సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 95

గురువారం 26-6-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'



కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో పంత్

ఐసీసీ టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్. ఏడో స్థానంలో భారత వికెట్ కీపర్ -14లో



అతి పెద్ద రిస్క్.. జియో

అందరూ వద్దన్నా వినలేదు.. ముకేశ్ అంబానీ వెల్లడి -15లో



నిర్బంధంలో ప్రజాస్వామ్యం

ఎమర్జెన్సీ రోజులు దేశ చరిత్రలోనే అత్యంత చీకటి అధ్యాయాలుగా మిగిలిపోయాయని ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తంచేశారు.

- వివరాలు 6లో



ఖర్గే వర్సెస్ థరూర్

సొంత పార్టీ ఎంపీ శశిథరూర్‌పై కాంగ్రెస్‌లో అసహనం పరాకాష్టకు చేరుతోంది. ఆయన తీరుపై ఖర్గే వ్యంగ్యాస్త్రాలు విసిరారు.

- వివరాలు 6లో

సీబీఎస్ఈ టెన్త్ రెండుసార్లు పరీక్షలు

టెన్త్ విద్యార్థుల్లో పరీక్ష భయాలను తగ్గించే లక్ష్యంతో ఏడాదికి రెండుసార్లు పరీక్షలను నిర్వహిస్తామని సీబీఎస్ఈ తెలిపింది.

- వివరాలు 6లో



న్యూయార్క్ మేయర్ అభ్యర్థిగా..

న్యూయార్క్ నగర మేయర్ డెమొక్రటిక్ పార్టీ నామినీగా భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ ఎన్నికయ్యారు.

- వివరాలు 6లో

మొగులు.. దిగులు

కరుణించని వరుణుడు.. జోరందుకోని సాగు..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం శివారులో మూడోసారి పత్తి విత్తనాలు నాటుతున్న దృశ్యం

- రాష్ట్రంలో 26 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు.. 8 జిల్లాల్లో తీవ్రం
- గత ఏడాది ఇప్పటికి 38 లక్షల ఎకరాల్లో పంటలు.. ఈ ఏడాది 29 లక్షల ఎకరాలకే పరిమితం
- ముందస్తు వర్షాలతో వేసిన విత్తనాలు మొలకెత్తని వైనం
- కొన్నిచోట్ల మొలకలు వచ్చినా ఎండిపోతున్న తీరు
- పత్తి, మక్క రైతుల పరిస్థితి దారుణం.. మళ్లీ మళ్లీ విత్తనాలు వేస్తున్న పత్తి రైతులు
- అప్పు చేసి పెట్టుబడి పెడుతున్నామంటూ ఆవేదన

కురవాల్సిన సమయంలో పడట్లేదు

మే నెలలో వర్షాలు కురవడంతో నాకున్న 3 ఎకరాలు దుక్కి దున్ని పత్తి విత్తనాలు వేసిన. సుమారు రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టిన. విత్తనాలు వేసి దాదాపు 25 రోజులు గడిచినా వర్షాలు పడక పోవడంతో గింజలు మొలకెత్తలేదు. ఎండలు కొట్టాల్సిన సమయంలో వర్షాలు పడ్డాయి. కురవాల్సిన సమయంలో పడట్లేదు. జూన్‌లో ఇప్పటివరకు వర్షాలే కురవలేదు. విత్తిన పత్తి విత్తనాలను చీమలు తినేసి ఉంటాయి. అదే జరిగితే మళ్లీ పెట్టుబడి పెట్టి పత్తి గింజలు కొని విత్తాలి.

– బాదావత్ చంటినాయక్, పూసలతండా, గార్ల మండలం, మహబూబాబాద్ జిల్లా



సాక్షి, హైదరాబాద్/వరంగల్: రాష్ట్రంలో నెల కొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు రైతన్నలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జూన్ ముగిసిపోతున్నా.. సరైన వర్షాలు లేక లక్షలాది ఎకరాలు సాగుకు నోచుకోలేదు. మరో వైపు నైరుతి రుతుపవనాలు ముందస్తుగా రాష్ట్రంలోకి ప్రవేశించడంతో కురిసిన తొలకరి జల్లులకు మురిసి విత్తనాలు వేసిన రైతులు.. కొన్నిరోజులుగా వరుణుడు ముఖం చాటేయడంతో దిక్కులు చూస్తున్నారు. ఆకాశంలో మబ్బులు కన్పించగానే ఆశగా చూస్తున్నారు గానీ ఫలితం ఉండటం లేదు. వర్షాలు పడకపోవడం..ఈ సీజన్‌లో సాగయ్యే పత్తి, మొక్కజొన్న, కందులు, సోయాబీన్ వంటి పంటలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. వర్షాలపై ఆధారపడి చాలా జిల్లాల్లో వేసిన ఆయా పంటల విత్తనాలు

మిగతా 2వ పేజీలో ▶

ముందొచ్చింది.. ముఖం చాటేసింది!

- జూన్‌లో ఇప్పటివరకు 36 శాతం లోటు వర్షపాతం
- కురవాల్సింది 10.54 సెం.మీ.. కురిసింది 6.72 సెం.మీ.
- జులైలో సమృద్ధిగా వర్షాలు: వాతావరణ కేంద్రం

- వివరాలు 2లో



వ్యోమనౌకలో సహచరులతో శుభాన్షు శుక్లా

అంతరిక్షంలో ఘనంగా.. రెండో అడుగు

రోదసిలోకి శుభాన్షు శుక్లా



రెండో భారతీయునిగా రికార్డు

- యాగ్జియం-4 ప్రయోగం దిగ్విజయం
- ఇదో అద్భుత యాత్ర: శుభాన్షు
- దేశ ప్రజలందరి సమష్టి యాత్ర
- మానవసహిత యాత్రలకు నాంది
- అంతరిక్షం నుంచి సందేశం
- జైహింద్, జై భారత్ అంటూ నినాదం
- నేడు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి
- తొలి భారతీయునిగా ఘనత..
- భారతావని జేజేలు, కేంద్రం ప్రశంసలు

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

తెలంగాణలో 'మెము' రైళ్లు



తెలంగాణలో రైల్వే ప్రయాణాన్ని మరింత సులభతరం చేసే లక్ష్యంతో కొత్త తరం 'మెము' రైళ్లను త్వరలోనే ప్రవేశపెట్టనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పండుగల సమయంలో ప్రయాణానికి ఇవి సౌకర్యవంతంగా ఉంటాయన్నారు.

- వివరాలు 12లో

బనకచర్లపై త్వరలో 'అపెక్స్' భేటీ



ఏపీ ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరాలపై చర్చించడానికి త్వరలో అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని కేంద్ర మంత్రి పాటిల్ హామీ ఇచ్చినట్లు రాష్ట్ర మంత్రి ఉత్తమ్ తెలిపారు.

- వివరాలు 2లో

ఆ భూములపై నిర్ణయం తీసుకోండి



కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలకు ఉమ్మడి ఏపీలో కేటాయించిన 7,183.13 ఎకరాల భూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు.

- వివరాలు 2లో


లాసెట్‌లో 66.46% ఉత్తీర్ణత



న్యాయవిద్య కోర్సుల్లో ప్రవేశానికి ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీ లాసెట్)లో 30,311 (66.46 శాతం) మంది అర్హత సాధించారు. రాష్ట్రంలో అన్ని కోర్సులకు కలిపి 31 కాలేజీలు ఉండగా, 8,680 సీట్లు ఉన్నాయి.

- వివరాలు 12లో

డెడ్‌లైన్.. సెప్టెంబర్ 30



- ఆలోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- 'రిజర్వేషన్లు' తేల్చేందుకు 30 రోజుల గడువు
- ఆ తర్వాత ఎన్నికల ప్రక్రియ పూర్తికి 60 రోజుల సమయం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు బుధవారం తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు కాపీ అందిన 30 రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాలని సర్కారుకు స్పష్టం చేసింది. అప్పటి నుంచి 60 రోజుల్లో రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపింది. గత పంచాయతీల కాల పరిమితి ముగిసి 14 నెలలు దాటిందంటూ, అయితే ఇప్పుడు 'ఆలస్యం'పై మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని హైకోర్టు పేర్కొంది. పంచాయతీ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని కోరుతూ నల్లగొండ జిల్లా మల్లేపల్లి సర్పంచ్ పార్వతి, కుర్మపల్లి సర్పంచ్ శ్రీనివాస్, జనగాం జిల్లా కాంచనపల్లి సర్పంచ్ విజయ, నిర్మల్ జిల్లా తల్వేడ సర్పంచ్ అనిల్‌కుమార్, కరీంనగర్ జిల్లా చంగర్ల సర్పంచ్ వేణుగోపాల్, నిజాయతీగూడెం సర్పంచ్ మురళీధర్ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టి ఆయా పక్షాల వాదనల అనంతరం గతంలో తీర్పు రిజర్వు చేసిన జస్టిస్ టి.మాధవీదేవి బుధవారం తీర్పు వెలువరించారు.

'ఆలస్యం' జోలికి వెళ్లాలనుకోవడం లేదు..

'గ్రామ పంచాయతీల పదవీకాలం 2024 జనవరి 31తో ముగిసింది. రాజ్యాంగం ప్రకారం పదవీకాలం ముగిసేలోపే ఎన్నికలపై ఎస్ఈసీ నిర్ణయం

మిగతా 2వ పేజీలో ▶

ఆ ఐదింటిలో... టాప్-10లో భారత్



- కీలక సాంకేతిక రంగాల పోటీలో ముందంజ
- ఏఐ, అంతరిక్ష విభాగాల్లో మెరుగైన స్థానం
- హార్వర్డ్ కెన్నడీ స్కూల్ నివేదికలో వెల్లడి

16లో

ఇంకుంజూరాత్



అంతా మీ ఇష్టమేనా..?

- ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ ఎందుకు ఆపుతున్నారు.. పాత ఫీజులతో ఇవ్వాలన్నా.. లెక్క చేయరెందుకు?
- ఉన్నత విద్యామండలితో పంచాయితీ ఏంటి
- వాళ్లూ.. మీరూ కూర్చొని మాట్లాడుకోండి
- విద్యాశాఖ, సాంకేతిక విద్య అధికారులపై సీఎం మండిపాటు
- వ్యక్తిగత ప్రతిష్ట మానుకొని కలిసి పనిచేయాలని సూచన
- విద్యాశాఖ పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు అధికారులే అడ్డు పడుతున్న తీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అధికారుల సమన్వయలోపంతో ప్రభుత్వం ఇరకాటంలో పడుతోందని ఆయన అన్నట్టు సమాచారం. అసలు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌ను ఎందుకు ఆపుతున్నారో చెప్పాలని అధికారులను నిలదీసినట్టు తెలిసింది. విద్యాశాఖ ఉన్నతాధికారులతో సీఎం బుధవారం సమీక్షించారు. ముఖ్యంగా సాంకేతిక విద్యామండలి, విద్యాశాఖ ముఖ్య అధికారుల పనితీరుపైనే సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా అధికారుల మధ్య కొనసాగుతున్న కోల్డ్‌వార్‌పై సీఎం సీరియస్ అవ్వడంపై అధికారవర్గాల్లో చర్చ జరుగుతోంది. విశ్వసనీయంగా తెలిసిన ప్రకారం... సమావేశం వివరాలు ఇలా ఉన్నాయి. పాత ఫీజులతోనే కౌన్సెలింగ్ చేపట్టాలని గతంలో ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. దీనిని దృష్టిలో ఉంచుకునే ఉన్నత విద్యామండలి త్వరలో కౌన్సెలింగ్ చేపడతామని వెల్లడించింది. ఈ నేపథ్యంలో సాంకేతిక, ఉన్నతవిద్య అధికారులు అడ్డుపడటం వివాదానికి కారణమైంది. ఈ అంశాన్ని ముఖ్యమంత్రి

మిగతా 5వ పేజీలో ▶

నైరుతి రుతుపవనాల కదలిక మందగించింది. సాగుకు కీలకమైన సమయంలో రాష్ట్రంలో వానలకు బ్రేక్ పడింది. సీజన్‌కు ముందు ఏప్రిల్, మే నెలల్లో భారీగా పడిన వర్షాలు.. తీరా వానాకాలం సీజన్ మొదలయ్యాక ముఖం చాటేశాయి. ఈ నెల 1వ తేదీ నుంచి బుధవారం (25వ తేదీ) నాటికి రాష్ట్రంలో సగటున 10.54 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. కానీ, 6.72 సెంటీమీటర్లు మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 36 శాతం లోటు నమోదు కావడం గమనార్హం.



ముందొచ్చింది.. ముఖం చాటేసింది!

వర్షపాత లోటు ఇలా..

- సూర్యాపేట జిల్లాల్లో సాధారణం కంటే 73 శాతం లోటు వర్షపాతం నమోదైంది.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 72 శాతం, హైదరాబాద్ జిల్లాలో 70 శాతం లోటు వర్షపాతం ఉంది.
- పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో 60 శాతం పైబడి లోటు వర్షపాతం నమోదైంది.
- 5 జిల్లాల్లో మాత్రమే సాధారణ వర్షాలు కురిశాయి. 18 జిల్లాల్లో లోటు, మరో 10 జిల్లాల్లో అత్యంత లోటు వర్షపాతం రికార్డయ్యింది.
- కుమురంభీం ఆసిఫాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.
- ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, కామారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ, ఖమ్మం, ములుగు, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాలు లోటు వర్షపాతం జాబితాలో ఉన్నాయి.
- పెద్దపల్లి, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జనగామ, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్, సూర్యాపేట జిల్లాలో అత్యంత లోటు వర్షపాతం రికార్డయ్యింది.

సాక్షి, హైదరాబాద్


జూన్‌లో ఇప్పటివరకు
36 శాతం లోటు వర్షపాతం
కురవాల్సింది 10.54 సెం.మీ..
కురిసింది 6.72 సెం.మీ.
5 జిల్లాల్లోనే
సాధారణ వర్షపాతం నమోదు
18 జిల్లాల్లో లోటు,
10 జిల్లాల్లో అత్యంత లోటు
జూలైలో సమృద్ధిగా వర్షాలు: వాతావరణ కేంద్రం

కారణాలు ఎన్నో..

సాధారణంగా నైరుతి సీజన్‌లో వర్షపాతానికి బంగాళాఖాతంలో ఏర్పడే అల్పపీడన ద్రోణులు, ఉపరితల ఆవర్తనాలు కీలకం. కానీ, ఈ ఏడాది సీజన్‌లో ఇటువంటి వాతావరణ పరిస్థితులు ఇంకా ఏర్పడలేదు. అందుకే ఈ సీజన్లో ఇప్పటివరకు వర్షాలు ఆశించినంతగా లేవు. ఉష్ణోగ్రతలు పెరగటంతో వాతావరణంలో తేమ పెరిగి ఉక్కపోతకు కారణమైంది. మరో వారంపాటు ఇదే పరిస్థితి ఉంటుందని వాతావరణ శాఖ చెబుతోంది. దీంతో ఈ నెలలో వర్షాల నమోదు ఆశించినంతగా ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దాదాపు రెండుమూడు రోజులకోసారి వర్షాలు కురవాల్సి ఉండగా, చాలా ప్రాంతాల్లో ఏకంగా ఏడు నుంచి పన్నెండు రోజులకు పైబడి డ్రై స్పెల్స్ నమోదయ్యాయి.

రాష్ట్రంలో 621 రెవెన్యూ మండలాలుండగా, 8 మండలాల్లోనే సమృద్ధిగా వర్షాలు కురిశాయి.

కేటగిరీల వారీగా మండలాల్లో వర్షపాతం ఇలా..



జూలై నెల వానలే కీలకం..

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల కదలికలు చురుకుగా లేవు. సాధారణంగా ముందస్తుగా రుతుపవనాల రాకతో ఇలాంటి పరిస్థితులు ఏర్పడతాయి. వారం ముందే వచ్చి, మొదట్లో అత్యంత చురుకుగా కదిలినా.. ఆ తర్వాత కొంత అంతరం ఏర్పడింది. ఈ అంతరంతో వర్షాలకు కాస్త విరామం వచ్చినట్లైంది. కానీ వచ్చే నెల మొదటి వారం నుంచి వర్షాలు ఆశించినంతగా ఉంటాయని అంచనా వేశాం. జూలై నెలలో సమృద్ధిగా వర్షాలు కురిసే అవకాశం ఉంది.

శ్రావణి
హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి

క్లుప్తంగా...

యూరియాను త్వరగా తెప్పించండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తుమ్మల లేఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ఎరువులను ఏ నెలకా నెల పంపించేలా కృషి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ లేఖ రాశారు. రాష్ట్రానికి నెలవారీ కేటాయించిన ఎరువుల కంటే కేంద్రం తక్కువగా పంపిణీ చేసిందని, ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే చాలా సందర్భాల్లో లేఖల ద్వారా కేంద్ర ఎరువుల శాఖమంత్రి జె.పి.నడ్డా దృష్టికి తీసుకెళ్లినట్లు తుమ్మల చెప్పారు. జూన్‌కు సంబంధించి కూడా రాష్ట్రానికి 1.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించగా, కేవలం 67 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయిందని, ఏప్రిల్, మే నెలలకు సంబంధించి కూడా కేటాయించిన దాని కంటే 1.21 లక్షల మెట్రిక్ టన్నులు తక్కువగా సరఫరా చేసిందని వెల్లడించారు.

ఆ పథకంపై విస్తృత అవగాహన కల్పించండి

రోడ్డు ప్రమాద బాధితుల నగదు రహిత చికిత్స పథకంపై పొన్నం



సాక్షి, హైదరాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి కేంద్ర ప్రభుత్వం రూ.లక్షన్నర చొప్పున అందించే 'రోడ్డు ప్రమాద బాధితుల నగదు రహిత చికిత్స' పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడే పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడే ఇలాంటి ఉదాత్త పథకాన్ని ప్రారంభించినందుకు ఆయన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పథకాన్ని తెలంగాణలో అమలు చేసే అంశంపై బుధవారం సచివాలయంలో ఆయన రవాణా, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించారు.

సర్పంచుల ఆత్మహత్యలు సుమోటోగా తీసుకోండి

సాక్షి, హైదరాబాద్: సర్పంచ్‌ల ఆత్మహత్యలను మానవ హక్కుల కమిషన్ సుమోటోగా తీసుకోవాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది. ఈ మేరకు బుధవారం తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కమిషనర్‌ను సంఘం అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్, నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేస్తే.. వాటి బిల్లులను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు.



పెద్దపల్లి జిల్లా జూలపల్లి గ్రామంలో పత్తి పెట్టేందుకు రెండవసారి దున్నిస్తున్న రైతు పొట్టాల సందీప్



జేఎస్ భూపాలపల్లి జిల్లా రేగొండ, గోరి కొత్తపల్లి మండలాల్లో వరుణుడు కరుణించాలని కప్పతల్లి ఆటలు ఆడుతున్న గ్రామస్తులు

మొగులు.. దిగులు

▶ మొదటి పేజీ తరువాయి

అనేక ప్రాంతాల్లో మొలకెత్తలేదు. ముఖ్యంగా పత్తి, మక్క మొలకలు రాలేదు. కొన్నిచోట్ల మొలిచినా నీరు లేక ఎండిపోతున్నాయి. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడి వృథా అవుతుండగా..అనేకచోట్ల రైతులు మళ్లీ మళ్లీ పెట్టుబడులు పెడుతూ రెండోసారి, మూడోసారి విత్తనాలు నాటుతున్నారు. దుక్కులు దున్ని, భూమి చదును చేసి, విత్తనాలు వేసిన ఒక్కో పత్తి రైతు ఎకరానికి రూ.10 వేల దాకా నష్టపోయే పరిస్థితి ఉందని అంటున్నారు.

8 జిల్లాల రైతులపై తీవ్ర ప్రభావం

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో వర్షాభావ పరిస్థితి ఉంది. ముఖ్యంగా వరంగల్, కరీంనగర్, పెద్దపల్లి, మహబూబాబాద్, హనుమకొండ, రాజన్న సిరిసిల్ల, జనగాం, సూర్యాపేట జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయి. 190 మండలాల్లో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొనగా, 90 మండలాల్లో వర్షపు చుక్క పడలేదు. ఈ జిల్లాల్లో 60 నుంచి 72 మిల్లీ మీటర్ల వరకు లోటు వర్షపాతం ఉండగా, ముందస్తు వానలతో పలు చోట్ల పత్తి, మక్కలు వేసిన రైతులు నష్టపోయారు. విత్తనాలు వేయనివారు వర్షాలు పడిన తర్వాత వేద్దామని చూస్తుండగా, ఆలస్యంగా వేసిన విత్తనా లతో పంట దిగుబడి రాదేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

పత్తి, మక్క పంటల పరిస్థితి దారుణం

రాష్ట్రంలో 70 నుంచి 100 శాతం వర్షాభావ పరిస్థితుల కారణంగా.. వర్షాధార పంటలుగా వేసిన పత్తి, మక్క ఇతర మెట్ట పంటల పరిస్థితి దారుణంగా మారింది. ముఖ్యంగా సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలో కేవలం 0.3 ఎంఎం వర్షం కురిసింది.. అంటే ఒక్క తుంపర కూడా లేదని నివేదికలు చెప్తున్నాయి. ఇదే పరిస్థితి చింతలపాలెం, నేరేడుచర్ల, పెన్‌పహాడ్, చివ్వెంలలో ఉంది. ఖమ్మంలో కామేపల్లి, యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదగిరిగుట్ట, అడ్డగూడూరు, భువనగిరి, నల్లగొండ జిల్లా శాలిగౌరారం, కనగల్, పెద్దవూర, కరీంనగర్‌లో చిగురుమామిడి, కరీంనగర్ రూరల్, వేములవాడ, సంగారెడ్డిలో పుల్కల్, జిన్నారం, మెదక్‌లో మనోహరాబాద్, నార్సింగ్, సిద్దిపేట జిల్లాలో చిన్నకోడూరు, మిరుదొడ్డి, హుస్నాబాద్, జనగామ జిల్లాలో కొడకండ్ల, జఫర్‌ఘడ్, వరంగల్‌లో నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లిలలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్నాయి.

వానాకాలం-2025 సాగు ప్రణాళిక (ఎకరాలలో)
సాగు అంచనా: 1,32,44,305
గతేడాది ఈ సమయానికి సాగు: 38,06,097
ఈ సీజన్‌లో ఇప్పటివరకు సాగు: 29,89,562
పత్తి సాగు అంచనా: 48,93,016
గత ఏడాది ఇదే సమయంలో: 28,58,337
ఇప్పటివరకు సాగైన పత్తి విస్తీర్ణం: 22,84,474
మొక్కజొన్న సాగు అంచనా : 5,21,206
గత ఏడాది ఇదే సమయంలో: 1,25,235
ఇప్పటివరకు సాగైన మొక్కజొన్న విస్తీర్ణం: 1,17,309

హనుమకొండ జిల్లాలో కమలాపూర్, ఐనవోలు, మహబూబాబాద్ జిల్లాలో గార్ల, గూడూరు, కేసముద్రం, చిన్నగూడూరు, పెద్దవంగర, పెద్దపల్లి జిల్లాలో ఎలిగేడు, కమాన్‌పూర్, సుల్తానాబాద్, జగిత్యాలలో బీఆర్‌పూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘనపూర్, గోరి కొత్తపల్లి, మహదేవ్‌పూర్, టేకుమట్ల, మంచిర్యాల రూరల్, భద్రాద్రిలో పినపాక, ఇల్లెందు, గుండాల మండలాల్లో సుమారు 70 నుంచి 100 శాతం వరకు లోటు వర్షపాతం ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

గత ఏడాది కన్నా తక్కువ పత్తి సాగు

రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో 1.32 కోట్ల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. గత ఏడాది ఈ సమయానికి 38 లక్షల ఎకరాల్లో పంటలు సాగవగా, అది ఈసారి కేవలం 29.89 లక్షలకే పరిమితమైంది. వేసిన పంటల్లో అధికంగా పత్తి 22.84 లక్షల ఎకరాల్లో సాగైంది. ఇందులో అత్యధికంగా సుమారు 9 లక్షల ఎకరాలు ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోనే సాగు చేశారు. ఆ తర్వాత సంగారెడ్డిలో 2.75 లక్షల ఎకరాల్లో, భద్రాద్రి కొత్తగూడెం, నారాయణపేట, నల్లగొండ జిల్లాల్లో సగటున 1.10 లక్షల ఎకరాల్లో సాగైంది. వర్షాలు లేకపోవడంతో చాలా జిల్లాల్లో ఇంకా విత్తనాలు వేయలేదు. అత్యధిక వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సూర్యాపేటలో గత సంవత్సరం ఇప్పటివరకు 46 వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈసారి కేవలం 7 వేల ఎకరాల్లో సాగు చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది. మహబూబాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, ఖమ్మం జిల్లాల్లో పత్తి సాగు గత ఏడాదితో పోల్చుకుంటే సగం కూడా కాలేదు.

మిగతా పంటల పరిస్థితీ ఇదే..

పత్తితో పాటు మొక్కజొన్న, జొన్నలు, కందులు, సోయాబీన్ విత్తనాలు వేసిన రైతులు కూడా వానలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆరుతడి పంటలైన ఇవి మొలకెత్తడానికి, మొలకెత్తిన విత్తనాలు మొక్కలుగా పెరగడానికి వర్షం తప్పనిసరి. అయితే విత్తనాలు నాటిన తరువాత వర్షాలు లేకపోవడంతో మొక్కలు ఎండిపోయాయని రైతులు వాపోయారు.

లక్ష నష్టం.. ఇంకో లక్ష అప్పు చేయాల్సిందే



ఇతను జనగామ జిల్లా కొడకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన కౌలు రైతు బాల్నె చిన్న కొమురయ్య. ఎకరాకు రూ.6 వేల చొప్పున రూ.30 వేలకు ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి విత్తనాలు నాటాడు. భూమి దున్నేందుకు, విత్తనాలకు మరో లక్ష రూపాయల పెట్టుబడి పెట్టాడు. అయితే ఆ తర్వాత వర్షాలు కురవలేదు. దీంతో 20 శాతం విత్తనాలు కూడా మొలకెత్తలేదు. మొలకెత్తినవి కూడా వర్షం లేకపోవడంతోఎండిపోతున్నాయి. వర్షాలు పడి కాలం కలిసొస్తే మళ్లీ భూమి దున్ని విత్తనాలు పెట్టాల్సిందేనని, మళ్లీ రూ.లక్ష అప్పు వెతుక్కోవాల్సిందేనంటూ కొమురయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

మొక్కజొన్న మొలకెత్తలే..



ఈ ఫొటోలోని మహిళా రైతు పేరు పావని. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం కలకత్త తండాకు చెందిన ఈమె ఎకరం పొలంలో పత్తి, మరో ఎకరంలో మొక్కజొన్న విత్తనాలు పెట్టింది. విత్తనాలు వేసి 25 రోజులు దాటినా చినుకు పడకపోవడంతో రెండు పంటలు మొలకెత్తలేదు. ఎకరానికి రూ.10 వేల చొప్పున రూ.20 వేల పెట్టుబడి పెట్టింది. బుధవారం కొద్దిగా కురిసిన వానతో అక్కడక్కడ కొన్ని పత్తి విత్తనాలు మొలకెత్తాయి. అయితే ఇప్పటివరకు ఎండిన నేపథ్యంలో 70 శాతానికి పైగా సాళ్లలోని పత్తి మొక్కలు పీకేసి మళ్లీ గింజలు పెడదామని ఆలోచిస్తున్నట్లు తెలిపింది.

ఇప్పటికి రెండుసార్లు నాటినా..



ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన బానోతు వీరన్న తనకు ఉన్న రెండెకరాల భూమిలో 20 రోజుల క్రితం పత్తి విత్తనాలు విత్తాడు. దున్నినందుకు, విత్తనాలకు, కూలీలకు సుమారు రూ.20 వేలు ఖర్చయింది. ఆ తర్వాత తేలిక పాటి జల్లులు తప్ప వర్షాలు పడలేదు. దీంతో విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో నాలుగు రోజుల క్రితం మళ్లీ దుక్కి దున్ని మరోసారి విత్తనాలను కొనుగోలు చేసి కూలీలతో నాటించాడు. గత మూడు రోజులుగా తేలికపాటి చినుకులే పడడం వల్ల అవి కూడా మొలకెత్తే పరిస్థితి కన్పించడం లేదని వీరన్న వాపోతున్నాడు. వానాకాలం మొదటి దశలోనే అప్పుల పాలవుతున్నానని చెప్పాడు.

గింజలు పెట్టినంక మల్ల చుక్క పడలేదు



నెలకింది పడ్డ వానలకు ఐదు ఎకరాల్లో పత్తి పెట్టినం. పత్తి గింజలు పెట్టింది గత్త మల్ల చుక్క పడలేదు. దీంతో మొలకలు రాలేదు. మళ్లీ విత్తనాలు వేసేందుకు దున్నుతున్నాం. రూ.35 వేలు అదనంగా పెట్టుబడి అవుతోంది.

\- సిలువేరు లచ్చయ్య,
రైతు, జూలపల్లి, పెద్దపల్లి జిల్లా

బనకచర్లపై త్వరలో 'అపెక్స్' భేటీ

నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- తెలంగాణ అభ్యంతరాలపై చర్చించేందుకు కేంద్రమంత్రి హామీ ఇచ్చారు
- ఆ ప్రాజెక్టును అడ్డుకుంటాం..

సాక్షి, హైదరాబాద్: ఏపీ ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ అభ్యంతరాలపై చర్చించడానికి త్వరలో అపెక్స్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామని కేంద్ర జలశక్తి శాఖ సీఆర్ పాటిల్ హామీ ఇచ్చినట్లు మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర రైతాంగ ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా చూడడమే తమ ముందున్న కర్తవ్యమని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ ప్రాజెక్టును చట్టపరంగా అడ్డుకుంటామని చెప్పారు. నీటిపారుదల శాఖపై బుధవారం జలసౌధలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, తాను ఈ నెల 19న సీఆర్ పాటిల్‌ను కలిసి బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజబిలిటీ నివేదికను ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించవద్దని కోరినట్లు ఉత్తమ్ తెలిపారు. ప్రాజెక్టుతో రాష్ట్ర



అధికారులతో మాట్లాడుతున్న ఉత్తమ్

ప్రయోజనాలు ఎలా దెబ్బతింటాయో ప్రజెంటేషన్ ద్వారా వివరించగా, దీనిపై రెండు రాష్ట్రాల సీఎంలతో కూడిన అపెక్స్ కౌన్సిల్ భేటీ నిర్వహిస్తామంటూ ఆయన హామీ ఇచ్చారని చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే బనకచర్ల ప్రాజెక్టుకు బీజం పడిందని ఉత్తమ్ విమర్శించారు. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రానికి జరిగే నష్టంపై 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రజాభవన్‌లో ప్రజెంటేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సొరంగాల నిపుణుల నియామకం

ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు సొరంగం నిర్మాణం పనుల పునరుద్ధరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకుగాను భారత సైన్యంలో ఈఎన్‌సీగా పనిచేసిన జనరల్ హర్పల్ సింగ్‌ను నీటిపారుదల శాఖ సలహాదారుడిగా నియమించుకుంటున్నట్టు మంత్రి ఉత్తమ్ తెలిపారు. సొరంగాల నిర్మాణంలో అంతర్జాతీయ స్థాయి నైపుణ్యం కలిగిన కర్నల్ పరీక్షిత్ మెహ్రా కూడా జూలైలో నీటిపారుదల శాఖలో చేరతారని చెప్పారు. వీరిద్దరికీ రోహతంగ్, జోజిలా సొరంగాల నిర్మాణంలో అనుభవం ఉందని తెలిపారు. ఇలావుండగా.. కాళేశ్వరం బరాజ్‌ల పునరుద్ధరణకు ఎన్డీఎస్ఏ నిపుణుల కమిటీ తుది నివేదికలో చేసిన సిఫారసులను తక్షణమే అమలు చేయాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. డిండి ప్రాజెక్టు భూసేకరణను వేగవంతం చేసేందుకు సంబంధిత జిల్లాల కలెక్టర్లతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు.

పదోన్నతులు, బదిలీలకు లైన్ క్లియర్

నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీల ప్రక్రియను సత్వరం పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. నాగార్జున సాగర్, నిజాంసాగర్ తదితర ప్రాజెక్టుల్లో పూడికతీత పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. సమీక్షలో అధికా రులు ప్రశాంత్ జీవన్‌పాటిల్, అంజాద్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఆ భూములపై నిర్ణయం తీసుకోండి

తెలంగాణలో కేంద్ర సంస్థల వద్ద 7,183 ఎకరాల నిరుపయోగ భూములు
- అవి ఉపయోగంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధికి ఊతం
- కేంద్రమంత్రి కుమారస్వామికి మంత్రి శ్రీధర్‌బాబు వినతి
- అరుదైన ఖనిజాల కొరత తీర్చాలని గోయల్‌కు విన్నపం



కుమారస్వామికి జ్ఞాపిక అందజేస్తున్న శ్రీధర్‌బాబు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు ఉమ్మడి ఏపీలో కేటాయించిన 7,183.13 ఎకరాల భూముల సమస్యల పరిష్కారానికి కేంద్రం ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లను కలిసి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వినతిపత్రాలు అందజేశారు.

నిరుపయోగ భూముల సమస్య పరిష్కరించండి

1960లో ఉమ్మడి ఏపీ పారిశ్రామికాభివృద్ధి కోసం హైదరాబాద్ చుట్టుపక్కల విలువైన భూములను భారీ ఎత్తున రాయితీ ధరలకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు కేటాయించిందని మంత్రి కుమారస్వామికి శ్రీధర్‌బాబు తెలిపారు. వాటిలో చాలా సంస్థలు మూతపడ్డాయని, వాటి పరిధి లోని భూములు ప్రస్తుతానికి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. మేడ్చల్ మల్కాజిగిరిలో హిందుస్తాన్ కేబుల్స్ లిమిటెడ్ పరిధిలో 324.87 ఎకరాలు, ఐడీపీఎల్‌కు 551.03 ఎకరాలు, హెచ్ఎంటీకి 888.05 ఎకరాలు, సంగారెడ్డిలోని హిందుస్తాన్ ఫ్లోరోకార్బన్స్ లిమిటెడ్ పరిధిలో 126.33 ఎకరాలు, ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ)కు 2,272.85 ఎకరాలు, సంగారెడ్డి ఎద్దుమైలారంలో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ పరిధిలో 3,020 ఎక రాలు ఉన్నాయని వివరించారు. ఆ భూములు ఉపయోగంలోకి వస్తే రాష్ట్రాభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ భూములపై త్వరలోనే సమావేశం నిర్వహిస్తామని శ్రీధర్‌బాబుకు కేంద్రమంత్రి హామీ ఇచ్చారు.

చైనా ఆంక్షలతో ఉత్పత్తి రంగంపై ప్రభావం

అరుదైన ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించటంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్వినీ వైష్ణవ్‌లను శ్రీధర్ బాబు కోరారు. చైనా నిర్ణయం తెలంగాణ తయారీ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్–నాగ్‌పూర్, హైదరాబాద్–వరంగల్, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–విజయవాడ పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు మౌలిక సదుపాయాల కోసం రూ.400 కోట్లు పీఎం గతిశక్తి పథకం కింద మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్‌లో జాతీయ డిజైన్ సెంటర్ (ఎన్‌డీసీ) ఏర్పాటుకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ మెట్రోపై వివక్ష

తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. కేంద్ర మంత్రులను కలిసిన అనంతరం తెలంగాణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రో– 2పై కేంద్ర మంత్రివర్గం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుందని ఆశించినా, మరోసారి నిరాశే ఎదురైందని అన్నారు. మహారాష్ట్రలోని పుణే మెట్రోకు అనుమతి ఇచ్చి హైదరాబాద్ మెట్రోపై ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు.

డెడ్‌లైన్.. సెప్టెంబర్ 30

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలి. ఆ మేరకు పిటిషనర్ల వాదన ఆమోదయోగ్యం. పంచాయతీల పదవీకాలం ముగిసి 14 నెలల కంటే ఎక్కువ సమయమే గడిచింది. అయితే ఆలస్యం సమర్థనీయమా.. లేదా.. అనే అంశాల్లోకి ప్రస్తుతం వెళ్లదలుచుకోవడంలేదు. వార్డు సభ్యులు, సర్పంచుల సీట్ల రిజర్వేషన్లు సహా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం సముచితమని కోర్టు భావిస్తోంది. అయితే ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఐదు దశల ప్రక్రియను పూర్తి చేసేందుకు కనీసం 20 రోజులు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీన్ని పరిగణనలోకి తీసుకుని సెప్టెంబర్ 30లోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశిస్తున్నాం..' అని న్యాయమూర్తి తెలిపారు.

ఇరుపక్షాల వాదనలు ఇలా..: అంతకుముందు ప్రభుత్వం తరఫున ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ వాదనలు విని పిస్తూ.. 'ఎన్నికల ప్రక్రియలో 5 దశలు ఉండగా, 3 దశలు ఇప్పటికే పూర్తయ్యాయి. మరో రెండు దశలను 20 రోజుల్లో పూర్తి చేస్తాం. పంచాయతీలకు ఎన్నికల నిర్వహణ విషయంలో ఎస్ఈసీకి సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అయితే బీసీ కులాల వారీగా రాజకీయ వెనుక బాటుతనాన్ని గుర్తించే ప్రక్రియకు కొంత సమయం పట్టింది. ఇప్పుడు డేటా సిద్ధంగా ఉంది..' అని చెప్పారు. ఎస్ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది జి.విద్యాసాగర్ వాదనలు వినిపిస్తూ.. 'బీసీ రిజర్వేషన్లను ఖరారు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. రిజర్వేషన్లు తేలకుండా సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సొంతంగా ఎన్నికల నిర్వహణపై మేం నిర్ణయం తీసుకోలేం. ఎన్నికల ప్రక్రియకు సర్కార్ అంగీకరించిన నాటి నుంచి మాకు రెండు నెలల సమయం అవసరం..' అని నివేదించారు. పిటిషనర్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. 'ఐదేళ్ల వ్యవధి ముగిసేలోపు పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడం రాజ్యాంగ విరుద్ధం. ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి ఎన్నికలు నిర్వహిస్తామని గత అక్టోబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు హామీ ఇచ్చింది. ఆ హామీని నిలబెట్టుకోలేదు. ఎస్ఈసీ మౌన ప్రేక్షకుడిలా వ్యవహరిస్తోంది..' అని విమర్శించారు.

భూముల ధరలు ఎంత పెంచొచ్చు?

- ప్రతిపాదనలు పంపాలని జిల్లా రిజిస్ట్రార్లకు ప్రభుత్వ ఆదేశం
- ట్రిపుల్ ఆర్ సమీపంలో 200 శాతం, సంగారెడ్డి జిల్లాలోని పలు గ్రామాల్లో 300 శాతం పెంచాలంటూ ప్రతిపాదనలు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ మార్కెట్ ధరలను పెంచాలని భావిస్తున్న ప్రభుత్వం.. అందుకు ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగ్‌రోడ్డు (ట్రిపుల్ ఆర్) మధ్య ప్రాంతంపైనే ప్రధానంగా దృష్టి పెట్టినట్లు తెలిసింది. ఏ ప్రాంతంలో ఎంత మొత్తం ధరలు పెంచేందుకు వీలుంటుందనే అంశంపై ప్రతిపాదనలు పంపాలని అన్ని జిల్లాల రిజిస్ట్రార్లను ఇప్పటికే ఆదేశించగా, అధికారులు ప్రతిపాదనలు కూడా పంపారు. ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్యలో ఉన్న భూముల రిజిస్ట్రేషన్ విలువకు, మార్కెట్ విలువకు ప్రస్తుతం భారీ వ్యత్యాసం ఉంది. దీన్ని తగ్గించడంతో పాటు, రిజిస్ట్రేషన్ల ఆదాయం పెంచుకునేందుకు ఈ ప్రాంతంలో భూముల ధరలను భారీగా పెంచాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ప్రతిపాదనల్లో కొన్ని..

- ట్రిపుల్ ఆర్ ప్రాంతంలోని సదాశివపేట మండలం పెద్దాపూర్‌లో రిజిస్ట్రేషన్ రేటు చదరపు గజానికి రూ.1,700 (కమర్షియల్), రూ.1,100 (రెసిడెన్షియల్) ఉంది. దీనిని కమర్షియల్ ఏరియాలో చ.గజానికి రూ.3,500ల వరకు, రెసిడెన్షియల్ ఏరియాలో రూ.2,400 వరకు పెంచాలని ప్రతిపాదనలు పంపారు. అంటే ఈ ప్రాంతంలో సుమారు 200 శాతం వరకు భూముల ధరలు పెంచాలని భావిస్తున్నారు.
- సంగారెడ్డి జిల్లా కొల్లూరు, ఈదులనాగులపల్లి, వెలిమెల, పాటిఘనాపురం, కర్దనూరు, ముత్తంగి, పోచారం, పటేల్‌గూడ, కిష్టారెడ్డిపేట, సుల్తాన్‌పూర్, దయార, బొల్లారం వంటి గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ధరను 300 శాతం వరకు పెంచాలని ప్రతిపాదించారు.
- రామచంద్రాపురంలో రిజిస్ట్రేషన్ మార్కెట్ రేటు చదరపు గజానికి రూ.22,500 ఉంది. దీన్ని రూ.50 వేల వరకు ప్రతిపాదిస్తున్నారు.
- తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అపార్ట్‌మెంట్లలో ప్రస్తుతం చదరపు అడుగుకు రూ.2,250 వరకు రిజిస్ట్రేషన్ రేటు ఉంది. దీనిని రూ.3,500ల వరకు పెంచాలని భావిస్తున్నారు.

ఆడియోలు వినిపిస్తూ... పత్రాలు చూపిస్తూ!

- ఫోన్ ట్యాపింగ్ కేసులో వ్యూహాత్మకంగా ముందుకెళ్తున్న సిట్
- నిందితులు, బాధితులను ఎదురెదురుగా పెట్టి వాంగ్మూలాల నమోదు



సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న సిట్ వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. బాధితుల్ని సాక్షులుగా పరిగణిస్తూ వారి నుంచి వాంగ్మూలాలు సేకరించడంతో పాటు వాళ్లు కచ్చితంగా న్యాయస్థానం వరకు వచ్చి సాక్ష్యం చెప్పేలా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వారి ఫోన్లు ఎలా ట్యాప్ అయ్యాయో చూపిస్తోంది. నేతలతో పాటు వారి కుటుంబీకులు, అనుచరుల సంభాషణల ఆడియోలను వినిపిస్తూ, సంబంధిత పత్రాలను చూపిస్తూ వాంగ్మూలాలు తీసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో 2023 నవంబర్ 15 నుంచి 30 మధ్యే ప్రభాకర్‌రావు నేతృత్వంలోని ఎస్ఐబీ 4,013 ఫోన్లపై నిఘా ఉంచినట్లు సిట్ గుర్తించింది. వీటిలో 618 రాజకీయ నాయకులకు సంబంధించినవిగా తేల్చింది. మరోపక్క కేసులో మరో నిందితుడు ప్రణీత్‌రావు ఫోన్ నుంచి సిట్ అధికారులు కొన్ని ఆడియోలు సేకరించారు. వాస్తవానికి రాష్ట్రంలో ప్రభుత్వం మారిన వెంటనే ప్రభాకర్‌రావుతో పాటు ఆయన టీమ్ మొత్తం తమ ఫోన్లలో ఉన్న డేటాను డిలీట్ చేయడంతో పాటు ఫోన్లను ధ్వంసం చేసింది. అయితే ప్రణీత్‌కు సంబంధించిన ఓ ఫోన్‌లో మాత్రం డేటా డిలీట్ కాకపోవడంతో అది సిట్ చేతికి చిక్కింది. రాజకీయ నాయకులతో పాటు వారి సంబంధీకుల ఫోన్లను ట్యాప్ చేసిన ప్రణీత్ ఆ ఆడియోలను 'పెద్దలకు' షేర్ చేసినట్లు సిట్ అనుమానిస్తోంది. ప్రస్తుతం సిట్ సాక్షులకు ఈ ఆడియోలను వినిపించడంతో పాటు వివిధ లేఖల్ని చూపిస్తోంది. ఆ తర్వాతే వివిధ అంశాలను ప్రశ్నిస్తూ వారి వాంగ్మూలం నమోదు చేస్తోంది. కొందరు సాక్షులు, నిందితుల్ని ఎదురెదురుగా పెట్టి స్టేట్‌మెంట్లు తీసుకుంటోంది.

అప్పటి ప్రభుత్వం దిగజారి వ్యవహరించింది..

ప్రణీత్‌రావు బుధవారం మరోసారి సిట్ ఎదుట హాజరయ్యారు. తెలంగాణ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీమ్ ఖురేషీ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లతో పాటు కామారెడ్డికి చెందిన వివిధ పార్టీల నేతలు సిట్ ఎదుట హాజరై వాంగ్మూలాలు ఇచ్చారు. కాగా ఫహీమ్ ఖురేషీ మీడియాతో మాట్లాడుతూ.. 'నా ఫోన్ ట్యాప్ అయిందని డీసీపీ నుంచి సమాచారం అందింది. నా ఫోన్‌తో పాటు నా భార్య, డ్రైవర్ ఫోన్లనూ ట్యాప్ చేశారు. అధికారం కోసం నీచానికి దిగజారారు. బహుశా ట్యాపింగ్ ద్వారా తెలుసుకున్న సమాచారంతోనే ఎన్నికల ముందు నాపై చాలా ఒత్తిడి తెచ్చారు..' అని చెప్పారు. బల్మూరి వెంకట్ మాట్లాడుతూ..'బీఆర్ఎస్ ప్రభుత్వం రాజకీయాల కోసం నీచానికి దిగజారింది. తల్లి, పిల్ల అనే తేడా లేకుండా అందరి ఫోన్లు ట్యాప్ చేసింది. మమ్మల్ని ఇబ్బందులకు గురి చేసింది..' అని చెప్పారు. కాగా 2023 ఎన్నికల సమయంలో ప్రభాకర్‌రావు కామారెడ్డిలో ప్రత్యేకంగా ఓ మినీ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మరీ ట్యాపింగ్ చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. బుధవారం వరకు దాదాపు 235 మంది వాంగ్మూలాలను సిట్ నమోదు చేసినట్లు తెలిసింది.

సీఎం రేవంత్‌రెడ్డికి టోనీ బ్లెయిర్ లేఖ

విజన్ 2047పై ప్రశంసలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైజింగ్ విజన్-2047 డాక్యుమెంట్ తయారీ పట్ల సీఎం ఎ.రేవంత్‌రెడ్డిని బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ ప్రశంసించారు. రేవంత్ విజన్‌ను ప్రశంసిస్తూ తాజాగా టోనీ బ్లెయిర్ ఆయనకు లేఖ రాశారు. ఇటీవల ఢిల్లీలో టోనీ బ్లెయిర్‌తో సమావేశమైన సీఎం రేవంత్.. ఆయనకు రైజింగ్ తెలంగాణ విజన్ ఉద్దేశాలను వివరించారు. విజన్‌లో భాగంగా 2024 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని అభివృద్ధి పరచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలియజేశారు. విజన్ రూపకల్పన, అమలుకి సహకారం అందించడం కోసం టోనీ బ్లెయిర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ చేంజ్ (టీబీఐజీసీ) సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకోనుంది. ఈ మేరకు ప్రభుత్వం, టీబీఐజీసీలు పరస్పర అవగాహన లేఖలు (లెటర్ ఆఫ్ ఇంటెంట్)ను మార్పిడి చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో రైజింగ్ తెలంగాణ విజన్ లక్ష్యాల సాధనకు టీబీఐజీసీ ప్రభుత్వానికి సహకరిస్తుందని టోనీ బ్లెయిర్ తెలిపారు. విజన్-2047 డాక్యుమెంట్ ఆవిష్కరణకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు పేర్కొన్నారు.

పురపాలికల్లో డీలిమిటేషన్ పూర్తి

- 30 మున్సిపాలిటీల్లో వార్డుల పునర్విభజన కొలిక్కి
- ఒక్కో మున్సిపాలిటీలో కనిష్టంగా 12, గరిష్టంగా 60 వార్డులు
- సీఎంఓ ఆమోదిస్తే త్వరలో ఉత్తర్వుల జారీకి సన్నాహాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 30 పట్టణ స్థానిక సంస్థల్లో (మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లు- యూఎల్‌బీలు) వార్డుల పునర్విభజన ప్రక్రియ కొలిక్కి వచ్చింది. వీటిలో 18 అర్బన్ లోకల్ బాడీలు (యూఎల్‌బీ) కొత్తగా ఏర్పడినవి కాగా, మరో 12 యూఎల్‌బీల్లో పరిసర గ్రామాలను విలీనం చేసి పరిధిని పెంచారు. ఒక్కో యూఎల్‌బీలో కనిష్టంగా 12, గరిష్టంగా 60 వార్డుల ఏర్పాటుకు అనుమతి ఇస్తూ ఈ నెల 3న రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ షెడ్యూల్ ప్రకారం ఈ నెల 19న పురపాలక శాఖ కమిషనర్‌కు తుది నివేదిక అందింది. ఈ నివేదికను ఈ నెల 20న ప్రభుత్వానికి సమర్పించగా, ముఖ్యమంత్రి కార్యాలయం ఆమోదిస్తే త్వరలో 30 యూఎల్‌బీల ఏర్పాటు, విస్తరణకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తామని పురపాలక శాఖ అధికారులు వెల్లడించారు. కరీంనగర్, రామగుండం, మహబూబ్‌నగర్, మంచిర్యాల, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లు, కొల్లాపూర్, ఆలేరు, బాన్సువాడ, నర్సంపేట, పరిగి, జగిత్యాల, హాలియా, కోహిర్, కేసముద్రం, అశ్వారావుపేట, స్టేషన్‌ఘన్‌పూర్, ఎదులాపురం, దేవరకద్ర, గడ్డపోతారం, గుమ్మడిదల, ఇస్నాపూర్, మద్దూరు, చేవెళ్ల, మొయినాబాద్, ములుగు, బిచ్కుంద, కల్లూరు, మూడుచింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట మున్సిపాలిటీల్లో వార్డుల పునర్విభజన జరిగింది.

వార్డుల సరిహద్దుల మార్పు

రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన షెడ్యూల్ ప్రకారం జనాభా వృద్ధి, పట్టణ పరిధి విస్తరణను పరిగణనలోకి తీసుకుని మున్సిపల్ కార్పొరేషన్లలో డివిజన్లు, మున్సిపాలిటీల్లో వార్డుల ఏర్పాటు, సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేశారు. డివిజన్లు, వార్డుల్లో జనాభా సమతుల్యతలో వ్యత్యాసం పది శాతం కంటే ఎక్కువ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలైన చేవెళ్ల 18 వార్డులు, ఎల్లంపేట 24 వార్డులు, గడ్డపోతారం 18 వార్డులు, దేవరకద్ర 12 వార్డులు, ఆలియాబాద్ 20 వార్డులు, కేసముద్రం ను 16 వార్డులుగా విభజన చేసినట్లు తెలిసింది.



జీవితం అనేది నాకు చేదు ద్రావకం అయిపోయింది, అయినప్పటికీ దాన్ని చుక్కలుగా తాగి తీరాలి, ఒక్కొక్క చుక్కను లెక్కించుకుంటూ!
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి

గురువారం, 26 జూన్ 2025

అంతరిక్షంలో మనవాడు!

నాలుగు దశాబ్దాల అనంతరం రోదసి నుంచి భారతీయ స్వరం మోగింది. మన వైమానిక దళం గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాతోపాటు అమెరికా, పోలెండ్, హంగేరీలకు చెందిన మరో ముగ్గురు వ్యోమగాములు స్పేస్‌ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌకలో బుధవారం మధ్యాహ్నం సరిగ్గా 12.01 నిమిషానికి 28 గంటల అంతరిక్షయాత్ర ప్రారంభించారు. వీరు అంతరిక్షంలోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)కు చేరుకుని 14 రోజులపాటు దాదాపు 60 పరిశోధనలు చేస్తారు. 'మేం భూకక్ష్యలో తిరుగుతున్నాం. భారత మానవ అంతరిక్ష కార్యక్రమం మొదలైంద'ంటూ శుభాంశు శుక్లా పంపిన సందేశం ఈ మొత్తం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న శాస్త్రవేత్తల్లో భావోద్వేగం కలిగించింది. ఎప్పుడో 1984లో రాకేష్ శర్మ అంతరిక్ష యాత్ర చేశాక భారత్ నుంచి మరొకరు వెళ్లటం ఇదే ప్రథమం. ఫ్లోరిడాలోని నాసా కెన్నెడీ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ యాత్ర ప్రారంభమైంది. గంటకు 28,000 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోయే ఐఎస్‌ఎస్... ప్రతి 90 నిమిషాలకూ భూకక్ష్యలో ఒక రౌండ్ పూర్తిచేస్తుంది. ఆ కారణంగా మన శుభాంశు శుక్లా, మరో ముగ్గురు వ్యోమగాములు రోజూ 16 సూర్యోదయాలనూ, 16 సూర్యాస్తమయాలనూ వీక్షిస్తారు.

అవనిపై ఎలావున్నా అంతరిక్షంలో దేశాల మధ్య ఇంతవరకూ కొనసాగుతున్న సహకారానికీ, సమన్వయానికీ ఐఎస్‌ఎస్ ఒక ప్రతీక. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా, రష్యా సంస్థ రోస్‌కాస్మోస్, జపాన్ సంస్థ జాక్సా, కెనడా అంతరిక్ష సంస్థ సీఎస్ఏలు ఉమ్మడిగా ఐఎస్‌ఎస్ నిర్మాణానికి ముందుకు కదిలాయి. అంతరిక్షంలో ప్రపంచ దేశాలన్నీ పరస్పరం సహకరించుకోవాలని, దాన్ని శాంతియుత ప్రయోజనాలకు వినియోగించాలని, అక్కడి పరిశోధనల ఫలితాలు సమస్త మానవాళికి అందించాలన్న లక్ష్యాలతో ఐఎస్‌ఎస్‌కు అంకురార్పణ జరిగింది. రెండున్నర దశాబ్దాల క్రితం గనుక ఇదంతా కుదిరింది. వర్తమానంలో ఇది సాధ్యమయ్యేదా? ప్రఖ్యాత సైన్స్ ఫిక్షన్ రచయిత ఆర్థర్ సి. క్లార్క్ చాన్నాళ్ల క్రితం 'ఈ విశాల విశ్వంలో రెండే రెండు సంభావ్యతలుంటాయి... అవి–మానవాళి ఒంటరైనా కావాలి లేదా కాకపోవాలి' అన్నారు. సకల అంతరిక్ష యాత్రల సారాంశం దాన్ని ఛేదించటమే. ఈ క్రమంలో ఐఎస్‌ఎస్ ఒక సాధనం.

ప్రయోగశాలగా, భిన్న సాంకేతికతల నిగ్గుతేల్చేదిగా భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో సేవలందిస్తున్న ఐఎస్‌ఎస్ ఇప్పటికి భిన్న శాస్త్రాల్లో 4,000 ప్రయోగాలకు వేదికైంది. జీవశాస్త్రం మొదలుకొని ఔషధాల వరకూ... భూ విజ్ఞాన శాస్త్రాలు మొదలుకొని భౌతిక శాస్త్రం వరకూ... పర్యావరణ పర్యవేక్షణ నుంచి అంతరిక్ష అన్వేషణ వరకూ ఎన్నెన్నో అంశాల్లో ఐఎస్‌ఎస్ వ్యోమగాములకు తోడ్పాటునందిస్తోంది. గురుత్వాకర్షణ శక్తి బలంగావుండే భూ వాతావరణంలో కొన్ని కొన్ని పరిశోధనలు అసాధ్యమవుతాయి. అత్యంత సూక్ష్మ గురుత్వాకర్షణ కలిగి భారరహిత స్థితిలో ఉండే ఐఎస్‌ఎస్‌లో సంక్లిష్టమైన పరిశోధనలూ, ప్రయోగాలూ చేయటం, వాటినుంచి ఫలితాలు రాబట్టడం ఎంతో సులభం. ఇవి మనిషి జీవితాన్ని సుఖవంతం చేయగల అనేక సృజనాత్మక సాంకేతికతల ఆవిష్కరణకు తోడ్పడ్డాయి. కమ్యూనికేషన్ల రంగంలో, వనరుల యాజమాన్య నిర్వహణలో, తాగు నీరు స్వచ్ఛతకు వినియోగించే సాంకేతికతల రూపకల్పనలో, అంతరిక్ష యాత్రకు పనికొచ్చే అధునాతన సాంకేతికతల అభివృద్ధిలో ఈ పరిశోధనలు ఉపయోగపడ్డాయి. అంతేకాదు... మానవాళి భవిష్యత్తు అంతరిక్ష అన్వేషణలకు ఐఎస్‌ఎస్ వేదికవుతున్నది.

ఐఎస్‌ఎస్ భూమ్మీద రూపొందించి ప్రయోగించింది కాదు. అది కొన్ని రోజుల్లోనో, నెలల్లోనో పూర్తయినది కూడా కాదు. అందుకు దాదాపు పదమూడేళ్లు పట్టింది. అందులోని విడిభాగాల్లో ఎవరేమి తయారుచేయాలో, ఎప్పుడు పట్టుకెళ్లాలో సమగ్ర ప్రణాళికలు రూపొందించుకోగా, 1998 నవంబర్‌లో మొదలుపెట్టి 2011 వరకూ పునర్వినియోగ అంతరిక్ష నౌకలద్వారా, రష్యన్ రాకెట్ల ద్వారా 30 దఫాలు వందకుపైగా ఐఎస్‌ఎస్ విడిభాగాలు, సౌరశక్తి ప్యానెళ్లు, కేబుళ్లు వగైరాలు చేర్చారు. వ్యోమగాములు స్పేస్‌వాక్ చేస్తూ ఈ కేంద్రానికి రూపకల్పన చేశారు. నిద్రపోవటానికీ, తిండికీ, వ్యాయామాలకూ, పరిశోధనలకూ ఇక్కడి నుంచి ప్రయోగించిన మాడ్యూళ్లు తోడ్పడ్డాయి. మొదట్లో ఇది గరిష్ఠంగా 2020 వరకూ పనిచేయొచ్చని అంచనా వేయగా ఇప్పటికీ నిక్షేపంలా ఉంది. తాజా అంచనా ప్రకారం 2030తో దీని జీవితకాలం పూర్తవుతుందని, ఆ తర్వాత కక్ష్య తప్పించి నేలపై పడేవిధంగా చర్యలు తీసుకోవచ్చని భావిస్తున్నారు. కానీ ట్రంప్ ఏలుబడి మొదలయ్యాక 2030 కన్నా ముందే దాన్ని దించేయాలని ఎలాన్ మస్క్ వాదించటం మొదలుపెట్టారు. ప్రస్తుతం మస్క్ స్థానమేమిటన్న దాన్నిబట్టి ఐఎస్‌ఎస్ భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

మామూలుగా దూరప్రాంతాలకు వెళ్లినప్పుడే ఇంటిల్లిపాదీ ఎంతో భావోద్వేగానికి లోనవుతారు. అంతరిక్ష యాత్రంటే చెప్పేదేముంది? అందులో సాహసమూ, సమస్యలూ కలగలిసి ఉంటాయి. ఎన్నో త్యాగాలకు సిద్ధపడాలి. శిక్షణ కోసం అయినవాళ్లకు దూరంగా ఉండాలి. కష్టతరమైన వ్యాయామాలు తప్పనిసరి. శుభాంశు వీటన్నిటినీ తట్టుకుని నిలబడ్డాడు. వాయుసేన నుంచి అంతరిక్షయాత్ర వైపు అడుగులేశాడు. ప్రధాని నరేంద్ర మోదీ చెప్పినట్టు ఇప్పుడు 140 కోట్లమంది భారతీయుల ఆకాంక్షలనూ, నమ్మకాలనూ మోసుకెళ్లాడు. యువతకు స్ఫూర్తిగా నిలిచాడు. శుభాంశు యాత్ర దిగ్విజయం కావాలని, మరో ముగ్గురితో కలిసి ఆయన సాగించే ప్రయోగాలూ, పరిశోధనలూ మానవాళి శ్రేయస్సుకు తోడ్పడాలని దేశ పౌరులంతా ఆకాంక్షిస్తున్నారు.

చీకటి రోజులు ఆనాడు, ఈనాడు

జ్ఞాపకం



భూమన కరుణాకర రెడ్డి

మానవ సౌభాగ్యం కోసం ధనమూ, ప్రాణమూ కూడా తృణప్రాయంగా త్యాగం చేసేవారు ఒకరు; స్వార్థం, అధికారం కోసం అక్షరాన్ని, ఆలోచనను, జ్ఞానాన్ని, దేశాన్ని ఖైదు చేసేవారు మరొకరు. ఇద్దరికీ 'సాక్షి' ఈ వేదభూమి.

అది 1975. దేశం అల్లకల్లోలంగా ఉంది. నిరుద్యోగం, ఆశ్రిత పక్షపాతం, అధిక ధరలు, అవినీతి, బాంబుల పేలుళ్లు... మొత్తం అలజడే. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, ఆంధ్ర రాష్ట్రాలలో నక్సల్బరీ ఉద్యమం ఊపు మీదుంది. అవినీతి, అన్యాయాలకు వ్యతిరేకంగా జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమం దేశవ్యాప్తంగా ఉధృతంగా ఉంది. మన ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఉక్కుపాదంతో అన్ని ఉద్యమాలను అణచి వేస్తున్నారు. ఆలోచనా పరుల మీద కుట్ర కేసులు పెడుతున్నారు.

తిరుపతి ఎరుపుమయం

తిరుపతిలో 1972లో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ స్థాపించబడింది. అప్పుడు నేను ప్రారంభ సభ్యుడిని. కొంత కాలానికి విద్యార్థి ఉద్యమంలో నేను ప్రముఖ పాత్ర వహించాను. నా మిత్రులు తిలక్, శైలకుమార్, శ్రీధర్, సాకం నాగరాజ, శివారెడ్డి తదితరులతో అనేక ఉద్యమాలు నడిపాం. అధిక ధరలు, అవినీతికి వ్యతిరేకంగా జరిపిన ఉద్యమాలు ఒకెత్తు. అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా కేవలం విద్యార్థినులతో తిరుపతి పురవీధుల్లో జరిపిన ఊరేగింపు మరో ఎత్తు. తిరుపతి గోడల నిండా ఎర్రని అక్షరాలతో నేను, సాకం నాగరాజ విప్లవ నినాదాలు రాసి ఎర్ర తిరుపతిని ఆవిష్కరించాం.

చిత్తూరు కుట్ర కేసు బనాయించి, త్రిపురనేని మధుసూదన్ రావు, భూమన్ తదితరులను అరెస్టు చేసినపుడు తిరుపతి కోర్టు ఆవరణలో నా నాయకత్వంలో జరిగిన విద్యార్థి ఉద్యమం చూసి పోలీసులే భయపడ్డారంటే అతిశయోక్తి కాదు.

ఈ పరిస్థితుల్లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాదు హైకోర్టు తీర్పు వెలువరించింది. దాని ఫలితంగా 1975 జూన్ 25న ప్రధాని దేశంలో ఎమర్జెన్సీ విధించింది. అంతే... దేశానికి చీకటి రోజులు ప్రారంభం అయ్యాయి. జైళ్ల నోళ్లు తెరుచుకున్నాయి. ప్రశ్నించే వారిని, ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేశారు. ఎక్కడ చూసినా నిశ్శబ్దం. భయం. కలాలు, గళాలు మూగబోయాయి.

ఎమర్జెన్సీ విధించిన 4 రోజుల తర్వాత ఓ అర్ధరాత్రి పోలీసులు నన్ను, మా అన్న భూమన్‌ను, త్రిపురనేని, శివారెడ్డి, కోటయ్య, లాయర్ కృష్ణస్వామి, మిత్రులు శ్రీధర్, శైలకుమార్, చంద్రను అరెస్టు చేశారు. తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో మమ్మల్ని ఉంచారు. ఉదయాన్నే టాయిలెట్‌కు వెళ్లాలని, అక్కడ తొట్టిలోని నీళ్లను చూస్తే కడుపులో దేవింది. నీళ్ళల్లో వందల పురుగులు. అది కడిగి ఎన్నేళ్లయిందో!

ముషీరాబాద్ జైలు జీవితం

ఆ తర్వాత మా అందర్నీ ఒక పాత వ్యానులో హైదరాబాదులోని ముషీరాబాద్ జైలుకు తరలించారు. విప్లవ నినాదాలు చేస్తూనే ప్రయాణించాం, జైలు ఆవరణలోకి ప్రవేశించాం. మా అందర్నీ ఒకే బ్యారక్‌లో ఉంచారు. మేమందరం డిటెన్యూలము. నా నంబరు 27. 'మీసా' (మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్టు) కింద అరెస్టు చేశారు. అంటే నేరస్థులం కాము. నేరం చేస్తామేమో అనే భయంతో ప్రభుత్వం ముందుగా అరెస్టు చేసింది.

అప్పటికే జైలులో రాజకీయ ఖైదీగా ప్రొద్దుటూరు ఎం.వి. రమణారెడ్డి, కొందరు స్మగ్లర్లు, గూండాలు ఉన్నారు. ఆ తరువాత రోజు నుంచి నాయకుల ప్రవాహం మొదలైంది. వరుసగా ఆర్.ఎస్.ఎస్. నాయకుడు, ఎమ్మెల్సీ సూర్యప్రకాష్ రెడ్డి, అనంతపురం తరిమెల రామదాసురెడ్డి, జూపూడి యజ్ఞనారాయణ వచ్చారు. జైలులో సౌకర్యాల కోసం పోరాటం చేసి సాధించుకున్నాం.

సీపీఎం, పౌరహక్కుల సంఘం నాయకులు, ఆర్ఎస్ఎస్, జనసంఘ్, ఆనందమార్గ్, సోషలిస్టు పార్టీ, జమైతే ఇస్లామ్, ముస్లిం లీగ్ – ఇలా అన్ని పార్టీల నాయకులూ అరెస్ట య్యారు. ఎమర్జెన్సీలో అరెస్టయిన రాజకీయ ఖైదీలలో వయసులో అందరికన్నా పెద్దవాడు మొరార్జీ దేశాయ్, అందరికంటే చిన్నవాడిని నేను.

నా పక్క బ్యారక్‌లో ఎందరో పెద్దలు, ఉద్యమ నిర్మాతలు ఉండేవారు. తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్న, సుంకర సత్యనారాయణ, యలమంచిలి శివాజీ, తరువాత ఉప రాష్ట్రపతి అయిన వెంకయ్య నాయుడు, గవర్నర్లు అయిన బి. సత్య నారాయణ రెడ్డి, వి. రామారావు, ఎస్. ఇంద్రసేనా రెడ్డి (ప్రస్తుతం త్రిపుర గవర్నర్), తుమ్మల చౌదరి వంటి ప్రముఖులు అందులో ఉన్నారు. ఇక వామపక్ష భావాలకు సంబంధించి ఎందరో! వరవరరావు, చెరబండరాజు, జక్కా వెంకయ్య, మదనపల్లెకు చెందిన మా మామ పలవలి రామకృష్ణారెడ్డి, పార్వతీపురం కుట్ర కేసుకు చెందిన నక్సలైట్ నాయకుడు నాగభూషణం పట్నాయక్, శ్రీకాకుళం నక్సల్బరీ పోరాట ప్రముఖుడు వై.కోటేశ్వర రావు, 'విరసం' సభ్యుడు యాదాటి కాశీపతి, తరిమెల నాగిరెడ్డి ప్రియ శిష్యుడు ఇమామ్, చల్లా చిన్నపురెడ్డి (దివంగత ఎమ్మెల్యే చల్లా రామకృష్ణారెడ్డి తండ్రి), కాట సాని 'గడ్డం' నరసింహారెడ్డి (కాటసాని రాంభూపాల్‌రెడ్డి తండ్రి), బిజ్జం సత్యంరెడ్డి, అలాగే సి.వి. సుబ్బారావు, 'పర్‌స్పెక్టివ్స్' ఆర్కే (రామకృష్ణ), వినుకొండ నాగరాజు, పిరాట్ల వెంకటేశ్వర్లు వంటి ప్రముఖులు ఎందరో జైల్లో ఉన్నారు. అనంతపురానికి చెందిన కామ్రేడ్ సూరి, పరిటాల రవికి బావ అయిన వడ్లమూడి కృష్ణారావును జైలుకు తెచ్చినపుడు శరీరం నిండా గాయాలు! పోలీసుల చిత్రహింసలకు సాక్ష్యం వారి శరీరాలు! అంతమంది పెద్దలు పరిచయం కావడం, వారి మధ్య ఉండటం నా జీవితాన్ని మలుపు తిప్పింది. ఆ జైలు ఓ పాఠశాలగా, ఒక విశ్వవిద్యాలయంగా నన్ను తీర్చిదిద్దింది. అది నిర్బంధం కాదు, నా జ్ఞానానికి బంధం అయింది.



ఎమర్జెన్సీలో ఖైదు అయిన జార్జ్ ఫెర్నాండెజ్

> ఎమర్జెన్సీలో అరెస్టయిన రాజకీయ ఖైదీలలో అందరి కన్నా పెద్దవాడు మొరార్జీ దేశాయ్. చిన్నవాడిని నేను. నా పక్క బ్యారక్‌లో ఎందరో ఉద్యమ నిర్మాతలు ఉండేవారు. అంతమంది పెద్దలు పరిచయం కావడం, వారి మధ్య ఉండటం నా జీవితాన్ని మలుపు తిప్పింది. నన్ను తీర్చిదిద్దింది.

ఆ రోజు దేశ వ్యాప్తంగా లక్షకుపైగా జనాన్ని అరెస్టు చేశారు. మన రాష్ట్రంలోనే దాదాపు మూడు వేల మందిని నిర్బంధించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వామపక్ష మహోద్యమ కెరటం జార్జిరెడ్డిని చంపాడని ఆరోపణలు ఎదుర్కొన్న ఆర్ఎస్ఎస్ నారాయణదాస్ మాతోనే ఉండేవారు. వారిని చూస్తూ ఓ వైపు కోపం, బలవంతపు సహనం. మేము జైలులో ఉండగానే నక్సలైట్ ఖైదీలైన భూమయ్య, కిష్టాగౌడ్‌లను ఉరితీశారు. 1975 డిసెంబరు 31న ఉరి అమలు జరిపారు. ఉరితీతకు వ్యతిరేకంగా రెండు రోజులు నిరాహార దీక్ష చేశాం. ఉరి తీయడానికి రెండు రోజుల ముందు నేను భూమయ్య, కిష్టాగౌడ్‌లను కలసి మాట్లాడాను. అది ఒక ఆనందం. వారి మరణం హృదయానికి శిక్ష.

మేము జైలులో ఉండగానే కామ్రేడ్ కరణం నాగరాజు, సుంకన్న, మహదేవన్, నరసింహారెడ్డి, జంపాల చంద్రశేఖర ప్రసాద్, నీలం రామచంద్రయ్య పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించారు. విషాదాన్ని మౌనంగా జైలు గోడలకు, రాత్రి మూగగా వెలిగే దీపాలకు చెప్పుకుని చెమ్మగిల్లేవాళ్ళం. నక్సల్బరీ ఉద్యమ నిర్మాత కె.జి. సత్యమూర్తి (శివసాగర్) నా భుజం మీద చేతులు వేసి విప్లవ గీతాలు ఆలపించడం ఈనాటికీ మరువలేను. ఒక సాయంత్రం వాలీబాల్ ఆడుకుంటున్న సమయంలో వంగవీటి రంగా వాళ్లు, పింగళి దశరథరామ్‌ను కొట్టడం జరిగింది. అపుడు మా డిటెన్యూలకు 'మేయర్' సత్యనారాయణ రెడ్డి. వారి దగ్గర మాట్లాడి, పింగళికి క్షమాపణలు చెప్పించాం. తప్పును అంగీకరించే సహృదయత ఆ రోజుల్లో ఉంది. సిద్ధాంతాలు వేరు కాని, మనుషులుగా ఒక్కటే అన్నది ఆనాటి అనుభవం.

కటకటాల్లో కలిసిన బంధం

జైలులో నా జీవితాన్ని మలుపు తిప్పిన సంఘటన వై.ఎస్. రాజారెడ్డి పరిచయం. మేము జైలుకు వెళ్లిన కొద్దిరోజుల తర్వాత రాజారెడ్డి, ఆయన పెద్ద కుమారుడు జార్జిరెడ్డి జైలుకు వచ్చారు. అప్పటికే ఆయన వయస్సు యాభై ఏళ్లు. నాకు సుమారు పదిహేడు ఉంటాయి. ఆయన గంభీరంగా కనిపిస్తాడు కానీ మాట్లాడితే సున్నితమైన మనస్సు తెలుస్తుంది. మా ఇద్దరినీ చెస్ కలిపింది. ఆటలో ఆయన నిష్ణాతుడు. నాకు కొద్దిగా తెలుసు. అయిదారుసార్లు ఆయన ఓడిపోయారు. కొన్ని ఆటల తర్వాత నాకు అర్థమైంది, నన్ను గెలిపించటానికే ఆయన ఓడుతున్నాడని! జీవితంలో కూడా నన్ను ఎప్పుడూ గెలిపించాలనే ఆయన ఆరాటపడేవాడు. ఎందుకు ఏర్పడిందో ఈ బంధం! కటకటాల మధ్య బంధం, జీవిత అనుబంధమైంది. నేను మట్టిలో కలిసే వరకు ఇది గట్టిగానే ఉంటుంది.

తాడిపత్రి దగ్గరి వెన్నపూసపల్లి గ్రామానికి చెందిన కామ్రేడ్ సూరి నాకు మంచి స్నేహితుడు. ఇద్దరం కలసి ఆసుపత్రికి వెళ్లి అక్కడి నుంచి పోలీసుల కన్నుగప్పి పారిపోవాలని ప్రణాళిక వేశాం. ఆసుపత్రికి వెళ్లాం. కానీ విపరీతమైన బందోబస్తు. కుదరలేదు. ఈ రోజు అనుకుంటే నవ్వు వస్తుంది. జైలులో పశుపతి అనే వైద్యుడు ఖైదీల పట్ల దారుణంగా ప్రవర్తించేవాడు. ఒకరోజు నేను, కడపకు చెందిన మా సీమ రాజగోపాల్ రెడ్డి ఇద్దరం అతని మీద దాడి చేశాం. ఇక, జైలు ప్రధాన ద్వారం దగ్గరున్న చెట్టు కింద వెంకయ్య నాయుడు, వారి భార్య ముచ్చటగా ములాఖత్‌లో మాట్లాడుకోవడం ఇంకా గుర్తు. అప్పట్లో ఆయన చాలా అందంగా ఉండేవారు. జైలు అనుభవాలు ఇప్పుడు గుర్తు చేసుకుంటే ఆనందంగానూ, ఆశ్చర్యంగానూ ఉంది. నేను మహాత్మాగాంధీ జీవిత చరిత్ర చదివింది జైలులోనే! గౌతు లచ్చన్న ఆ పుస్తకం ఇచ్చి చదవమన్నారు. జైలులో మేము ఓ లిఖిత పత్రికను నడిపాం. పత్రిక మొత్తం చేతితో రాసి సహచరులకు పంచేవాళ్ళం. అందులో మొదటిసారిగా నేను ఓ కవిత రాశాను. మొదటిది, ఆఖరిది అదే! అయితే ఆ కవితను అక్కడే ఉన్న కవి–విమర్శకుడు కె.వి. రమణారెడ్డి ఎంతో మెచ్చుకున్నారు.

నాలుగు గోడల మధ్య దాదాపు రెండేళ్లు గడపవలసి వచ్చింది. దానివల్ల కొందరు అకస్మాత్తుగా మానసికంగా ఇబ్బందిపడేవారు. ఈ రోజు ప్రముఖులైన కొందరు నాయకులు ఆ రోజు, 'ఇక ఇందిరా గాంధీ మనలను వదలదేమో, ఇక్కడే ఉండిపోవాలేమో' అని బాధపడటం, కుటుంబం కోసం చింతించడం నాకు తెలుసు. జైల్లో మాతో పాటు కదిరికి చెందిన డాక్టర్ శ్రీనివాస్ అని ఒకరు ఉండేవాడు. తరచుగా ఆసుపత్రికి వెళ్లేవాడు. ఏ అనారోగ్యము లేదు. విషయం తెలిసి ఆశ్చర్యపోయాం. ఆసుపత్రిలోని ఓ వైద్యురాలిని ప్రేమించి, ఆ నిర్బంధంలోనే పెళ్లి చేసుకోవడం జరిగింది.

రాజకీయంగా అభిప్రాయ బేధాలున్నా అందరం కలసిమెలసి ఉండేవారం. ఎవరికి వారు రాజకీయ పాఠశాలను నిర్వహించుకొనేవారు. వారి వారి సిద్ధాంతాలను వివరించేవారు. కవులు, రచయితలు, కళాకారులు, సిద్ధాంతకారులు అందరినీ ఒకేచోట కలుసుకోవడం, మాట్లాడటం నాకు ఇచ్చిన విజ్ఞానం ఎంతో గొప్పది.

అప్రకటిత ఎమర్జెన్సీ

ఏపీలో కూటమి పాలన వచ్చినప్పటి నుంచి జరుగుతున్న అరెస్టులు, అన్యాయాలు, దౌర్జన్యాలు, దోపిడీ చూస్తుంటే అప్పటి ఎమర్జెన్సీ ఎంతో మేలని అనిపిస్తోంది. అది ప్రకటించిన ఎమర్జెన్సీ. ఇది ప్రకటించని ఎమర్జెన్సీ. ప్రశ్నిస్తే జైలు, మాట్లాడితే కేసు, కాదంటే దాడి, కదిలితే తూటా– ఇదీ నేటి వాస్తవం. అప్పుడు కారణంతో ఖైదు చేస్తే, ఇపుడు అకారణంగా ఖతం చేస్తున్నారు. పాత్రికేయుల కలాలను అధికారంతో శాసిస్తున్నారు. నవ్వితే 40 కేసులు పెట్టడం ఈ ముఖ్యమంత్రికే సాధ్యం. ఎమర్జెన్సీ కాలంలో యూత్ కాంగ్రెస్‌లో ఉన్న చంద్రబాబు నాయుడు నేర్చుకున్న దమన దహన రాజకీయం ఇదేనేమో! రాష్ట్రం రావణ కాష్ఠంగా ఉంది. 6 కోట్ల మందిని ఆరు బయటే ఖైదు చేసి చంద్రబాబు ఆనందిస్తున్నట్లుగా ఉంది. ఎమర్జెన్సీ తర్వాత ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ ఏమయిందో గుర్తు చేసుకోవాలని అధికార చంద్రునికి అనునయంగా గుర్తు చేస్తూ...

వ్యాసకర్త టీటీడీ మాజీ చైర్మన్

ఇన్ బాక్స్

మత్తు వదిలితేనే భవిత

ప్రపంచ దేశాలను తీవ్రంగా కలవరపెడుతున్న అంశాలలో 'మాదక ద్రవ్యాల తయారీ–అక్రమ రవాణా–క్రయవిక్రయాలు–వినియోగం' అతి ముఖ్యమైనవి. వీటిని అరికట్టడానికి వివిధ దేశాలు వివిధ రకాలుగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. అయినా, మాదక ద్రవ్యాల నిర్మూలనలో ఆశించిన ఫలితాలు రావడం లేదు.

మనకు మిక్కిలి హాని కలిగించే కొన్ని మత్తు పదార్థాలను మాదకద్రవ్యాలు (డ్రగ్స్) అని వ్యవహరిస్తారు. ఈనాటి యువతరాన్ని దారి మళ్ళించి చెడు మార్గాల్లో నడిపిస్తున్న దురలవాట్లలో మాదక ద్రవ్యాల వినియోగం తీవ్రమైనది. నల్లమందు, మార్ఫిన్, హెరాయిన్, చరస్, గంజాయి, కొకైన్, ఎల్ఎస్‌డీ వంటి మాదక ద్రవ్యాలను అక్రమంగా తరలించి రహస్యంగా వినియోగదారులకు అందిస్తూ డబ్బు సంపాదించడం కొందరికి లాభసాటి వ్యాపారం అయ్యింది. కానీ వాటికి అలవాటుపడిన వారు మాత్రం ఆరోగ్యం కోల్పోయి బికారులవుతున్నారు.

తల్లితండ్రులు, కుటుంబ సభ్యులు పిల్లల ముందే మత్తు పదార్థాలను వినియోగించడం వల్ల పిల్లలూ వాటికి ఆకర్షితులవుతున్నారు. ఒత్తిడిని తట్టుకోలేని సున్నిత మనస్కులు వీటిని ఆశ్రయిస్తున్నారు. కనుచూపు మేరలో మత్తు పదార్థాలు అందుబాటులోకి రావడం, పాశ్చాత్య పోకడలు, టీవీ, సోషల్ మీడియాల ప్రభావం వల్ల యువత వీటిబారిన పడుతున్నారు.

పలు జాతీయ సర్వేల ప్రకారం... మత్తు పదార్థాలు సేవించేవారిలో ఆత్మహత్య ఆలోచనలు వస్తాయి. శారీరక సమస్యలకు తీవ్రంగా గురవుతారు. ఒత్తిడికి, మానసిక సమస్యలకు గురవుతారు. భార్యల నుండి విడాకులు కోరుతున్నారు. నేరపూరిత ఆలోచనలతో గడుపుతున్నారు. చాలామంది లైంగిక సామర్థ్యం కుంటుపడుతోంది. స్థూలకాయం లాంటి సమస్యలతోనూ బాధ పడుతున్నారు.

– డా॥ బి. హర్షిణి
ఎమ్‌డీ (సైకియాట్రీ), మంగళూర్, కర్ణాటక
(నేడు అంతర్జాతీయ మత్తుపదార్థాల వ్యతిరేక దినం)

క్షమాపణే లేదు... పొరపాటన్న మాటా!

కామెంట్



కరణ్ థాపర్

సరిగ్గా యాభై ఏళ్ళ క్రితం ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించారు. 'ఇందిరా గాంధీ అండ్ ది ఇయర్స్ దట్ ట్రాన్స్‌ఫామ్డ్ ఇండియా' పేరుతో శ్రీనాథ్ రాఘవన్ ఒక పుస్తకం రాశారు. ఆమె జీవిత చరిత్రకు సంబంధించి దీనిని అత్యంత సాధికారిక మైన, ప్రగాఢమైన పుస్తకంగా చెబుతారు. ఎమర్జెన్సీని 'స్వతంత్ర భారతదేశపు రాజకీయ చరిత్రలో ఏకైక అత్యంత బాధాకరమైన ఘట్టం'గా రాఘవన్ అభివర్ణించారు. అది ఎంతటి భయానకమైన అనుభవాలను మిగిల్చిందో నేడు మనకు మనం గుర్తు చేసుకుందాం.

ఎమర్జెన్సీకి సంబంధించిన చేదు వాస్తవాలు ఒళ్ళు గగుర్పొడిచేవిగా ఉంటాయి. ఆంతరంగిక భద్రతా చట్టం (మీసా) కింద 34,988 మందిని నిర్బంధంలోకి తీసు కున్నారు. డిఫెన్స్ ఆఫ్ ఇండియా నిబంధనల కింద 75,818 మందిని అరెస్టు చేశారు. ఇంచుమించుగా మొత్తం ప్రతిపక్షాన్ని అంతటినీ కటకటాల వెనక్కి నెట్టారు. పత్రికలు సెన్సార్‌కు గురయ్యాయి. రాజ్యాంగాన్ని దారుణంగా సవరించారు. జీవించే హక్కును సస్పెండ్ చేశారని న్యాయ వ్యవస్థ కూడా అంగీకరించింది.


భారతదేశంలో ప్రజాస్వామ్యం పని అయిపోయినట్లేననీ, దానికి ఇంతటితో నీళ్ళు వదిలేసినట్లేననీ ఎమర్జెన్సీ తీవ్ర స్థాయికి చేరిన రోజుల్లో ఎల్కే అద్వానీ తన డైరీలో రాసుకున్నారు. ఆనాటి పరిస్థితుల్లో ఆయన అభిప్రాయంతో చాలా మంది ఏకీభవించి ఉంటారు.


ఇందిరా గాంధీ తన రాజకీయ జీవితాన్ని కాపాడుకునేందుకే ఎమర్జెన్సీ ప్రకటించారనడంలో ఎవరికీ ఇసుమంత సందేహం లేదు. అప్పట్లో ఇందిరా గాంధీ ఎన్నికను అలహాబాద్ హైకోర్టు రద్దు చేసింది. దానిపై సుప్రీం కోర్టు షరతులతో కూడిన స్టే మాత్రమే ఇచ్చింది. ప్రభుత్వ పాలన చచ్చుబడేలా చేయడానికి ప్రతిపక్షం ప్రయత్నించ బట్టి అత్యవసర పరిస్థితిని ప్రకటించవలసి వచ్చిందని ఇందిర చెప్పుకొన్నారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించవద్దని సైన్యానికి, పోలీసులకు జయప్రకాశ్ నారాయణ్ పిలుపు ఇవ్వడంతో గత్యంతరం లేక ఎమర్జెన్సీ ప్రకటించవలసి వచ్చిందని ఇందిర చెప్పుకున్నా, అది ఆమె తన చర్యను కప్పిపుచ్చుకునే సాకు గానే కనిపించింది.

మొత్తానికి, 1975 జూన్ 25న ఎమర్జెన్సీ ప్రకటించడాన్ని 'రాజకీయ తిరుగుబాటు'గా శ్రీనాథ్ రాఘవన్ అభిప్రాయపడ్డారు. ఎందుకంటే, రాజ్యాంగం ప్రకారం, ఒక సమయంలో ఒకే ఎమర్జెన్సీని ప్రకటించడానికి మాత్రమే అవకాశం ఉంది. బంగ్లాదేశ్ యుద్ధం (1971) కారణంగా అప్పటికే బాహ్య ఆత్యయిక పరిస్థితి (ఎక్స్‌టర్నల్ ఎమర్జెన్సీ) అమలులో ఉంది.

రెండు – మంత్రి మండలి చేసిన లిఖితపూర్వక సిఫార్సు మేరకు మాత్రమే రాష్ట్రపతి రాజ్యాంగంలోని 352వ అధికరణం కింద ఎమర్జెన్సీ విధించగలుగుతారు. ఆనాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ అంతవరకు వేచి చూడలేదు. ప్రధాన మంత్రి వ్యక్తిగత అభ్యర్థన మేరకే ఆయన ఆ పని చేసేశారు.

మూడు – సామూహిక అరెస్టులు చేయడం, జూన్ 25, 26 రాత్రుళ్లు పత్రికా సంస్థలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం వంటి పనులకు 'చట్టపరమైన ప్రాతిపదిక లేదు. ఇదంతా ప్రధానమంత్రి ప్రోద్బలం మేరకే జరిగింది' అని రాఘవన్ వ్యాఖ్యానించారు.





ప్రధాని ఇందిరా గాంధీ, ఆనాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్

పోనీ ఇందిరా గాంధీ చెప్పినట్లుగానే అప్పట్లో 'భారత్ భద్రతకు తక్షణ ముప్పు పొంచి ఉందా?' అని ప్రశ్నించుకుందాం. ఇంటెలిజెన్స్ బ్యూరో అటువంటి నివేదికను ఏమీ సమర్పించలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆ రకమైన సమాచారాన్ని దేనినీ హోమ్ మంత్రిత్వ శాఖకు తెలియబరచలేదు. అంటే... ఇందిరా గాంధీయే ఈ ఆంతరంగిక ముప్పు ఉన్నట్లుగా ఒక సాకును సృష్టించుకుని ఉంటారా? ఔననే భావించవలసి ఉంటుంది.

సత్యం ఏమిటంటే... ప్రజాస్వామ్యం గురించి ఇందిరకు ఎన్నడూ ఉన్నతమైన భావన లేదని రాఘవన్ రాసిన పుస్తకం పేర్కొంటోంది. 'ప్రజాస్వామ్యమే గమ్యం కాదు. అది కేవలం ఒకరు లక్ష్యం వైపు సాగడానికి ఉపయోగపడే వ్యవస్థ మాత్రమే. కనుక ప్రగతి, సమైక్యత లేదా దేశ అస్తిత్వాల కన్నా ప్రజాస్వామ్యం ముఖ్యమైంది ఏమీ కాదు' అని ఆమె ఒకసారి వాయులీన విద్వాంసుడు యెహుదీ మెనుహిన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు.

ఎమర్జెన్సీ అనగానే చాలా మందికి రెండు ప్రచారోద్యమాలు చప్పును గుర్తుకు వస్తాయి. ఒకటి – కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు. రెండు – మురికివాడల నిర్మూలన. ఆ రెండింటికీ ఇందిర చిన్న కుమారుడు సంజయ్ నేతృత్వం వహించారు. తీరా, ఆ రెండూ ఎమర్జెన్సీ విశ్వసనీయతను, ఇందిర వ్యక్తిగత ప్రతిష్ఠను దెబ్బతీశాయి.

అయినా, సంజయ్‌పై ఇందిర ఎంతగా ఆధారపడ్డారంటే... వాటిని ఆమె పట్టించుకోలేదు. పైగా, సంజయ్ అన్నయ్య లాంటివాడంటూ ఆమె వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య అధికారికంగా నమోదైంది. ఇందిరకు వ్యతిరేకంగా అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత, సంజయ్‌ను గట్టి, అత్యంత విధేయుడైన మద్దతుదారునిగా ఆమె పరిగణించారు. ఇందిర ముఖ్య కార్యదర్శి పీఎన్ హక్సర్ మాటల్లో 'ఆ అబ్బాయికి సంబంధించినంత వరకు ఆమె గుడ్డిగా వ్యవహరించారు.'

ఎన్నికలకు ఇంకా ఒక ఏడాది గడువు ఉన్నప్పటికీ, అందరినీ ఆశ్చర్యపరుస్తూ 1977 జనవరిలో ఇందిరా గాంధీ ఎన్నికలకు పిలుపు నిచ్చారు. అవి ఆమె పాలనకూ, ఎమర్జెన్సీ అంతానికీ దారి తీశాయి. ఎన్నికల్లో తప్పకుండా గెలుస్తాననీ, ఎమర్జెన్సీ విధింపునకు చట్టబద్ధతను చేకూర్చగలననీ గట్టిగా నమ్మబట్టే ఆమె ఎన్నికలకు వెళ్ళి ఉంటారా? లేదా ఎమర్జెన్సీ ఒక తప్పిదమేనని ఆమె ఆ రకంగా అంగీకరించి, చేస్తున్న పులిస్వారీని విరమించి ఉంటారా?


వాస్తవం ఏమిటంటే... ఎమర్జెన్సీ విధించినందుకు ఇందిరా గాంధీ ఎన్నడూ క్షమాపణ చెప్పలేదు. అలాగే అది ఒక పొరపాటనీ అంగీకరించనూ లేదు. వివిధ పార్శ్వాలలో ఎమర్జెన్సీ తాలూకు ప్రభావం పట్ల మాత్రం ఆమె విచారం వ్యక్తపరిచారు. వాటిని ఆమె అధికార యంత్రాంగ మితిమీరిన చేష్టలుగా భావించారు. 'ఎమర్జెన్సీ విధింపునకు సంబంధించి మీరు మరో విధంగా వ్యవహరించి ఉంటే బాగుండేదని మీకు ఎప్పుడైనా అనిపించిందా?' అని పాల్ బ్రాస్ ఒక ఇంటర్వ్యూ సందర్భంగా 1978 మార్చి 26న ఆమెను ప్రశ్నించారు. దానికి ఆమె జవాబు 'లేదు' అనే పదంతో ప్రారంభమైంది. ఇంక అంతకన్నా సూటిగా చెప్పేది ఏమీ ఉండదనుకుంటా!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

త్రికరణ శుద్ధి

మనోవాక్కాయాలను మూడింటినీ త్రికరణములు అంటారు. ఏ పనైనా ఈ మూడింటి సహకారమున్నప్పుడు నిర్దిష్టంగా జరిగి తీరుతుంది. అలాంటి పనిని 'త్రికరణ శుద్ధి' అంటారు. ఈ త్రికరణశుద్ధి అనేది మంచి, చెడులు రెంటికీ ఉంటుంది.

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

సత్పురుషులైనా, దుర్మార్గులైనా వాళ్ళు చేసే సత్కర్మను మనోవాక్కాయ పూర్వకంగానే చేస్తారు. వారు మనసులో ఏ సత్కర్మ చేద్దామని సంకల్పిస్తారో, అదే మాటలలోనూ అంటారు. అదే క్రియా రూపంలో చేసి చూపిస్తారు. సత్పురుషులు మంచి పని చేయటంలో ఎలా నిజాయితీపరులో, చెడ్డవారు తాము చేయదలచిన చెడ్డపనిలో కూడా త్రికరణ శుద్ధిని ప్రదర్శిస్తారు.

పూర్వం ఒక రాజు మారువేషంలో తన రాజ్యంలో పర్యటిస్తున్నప్పుడు దొంగలు మాట్లాడుకోవడాన్ని చాటు నుంచి విన్నాడు. ఒక దొంగ తాను రాజుగారి ఖజానాలో ఉన్న నాలుగు రత్నాలలో మూడింటిని దొంగిలించి రేపు తీసుకువస్తానని ధీమాగా అన్నాడు. మరుసటి రోజు అన్నంతపనీ చేసి తాను తీసుకువచ్చిన మూడు రత్నాలను సాటి దొంగలకు చూపడం రాజుగారు చాటుగా చూశాడు.

మరుసటి రోజు మంత్రిని పిలిచి ఖజానాలో దాచిన వన్నీ ఉన్నాయో లేదో చూడమని ఆదేశించాడు రాజు. మూడు రత్నాలు మాయమైన సంగతిని గుర్తించి నాల్గవదాన్ని తాను జేబులో వేసుకుని రాజుగారి దగ్గరకు వెళ్లి నాలుగు రత్నాలు తప్ప అన్నీ భద్రంగా ఉన్నాయని నివేదించాడు. రాజు ఆదేశాలతో దొంగను సభలో ప్రవేశపెట్టారు భటులు. నిజం చెప్పమని దొంగను బెదిరించడంతో తాను మూడు రత్నాలను దొంగిలించానని చెప్పాడు దొంగ. కానీ 'నాలుగోదీ కనబడటంలేదు, దాన్నీ నువ్వే దొంగిలించావు' అంటూ ఉగ్రుడయ్యాడు మంత్రి. అప్పుడు రాజు కల్పించుకొని 'ఆ నాలుగవ రత్నం మీ దగ్గరే ఉందని నాకు తెలుసు మంత్రిగారూ' అని సభాసదులతో జరిగిన సంఘటనను వివరించాడు. మంత్రిని మందలించాడు.

క్లుప్తంగా...

ఆ ఉన్నతాధికారిపై చర్యలు తీసుకోండి

మంత్రి సీతక్కకు ఉద్యోగుల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలోని క్వాలిటీ కంట్రోల్ విభాగంలోని కిందిస్థాయి ఉద్యోగులను వేధిస్తున్న ఉన్నతాధికారిపై చర్యలు తీసుకోవాలని సదరు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను కలిసి ఫిర్యాదు చేశారు. ఉద్యోగులపట్ల అమానవీయంగా ప్రవర్తిస్తుండటం, మితిమీరిన ప్రవర్తన, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడం, సుదూర ప్రాంతాలకు పంపడం, వీడియో కాల్స్ చేయడం, కొందరు ఉద్యోగులను తన చాంబర్ వద్దే కూర్చుని పని చేయించడం, కార్యాలయంలో అవాంఛనీయ వాతావరణాన్ని సృష్టిస్తూ ఉద్యోగులను తీవ్ర గందరగోళానికి, భయాందోళనకు గురిచేస్తున్నారని ఉద్యోగులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే ఇద్దరు ఉద్యోగాన్ని విడిచిపెట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ ఉన్నతాధికారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు.

ఏఐసీటీఈ షెడ్యూల్ ప్రకారమే కౌన్సెలింగ్

- సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన



సాక్షి, హైదరాబాద్: 'ఇంజనీరింగ్ కౌన్సెలింగ్‌కు బ్రేక్'అనే శీర్షికతో 'సాక్షి'దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనంపై సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన స్పందించారు. అఖిలభారత సాంకేతిక విద్యా మండలి షెడ్యూల్ ప్రకారమే రాష్ట్ర ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. అదనపు సీట్ల కేటాయింపు అనుమతికి ఈ నెలాఖరు వరకు సమయం ఉందని వెల్లడించారు. గతేడాది కూడా జూలై 4 నుంచే మొదటి విడత కౌన్సెలింగ్ చేపట్టిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. అయితే సాక్షి దినపత్రికలో కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలపై జరుగుతున్న జాప్యాన్ని మాత్రమే పేర్కొన్నారు. గతేడాది మే 24వ తేదీన షెడ్యూల్ విడుదల చేసిన విషయాన్ని దేవసేన తన వివరణలో పేర్కొనలేదు. పైగా గతేడాది కూడా కౌన్సెలింగ్ వాయిదా పడి ఆలస్యమైందని ఆమె గుర్తు చేయడం విశేషం.

బీసీ రిజర్వేషన్లు పెంచేవరకు ఒత్తిడి కొనసాగిస్తాం

- జాజుల శ్రీనివాస్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్లు పెంచేవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి కొనసాగిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 30వ తేదీకల్లా పూర్తిచేయాలని హైకోర్టు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఆలోపే బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కోర్టు ఇచ్చిన సమయంలోపు బీసీ రిజర్వేషన్లు పెంచేందుకు ఈ గడువు సరిపోతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు చిత్తశుద్ధి ఉంటే బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని, ఇప్పటికైనా ఈ రెండు పార్టీలు బీసీల విషయంలో రాజకీయాలు చేయొద్దని కోరారు. తక్షణం కార్యాచరణ మొదలుపెట్టి నెలరోజుల్లోగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసిందని, ఇలాంటప్పుడు బీసీ రిజర్వేషన్ల పెంపులో జాప్యం ఎందుకు జరుగుతుందో అర్థంకాని పరిస్థితి బీసీల్లో నెలకొందని జాజుల పేర్కొన్నారు.

138 బడుల్లో 1,224 మంది చేరిక

సాక్షి, హైదరాబాద్: గత ఏడాది సున్నా ప్రవేశాలున్న ప్రభుత్వ బడుల్లో.. ఈ ఏడాది బడిబాట ద్వారా విద్యార్థులను చేర్పించినట్టు పాఠశాల విద్య డైరెక్టరేట్ తెలిపింది. గత ఏడాది సున్నా ప్రవేశాలున్న 138 ప్రభుత్వ స్కూళ్లలో ఈసారి 1,224 మందిని చేర్పించామని స్పష్టం చేసింది. అయినప్పటికీ దాదాపు 1,200 బడుల్లో సున్నా ప్రవేశాలే ఉన్నట్టు అధికారులు వివరించారు.

టీచర్ కొట్టాడని.. విద్యార్థి ఆత్మహత్యాయత్నం

సుజాతనగర్: హోంవర్క్ విషయంలో ఉపాధ్యాయుడు కొట్టాడని మనస్తాపానికి గురైన పదో తరగతి విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన బానోత్ వీరూలాల్–నీల కుమారుడు భరత్ కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతు న్నాడు. పాఠశాలలో గణితం ఉపాధ్యాయుడు సోమవారం హోంవర్క్ ఇవ్వగా భరత్ పూర్తి చేసుకుని మంగళవారం వెళ్లాడు. అయితే, 'హోంవర్క్ నువ్వు చేయకుండా ఎవరితోనో చేయించావు' అంటూ ఉపాధ్యాయుడు కొట్టినట్టు తెలిసింది. ఈ విషయం భరత్ తండ్రికి చెప్పగా ఆయన ఫోన్‌లో ప్రిన్సిపాల్‌తో మాట్లాడటంతో ఏం జరిగిందో తెలుసుకుంటానని బదులిచ్చాడు. ఈ మేరకు మంగళవారం సాయంత్రమే గ్రామంలో ఎలుకల నివారణ మందును కొను గోలు చేసిన భరత్ బుధవారం స్కూల్ బస్సులో వెళ్తూ కూల్ డ్రింక్‌లో ఆ మందు కలుపుకుని తాగాడు. పాఠశాలకు బస్సు చేరుకునే సరికి వాంతులు అవుతుండటంతో తోటి విద్యార్థులు క్లీనర్, డ్రైవర్‌కు చెప్పగా, వారిచ్చిన సమాచారంతో పాఠశాల యాజమాన్యం కొత్తగూడెం ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్టు తెలిసింది. కాగా, ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై రమాదేవి తెలిపారు.

కీసర అధికారికి బాసర గుడి బాధ్యతలు

దేవాదాయ శాఖలో వింత వ్యవహారం

- వందల కి.మీ.దూరంలో ఉన్న గుడుల బాధ్యతల అప్పగింత
- చిక్కడపల్లి ఆలయ ఈఓ.. కొమురవెల్లికి ఇన్‌చార్జ్
- ఖమ్మం అసిస్టెంట్ కమిషనర్‌కు.. మేడారం ఆలయ పాలన పగ్గాలు



మేడ్చల్ జిల్లాలోని కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఈఓగా పనిచేస్తున్న సుధాకరరెడ్డికి ఇటీవల బాసర జ్ఞాన సరస్వతి దేవాలయ కార్యనిర్వహణాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు దేవాలయాల మధ్య దూరం దాదాపు 240 కి.మీ.

ఆదిలాబాద్ జిల్లా సహాయ కమిషనర్‌గా ఉన్న విజయరామారావుకు ఇటీవల మెదక్ జిల్లాలోని నాచారం లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఈఓ బాధ్యతలు అప్పగించారు. ఈ రెండు ప్రాంతాల మధ్య దూరం దాదాపు 150 కి.మీ.

నగరంలోని చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈఓగా ఉన్న అన్నపూర్ణకు తాజాగా సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ బాధ్యతలను అప్పగించారు. 100 కి.మీ.దూరంలో ఉన్న రెండు దేవాలయాలను నిర్వహించటం చాలా సులభమనే భావనలో దేవాదాయశాఖ ఉన్నట్టుంది.

సాక్షి, హైదరాబాద్ : సమీపంలో ఉన్న అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించటం సహజమే, కానీ..వందల కి.మీ.దూరంలో ఉన్న కార్యాలయాల్లో విధుల నిర్వహణ ఎలా సాధ్యమో దేవాదాయశాఖ ఉన్నతాధికారులకే తెలియాలి. సిబ్బంది కొరతతో ఒకే అధికారికి పలు దేవాలయాల బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. పొరుగు దేవాలయాల బాధ్యతలు చూడటం కొంత సులభమే కానీ, వందల కి.మీ.దూరంలో ఉన్న దేవాలయాల పాలనావ్యవహారాల నిర్వహణ అధికారులకు కత్తిమీద సాములా మారింది. ఆ రెండు దేవాలయాల మధ్య ఆరేడు గంటల ప్రయాణ సమయం ఉంటోంది. వారంలో ఒకటి రెండు సార్లకు మించి వెళ్లటం సాధ్యం కావటం లేదు. ఓ దేవాలయానికి వెళ్లినప్పుడు మరో దేవాలయంలో ఏదైనా ఘటన జరిగితే ఏడెనిమిది గంటల తర్వాత గానీ చేరుకోలేని పరిస్థితి. దీంతో ఏ దేవాలయంపైనా వారు సరిగ్గా దృష్టి సారించలేకపోతున్నారు. ఫలితంగా రెండు దేవాలయాల్లో పాలన పడకేస్తోంది. ఇది నేరుగా ఆలయ పురోగతి, అక్కడి కైంకర్యాలు, భక్తుల వసతులపై స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్సవాల సమయంలో, మరో దేవాలయాన్ని పూర్తిగా విస్మరించాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. ఆ సమయంలో రెండో దేవాలయంలో అక్కడి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో భక్తుల మనోభావాలు దెబ్బతినే పరిస్థితులు నెలకొంటున్నాయి.

కమిషనర్‌కూ తప్పని 'అదనపు'తిప్పలు

భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగి ప్రత్యేక రోజుల్లో 50 వేల వరకు చేరుకోవటంతో యాదగిరిగుట్ట దేవాలయాన్ని కూడా తిరుమల తిరుపతి దేవస్థానాల తరహాలో మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు పాలకమండలిని ఏర్పాటు చేసి ఆలయానికి కార్యనిర్వహణాధికారిగా ఐఏఎస్ అధికారిని నియమించాలనుకున్నారు. అయితే పూర్తిస్థాయిలో ఓ అధికారిని నియమించకుండా దేవాదాయశాఖ కమిషనర్‌గా ఉన్న వెంకట్రావుకే అదనపు బాధ్యత అప్పగించారు. దీంతో ఆయన వారంలో రెండుమూడు రోజులు యాదగిరిగుట్టలో ఉండాల్సి వస్తోంది. ఆ సమయాల్లో కమిషనర్ కార్యాలయంలో పనులు నిలిచిపోతున్నాయి. ఆయన కమిషనర్ కార్యాలయంలో ఉంటే, యాదగిరిగుట్టలో లోటు కనిపిస్తోంది. అధికారి స్థానికంగా ఉంటే సిబ్బందిలో భయభక్తులు ఉంటాయని, పూర్తిస్థాయి అధికారి లేకపోతే ఇష్టారాజ్యం కొనసాగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- ఇటీవల యాదగిరిగుట్టలో కొందరు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎలాంటి జంకూ లేకుండా దేవాలయానికి సంబంధించిన చింతపండు బస్తాలను తరలిస్తూ పోలీసులకు చిక్కారు. ఇలాంటి చోరీలు ఎన్ని జరుగుతున్నాయో అని భక్తులు ప్రశ్నిస్తున్నారు.
- గతంలో మేడారం సమ్మక్క–సారలమ్మ దేవాలయాలకు జాతర సందర్భంలో తప్ప మిగతా రోజుల్లో భక్తుల సంఖ్య అంత ఉండేది కాదు. కానీ ప్రస్తుతం సాధారణ రోజుల్లో కూడా పోటెత్తుతున్నారు. దీంతో అక్కడ కచ్చితంగా ఈఓ ఉండాల్సిన పరిస్థితి ఉంది. కానీ, ప్రస్తుతం ఆ దేవాలయానికి ఖమ్మం ఏసీ వీరస్వామిని నియమించారు. ఆ అసిస్టెంట్ కమిషనర్ పోస్టు కూడా ఇన్‌చార్జ్ నియామకమే కావటం విడ్డూరం.

అంతా మీ ఇష్టమేనా..?

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించినట్టు తెలిసింది.

ఉన్నత విద్యామండలిపై నిందలెందుకు ?

ఉన్నత విద్యామండలి నేతృత్వంలో ఇప్పటి వరకూ అనేక ఉమ్మడి ప్రవేశ పరీక్షలను దిగ్విజయంగా నిర్వహించారని, ఎక్కడా ఎలాంటి సమస్యలు రాలేదని సీఎం సమావేశంలో కొనియాడారు. కేవలం ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ విషయంలోనే సమస్య ఎందుకు వస్తుందని అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా 'మండలి అధికారులు ఇష్టానుసారం చేస్తున్నారు'అంటూ విద్యా శాఖ అధికారులు అనడంపై సీఎం సీరియస్ అయినట్టు తెలిసింది. వ్యక్తిగత సమస్యలతో విద్యార్థులకు అసౌకర్యం కలిగించేలా చేయడం సరికాదని అన్నట్టు సమాచారం. ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డితో తాను స్వయంగా మాట్లాడతానని, ఆయన సంస్కరణలపై పట్టుదలగా ఉన్నారని సీఎం అన్నట్టు తెలిసింది. సాంకేతిక విద్య అధికారుల ప్రమేయం లేకుండా కౌన్సెలింగ్ చేపడతామని ఉన్నత విద్యామండలి చెప్పడమే నేరంగా భావించడం సరికాదని సీఎం హితబోధ చేసినట్టు తెలిసింది. ఇంజనీరింగ్ ఫీజుల నిర్ధారణపై కమిటీ వేయాలనే ప్రభుత్వ ఆలోచన కూడా కౌన్సెలింగ్ జాప్యానికి కారణమన్న అధికారుల వాదనతో సీఎం ఏకీభవించలేదని తెలిసింది. అధికారులంతా ఒకసారి కూర్చొని వ్యక్తిగత అంశాలుంటే మాట్లాడుకోవాలని సూచించినట్టు తెలిసింది.

బడిబాటపై అసంతృప్తి

బడిబాటపై సీఎం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు సమాచారం. ప్రభుత్వ బడుల్లో ఎక్కువ మందిని చేర్పడమే లక్ష్యంగా చేపట్టిన బడిబాట ఆశించిన పురోగతి సాధించలేదని ఆయన అన్నట్టు తెలిసింది. ఉన్నతాధికారులే ఈ కార్యక్రమాన్ని లైట్‌గా తీసుకున్నారని, ఇక క్షేత్రస్థాయిలో ఎందుకు స్పందన ఉంటుందని సీఎం అన్నట్టు సమాచారం.

ప్రభుత్వ బడులను అదనపు కలెక్టర్లు సందర్శించాలి : సీఎం

ప్రతీజిల్లా అదనపు కలెక్టర్ వారంలో రెండుసార్లు ప్రభుత్వ స్కూళ్లను సందర్శించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సమావేశ వివరాలపై బుధవారం ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ స్కూళ్లలో 48 వేల మంది చేరినట్టు సీఎం తెలిపారు. పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కొత్త గదులను నిర్మించాలని అధికారులకు చెప్పారు. ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు పాఠశాలల్లో వసతులు కల్పించాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం తయారీకి సంబంధించి గ్యాస్, కట్టెల పొయ్యిల బాధలతో వంట చేసే మహిళలకు విముక్తి కల్పించాలని, సోలార్ కిచెన్లు ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులవుతున్న విద్యార్థుల సంఖ్యకు, ఇంటర్‌లో చేరుతున్న విద్యార్థుల సంఖ్యకు పొంతన ఉండటం లేదని సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. వారంతా ఇంటర్‌లో చేరేలా చూడాలన్నారు. ఇంటర్ అనంతరం జీవనోపాధికి అవసరమైన స్కిల్డ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వడం వల్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయని సీఎం అన్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి ఎం.హరిత తదితరులు పాల్గొన్నారు.

టూరిజం సర్క్యూట్‌గా 'సోమశిల'

- మంత్రి జూపల్లి కృష్ణారావు



మదనగోపాలస్వామి ఆలయంలో మంత్రి జూపల్లి. చిత్రంలో జయేశ్‌రంజన్ తదితరులు

సాక్షి, నాగర్‌కర్నూల్: కృష్ణాతీరంలోని సోమశిల ప్రాంతాన్ని ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం సర్క్యూట్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బుధవారం పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్, టూరిజం కార్పొరేషన్ ఎండీ వల్లూరి క్రాంతి, కలెక్టర్ సంతోష్‌తో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సోమశిల, అమరగిరి, జటప్రోలు ప్రాంతాలను ఆయన సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాస్కీ) కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో సోమశిల టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఇందుకోసం రూ.68.10 కోట్లు ఖర్చు చేయనున్నట్టు వెల్లడించారు. కృష్ణానది తీర ప్రాంతాల్లోని సోమశిల, అమరగిరి ద్వీపంలో 18 కాటేజీల నిర్మాణం, నార్లాపూర్ వద్ద బోటింగ్ జెట్టీలు, వాటర్ స్పోర్ట్స్, కనెక్టింగ్‌రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. కొల్లాపూర్‌లోని మాధవస్వామి, జటప్రోలులోని పురాతన మదనగోపాలస్వామి ఆలయాలను అనుసంధానిస్తూ ఎకోటూరిజంతోపాటు టెంపుల్ సర్క్యూట్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు.

సీఎం సారూ మాకేది రుణమాఫీ

- మొగిలిపేటలో రుణమాఫీ కాని రైతుల నిరసన



పంచాయతీ వద్ద రుణమాఫీ కాని రైతుల నిరసన

మల్లాపూర్: 'అయ్యా సీఎం సారూ.. మాకేది రుణమాఫీ.. కాంగ్రెస్ ప్రభుత్వమా మేమేం పాపం చేశాం' అంటూ రుణమాఫీ కాని రైతులు తమ ఫొటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి నిరసన తెలిపారు. ఈ సంఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేటలో బుధవారం చోటుచేసుకుంది. రైతులు మాట్లాడుతూ రుణమాఫీ పూర్తి చేశామని ప్రభుత్వం చెబుతున్నా.. ఒక్క మొగిలిపేటలోనే 276 మంది రైతులకు మాఫీ వర్తించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. తమ గోడును ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వీరికి మాజీ సర్పంచ్ వనతడుపుల నాగరాజు సంఘీభావం ప్రకటించారు. ఐక్య పోరాటాలకు రైతులు సిద్ధం కావాలన్నారు. రుణ మాఫీ కాని రైతులందరూ పార్టీలకతీతంగా ఉద్యమించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మూడు నెలల కిందట రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించి ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించామని, అయినా రైతులకు న్యాయం జరగకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు!

- తేజేశ్వర్ హత్య కేసులో పురోగతి

గద్వాల క్రైం: ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న తిరుమలరావును ఎస్ఐ కల్యాణ్‌కుమార్ బృందం బుధవారం తెల్లవారుజామున రేణిగుంట విమానాశ్రయ సమీపంలో అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. తేజేశ్వర్ హత్య జరిగిన రోజు తిరుమలరావు తన కారులో తండ్రితో సహా హైదరాబాద్ వైపు వెళ్లినట్లు సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు గుర్తించారు. తాను వెళుతున్న విషయాలను పోలీసులు సైతం గుర్తించకుండా ఉండేందుకు మూడు సెల్‌ఫోన్లు వినియోగించినట్టు ఐటీ కోర్ బృందం గుర్తించింది. రోడ్డు మార్గంలో బయలుదేరిన క్రమంలో ఆయా టోల్‌ప్లాజాల వద్ద సీసీ ఫుటేజీలలో కారు నమోదు కావడంతో సాంకేతిక నిపుణులు వాటి ఆధారంగా హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, శంషాబాద్ తదితర ప్రాంతాల్లో కారు ఉన్నట్టు గుర్తించి అక్కడి తిరుమలరావు స్నేహితులు, బంధువుల ఇళ్లలో ఆరా తీశారు. తనను పట్టుకునేందుకు వస్తున్నట్టు తెలుసుకొని మరో వాహనంలో రెండు రోజుల క్రితం ఏపీ వైపు తిరుమలరావు రాగా, పోలీసులు గుర్తించారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ప్రయత్నించగా రేణిగుంట, అనంతపురం జిల్లా పరిసర ప్రాంతాల్లో ఉన్నట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది.

ధ్రువీకరించని పోలీసులు: బుధవారం తెల్లవారుజామున తిరుమలరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు ఒక్కసారిగా మీడియాలో వార్తలు వ్యాపించాయి. అయితే ఈ విషయాన్ని విచారణ అధికారులు గోప్యంగా ఉంచారు. మరోవైపు గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ప్రధాన నిందితుడు ఉన్నట్టు వైరల్ కావడంతో మీడియా సిబ్బంది అక్కడికి చేరుకొని హడావుడి చేశారు. ఇప్పటి వరకు పోలీసులు 8 మందికిపైగా అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించారు.

ఎవరినీ వదలం: ఎస్పీ శ్రీనివాసరావు



కేసులో అనుమానిత నిందితులను అదుపులోకి తీసుకొని పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని ఎస్పీ శ్రీనివాసరావు 'సాక్షి'కి చెప్పారు. దీనిపై గురువారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తామన్నారు. కేసులో ఎవరినీ వదిలే ప్రసక్తే లేదని, వివిధ మాధ్యమాల్లో వస్తున్న వదంతులను ప్రజలు, మీడియా నమ్మొద్దని కోరారు.

మావోయిస్టుల స్మారక స్తూపం కూల్చివేత



కూల్చిన స్తూపం వద్ద పోలీసు బలగాలు

చర్ల: మావోయిస్టుల స్మారక స్తూపాన్ని పోలీసు బలగాలు కూల్చివేశాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఇంద్రావతి నదీ తీరాన ఉన్న బంగాలీ గ్రామంలో.. మావోయిస్టుల స్మారకార్థం సుమారు 15 అడుగుల ఎత్తుతో కొన్నేళ్ల క్రితం స్తూపం నిర్మించారు. ఈ ప్రాంతానికి బుధవారం పెద్దసంఖ్యలో కూంబింగ్‌కు వెళ్లిన బలగాలు స్తూపాన్ని కూల్చివేశాయి.

కరెంట్ షాక్‌తో నలుగురి దుర్మరణం

వేర్వేరు చోట్ల తండ్రీకొడుకు, రైతు, జూనియర్ లైన్‌మ్యాన్ మృతి



నర్సయ్య



ప్రవీణ్



ఆదిలాబాద్ జిల్లా లింగట్ల గ్రామంలో రైతు సుభాష్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు. చిత్రంలో చేతికి తగిలేలా వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఇల్లెందురూరల్/నేరడిగొండ/గంగారం : వేర్వేరు చోట్ల విద్యుదాఘాతంతో నలుగురు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మూడు జిల్లాల పరిధిలో బుధవారం ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం ఎల్లాపురం గ్రామానికి చెందిన ఏనుగు నర్సయ్య (60), ఎర్రమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. అందరికీ వివాహాలు జరగ్గా, చిన్న కుమారుడు ప్రవీణ్ (35) తల్లిదండ్రులతో కలసి ఉంటున్నాడు. పొలం పనులకు వెళ్లాలని బుధవారం తెల్లవారుజామునే నిద్రలేచారు. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో ఆరుబయట నేల బురదమయంగా మారింది. ముందుగా ఎర్రమ్మ నిదానంగా అడుగులు వేస్తూ చేతికందే ఎత్తులో ఉన్న దండెం తీగను ఆసరాగా పట్టుకుంది. అప్పటికే విద్యుత్ సర్వీసు వైరుకు తగిలి ఉన్న దండెం నుంచి కరెంట్ ప్రసారం కావడంతో ఎర్రమ్మ షాక్‌తో కింద పడింది. ఆ వెనుకాల వస్తున్న నర్సయ్య.. భార్య జారి పడిందని భావించి పైకిలేపే ప్రయత్నం చేయగా ఆయనకు కూడా షాక్ తగలడంతో బిగ్గరగా అరిచాడు. ఏం జరిగిందోనని పరుగున బయటకు వచ్చిన ప్రవీణ్ నేరుగా వారి వద్దకు వెళ్లి కాపాడే ప్రయత్నం చేయడంతో ఆయనా షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో నర్సయ్య, ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన ఎర్రమ్మను స్థానికులు తొలుత ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఖమ్మంకు తరలించారు.

- ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం లింగట్ల గ్రామానికి చెందిన యువ రైతు సాబ్లే సుభాష్ (35) తన పత్తి చేలో కలుపు తీస్తుండగా.. వేలాడుతున్న విద్యుత్ తీగ ప్రమాదవశాత్తు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, విద్యుత్ తీగలు వేలాడుతున్న విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, వారి నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందని మృతుని బంధువులు ఆరోపించారు.
- మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన చిలుక ప్రవీణ్(28) గత ఏడాది మార్చిలో జూనియర్ లైన్‌మ్యాన్‌గా మహబూబాబాద్ గంగారం మండలంలో విధుల్లో చేరారు. కోమట్లగూడెం రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి త్రీఫేజ్ విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో సబ్‌స్టేషన్ నుంచి ఎల్‌సీ తీసుకొని మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ ప్రసారం కావడంతో ప్రవీణ్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సౌమ్య ప్రస్తుతం తొమ్మిది నెలల గర్భవతి.

ఘనంగా రెండో అడుగు

రోదసిలోకి శుభాన్షు శుక్లా • రెండో భారతీయునిగా రికార్డు

న్యూఢిల్లీ: భారత కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12 గంటలు దాటి ఒక నిమిషం. అమెరికాలో ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్. పదేపదే వాయిదాల అనంతరం, దేశమంతా ఊపిరి బిగబట్టి మరీ ఎదురుచూస్తున్న చరిత్రాత్మక క్షణాలు ఎట్టకేలకు రానే వచ్చాయి. యాగ్జియం-4 మిషన్ వాణిజ్య మిషన్‌ను వెంట తీసుకుని స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి దూసుకెళ్లింది. కాసేపటికే యాగ్జియం-4 క్యాప్సూల్ రాకెట్ నుంచి విడివడింది. మొత్తమ్మీద 10 నిమిషాల్లోనే భూమికి 200 కి.మీ. ఎగువ కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశించింది. మిషన్ పైలట్‌గా 140 కోట్ల పై చిలుకు భారతీయుల ఆకాంక్షలను మోసుకుంటూ మన వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా (39) సగర్వంగా రోదసిలోకి ప్రవేశించారు. రాకేశ్ శర్మ తర్వాత 41 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం అంతరిక్షంలో అడుగు పెట్టిన రెండో భారతీయునిగా నిలిచారు. మర్చిపోలేని ఆ క్షణాలను రోదసి నుంచే దేశవాసులందరితో పంచుకుని మురిసిపోయారు. 'ప్రియమైన నా దేశవాసులారా! నమస్తే' అంటూ భుజాన త్రివర్ణ పతాకం ధరించి భావోద్వేగానికి లోనయ్యారు. అంతరిక్ష ప్రవేశ యాత్ర అద్భుతంగా సాగిందంటూ సంభ్రమాశ్చర్యాల నడుమ పేర్కొన్నారు. జైహింద్, జై భారత్ అంటూ రోదసి సాక్షిగా నినదించారు. శుభాన్షు స్వస్థలం లఖ్‌నవూ నుంచి ప్రయోగాన్ని ఆద్యంతం వీక్షించిన ఆయన తల్లిదండ్రులు ఆనందాశ్రువులు రాల్చారు. తమ కుమారుడు చరిత్ర సృష్టించాడంటూ పరవశించిపోయారు. కేంద్ర మంత్రివర్గం ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో సమావేశమై శుభాన్షు ఘనతను ప్రస్తుతించింది. దేశపతాకను ఆయన అత్యున్నత స్థాయిలో రెపరెపలాడించారంటూ ప్రశంసించింది. రాజకీయ తదితర రంగాల ప్రముఖులు తదితరుల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. అంతరిక్షంలో 28 గంటల ప్రయాణం అనంతరం యాగ్జియం-4 మిషన్ భారత కాలమానం ప్రకారం గురువారం సాయంత్రం దాదాపు 4:30 గంటలకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)తో అనుసంధానం అవనుంది. అనంతరం మరో ముగ్గురు సహచర వ్యోమగాములు మిషన్ కమాండర్, నాసా ఆస్ట్రోనాట్ పెగ్గీ విట్సన్, మిషన్ స్పెషలిస్టులు స్లవోస్ ఉజ్నాన్స్కీ విస్నియెవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)తో కలిసి శుభాన్షు ఐఎస్‌ఎస్‌లోకి ప్రవేశిస్తారు. తద్వారా ఈ ఘనత సాధించిన తొలి భారతీయునిగా ఆయన సరికొత్త చరిత్ర సృష్టించనున్నారు. యాగ్జియం-4 ఇస్రో, నాసా సంయుక్త మద్దతుతో రూపొందిన వాణిజ్య అంతరిక్ష యాత్ర.

మిషన్ గ్రేస్ మిస్టర్ శుక్స్

ఐఎస్‌ఎస్‌లో ఉన్నంతకాలం శుభాన్షును శుక్స్ అనే సంకేత నామంతో పిలవనున్నారు. అలాగే తమ యాగ్జియం-4 వ్యోమనౌకకు కూడా వ్యోమగాములు నలుగురూ గ్రేస్ అని పేరు పెట్టుకున్నారు. విజయవంతంగా అంతరిక్షంలో చేరిన అనంతరం వారు ఈ మేరకు వెల్లడించారు. ''ఓపికతో వేచి చూసేవారికి అంతా మంచే జరుగుతుంది. గ్రేస్ సిబ్బంది తొలి యాత్రను దేవుడు అన్నివిధాలా వెంట ఉండి నడిపించు గాక'' అంటూ యాగ్జియం-4 బృందానికి స్పేస్ ఎక్స్ శుభాకాంక్షలు తెలిపింది.



మనందరి యాత్ర
శుభాన్షు భావోద్వేగం

అంతరిక్షంలోకి ప్రవేశించిన కాసేపటికే యాగ్జియం-4 మిషన్ నుంచి శుభాన్షు శుక్లా జాతినుద్దేశించి మాట్లాడారు. ''ప్రియ దేశవాసులారా! నమస్తే. 41 ఏళ్ల తర్వాత మనం మళ్లీ అంతరిక్ష ప్రవేశం చేశాం. ఇదో అద్భుత యాత్ర! ప్రస్తుతం మేం సెకనుకు 7.5 కిలోమీటర్ల వేగంతో భూమి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాం. నా భుజాలపైనున్న మన త్రివర్ణ పతాకం మీరంతా ఈ యాత్రలో నాతోపాటే ఉన్నారని నాకు భరోసా ఇస్తోంది. ఇది కేవలం నా ఐఎస్‌ఎస్ యాత్రకు మాత్రమే శుభారంభం కాదు. భారత మానవసహిత వ్యోమయాత్రకు కూడా నాందివాచకం. ఈ ఘనత పట్ల మీ ఛాతీ గర్వంతో పొంగుతోందని నాకు తెలుసు. మీలో ప్రతి ఒక్కరూ ఈ యాత్రలో భాగస్వాములు కావాలన్నది నా ఆకాంక్ష. భారత మానవసహిత అంతరిక్ష కార్యక్రమంలో మనమంతా కలసికట్టుగా సాగుదాం'' అంటూ ముప్పిరిగొంటున్న భావోద్వేగాల నడుమ హిందీలో చెప్పుకొచ్చారు. ''జైహింద్, జై భారత్'' అంటూ ముగించారు. ప్రయోగానికి శుభాన్షు మాట్లాడుతూ, ''నా యాత్ర దేశ యువతలో అంతరిక్ష యాత్రలు, ప్రయోగాలు, ఇన్నోవేషన్ల పట్ల సరికొత్త ఆసక్తి, ఉత్సాహం నింపుతుంది. నేను ఒక్కడినే కావచ్చు. కానీ అంతరిక్షంలోకి 140 కోట్ల పై చిలుకు భారతీయులందరితో కలసి వెళ్తున్నా. ఇది దేశ ప్రజలందరి సమష్టి యాత్ర'' అన్నారు.


ప్రయోగానికి ముందు శుభాన్షు బృందం సెల్ఫీ
శుభాన్షు తల్లిదండ్రుల ఉద్వేగం

14 రోజులు, 60 ప్రయోగాలు

శుభాన్షు తన ముగ్గురు సహచర వ్యోమగాములతో కలిసి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)లో 14 రోజుల పాటు గడుపుతారు. ఈ సందర్భంగా భారరహిత స్థితిలో వారు దాదాపు 60 ప్రయోగాలు నిర్వహిస్తారు. వాటిలో ఆహారం, పౌష్టికత సంబంధిత ప్రయోగాలు కూడా ఉన్నాయి. వాటిని నాసా మద్దతుతో ఇస్రో, కేంద్ర బయోటెక్నాలజీ శాఖ రూపొందించాయి. శుభాన్షు కోసం ఇస్రో ఏడు ప్రయోగాలను సిద్ధం చేసి ఉంచింది. సూక్ష్మభార స్థితిలో మెంతులు, పెసలు ఎలా మొలకెత్తుతాయో ఆయన పరీక్షించి చూడనున్నారు.

ప్రధానితో, పిల్లలతో మాటామంతి

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్) నుంచి ప్రధాని మోదీతో శుభాన్షు మాటామంతి జరపనున్నారు. అలాగే పలు స్కూళ్లకు చెందిన విద్యార్థులతో పాటు అంతరిక్ష రంగ నిపుణులు, సంస్థల సీఈఓలు, దిగ్గజాలతో కూడా ఆయన తన అనుభవాలను పంచుకుంటారు.

క్యారెట్ హల్వా, మామిడి రసం

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్) భారతీయ వంటకాల ఘుమఘుమలాడనుంది. భారత పాక ప్రావీణ్యానికి అద్దం పట్టే కూరలు, అన్నం, మామిడి రసం వంటివాటిని శుభాన్షు ఐఎస్‌ఎస్‌కు వెంట తీసుకెళ్లారు. ''తనకు క్యారెట్, పెసరపప్పు హల్వా అంటే చాలా ఇష్టం. వాటితోపాటు మరెన్నో మా ఇంటి రుచులను వెంట తీసుకెళ్లాడు. తోటి వ్యోమగాములకు కూడా రుచి చూపిస్తానని చెప్పాడు'' అని శుభాన్షు సోదరి శుచి తెలిపారు. ఇతర వ్యోమగాములు పప్రికా పేస్ట్ (హంగరీ), ఫ్రీజ్-ఫ్రైడ్ పైరోజీస్ (పోలండ్) వంటి వంటకాలను తమతో పాటు తీసుకెళ్లారు.

నింగిని నెగ్గి, తారలు తాకి

శుభాన్షుకు వాయుసేన అభినందనలు

యాగ్జియం-4 మిషన్‌ను భారత్‌కు ఓ అద్వితీయానుభూతిగా వాయుసేన అభివర్ణించింది. ''వాయుసేన యోధుడు గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా చరిత్రాత్మక అంతరిక్ష యాత్రకు శ్రీకారం చుట్టారు. నింగిని నెగ్గుతూ తారల్ని తాకుతూ దేశ గౌరవాన్ని, ప్రతిష్ఠను తనతోపాటు సగర్వంగా అంతరిక్షంలోకి మోసుకెళ్లారు'' అంటూ అభినందించింది. ఆయన ప్రొఫైల్ ఫొటోను షేర్ చేసింది. 'నీలిదుస్తుల్లో (వాయుసేన యూనిఫాంను ఉద్దేశించి) శిక్షణ, చుక్కలకేసి పయనం' అంటూ అందమైన క్యాప్షన్ జోడించింది. 'ఈ అద్భుత యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాం' జాతీయ పతాకంలోని మూడు రంగులతో కూడిన అక్షరాలతో మరో సందేశాన్ని పోస్టు చేసింది.

వందేమాతరం నుంచి...
'యూ హి చలా చల్' దాకా

అంతరిక్ష యాత్రకు బయల్దేరే ముందు భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడానికి, ప్రశాంతంగా ఉండటానికి వ్యోమగాములు తమకు నచ్చిన సంగీతాన్ని, పాటలను ఆస్వాదించడం ఆనవాయితీ. అలా యాగ్జియం-4 యాత్రకు బయల్దేరే ముందు శుభాన్షు హృతిక్ రోషన్ హీరోగా నటించిన 'ఫైటర్' సినిమాలోని తనకెంతో ఇష్టమైన వందేమాతరం పాటను విన్నారు. ఐఎస్‌ఎస్‌లో ఆస్వాదించేందుకు వీలుగా పలు పాటలతో కూడిన ప్లే లిస్టును అంతరిక్షంలోకి తీసుకెళ్లారు. అందులో షారుక్ ఖాన్ నటించిన 'స్వదేశ్' సినిమాలోని సూపర్‌హిట్ రోడ్డు పాట 'యూ హి చలా చల్ రాహీ, కిత్నీ హసీ హై ఏ దునియా (అలా సాగిపో యాత్రికా, ఈ ప్రపంచమెంత అందమైనదో!) తదితర పాటలు అందులో ఉన్నాయి. ప్రయోగానికి ముందు శుభాన్షు ఎక్స్ పోస్టులో ఈ మేరకు వెల్లడించారు. యాదృచ్ఛికంగా స్వదేశ్ సినిమాలో షారుక్ కూడా నాసా సైంటిస్టు కావడం విశేషం.

చిన్ననాటి కల సాకారం!

గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా. అంతరిక్షంలో ప్రవేశించి, ఐఎస్‌ఎస్‌లో అడుగుపెట్టబోతున్న ఆయన పేరు దేశమంతటా మార్మోగిపోతోంది. మానవసహిత అంతరిక్ష యాత్ర దిశగా భరత జాతి కంటున్న ఎన్నో ఏళ్ల కలకు ఎట్టకేలకు రెక్కలు తొడిగిన ఆయన, ఆ క్రమంలో తన చిన్ననాటి కలను కూడా విజయవంతంగా నెరవేర్చుకున్నారు. రాకేశ్ శర్మ అంతరిక్షంలో కాలుమోపిన ఏడాదికి, అంటే 1985లో ఉత్తరప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో శుభాన్షు జన్మించారు. బాల్యంలో ఒక ఎయిర్ షో చూసినప్పటి నుంచే ఆకాశంపై మనసు పారేసుకున్నారు. విమానాలు, వాటి వేగం, వాటి శబ్దాలు తన బుల్లి మనసులో శాశ్వతంగా తిష్ట వేసుకుపోయాయి. పైలట్ కావాలని అప్పుడే తీర్మానించుకున్నారాయన. నేషనల్ డిఫెన్స్ అకాడెమీలో చేరి తన కల నిజం చేసుకున్నారు. 2006లో భారత వాయుసేనలో చేరారు. పదేళ్ల పైచిలుకు కెరీర్‌లో 2 వేల గంటల పైచిలుకు ఫ్లయింగ్ అవర్స్ అనుభవం ఆయన సొంతం. సుఖోయ్-30 ఎంకేఐ, మిగ్-29తో పాటు జాగ్వార్, డోర్నియర్-228 వంటి పలు యుద్ధ విమానాలు నడిపారు. ప్రస్తుతం గ్రూప్ కెప్టెన్‌గా చేస్తున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి ఏరోస్పేస్‌లో ఎంటెక్ చేశారు. 2027లో ఉద్దేశించిన గగన్‌యాన్ మిషన్ కోసం 2019లో కేంద్రం ఎంపిక చేసిన నలుగురు ఆస్ట్రోనాట్ల బృందంలో శుభాన్షు ఒకరు. అంతరిక్ష యాత్ర నిమిత్తం తొలుత బెంగళూరులో, తర్వాత రష్యాలో గగారిన్ కాస్మోనాట్ శిక్షణ కేంద్రంలో కఠోరమైన శిక్షణ పొందారు. యాగ్జియం-4 మిషన్‌కు పైలట్‌గా కీలక బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏకాగ్రత, సునిశిత బుద్ధి తిరుగులేనివని సహచర వ్యోమగాములు కూడా కితాబిచ్చారు.

...అలా ఎన్‌డీఏలోకి

శుభాన్షు పేరు ఇప్పుడిలా దేశమంతా మారుమోగుతోందంటే ఆయన ఎన్‌డీఏలో చేరి వాయుసేన పైలట్ కావడమే ప్రధాన కారణం. అయితే ఎన్‌డీఏలో శుభాన్షు ప్రవేశం అనుకోకుండా జరిగిందని ఆయన తండ్రి గుర్తు చేసుకున్నారు. ''శుభాన్షు స్కూల్‌మేట్స్ ఎన్‌డీఏ పరీక్ష రాసేందుకు దరఖాస్తు ఫారాలు తీసుకొచ్చారు. కానీ వారిలో ఒకరికి వయోపరిమితి దాటిపోయింది. దాంతో శుభాన్షును రాస్తావా అని అడిగాడు. మావాడు వెంటనే సరేనన్నాడు. అలా పరీక్ష రాసి ఎన్‌డీఏకు సెలక్టయ్యాడు'' అంటూ వివరించారు. తమకైతే శుభాన్షు సివిల్స్ రాసి కలెక్టర్ కావాలని ఉండేదని వెల్లడించారు.

కేంద్ర మంత్రివర్గం అభినందనలు
దేశ ఆకాంక్షలను మోసుకెళ్లారు: మోదీ

యాగ్జియం-4 మిషన్ విజయవంతం కావడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ హర్షాతిరేకాలు వెలిబుచ్చారు. 140 కోట్ల పై చిలుకు భారతీయుల ఆశలు, ఆకాంక్షలను శుభాన్షు తనతో పాటు అంతరిక్షంలోకి మోసుకెళ్లారన్నారు. ''ఐఎస్‌ఎస్‌లో అడుగు పెట్టిన తొలి భారతీయునిగా నిలవనున్న గ్రూప్ కెప్టెన్ శుక్లాకు, ఇతర వ్యోమగాములకు శుభాభినందనలు'' అంటూ ప్రధాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆయన సారథ్యంలో కేంద్ర మంత్రివర్గం సమావేశమై శుభాన్షుకు అభినందనలు తెలిపింది. యాగ్జియం-4 యాత్ర దిగ్విజయం కావాలని ఆకాంక్షించింది. ఈ మేరకు మంత్రివర్గం ఆమోదించిన తీర్మానాన్ని కేంద్ర సమాచార ప్రసార మంత్రి అశ్వినీ వైష్ణవ్ చదివి విన్పించారు.

సగర్వంగా ఆకాశాన్ని ముద్దాడారు: ఖర్గే

శుభాన్షు సగర్వంగా ఆకాశాన్ని ముద్దాడారంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అభినందించారు. ఆయన యాత్ర సఫలమవాలన్నారు.



తల్లిదండ్రుల ఆనంద నృత్యం

శుభాన్షు అంతరిక్షయాత్రను వీక్షించి ఆయన తల్లిదండ్రులు ఉప్పొంగిపోయారు. యాగ్జియం-4 ప్రయోగాన్ని లఖ్‌నవూలో శుభాన్షు విద్యాభ్యాసం చేసిన సిటీ మాంటిసోరీ స్కూల్లో ప్రత్యక్షప్రసారం ద్వారా వారు వీక్షించారు. యాత్ర విజయవంతం కాగానే తోటివారందరితో కలిసి భాంగ్రా నృత్యం చేస్తూ ఆనందం పంచుకున్నారు. ప్రాంగణమంతా చప్పట్లతో, 'హిప్ హిప్ హుర్రే', 'భారత్‌మాతా కీ జై' నినాదాలతో మార్మోగిపోయింది. తమకివి మరపురాని క్షణాలని శుభాన్షు తండ్రి శంభూ శుక్లా అన్నారు. ''ఇవి ఆనందాశ్రువులు. ఇంతకన్నా మాట్లాడేందుకు నాకు మాటలే రావడం లేదు'' అని తల్లి ఆశా చెప్పారు. తన కొడుకు ఇలాంటి ఘనత సాధిస్తాడని ముందే తెలుసన్నారు. యాత్ర జయప్రదం కావాలని ఆకాంక్షిస్తూ ప్రయోగానికి ముందు కుమారునికి ఆమె వర్చువల్‌గా చక్కెర కలిపిన పెరుగు తినిపించి నోరు తీపి చేశారు. తమ విద్యార్థి భారత కీర్తిని అంతరిక్షం దాకా చేర్చాడంటూ స్కూలు టీచర్లు తదితరులు కూడా హర్షం వెలిబుచ్చారు.

నాడు 'సారే జహా సే అచ్ఛా'

స్క్వాడ్రన్ లీడర్ రాకేశ్ శర్మ తర్వాత రోదసిలోకి ప్రవేశించిన రెండో భారతీయునిగా శుభాన్షు శుక్లా నిలిచారు. సోవియట్ యూనియన్ సల్యూట్-7 స్పేస్ మిషన్‌లో భాగంగా రాకేశ్ శర్మ 1984లో 8 రోజుల పాటు అంతరిక్ష యాత్ర చేయడం తెలిసిందే. అక్కడినుంచి భూమి ఎలా కన్పిస్తోందన్న అప్పటి ప్రధాని ఇందిర ప్రశ్నకు బదులుగా 'సారే జహా సే అచ్ఛా' అంటూ రాకేశ్ శర్మ ఇచ్చిన భావోద్వేగపూరిత సమాధానంతో జాతి యావత్తూ ఉప్పొంగిపోయింది.

ప్రయోగానికి ముందూ సమస్యలే

యాగ్జియం-4 ప్రయోగ వేళ సమీపించగానే సహచర వ్యోమగాములతో కలిసి శుభాన్షు నెల రోజుల క్వారెంటైన్ నుంచి బయటికొచ్చారు. ఒక్కొక్కరుగా వ్యోమనౌకలోకి ప్రవేశించారు. రాకెట్ తాలూకు ఒక తీగ వేలాడుతుండటంతో పాటు పలు సమస్యలను గమనించి అప్పటికప్పుడు సరిచేశారు. మే 29న జరగాల్సిన ఈ ప్రయోగం రాకెట్ సమస్యలతో పదేపదే వాయిదా పడుతూ వచ్చింది.

రక్షణ వ్యయం పెంపుకు నాటో అంగీకారం

ద హేగ్: యుద్ధాల నేపథ్యంలో 'నాటో' సభ్య దేశాలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. రక్షణ బడ్జెట్‌లను పెంచుకోవాల్సిందేనన్న ట్రంప్ ఒత్తిడికి తలొగ్గాయి. 2035 నుంచి తమ జీడీపీలో 5 శాతాన్ని రక్షణ బడ్జెట్ కోసం కేటాయించేందుకు అంగీకరించాయి. నెదర్లాండ్స్‌లోని హేగ్ నగరం వేదికగా జరుగుతున్న నాటో సదస్సు బుధవారం ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సహా 32 దేశాల అగ్రనేతలు పాల్గొన్నారు. కూటమిలో ఏదైనా దేశంపై నాటోయేతర దేశం దాడికి దిగితే నాటో దేశాలన్నీ ఐక్యమై ఉమ్మడిగా దాడి చేయాలన్న తమ నిబద్ధతను 'ది హేగ్' డిక్లరేషన్ పునరుద్ఘాటించింది. రక్షణబడ్జెట్‌ను నాటో దేశాలు పెంచుకునేలా చేయడం అమెరికా సాధించిన ఘన విజయమని ట్రంప్ వ్యాఖ్యానించారు. బడ్జెట్‌ను పెంచుకోవడం ద్వారా మా కూటమికి మరో ఒక ట్రిలియన్ డాలర్ల మేర ఆర్థికదన్ను దక్కుతుందని ట్రంప్ అన్నారు. అయితే ఆ లక్ష్యాన్ని చేరుకోవడం తన తరం కాదని స్పెయిన్ ఇప్పటికే తెగేసి చెప్పింది. సదస్సుకు విచ్చేసిన సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ట్రంప్ విడిగా సమావేశమయ్యారు. నాటో బడ్జెట్ పరోక్షంగా రష్యా దురాక్రమణకు అడ్డుకట్టవేసేందుకు అక్కరకొస్తుంది జెలెన్‌స్కీతో ట్రంప్ అన్నారు.

నిర్బంధంలో ప్రజాస్వామ్యం

ఎమర్జెన్సీ ఓ చీకటి అధ్యాయం: మోదీ

న్యూఢిల్లీ: ఎమర్జెన్సీ రోజులు దేశ చరిత్రలోనే అత్యంత చీకటి అధ్యాయంగా మిగిలిపోయాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం దేశంలో 'ఎమర్జెన్సీ' విధించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ బుధవారం 'ఎక్స్' వేదికగా పలు పోస్టులు చేశారు. ''ప్రజాస్వామ్యాన్ని ఇందిర సర్కారు చీకటి కొట్టంలో పడేసింది. రాజ్యాంగ విలువలను కాలరాశారు. ప్రాథమిక హక్కులను రద్దుచేశారు. పత్రికా స్వేచ్ఛను హరించారు. లక్షలాది మందిని జైలుపాలు చేశారు. అంతటి అత్యయిక కాలంలోనూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పి, పోరాడిన ప్రతి ఒక్కరికీ నా సెల్యూట్. సమాజంలోని భిన్న వర్గాలు, మతాలకు చెందిన కోట్లాది మంది ఒకే లక్ష్యంగా పోరాడారు. తమ ప్రాణాలను పణంగా పెట్టిమరీ నాటి స్వాతంత్ర్య సమరయోదులు సాధించినభారత ప్రజాస్వామ్యాన్ని ఎమర్జెన్సీకాలంలో వీళ్లంతా పరిరక్షించేందుకు పాటుపడ్డారు. ఎమర్జెన్సీ కాలం నాకెన్నో జీవితపాఠాలు నేర్పింది. అప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌గా పనిచేశా. అరెస్టు తప్పించుకునేందుకు సర్దార్‌జీలా తలపాగా చుట్టా. ఆ వేషంలో నా స్నేహితులు, సన్నిహితులు కూడా గుర్తుపట్టలేకపోయారు. ఇలాంటి విశేషాలతో 'ది ఎమర్జెన్సీ డైరీస్-ఇయర్స్ దట్ ఫోర్జ్‌డ్ ఎ లీడర్' పేరిట కొత్త పుస్తకం వస్తోంది. ఎమర్జెన్సీకాలంలో పోరాడిన మాజీ ప్రధాని దేవెగౌడ ఈ పుస్తకానికి ముందుమాట రాశారు'' అని మోదీ చెప్పారు. ఎమర్జెన్సీ కాలంలో మోదీ ' సంఘర్ష్ సమితి'లో సభ్యునిగా ఉండేవారు. భావనగర్ జైలులో ఉన్న తమ సభ్యులను కలిసేందుకు మోదీ స్వామీజీ వేషంలో జైలుకు వచ్చి సభ్యుల క్షేమసమాచారం తెల్సుకుని బయట వాళ్లవాళ్ల కుటుంబ సభ్యులకు చేరవేసేవారు. ఎమర్జెన్సీ కాలంలో ఉత్తరాలపై నిఘా ఉండేది. అందుకే రాజ్యాంగ సంబంధ, ప్రభుత్వ అరాచకాల సంబంధ సమాచారాన్ని, సాహిత్యం, పుస్తకాలను తపాలా ద్వారా కాకుండా రైళ్ల ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలకు ఆనాడు మోదీ తరలించేవారు. అంతకుముందు మోదీ సారథ్యంలో కేంద్ర కేబినెట్ బుధవారం ఢిల్లీలో ప్రత్యేకంగా సమావేశమై 'ఎమర్జెన్సీ' దురాగతాలు, ప్రభుత్వ అణచివేతకు గురైన వీరులు, బాధితులకు నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించింది. సంవిధాన్ హత్యా దివస్‌ను కాంగ్రెస్ చీఫ్ ఖర్గే తీవ్రంగా తప్పుబట్టారు.


ఎమర్జెన్సీ వేళ మారువేషాల్లో మోదీ

సీబీఎస్‌ఈ టెన్త్ పరీక్షలు ఇకపై రెండుసార్లు

న్యూఢిల్లీ: 2026 నుంచి పదో తరగతికి ఇకపై ఏడాదికి రెండుసార్లు పరీక్షలు నిర్వహిస్తామని సీబీఎస్‌ఈ బుధవారం ప్రకటించింది. తొలి దఫా పరీక్షలు ఫిబ్రవరిలో ఉంటాయి. వీటిని రాయడం తప్పనిసరి. మే లో జరిపే రెండో దఫా పరీక్షలు ఐచ్ఛికం. ఫిబ్రవరిలో పరీక్షల ఫలితాలను ఏప్రిల్‌లో, మే పరీక్షల ఫలితాలను జూన్‌లో వెలువరిస్తారు. ఫిబ్రవరి ఫలితాల్లో కంటే మెరుగైన మార్కుల కోసం మేలో పరీక్షలు రాసుకోవచ్చు. రెండింట్లో మెరుగైన మార్కులనే పరిగణనలోకి తీసుకుంటారు. నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) సిఫార్సుల మేరకేలీ నిర్ణయం తీసుకున్నట్టు సీబీఎస్‌ఈ ఛైర్మన్ రాహుల్ సింగ్ చెప్పారు. ఫిబ్రవరి పరీక్షల్లో మూడు, అంతకంటే ఎక్కువ సబ్జెక్టులు రాయని విద్యార్థిని మే పరీక్షలకు అనుమతించబోరు. వారిని 'ఎసెన్షియల్ రిపీట్' కేటగిరీగా లెక్కిస్తారు. వారు పరీక్ష రాయాలంటే తర్వాతి ఏడాది ఫిబ్రవరిదాకా వేచి ఉండాల్సిందే. ఫిబ్రవరిలో కంపార్ట్‌మెంట్‌లో పాసైతే మే లోనూ ఆ కేటగిరీ కిందే పరీక్ష రాసేందుకు అనుమతిస్తారు. జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ వంటి మంచు ప్రాంతాల్లో విద్యార్థులు ఫిబ్రవరి లేదా మేలో ఏదో ఒకదాన్ని తప్పనిసరి పరీక్షను ఎంచుకోవచ్చు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు పోటీల రోజే పరీక్షలుంటే వాటిని మాత్రం మేలో రాసుకోవచ్చు. ఇంటర్నల్ అసెస్‌మెంట్‌ను మాత్రం ఏడాదిలో ఒక్కసారే నిర్వహిస్తారు.

ఖర్గే వర్సెస్ థరూర్

- దేశం కన్నా మోదీయే మిన్న: ఖర్గే
- ఎగిరేందుకు అనుమతి ఎందుకు?
- కాసేపటికే థరూర్ మార్మిక పోస్టు

న్యూఢిల్లీ: సొంత పార్టీ ఎంపీ శశిథరూర్‌పై కాంగ్రెస్‌లో అసహనం పరాకాష్ఠకు చేరుతోంది. ప్రధాని నరేంద్ర మోదీని థరూర్ ఇటీవల పలుమార్లు బహిరంగంగా మెచ్చుకోవడం తెలిసిందే. వాటిని ఉద్దేశిస్తూ, కొందరికి దేశం కన్నా మోదీయే మిన్న అంటూ ఆయనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఆపరేషన్ సిందూర్‌పై రాసిన తాజా వ్యాసంలో మోదీపై థరూర్ పొగడ్తలు కురిపించడాన్ని మీడియా ప్రస్తావించడంతో ఆయన ఇలా స్పందించారు. ''నేను ఇంగ్లిష్ అంత బాగా చదవలేను. థరూర్ ఇంగ్లిష్ చాలా బాగుంటుంది. అందుకే ఆయన్ను కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యున్ని చేశాం. కానీ 'నాకు మోదీయే ముందు, దేశం తర్వాత' అంటే మనమేం చేయగలం'' అంటూ నిట్టూర్చారు. కాసేపటికే అధ్యక్షుని వ్యంగ్య వ్యాఖ్యలపై థరూర్ దీటుగా స్పందించారు. స్వేచ్ఛగా ఎగురుతున్న పక్షి ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ''ఎగిరేందుకు ఎవరినీ అనుమతి అడక్కు. ఎందుకంటే రెక్కలు నీవి. నింగి ఎవరి సొత్తూ కాదు'' అంటూ క్యాప్షన్ కూడా జోడించారు.

న్యూయార్క్ మేయర్ అభ్యర్థిగా జోహ్రాన్ మమ్దానీ



న్యూయార్క్: న్యూయార్క్ నగర మేయర్ ఎన్నిక రేసులో భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ కీలక ముందడుగు వేశారు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వం కోసం జరిగిన ప్రైమరీలో మాజీ గవర్నర్ ఆండ్రూ క్యూమోపై విజయం సాధించారు. నవంబర్‌లో జరిగే ఎన్నికలో ప్రస్తుత మేయర్ ఎరిక్ ఆడమ్స్, రిపబ్లికన్ అభ్యర్థి కర్టిస్ స్లివాతో మమ్దానీ తలపడతారు.

ఎవరీ మమ్దానీ?

జోహ్రాన్ మమ్దానీ 1991 అక్టోబర్ 18న ఉగాండా రాజధాని కంపాలాలో జన్మించారు. తండ్రి మహమూద్ మమ్దానీ భారత్‌లో జన్మించిన ఉగాండా మార్క్సిస్ట్ పండితుడు. తల్లి మీరా నాయర్ భారతీయ-అమెరికన్ చిత్రనిర్మాత. జోహ్రాన్‌కు ఐదేళ్లప్పుడు కుటుంబం దక్షిణాఫ్రికా వలస వెళ్లింది. ఏడేళ్ల వయసులో న్యూయార్క్‌కు మకాం మార్చింది. 2017లో డెమొక్రటిక్ సోషలిస్ట్స్ ఆఫ్ అమెరికాలో చేరారు. 2021లో న్యూయార్క్ అసెంబ్లీ సభ్యుడిగా గెలిచారు. డెమొక్రటిక్ సోషలిస్ట్స్ ఆఫ్ అమెరికాలో ప్రముఖ సభ్యుడిగా కీలక కమిటీల్లో పనిచేస్తున్నారు. 2018లో అమెరికా పౌరసత్వం పొందారు. 2025లో సిరియా కళాకారిణి రామా దువాజీని పెళ్లాడారు. 2019లో ఆయన రూపొందించిన 'నాని' సింగిల్‌లో మధుర్ జాఫ్రీ నటించారు.

సాక్షి
హైదరాబాద్
గురువారం । 26 । జూన్ । 2025

కోట మెట్లు.. బోనం బొట్లు!

ఆషాఢ మాసం బోనాల జాతరకు గురువారం అంకురార్పణ జరగనుంది. నేడు గోల్కొండ కోట బోనమెత్తనుంది. ఈ సందర్భంగా బుధవారం పలువురు మహిళలు కోట మెట్లకు పసుపు, కుంకుమలతో బొట్లు పెట్టి తీర్చిదిద్దారు.



భక్తి శ్రద్ధలతో బోనాల పండగ

సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. గోల్కొండలో వెలసిన జగదాంబిక అమ్మవారికి ఆషాఢ మాసం తొలి బోనం సమర్పించడంతో జంట నగరాల్లో సందడి నెలకొంటుందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో, ఆయురోగ్యాలతో జీవించాలని రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని సీఎం ఆకాంక్షించారు. జంట నగరాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు విడుదల చేసిందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సీఎం సూచించారు.

హైదరాబాద్ మెట్రోపై ఎందుకీ వివక్ష?

సాక్షి, సిటీబ్యూరో: పుణె మెట్రో రైలు రెండో దశకు రూ.3,626 కోట్లు కేటాయిస్తూ బుధవారం ఆమోదం తెలిపిన కేంద్ర మంత్రివర్గం.. హైదరాబాద్ మెట్రోకు మొండిచేయి చూపటంపై నిరసన వ్యక్తమవుతోంది. ఐదు నెలల క్రితమే హైదరాబాద్ మెట్రో రైలు రెండోదశకు కేంద్రం ఆమోదం కోసం డీపీఆర్ అందజేసినా, ఇప్పటి వరకు ఎలాంటి సానుకూలత లభించలేదు. రెండో దశలో ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట, మేడ్చల్ వరకు, ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 3 కారిడార్లకు డీపీఆర్‌లను కూడా రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో హైదరాబాద్ మెట్రో రైలు కేంద్రానికి అందజేసింది. రెండో దశ 'ఎ' విభాగం కింద 5 కారిడార్లలో, 'బి' విభాగం కింద 3 కారిడార్లకు.. మొత్తం 8 కారిడార్లలో మెట్రో రైలు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశపై కేంద్ర అధికారులు వ్యక్తం చేసిన పలు సాంకేతిక సందేహాలను కూడా హైదరాబాద్ మెట్రో రైలు అధికారులు నివృత్తి చేశారు. అయినప్పటికీ, హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశకు కేంద్రం నుంచి ఆమోదం లభించక పడిగాపులు కాయాల్సి వస్తోంది.

జీహెచ్‌ఎంసీకి 'గోల్డెన్ గ్లోబ్ టైగర్స్' అవార్డు



అవార్డుతో జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: మలేషియాలోని కౌలాలంపూర్‌లో జరిగిన అంతర్జాతీయ వేడుకలో జీహెచ్‌ఎంసీకి ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్టేషన్ సిస్టమ్ విభాగంలో ప్రతిష్ఠాత్మక గోల్డెన్ గ్లోబ్ టైగర్స్ అవార్డ్–2025 లభించింది. నగరమంతా పెద్ద ఎత్తున అడాప్టివ్ ట్రాఫిక్ సిగ్నల్ కంట్రోల్ సిస్టమ్ (ఏటీసీఎస్)ను అమలు చేయడంలో జీహెచ్‌ఎంసీ చూపిన చొరవకు ఈ అవార్డు లభించింది. ఏటీసీఎస్ ద్వారా సగటు ప్రయాణ వేగం 15 నుంచి 20 శాతం పెరిగినట్లు జీహెచ్‌ఎంసీ తెలిపింది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్లు, ఆర్కాడిస్ ఐబీఐ గ్రూప్ సహకారంతో నగరంలోని 280 ట్రాఫిక్ జంక్షన్లు, 94 పెలికాన్ సిగ్నళ్ల ప్రాంతాల్లో ఏటీసీఎస్ అమలవుతున్నట్లు పేర్కొంది. రియల్ టైమ్ ట్రాఫిక్ డిటెక్షన్, సెంట్రలైజ్డ్ డైనమిక్ సిగ్నల్ కంట్రోల్‌తో ఈ సిస్టమ్ పని చేస్తుందని అధికారులు తెలిపారు.



ఇంటి పంట.. కొత్త పుంత

సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్‌కు నగరం చిరునామా

70 వేల మందికి పైగా ఔత్సాహికులు

- దాబాలు, బాల్కనీలపై మిద్దె తోటలు
- నగరం కేంద్రంగా దేశ, విదేశాలకు విస్తరణ
- యాపిల్, స్ట్రాబెర్రీ, బ్లూబెర్రీ తదితర ఫలాల సాగు
- పది పాదులతో ఇంటికి సరిపడా కూరగాయలు

సాక్షి, సిటీబ్యూరో:

ఒకప్పటి ఉద్యానాల భాగ్యనగరం.. ఇప్పుడు 'సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్'గా ప్రసిద్ధి చెందుతోంది. ఇంటిపంట కొత్త పుంతలు తొక్కుతోంది. నగరం కేంద్రంగా ఇంటి పంటల సంస్కృతి దేశ, విదేశాలకు విస్తరించింది. గ్రేటర్ పరిధిలోనే సుమారు 70 వేల మందికి పైగా టెర్రస్ గార్డెనర్స్ భారీ ఎత్తున సాగు చేస్తున్నారు. డాబాలు, బాల్కనీలు తదితర ప్రాంతాల్లో సుమారు 15వేల చదరపు గజాలకు పైగా విస్తీర్ణంలో ఇంటి పంటలను పండిస్తున్నట్లు అంచనా. రకరకాల కూరగాయలు, ఆకుకూరలు, పూలు, పండ్లు ఇళ్లపై సాగు చేస్తున్నారు. నగర టెర్రస్‌లపై ఆరోగ్య సిరులు కురిపిస్తున్న ఇంటి పంటలు సామాజిక మాధ్యమ వేదికలుగా ప్రపంచమంతటా విస్తరిస్తున్నాయి.

బ్రిటన్, అమెరికా, సింగపూర్, జర్మనీ, ఆస్ట్రేలియా తదితర దేశాల్లోని తెలుగువాళ్లు అన్ని రకాల కూరగాయలను తమ ఇళ్లపై పండించుకొని ఇంటిపంట రుచిని ఆస్వాదిస్తున్నారు. 2019లో కేవలం 30 మంది సభ్యులతో ఏర్పడిన 'సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్' సమూహం ఇప్పుడు 70,000 సంఖ్య దాటింది. వందల కొద్దీ వాట్సాప్ గ్రూపులు ఇంటి పంటల ఉద్యమాన్ని నిర్వహిస్తున్నాయి. కొత్త తరహా పంటలను పరిచయం చేస్తున్నాయి. ఇంటి పంట సంస్కృతి దైనందిన జీవితంలో ఒక భాగమైంది. స్వచ్ఛమైన ఆకుకూరలు, కూరగాయలతో ఆరోగ్యకర జీవితాన్ని కొనసాగిస్తున్నారు.

స్ట్రాబెర్రీ గ్రూపుతో ఆరంభం..

- 'మనం ఏం తింటామో అది మనమే పండించుకుందాం' అనే నినాదంతో 6 సంవత్సరాల క్రితం నగరంలో 30 మంది సభ్యులతో 'స్ట్రాబెర్రీ' గ్రూప్ ప్రారంభమైంది. అత్యధిక ఉష్ణోగ్రతలు ఉన్న చోట మాత్రమే పండే స్ట్రాబెర్రీలను టెర్రస్‌లపై పెంచే లక్ష్యంతో దీన్ని ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు న్యాయవాది శ్రీనివాస్ హర్కర కన్వీనర్‌గా, ఈదల సరోజ కో– కన్వీనర్‌గా ఈ గ్రూపు సేవలు మొదలయ్యాయి. కేవలం 500 స్ట్రాబెర్రీ మొక్కలను తెప్పించి అందజేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. కానీ కొద్ది రోజుల్లోనే నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి అనూహ్యంగా 5,600 మొక్కల కోసం ఆర్డర్లు వచ్చాయి. స్ట్రాబెర్రీ గ్రూపు వేగంగా విస్తరించింది. ఈ సమూహామే సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ (సీటీజీ)గా అవతరించింది.
- తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, అండమాన్ తదితర నగరాలతో పాటు విదేశాలకు విస్తరించింది. ఇంటి పంటలపై అనుభవాలను పంచుకొనేందుకు అవగాహనను పెంచుకొనేందుకు వేలాది మంది ఆసక్తి కనబర్చారు. సాధారణ కూరగాయలు, ఆకుకూరలతో పాటు కూరగాయల్లోనే ఎంతో విలువైన ఆగాకర, కాసర దుంపలు, పెన్సిల్ దొండ పాదులు వంటి వెరైటీ మొక్కలను సీటీజీ హైదరాబాద్ గార్డెనర్స్‌కు పరిచయం చేసింది. వంగ, మిర్చి, టమాటా, కాప్సికం, బీర, సొర, కాకరలలో అధిక దిగుబడినిచ్చే రకాలను నగరంలో అభివృద్ధి చేశారు.



ఎన్నెన్నో వెరైటీలు..

సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ ఈ రంగంలో కొత్త పుంతలు తొక్కింది. గ్రీన్ చామంతి, తెల్ల బంతి వంటి వెరైటీలు నగరంలో విరబూస్తున్నాయి. ఇక్కడి వాతావరణానికి అనుకూలమైన రెండు రకాల యాపిల్ మొక్కలను పెంచారు. మేఘాలయ ప్రభుత్వం ధ్రువీకరించిన లక్డంగ్ పసుపు హైదరాబాద్‌లో మిద్దెతోటలపై పండుతోంది. మొక్కలకు అవసరమైన జీవన ఎరువులు, ఘన, ద్రవ రూప ఎరువులు సిటీ ఆఫ్ గార్డెనర్స్ అందజేస్తోంది. నగరవాసులు తమ కూరగాయలు తామే పండించుకొని అందరూ కలిసి ఆరోగ్యాన్ని పంచుకొనేలా సీటీజీ అనేక కార్యక్రమాలను చేపట్టింది. మొక్కల పెంపకం పట్ల విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు గార్డెన్ విజిట్స్, ఫార్మ్ విజిట్ ట్రిప్స్, ఫీల్డ్ ట్రిప్స్, సీడ్ బాల్స్ వంటి వివిధ రకాల కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ఇంటింటా ఓ మిద్దెతోట..

నగరంలో మిద్దెతోట చాలాకాలంగా విస్తరిస్తోంది. కేవలం కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల మొక్కలే కాకుండా కొంత మంది ప్రత్యేక అభిరుచితో చిన్న చిన్న ట్యాంకులను ఏర్పాటు చేసి ఇంటిపై చేపల పెంపకాన్ని ఒక అభిరుచిగా కొనసాగిస్తున్నారు. ధాన్యం పండిస్తున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్‌తో పాటు తెలుగు రాష్ట్రాల్లో, ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో ఇంటిపంటల పట్ల అభిరుచి ఉన్నవాళ్లందరిని ఒక గొడుగు కిందకు తెచ్చి ఇంటిపంట సంస్కృతికి సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ నూతన ఒరవడిని తెచ్చింది.

చాలా వెరైటీలు పెంచుతున్నారు



హైదరాబాద్‌లో అన్నా వెరైటీ, హెచ్‌ఆర్‌ఎం యాపిల్ మొక్కలు పెంచారు. స్ట్రాబెర్రీతో పాటు బ్లాక్ బెర్రీ, ఇంగువ, కర్పూరం, ఇలాచీ దాల్చిన చెక్క ఆల్ స్పైసెస్ ప్లాంట్ వంటివి మన టెర్రస్‌లపై గుబాళిస్తున్నాయి. 2021 వరకు కూడా 5000 మంది సభ్యులు ఉండేవారు. ఆ తర్వాత నాలుగేళ్లలోనే 70 వేల మందికి పైగా చేరారు.

– ఈదల సరోజ, కో– కన్వీనర్, సీటీజీ



అవగాహన సదస్సులో పాల్గొన్న మహిళలు (ఫైల్)

పది పాదులు ఉంటే చాలు..

'కేవలం పది పాదులకు సరిపడా కుండీలను ఏర్పాటు చేసుకోగలిగితే ఏడాది పాటు ఇంటి అవసరాలకు కావాల్సినన్ని పండించుకోవచ్చు. ఆయా కాలాలకు అనుగుణమైన కూరగాయలను, ఆకుకూరలను 365 రోజులు పండించుకొనేలా ప్రత్యేమైన అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నాం' అని చెప్పారు సీటీజీ కో– కన్వీనర్ సరోజ. కొత్తగా ఇంటి పంట ప్రారంభించేవారికి శిక్షణనిస్తున్నారు. అవసరమైన కుండీలు, టబ్బులు, మొక్కలు, ఎరువుల వినియోగం, మొక్కలకు వచ్చే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా ఈ శిక్షణ దోహదం చేస్తోందని ఆమె చెప్పారు. కేబీఆర్ పార్కు,పబ్లిక్ గార్డెన్స్, అగ్రి–హార్టికల్చరల్ సొసైటీ, తెలంగాణ ఉద్యానశాఖ, జీహెచ్‌ఎంసీ తదితర సంస్థలు, ప్రభుత్వ విభాగాలు ఇంటి పంట ఉద్యమంలో భాగస్వాములుగా నిలిచాయి. సీటీజీ సమావేశాల్లో రిటర్న్ గిఫ్ట్‌ల రూపంలో వివిధ రకాల మొక్కలు, సేంద్రియ విత్తనాలను ఉచితంగా అందజేస్తున్నారు.

'ధ్రువీకరణ'పై ఆరా!

584 మంది కొత్త టీచర్లపై ఎస్‌బీ విచారణ



సాక్షి, సిటీబ్యూరో: డీఎస్సీ– 2024 ద్వారా ఎంపికై విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయుల ధ్రువీకరణ పత్రాలపై హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ) పోలీసు యంత్రాంగం ఆరా తీస్తోంది. కొత్త టీచర్లు డీఎస్సీ పరీక్ష సమయంలో సమర్పించిన ధ్రువీకరణ పత్రాలన్నింటీపై సమగ్ర విచారణ నిర్వహిస్తోంది. అభ్యర్థులు చదివిన ప్రాథమిక పాఠశాల నుంచి బీఎడ్, డీఎడ్ కళాశాల వరకు రికార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేసిన రెవెన్యూ రికార్డులు క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. వాస్తవంగా గతేడాది డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన సందర్భంగా చాలా మంది ఫేక్ సర్టిఫికెట్లతో టీచర్ ఉద్యోగాలు సాధించినట్లు హైదరాబాద్ జిల్లా విద్యా శాఖ గుర్తించింది. యూజీసీ గుర్తింపు లేని ధ్రువీకరణ, నకిలీ బోనఫైడ్, తప్పుడు కుల పత్రాలతో సుమారు 32 మంది డీఎస్సీ పరీక్ష రాసి ఉత్తీర్ణులైనట్లు గుర్తించి వారి నియామకపు పత్రాలను నిలిపివేసింది. అప్పటి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ధ్రువీకరణ పత్రాలపై విచారణకు ఆదేశించారు.

కలకలం రేపిన నకిలీ ధ్రువీకరణ పత్రం..

తాజాగా ఒక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న కొత్త టీచర్ రిజర్వేషన్ పొందేందుకు నకిలీ కుల ధ్రువీకరణ పత్రం సమర్పించి ఉద్యోగంలో చేరినట్లు ఆరోపణలు రావడం కలకలం సృష్టించింది. దీనిని త్రీవంగా పరిగణించిన హైదరాబాద్ జిల్లా యంత్రాంగం డీఎస్సీ–2024 కొత్త ఉపాధ్యాయులందరీ విద్యార్హతతో పాటు అన్ని ధ్రువీకరణ ప్రతాలపై సమగ్ర విచారణకు ఆదేశించింది. దీంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రంగంలోకి దిగి నిగ్గు తేల్చేందుకు లోతైన విచారణ చేపట్టారు. విచారణ మరింత వేగవంతంగా కొనసాగేలా జిల్లా విద్యాశాఖ అధికారులు పోలీసు కమిషనర్‌కు కలిసేందుకు సిద్ధమవుత్నుట్లు సమాచారం.

తొలి అనుమానితులపై విచారణ తుది దశకు

డీఎస్సీ–2024 ద్వారా ఎంపికై నియామక పత్రాలు అందుకోని 32 మంది అభ్యర్థులపై స్పెషల్ బ్రాంచ్ పోలీసుల విచారణ తుది దశకు చేరింది. ఇప్పటికే 30 అభ్యర్థులపై విద్యార్హత, ఇతర ధ్రువీకరణ పత్రాలపై క్షేత్ర స్థాయి విచారణ పూర్తి చేసి విద్యా శాఖకు నివేదిక సమర్పించింది. మరో ఇద్దరు అభ్యర్థుల విచారణ నివేదిక సమర్పించాల్సి ఉంది. అందులో 30 శాతం అభ్యర్థులు యూజీసీ గుర్తింపు లేని ధ్రువీకరణ, నకిలీ బోనఫైడ్, తప్పుడు కుల పత్రాలు సమర్పించి డీఎస్సీ పరీక్ష రాసి ఉత్తీర్ణులైనట్లు బయటపడింది.

వాస్తవంగా గతేడాది డీఎస్సీ ద్వారా ఎంపికైనవారి ధ్రువీకరణ పత్రాల పరిశీలన సమయంలోని కొందరి పత్రాలపై విద్యాశాఖ అధికారుల అనుమానం వ్యక్తమైంది. సెకండ్ గ్రేడ్ టీచర్ పోస్టు (ఎస్‌జీటీ)కు డీఎడ్ అర్హత తప్పనిసరిగా ఉండాలి. ఈ పోస్టులకు ఎంపికైన 11 మంది అభ్యర్థులు పొరుగు రాష్ట్రం ఏపీలో డీఎడ్ పూర్తి చేసినట్లు సర్టిఫికెట్లు సమర్పించి డీఎస్సీ పరీక్షలు రాసి ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ కార్యాలయంలో వీరందరూ ఔట్ సోర్సింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రాథమిక విచారణ నిర్వహించగా తరగతులకు హాజరు కాకుండా కోర్సు పూర్తి చేసినట్లు బయటపడింది. మరోవైపు హైదరాబాద్ స్థానికత కోసం నగరంలో ఏళ్ల క్రితం మూతపడిన ప్రైవేటు పాఠశాలల్లో చదివినట్లు నకిలీ బోనఫైడ్ పత్రాలు సృష్టించారు. వాటిని వెరిఫికేషన్ అధికారులకు సమర్పించారు. స్కూళ్లు మూతపడితే వాటిలో ఎలా చదువుకున్నారని అధికారులకు అనుమానం వచ్చింది. దీంతో విద్యాశాఖ అధికారులు వారి నియామక పత్రాలను నిలిపివేశారు. మిగిలిన 21 మంది విద్యార్హతలపైనా అనుమానం రావడంతో విద్యా శాఖ సమగ్ర విచారణకు ఆదేశించింది. తాజాగా విచారణ ప్రక్రియ తుది దశకు చేరుకుంది.

ఇక ఆర్క్ జీఐఎస్ సర్వే

- భూగర్భంలో ఏముందో తెలుసుకునేందుకు
- నాలాలు, ఇతర సమస్యల పరిష్కారానికి..



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో వర్షాలొచ్చినప్పుడు ముంపు సమస్యలకు ప్రధాన కారణం నాలాలు. వీటిలో వరద నీరు సాఫీగా పారకపోవడం వల్లే సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో నాలాల్లో పూడికతీత, నాలాల విస్తరణ, ఆధునికీకరణ వంటి పనులు చేస్తున్నప్పటికీ, నాలాల దిగువన భూగర్భంలో ఏ యుటిలిటీస్ ఉన్నాయో ,ఎలాంటి ఆటంకాలున్నాయో తెలియదు. ఈ నేపథ్యంలో నాలాలతో పాటు చెరువుల కింద వరద నీరు పారకుండా ఏవైనా ఆటంకాలున్నాయా తదితర వివరాలను తెలుసుకుంటే సమస్యలు పరిష్కరించడం సులభమవుతుందనే ఆలోచనతో జీహెచ్‌ఎంసీ ఆర్క్ జీఐఎస్ సర్వేకు సిద్ధమవుతోంది. డ్రోన్, జీఐఎస్, క్షేత్రస్థాయి సర్వేల ద్వారా భూమిపై ఉన్న ఆస్తులు, తదితరాల గురించి తెలుసుకుంటుండగా, భూమి లోపల ఏం ఉన్నాయో ఆర్క్ జీఐఎస్ సర్వే ద్వారా తెలుసుకోనుంది.

150 డివిజన్లలో..

సాంకేతికంగా 'మొబైల్ ఫీల్డ్ వర్కర్ యూజర్ టైప్' సర్వేగా పిలిచే ఈ సర్వేను గ్రేటర్ పరిధిలోని 150 కార్పొరేటర్ల డివిజన్లలో చేసేందుకు ఈ సాంకేతిక సహకారాన్ని అందించే సంస్థ యూజర్ లాగిన్ ఐడీలను అందిస్తుంది. డివిజన్లలో పనిచేసే ఇంజినీర్లకు సంబంధిత డివిజన్ లాగిన్‌ను ఉన్నతాధికారులిస్తారు. మొబైల్ యాప్‌తో వారు క్షేత్రస్థాయిలో ఉండే నాలాల దిగువన ఏముందో తెలుసుకోవచ్చు. ఏయే ప్రాంతాల్లో నీరు ఎటు నుంచి ఎటు వెళ్తుంది వంటి అంశాలతోపాటు వరదనీటిని ఎటు మళ్లిస్తే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.. తదితర అంశాలను తెలుసుకోవచ్చు. భూమిలో అడ్డుగా బండరాళ్లున్నా తెలుస్తుంది. నాలాలతో పాటు చెరువులు, నీరు నిల్వ అయ్యే ఇతర ప్రాంతాల్లోని పరిస్థితులనూ తెలుసుకోవచ్చు. వీటిని మ్యాపింగ్ చేయడం ద్వారా ఎక్కడెక్కడ ఎలాంటి పరిస్థితులున్నాయో తెలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. తద్వారా అవసరమైన చర్యలు చేపట్టవచ్చని భావిస్తున్నారు. అంతేకాదు నగరంలో చాలా ప్రాంతాల్లో వరదనీటి లైన్లు, మురుగు లైన్లు కలిసిపోయి వర్షాల వేళ మ్యాన్‌హోళ్లు పొంగిపొర్లుతున్న సమస్యలను సైతం పరిష్కరించవచ్చు. రెండేళ్లపాటు ఆర్క్ జీఐఎస్ సర్వేకు అవసరమైన సాంకేతికతకు దాదాపు రూ.77. 88 లక్షలు ఖర్చు కానుంది. ఈ వివరాలను నేడు (గురువారం) జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశం ముందుంచి, ఆమోదానంతరం ఈ సర్వేకు సంబంధించిన పనుల్ని అధికారులు చేపట్టనున్నారు.

పగబట్టిన ప్రేమ

తొలుత అంగీకరించి.. ఆ తర్వాత అడ్డు చెప్పిందని..

- పోలీసు కేసు పెట్టిందని కన్నతల్లిపై కోపం
- ఆమెను చంపడమే పరిష్కారమని ప్రేమికుడికి పిలుపు
- ప్రియుడు, అతని సోదరుడితో కలిసి అమ్మను చంపించిన బాలిక
- జీడిమెట్ల దారుణం కేసులో ముగ్గురు నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన బాలానగర్ డీసీపీ శ్రీనివాస్



నిందితుడు శివ

జీడిమెట్ల: ప్రియుడు, అతని సోదరుడితో కలిసి పదో తరగతి బాలిక కన్నతల్లిని చంపించిన కేసులో పోలీసులు నిందితులను రిమాండ్‌కు తరలించారు. బుధవారం షాపూర్‌నగర్‌లో బాలానగర్ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ నరేష్‌రెడ్డి, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేష్, డీఐ కనకయ్యలతో కలిసి విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తికి చెందిన సట్ల అంజలి (39) తెలంగాణ సాంస్కృతిక శాఖలో కళాకారిణి. అంజలి తన ఇద్దరు కుమార్తెలు (16), (12)లతో కలిసి షాపూర్‌నగర్‌లోని హెచ్‌ఎంటీ సొసైటీలో నివసిస్తోంది. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పెద్ద కుమార్తె పదో తరగతి చదువుతోంది. ఆమెకు ఎనిమిది నెలల క్రితం నల్లగొండ జిల్లా కట్టంగూర్‌కు చెందిన శివ (18)తో ఇన్‌స్టాలో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారి తీసింది. వీరి ప్రేమను బాలిక తల్లి అంజలి తొలుత అంగీకరించినా.. ఆ తర్వాత వ్యతిరేకించసాగింది. బాగా చదువుకోవాలని కుమార్తెకు చెబుతూనే ప్రేమ విషయంలో మందలించేది.

తల్లి మందలించడంతో ప్రియుడి చెంతకు..

ఈ క్రమంలో ఈ నెల 8న బాలిక తన సోదరిని తీసుకుని కట్టంగూర్‌కు వెళ్లి నాలుగు రోజులు ఉండి వచ్చింది. ఇది నచ్చని తల్లి కుమార్తెను తీవ్రంగా మందలించింది. తనను మందలించడంతో తల్లిపై కోపం పెంచుకున్న బాలిక ఈ నెల 19న కట్టంగూర్‌లోని ప్రియుడు శివ వద్దకు వెళ్లిపోయింది. మరునాడు బాలిక తల్లి అంజలి తన కూతురుని శివ కిడ్నాప్ చేశాడంటూ జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు శివపై కేసు నమోదు చేసి బాలికను తల్లి అంజలికి అప్పగించారు.

అంజలికి అదే శాపమైంది..

ఈ నెల 22న తన చెంతకు చేరిన కుమార్తెను తల్లి అంజలి గట్టిగా మందలించడంతో పాటు చేయి చేసుకుంది. శివను జైలుకు పంపిస్తానని భయపెట్టింది. దీంతో తన ఇష్టానికి అడ్డుగా వస్తున్న తల్లిని ఎలాగైనా చంపాలని బాలిక గట్టిగా నిర్ణయించుకుంది. 23న సాయంత్రం శివను షాపూర్‌నగర్ వచ్చి తన తల్లిని హత్య చేయాలని కోరింది. దీనికి శివ అభ్యంతరం చెప్పడంతో.. అయితే తానే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించడంతో శివ... పదో తరగతి చదువుతున్న తన తమ్ముడి (16)ని తీసుకుని గత సోమవారం సాయంత్రం షాపూర్‌నగర్ వచ్చాడు. బాలిక ఇంటి బయట కాపలా కాయగా.. శివ, అతని సోదరుడు లోపలికి వెళ్లి అంజలి మెడకు చున్నీతో గట్టిగా ఉరి బిగించి హత్య చేశారు. విషయం పోలీసులకు తెలియడంతో మంగళవారం తెల్లవారుజామున శివను కట్టంగూర్‌లో, అతని సోదరుడిని, బాలికను నగరంలో అదుపులోకి తీసుకుని విచారణ చేయగా అంజలిని తామే చంపినట్లు ఒప్పుకొన్నారు. ముగ్గురిపై హత్య కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు.

మొదటి నుంచీ తల్లి అంటే కుమార్తెకు గిట్టేది కాదు..

నిందితురాలు బాలిక (16)కు తల్లి అంజలి అంటే గిట్టేది కాదు. 7వ తరగతిలోనే తల్లి వద్ద ఉండను అంటూ అప్పట్లోనే పోలీసులకు బాలిక ఫిర్యాదు చేసింది. దీంతో అంజలి తన కూతురును రెండేళ్ల పాటు గుండ్లపోచంపల్లిలోని సోదరి ఇంట్లో ఉంచింది. మూడు నెలల క్రితమే బాలిక తల్లి వద్దకు వచ్చినట్లు తెలుస్తోంది. బాలికకు మొదటి నుంచీ తల్లితో శత్రుత్వమే అని.. తరచూ తల్లి తరచూ తనపై చేయి చేసుకొంటోందని బాలిక తన గోడును స్నేహితులతో వెళ్లబోసుకునేదని తెలిసింది. కేసును కొన్ని గంటల్లోనే ఛేదించిన జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ మల్లేష్, డీఐ కనకయ్య, సిబ్బందిని డీసీపీ అభినందించారు.

అంజలిని హత్య చేయడంలో తప్పులేదు: నిందితుడి తల్లి

జీడిమెట్లలో అంజలి హత్యోదంతం కేసులో నిందితుడు శివ తల్లి ఓ టీవీ చానల్‌తో మాట్లాడుతూ.. పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేసింది. బాలిక తల్లి అంజలిని తన కుమారులు హత్య చేయడాన్ని ఆమె సమర్థించుకుంది. మొదట్లో శివ ప్రేమకు అంగీకారం తెలిపిన అంజలి.. ఆ తర్వాత ఒప్పుకోకపోవడం వల్లే ఆమెను తన కొడుకులు హత్య చేశారని చెప్పుకొచ్చింది.

తల్లికి తలకొరివి పెట్టిన చిన్నకూతురు

కేసముద్రం: జీడిమెట్లలో హత్యకు గురైన అంజలి అంత్యక్రియలు బుధవారం ఆమె స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో జరిగాయి. ఆమె మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్‌తో పాటు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు, కళాకారులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం తల్లి మృతదేహానికి చిన్న కుమార్తె మనస్విని తలకొరివి పెట్టింది.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ శ్రీనివాస్

కారు ఢీకొని ఇద్దరు మహిళల మృతి

- ప్రాణాపాయ స్థితిలో మరో మహిళ
- స్కూటీని కారు ఢీకొట్టడంతో ప్రమాదం



అశ్విని (ఫైల్) సుశీల (ఫైల్)

మొయినాబాద్: కారు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఇద్దరు మహిళలను బలిగొంది. మరో మహిళ మృత్యువుతో పోరాడుతోంది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..నగరంలోని ఖైరతాబాద్‌కు చెందిన నందకిషోర్, అశ్విని(37) దంపతుల పిల్లలు మొయినాబాద్‌లోని సుజాత స్కూల్‌లో చదువుతున్నారు. దీంతో వీరి కుటుంబం కొంతకాలంగా హిమాయత్‌నగర్‌లో అద్దెకు ఉంటున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు అశ్విని తన మరదలు లక్ష్మితో కలిసి స్కూటీపై రెడ్డిపల్లిలోని మీసేవ కేంద్రానికి బయలుదేరారు. చిలుకూరుకు వెళ్లగానే మండలంలోని మేడిపల్లికి చెందిన కుమ్మరి సుశీల(60) యూకో బ్యాంకుకు వచ్చి తిరిగి వెళ్లేందుకు వీరిని లిఫ్ట్ అడిగింది. ముగ్గురూ స్కూటీపై వెళ్తుండగా రెడ్డిపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన కారు అతివేగంతో ఢీకొట్టింది. దీంతో ముగ్గురూ ఎగిరి రోడ్డుపై పడ్డారు. తీవ్ర గాయాలపాలైన వీరిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అశ్విని, సుశీల మృతిచెందారు. లక్ష్మి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కారు అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు గుర్తించారు. ఘటన జరిగిన చోట ఓ షాపులో ఉన్న సీసీ కెమెరాల్లో కారు అతివేగంగా వచ్చి స్కూటీని ఢీకొట్టినట్లు రికార్డయ్యింది. ఈ కారు ఓ ప్రైవేటు పాఠశాల కరస్పాండెంట్‌దిగా పోలీసులు గుర్తించారు.

రీల్స్ మోజులో దుస్సాహసాలు!

- చీకటిపడితే చాలు అనేక రహదారులపై ఇవే సీన్లు
- ఇటీవల టూవీలర్‌పై ఎనిమిది మంది ప్రయాణం
- సోషల్‌మీడియాపై నిఘాతో పట్టుకున్న పోలీసులు
- డ్రోన్లనూ వినియోగిస్తేనే పూర్తిస్థాయిలో ఫలితాలు

నడిరోడ్డుపై యువత స్టంట్లు!



మాదాపూర్, రాయదుర్గం ఏరియాల్లో బైకు, ఆటోలతో స్టంట్లు

సాక్షి, సిటీబ్యూరో:

- కంచన్‌బాగ్‌–చంద్రాయణగుట్ట రోడ్డులో అర్ధరాత్రి మూడు ఆటోలు విన్యాసాలు చేశాయి. ఈ దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన పోలీసులు ఏడుగురిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.
- బేగంపేట–ప్రకాష్‌నగర్ మార్గంలో ఏడుగురు యువకులు అర్ధరాత్రి వేళ హల్‌చల్ చేశారు. రేసింగ్‌తో పాటు వీళ్లు చేసిన ఫీట్లు సోషల్ మీడియా ద్వారా పోలీసుల దృష్టికి రావడంతో కేసు నమోదు చేసిన అధికారులు ఏడుగురిని అరెస్టు చేశారు.
- శంషాబాద్‌–రాజేంద్రనగర్ మార్గంలో ఈ–బైక్‌పై ప్రయాణించిన ఎనిమిది మంది రహదారిపై ఫీట్లు చేశారు. సోషల్ మీడియాలో పోస్టు చేయడానికి చేసిన ఈ దుస్సాహసం దాని ద్వారానే పోలీసుల దృష్టికి వెళ్లింది. దీంతో రాజేంద్రనగర్ పోలీసులు వీరిపై కేసు నమోదు చేశారు.

...ఇవన్నీ పోలీసుల రికార్డుల్లోకి ఎక్కిన స్టంట్లు. అయితే వీరి దృష్టిలో పడకుండా అనునిత్యం నగరంలోని అనేక ప్రాంతాల్లో యువత రెచ్చిపోతున్నారు. వాహనాలపై తిరుగుతూ ప్రమాదకరమైన స్టంట్లు, ఫీట్లు చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. సోషల్‌మీడియా ప్రభావంతో రీల్స్ చేసి, లైక్స్‌–షేర్స్ పొందడానికి ఎక్కువగా చేస్తున్నారు.

ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళ...

నడిరోడ్లపై సాగే ఈ సర్కస్ ఫీట్లలో పాల్గొంటున్న వారంతా యువకులే ఉంటున్నారు. ప్రధానంగా ఇన్నర్ రింగ్ రోడ్‌తో పాటు రాజేంద్రనగర్, రాయదుర్గం, మాదాపూర్, బోయిన్‌పల్లి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బోయిన్‌పల్లి, ఔటర్ రింగ్ రోడ్‌కు సంబంధించిన సర్వీస్ రోడ్డులోని కొన్ని చోట్ల ఈ విన్యాసాలు ఎక్కువగా జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అర్ధరాత్రి వేళల్లో సాగుతున్న వీటి వల్ల ఇతరులకు ఇబ్బందికరంగా మారడంతో పాటు ఆ వాహనచోదకులకు, ఎదుటి వారికీ ప్రమాదహేతువులుగా మారే ప్రమాదం ఉందని పోలీసులు గుర్తించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నిఘా ఉంచుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో ఫలితం ఉండట్లేదు.

జరిగిన తర్వాతే పట్టుకుంటున్నారు...

ఈ స్టంట్ల విషయంలో పోలీసులు అవసరమైన స్థాయిలో 'ముందస్తు' చర్యలు తీసుకోవట్లేదనే విమర్శ ఉంది. ఎప్పుడో అడపాదడపా మినహా ఎక్కువ సందర్భాల్లో ఫీట్లు పూర్తయిన తర్వాతే అది పోలీసుల దృష్టికి వెళ్తోంది. ఈ ఫీట్లు, స్టంట్లలో ఒకే వాహనంపై ఎక్కువ మంది ప్రయాణించడం, వెనుక చక్రంతో రోడ్డుపై రాపిడి కలిగిస్తూ పొగ వచ్చేలా చేయడం (వీలింగ్), వాహనం స్టాండ్‌తో పాటు ఇతర భాగాలు రోడ్డుకు తాకేలా చేసి, వేగంగా దూసుకుపోతూ నిప్పు రవ్వలు రప్పించడం (స్పార్కింగ్), ఆటోను ఓ వైపునకు ఎత్తేసి ప్రమాదకరంగా నడపటం వంటివి ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన తర్వాతే పోలీసుల దృష్టికి వస్తున్నాయి. దీంతో ఆయా వాహనాల నెంబర్ల ఆధారంగా ముందుకు వెళ్తున్న పోలీసులు వారిని పట్టుకుని చర్యలు తీసుకుంటున్నారు.

డ్రోన్ల సాయంతో నిఘా ఉంచితేనే...

స్టంట్లు చేయడం పూర్తయిన తర్వాత వీడియోలు, సీసీ కెమెరాల ఆధారంగా బాధ్యుల్ని పట్టుకోవడంతో ఫలితం లేదనే వాదన వినిపిస్తోంది. ఈలోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుందని, ఈ నేపథ్యంలో ఇలాంటి దుస్సాహసాలను ముందే గుర్తించి అణిచివేయాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దీనికోసం స్టంట్లు జరిగే ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో పెట్రోలింగ్ సిబ్బందితో పాటు డ్రోన్ల సాయంతో నిఘా ఉంచాలని సూచిస్తున్నారు. ఇప్పటికే నగర పోలీసు విభాగం ట్రాఫిక్ నియంత్రణకు రెండు డ్రోన్లు వాడుతోంది. వీటిని రేసులు, స్టంట్ల నిరోధానికి వాడాలని కోరుతున్నారు. ఈ డ్రోన్లు గరిష్ఠంగా 250 మీటర్ల ఎత్తులో, 25 కిమీ పరిధిలో నిఘా ఉంచగలుగుతాయని, '28ఎక్స్' వరకు జూమ్ చేసుకునే సామర్థ్యం వీటి ద్వారా స్టంట్లకు అడ్డుకట్ట వేయాలని సూచిస్తున్నారు. సాధారణ ప్రజలతో పాటు తోటి ప్రయాణికుల భద్రతకు ముప్పుగా మారే ఈ తరహా రేసింగ్స్, స్టంట్స్‌కు సంబంధించి బాధ్యులపై బీఎన్ఎస్‌తో పాటు మోటారు వాహన చట్టం, సీపీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు చెప్తున్నారు.

శేషాచలం టు సిటీ..
ఏనుగు దంతాల అక్రమ రవాణా

పట్టుకున్న పోలీసులు..ఒకరి అరెస్టు..మరొకరి పరారీ

- రెండు ఏనుగు దంతాలు స్వాధీనం
- వీటి విలువ రూ.3 కోట్లు!



ఏనుగు దంతాలను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

నాగోలు: ఏపీలోని శేషాచలం అడవుల్లో ఏనుగు దంతాలు దొంగలించి సిటీకి రవాణా చేస్తున్న ముఠాలోని ఓ పాత నేరస్తుడ్ని ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, రంగారెడ్డి జిల్లా అటవీ రేంజ్ అధికారులు అరెస్టు చేశారు. అతని వద్ద నుండి రెండు ఏనుగు దంతాలను, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాల విలువ రూ.3 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. బుధవారం ఎల్‌బీనగర్‌లోని రాచకొండ సీపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం..ఏపీలోని రాయచోటి అన్నమయ్య జిల్లా రాజుల కాలనీకి చెందిన రేకులకుంట ప్రసాద్ గతంలో డ్రైవర్‌గా పనిచేసేవాడు. వ్యసనాలకు బానిసై..అడ్డదారులు తొక్కడం ప్రారంభించాడు. గతంలో తిరుపతి టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎర్ర చందనం స్మగ్లింగ్ కేసులో అరెస్టు చేసి జైలుకు పంపించారు. అక్కడ లోకేశ్వర్‌రెడ్డి అనే స్మగ్లర్‌తో పరిచయమైంది. జైలు నుండి విడుదలైన తర్వాత నిందితులిద్దరూ ఏనుగు దంతాలను అక్రమంగా రవాణా చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయించాలని ప్లాన్ చేసుకున్నారు. వారి పథకం ప్రకారం లోకేశ్వర్‌రెడ్డి శేషాచలం అడవికి వెళ్లి అక్కడి స్థానికుల నుండి ఏనుగుల దంతాలను తక్కువ ధరకు సేకరించాడు. అక్కడ నుండి తీసుకువచ్చి హైదరాబాద్‌లో అధిక ధరకు విక్రయించాలని ప్రసాద్‌కు సమాచారం ఇచ్చాడు. దీని ప్రకారం వారిద్దరూ ఏనుగు దంతాలు తీసుకుని ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్సులో హైదరాబాద్‌కు బయలుదేరారు. సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్ఓటీ పోలీసులు, హయత్‌నగర్ అటవీ శాఖ అధికారులతో కలిసి నిందితుడు రేకుల కుంట ప్రసాద్‌ను అరెస్టు చేశారు. ఈ సంఘటనలో మరో నిందితుడు లోకేశ్వర్‌రెడ్డి అక్కడి నుండి పారిపోయాడు. కాగా ఏనుగు దంతాల బరువు 5.62 కిలోలు ఉందని, కిలో ఏనుగు దంతాలను రూ.50 నుంచి 60 లక్షలకు విక్రయిస్తున్నారని చెప్పారు. అంతర్జాతీయ మార్కెట్‌లో వీటికి రూ.3 కోట్లు ధర పలుకుతుందని పోలీసులు తెలిపారు. సమావేశంలో ఎల్‌బీనగర్–మహేశ్వరం ఎస్ఓటీ అదనపు డీసీపీ ఎండీ షకీర్ హుస్సేన్, రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ అటవీ రేంజ్ అధికారి సాయి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీ ఇన్‌ఫ్రాకాన్ సీఎండీ విజయ్ అరెస్టు

- ప్రీలాంచ్, బైబ్యాక్ స్కీమ్‌లతో మోసం
- అక్రమంగా రూ.8 కోట్ల డిపాజిట్లు వసూలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రీలాంచ్, బైబ్యాక్ స్కీమ్‌ల పేరిట అమాయకులను నమ్మించి నట్టేట ముంచిన ఏవీ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గోగుల లక్ష్మీ విజయకుమార్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. డీసీపీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడకు చెందిన లక్ష్మీ విజయకుమార్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2021లో ఏవీ ఇన్‌ఫ్రాకాన్, ఏవీ ఆర్గానో ఫార్మ్స్ పేరిట కంపెనీలను ప్రారంభించాడు. తక్కువ సమయంలో అధిక లాభాలు అందిస్తానని తప్పుడు హామీలతో పెట్టుబడిదారులను ఆకర్షించాడు. పెట్టుబడిదారులను నమ్మించేందుకు సేల్ అగ్రిమెంట్, ఎంఓయూ చేసుకునేవాడు. రూ.10 లక్షలు డిపాజిట్ చేస్తే ఏడాది కాలం తర్వాత ప్రిన్సిపల్ అమౌంట్‌తో పాటు 50 శాతం అదనపు సొమ్మును మొత్తంగా రూ.15 లక్షలు ఇస్తానని పెట్టుబడిదారులను నమ్మించాడు. అలాగే ఇన్వెస్టర్లు రూ.10 లక్షలు, రూ.20 లక్షలు డిపాజిట్ చేస్తే.. ఏడాది తర్వాత చెల్లించిన సొమ్ము ఖరీదు చేసే ఓపెన్ ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు చెల్లించిన సొమ్ములో 50 శాతం అదనంగా అందిస్తామని మాయ మాటలు చెప్పాడు. ఇలా వందలాది అమాయకుల నుంచి అక్రమంగా రూ.8 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేశాడు. ఆ తర్వాత చేతులెత్తేశాడు. ఈ మేరకు వనస్థలిపురంకు చెందిన బాధితుడు భూపతి ప్రదీప్ సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు విజయ్‌ను మంగళవారం ఒంగోలులో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆత్మహత్య



నిఖిల్ మదన్ (ఫైల్)

గచ్చిబౌలి: కొంత కాలంగా డిప్రెషన్‌లో ఉన్న ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ 17వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సౌత్‌వెస్ట్ న్యూఢిల్లీకి చెందిన నిఖిల్ మదన్(37) గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్(ఐఎస్‌బీ)లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. 9 నెలల క్రితం వివాహం జరగగా భార్య ప్రేరణతో కలిసి ఐఎస్‌బీ క్యాంపస్ క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నాడు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో భార్య టీవీ చూస్తుండగా 17 అంతస్తులోని బాల్కానీ నుంచి కిందికి దూకాడు. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చప్పుడు విన్న భార్య కిందికి వెళ్లి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. కొంత కాలంగా డిప్రెషన్‌లో ఉండటంతో డాక్టర్ వద్దకు వెళ్తున్నాడని, తన వల్ల చిన్న పొరపాటు జరిగినా తీవ్రంగా ఆలోచిస్తాడని పోలీసుల విచారణలో తేలింది. దీంతో మానసిక సమస్యల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

భార్యపై దాడి.. భర్తపై కేసు నమోదు

బంజారాహిల్స్: అరుణాచలం క్షేత్రానికి వెళ్దామంటూ భార్యను, ఇద్దరు కుమారులను కారులో తీసుకువెళ్లిన వ్యక్తి మార్గమధ్యంలో భార్యపై దాడి చేసి గాయపరిచిన ఘటనలో నిందితుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని వెంకటేశ్వరనగర్‌లో నివసించే నేనావత్ కృష్ణవేణికి 2011లో విజయ్‌కుమార్‌తో వివాహమైంది. వీరి మధ్య కొద్ది రోజులుగా మనస్పర్థలు వచ్చి ఘర్షణ పడుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 18న విజయ్‌కుమార్ భార్యాపిల్లలను అరుణాచలం వెళ్దామంటూ కారులో ఎక్కించుకుని వెళ్తుండగా..కర్నూలు టోల్‌గేట్ వద్ద కారు ఆపి భార్యను తీవ్రంగా కొట్టాడు. దీంతో ఆమె భర్త నుంచి తప్పించుకుని పరుగులు తీసింది. సమీపంలోని పెట్రోల్ బంకులో తలదాచుకుని డయల్ 100కు ఫిర్యాదు చేసింది. పోలీసుల సహాయంతో భర్త దాడి నుంచి బయటపడి కర్నూలులో ఫిర్యాదు చేసింది. అక్కడ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. గతంలో కూడా బాధితురాలు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లోనూ, వెస్ట్‌జోన్ ఉమెన్స్ పోలీస్‌స్టేషన్‌లోనూ భర్త పైశాచికత్వంపై ఫిర్యాదు చేయగా కేసులు కూడా నమోదయ్యాయి. నిందితుడు విజయ్‌కుమార్ రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రలోనే పదో తరగతి విద్యార్థి మృతి

మూసాపేట: స్కూల్‌కి వెళ్లి వచ్చి రాత్రి అన్నం తిని పడుకున్న ఓ పదవ తరగతి విద్యార్థి నిద్రలోనే చనిపోయిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బిహార్‌కు చెందిన రంజిత్ కుమార్ ప్రశాంత్‌నగర్‌లో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. భార్య ఐదు సంవత్సరాల క్రితం చనిపోయింది. కూతురు, కుమారుడు పురుషోత్తం (14) ఉన్నారు. మంగళవారం స్కూల్‌కి వెళ్లి వచ్చి ఆడుకుని రాత్రి ముగ్గురు కలిసి భోజనం చేశాక తండ్రి నిద్రపోగా పిల్లలు ఇద్దరు టీవీ చూసి నిద్రపోయారు. మధ్యరాత్రి కూతురు వాష్‌రూంకు వెళ్లి వస్తూ పురుషోత్తం పక్కకు జరిగి పడుకుని ఉండటంతో జరిపేందుకు వెళ్లింది. పురుషోత్తం స్పృహలో లేకపోవడంతో తండ్రిని నిద్ర లేపింది. తండ్రి కూడా లేపేందుకు ప్రయత్నించినా లేవకపోవడంతో వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి అప్పటికే చనిపోయినట్లు ధృవీకరించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గుండె సమస్య లేదా ఇతర అనారోగ్య సమస్యతో చనిపోయాడా అని కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగించి లైంగిక దాడి

గచ్చిబౌలి: వైన్ షాపు ముందు పరిచయమైన ఓ యువకుడు అతిగా మద్యం తాగించి యువతిపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం..సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో ఈవెంట్లలో డ్యాన్సర్‌గా పని చేసే ఓ యువతి (23) గచ్చిబౌలి జంక్షన్‌లోని వైన్ షాపు వద్ద మద్యం తాగుతోంది. కుక్‌గా పనిచేసే ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ప్రకాష్ (32) అదే వైన్ షాపు వద్దకు వచ్చాడు. మద్యం తాగుతున్న యువతిని పరిచయం చేసుకొని..ఇలా రోడ్డుపై తాగితే మంచిది కాదని చెప్పాడు. దగ్గర్లోనే తన రూమ్ ఉందని నమ్మించి వెంట తీసుకెళ్లాడు. ఇద్దరు కలిసి మద్యం తాగి నిద్రపోయారు. రాత్రి 2 గంటలకు యువతికి మెళకువ రావడంతో లేవగా..ఒంటిపై బట్టలు లేకుండా నగ్నంగా ఉంది. దీంతో ఆ యువతి మోసం చేశావంటూ ప్రకాష్‌తో గొడవకు దిగింది. తెల్లవారే వరకు అక్కడే ఉండాలని ప్రకాశ్ తన మొబైల్‌లో తీసిన యువతి న్యూడ్ ఫొటోలు చూపించాడు. ఎవరికి చెప్పినా, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఈ ఫొటోలు అందరికి పంపిస్తానని బెదిరించాడు. అయినా యువతి మాత్రం తాను ఇక్కడ ఉండనని గొడవ పడి ఫ్రెండ్‌కు ఫోన్ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయింది. అతిగా మద్యం తాగించి లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సెల్‌ఫోన్ సీజ్ చేసి నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

27న జగన్నాథ రథయాత్ర

హిమాయత్‌నగర్: విశ్వ ప్రభువు జగన్నాథుని రథయాత్ర ఈనెల 27న అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) కుకట్‌పల్లి ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ కుకుట్‌పల్లి అధ్యక్షులు ప్రభుజీ మహా శృంగ దాస్ తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ అగర్వాల్ సమాజ్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు అంజనీ కుమార్ అగర్వాల్, తెలంగాణ గుజరాతి సమాజ్ అధ్యక్షులు జస్మత్ పటేల్, ఇస్కాన్ కుకట్ పల్లి సమన్వయకర్త ఎం.శ్రీవాణి, ఇస్కాన్ రష్యా ప్రతినిధి ఒక్సానాలతో కలసి యాత్ర పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు.

పోస్టాఫీస్‌లో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేయించుకుంటున్న పోస్టల్ ఉద్యోగులు..

బంజారాహిల్స్: ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ ఆస్పత్రి యాజమాన్యం బుధవారం ఖైరతాబాద్ పోస్టల్ కార్యాలయంలో ఉద్యోగులకు, సిబ్బందికి ఉచిత కిడ్నీ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు క్రియాటిన్, బీపీ, షుగర్, యూరిన్ ప్రొటీన్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డిప్యూటీ పోస్ట్‌మాస్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత

హిమాయత్‌నగర్: వెనుకబడిన విద్యార్థుల సాధికారతే లక్ష్యంగా అర్జాస్ స్టీల్స్ కృషి చేస్తుందని అర్జాస్ స్టీల్స్ సీఈఓ పసుపులేటి ఆనంద్ పేర్కొన్నారు. 2025 సంవత్సరానికి గాను 12 మంది నిరుపేద విద్యార్థులను సందూర్ విద్యా ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేసి అందజేసినట్లు బుధవారం తెలిపారు. భవిష్యత్తులో అధిక సంఖ్యలో విద్యార్థులకు ప్రోత్సహకాలు అందించేందుకు తమ సేవలను విస్తరిస్తామని పేర్కొన్నారు.

సందడి చేసిన చిన్నారులు



శ్రీనగర్‌కాలనీ: పార్కులో చిన్నారులు ఆడుతూ..పాడుతూ సందడిచేశారు. బుధవారం రాజీవ్‌నగర్‌కాలనీ బడ్స్ అండ్ బ్లూమ్స్ ప్లే స్కూల్ చిన్నారులు యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్క్‌కి ఫీల్డ్‌ట్రిప్‌లో భాగంగా పార్క్‌లోని విషయాలను ఉపాధ్యాయులు వివరించారు. పార్కులు, చెట్లు, పర్యావరణ పరిరక్షణకు పార్క్‌లు ఎలా దోహదపడతాయనే అంశాలను తెలపడానికి ఇలాంటి కార్యక్రమాలను చిన్నారులకు నిర్వహిస్తున్నట్లు స్కూల్ డైరెక్టర్ శశిభూషణ్ అన్నారు.

తాగి నడిపితే వాహనం సీజ్



పార్క్‌హయత్ హోటల్ వద్ద స్కూల్ బస్సు డ్రైవర్‌కు శ్వాస పరీక్షలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ గోవర్ధన్‌రెడ్డి

బంజారాహిల్స్: విద్యార్థులను పాఠశాలలకు చేర్చే స్కూల్ బస్సులు, వ్యాన్‌లు, ఆటో డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ హెచ్చరించారు. బుధవారం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట ప్రాంతాల్లో విద్యార్థులను తీసుకెళ్తున్న బస్సు, వ్యాన్, ఆటో డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించారు. కొంత మంది డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు తమ దృష్టికి రావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆయా పాఠశాలల యాజమాన్యాలు కూడా బస్సు డ్రైవర్లపై నిఘా ఉంచాలని వారిని ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ ఉండాలని సూచించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

వెంగళరావునగర్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన మేరకు.. జవహర్‌నగర్‌కు చెందిన ఆర్.రామారావుకు మధురానగర్ హాస్టల్‌లో నివసించే పి.అనంత శివశంకర్ పరిచయం అయ్యాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.1.50 లక్షలు తీసుకున్నాడు. ఆ తరువాత తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో బాధితుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఫ్లైఓవర్‌కు కొత్త సొబగులు..

రూ.1.32 కోట్లతో ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌కు మెరుగులు

- వినాయక చవితి నాటికి పూర్తి చేయాలని లక్ష్యం..
- సరికొత్తగా ముస్తాబు కానున్న ఫ్లైఓవర్
- చౌరస్తాలోనూ అభివృద్ధి పనులు..



ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య జంక్షన్‌లో ఫౌంటెన్ మరమ్మతులు

బంజారాహిల్స్: నిత్యం వీవీఐపీలు ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు, బ్యూరోక్రాట్లు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులు, వాహనదారులతో రద్దీగా ఉండే ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌కు కొత్త సొబగులు అద్దాలని జీహెచ్ఎంసీ ప్రత్యేక ప్రణాళికను రూపొందించింది. ఖైరతాబాద్ చౌరస్తా విశ్వేశ్వరయ్య జంక్షన్ నంచి నెక్లెస్‌రోడ్డు ఇందిరా గాంధీ విగ్రహం జంక్షన్ వరకు ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌ను సుందరంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. ఈ మేరకు డిజైన్లు కూడా రూపొందించారు. రూ.1.32 కోట్ల వ్యయంతో ఫ్లైఓవర్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దే పనులు ప్రారంభమయ్యాయి. ఫ్లైఓవర్‌పై రెయిలింగ్, పెయింటింగ్, లేన్ మార్కింగ్, జీబ్రా క్రాసింగ్, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ షెల్టర్, పీజేఆర్ విగ్రహం, విశ్వేశ్వరయ్య జంక్షన్ల అభివృద్ధికి రూ.30 లక్షలు, శతధార ఫౌంటెన్, వీవీ స్టాచ్యూ ఫౌంటెన్ల అభివృద్ధి కోసం రూ.12 లక్షలు, ఫ్లైఓవర్‌పై ఆర్‌సీసీ మీడియన్ పనులకు రూ.32 లక్షలు, ఫ్లైఓవర్‌కు రెండు వైపులా ఫుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్ల మరమ్మతులు, ఇందిరాగాంధీ రోటరీ వద్ద రెయిలింగ్ పనుల కోసం రూ.58 లక్షలు ఖర్చు చేయనున్నారు. మొత్తం రూ.1.32 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనులు ప్రారంభమయ్యాయి.

- వినాయక చవితి పర్వదినం నాటికి ఫ్లైఓవర్ సుందరీకరణ పనులు పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- వినాయక నిమజ్జనం సందర్భంగా లక్షలాది మంది సందర్శకులు నెక్లెస్‌రోడ్డుకు ఇదే ఫ్లైఓవర్ మీదుగా వెళ్లనుండగా ఆ లోపునే ఫ్లైఓవర్‌కు సరికొత్త ఆకర్షణను తీసుకురావాలని నిర్ణయించారు.
- విశ్వేశ్వరయ్య జంక్షన్ ఫౌంటెన్ అభివృద్ధితో పాటు ఈ ప్రాంతాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దాలని డిజైన్లు రూపొందించారు.
- ప్రతిరోజూ ఈ ఫ్లైఓవర్ మీదుగా నెక్లెస్‌రోడ్డు, ట్యాంక్‌బండ్, ఐమాక్స్, సచివాలయం, ఎన్టీఆర్ మార్గ్, లుంబినీపార్కు, ఇటు పంజగుట్ట, అమీర్‌పేట, బంజారాహిల్స్ వైపు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి.
- నగరంలో అత్యంత రద్దీ కలిగిన రహదారి ఇదే కావడంతో పాటు ప్రతిరోజూ ముఖ్యమంత్రి ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ఈ ఫ్లైఓవర్‌కు ప్రత్యేక ఆకర్షణ తీసుకురావాలని నిర్ణయించారు.



ఖైరతాబాద్ ఫ్లైఓవర్ సెంట్రల్ మీడియన్ పనులు చేస్తున్న సిబ్బంది..

రెండు నెలల్లో పూర్తి చేస్తాం

నగరం నడిబొడ్డున అత్యంత రద్దీగా ఉండే ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌ను పచ్చదనంతో పాటు సరికొత్త ఆకర్షణలతో తీర్చిదిద్దాలని ప్రణాళికలు రూపొందించడమే కాకుండా నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ కూడా పూర్తయ్యింది. ప్రస్తుతం పనులు ప్రారంభమయ్యాయి. ఖైరతాబాద్ జంక్షన్‌ను కూడా అభివృద్ధి చేస్తున్నాం. గత కొంతకాలంగా ఫ్లైఓవర్‌పై ఫుట్‌పాత్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. సెంట్రల్ మీడియన్లు కూడా దెబ్బతిన్నాయి. వీటన్నింటి మరమ్మతులతో పాటు ఆకర్షణీయమైన టైల్స్‌తో ఫుట్‌పాత్‌లను తీర్చిదిద్దనున్నాం. వినాయక చవితి నాటికి ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అభివృద్ధి పనులు పూర్తయితే ఖైరతాబాద్ రూపురేఖలే మారిపోతాయి.

– రజనీకాంత్‌రెడ్డి, డీసీ, ఖైరతాబాద్ సర్కిల్–17

రేషన్ బియ్యం తరలింపుపై నిరంతర నిఘా

ఏఎస్ఓ జ్యోతి

బంజారాహిల్స్: సబ్సిడీ బియ్యం మళ్లింపుపై పౌర సరఫరా శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని ఖైరతాబాద్ రేషనింగ్ సర్కిల్–7 సహాయ సరఫరా అధికారి (ఏఎస్ఓ) జ్యోతి స్పష్టం చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ కోసం ఉద్దేశించిన సబ్సిడీ బియ్యం మళ్లింపునకు సంబంధించి ఇటీవల చోటుచేసుకుంటున్న ఆందోళనలపై సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడారు. నిత్యావసర వస్తువులు పక్కదారిపట్టకుండా క్రమం తప్పకుండా తమ పర్యవేక్షణ కొనసాగుతుందన్నారు. అక్రమ కార్యకలాపాల్లో పాల్గొన్న వ్యక్తులపై చర్యలు తీసుకునేలా తమ బృందాలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉన్నాయన్నారు. నిత్యావసర వస్తువుల చట్టం 1955లోని సెక్షన్ 6–ఏ కింద కేసులు నమోదు చేయబడతాయన్నారు. అలాగే నిత్యావసర వస్తువుల అక్రమ వ్యాపారంలో భాగస్వాములు ఉన్న వారిపై పోలీస్‌స్టేషన్లలో క్రిమినల్ కేసులు దాఖలు చేస్తామన్నారు.బోరబండ పోలీస్‌స్టేషన్‌లో జితేందర్ రాథోడ్ అలియాస జీతూనాయక్ అనే వ్యక్తిపై రెండు క్రిమినల్ కేసులు నమోదయ్యాయని గుర్తుచేశారు. ఈ రెండు కేసుల్లోనూ నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారని చెప్పారు. అలాగే కాటేదాన్ ప్రాంతానికి చెందిన వ్యక్తులపై సబ్సిడీ బియ్యం అక్రమంగా మళ్లించడంలో ప్రమేయం ఉన్నందున బంజారాహిల్స్, బోరబండ పోలీస్‌స్టేషన్లలో మరో రెండు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లోనూ నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారన్నారు. నిందితులను పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చేపట్టారన్నారు. ఎవరైనా అనుమానాస్పద కార్యకలాపాలకు పాల్పడినట్లు సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నెంబర్ 1967కు గానీ, 18004250033 నెంబర్‌కు గానీ, 7330774444 వాట్సప్ నెంబర్ ద్వారా ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

అసంఘటిత కార్మికుల సమస్యలపై పోరాటం చెయ్యాలి



బిజేఎమ్‌సీ నగర అధ్యక్షురాలిగా శ్రీదేవికి నియామక పత్రం ఇస్తున్న దృశ్యం

పంజగుట్ట: అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని భారతీయ జనతా మజ్దూర్ సంఘ్ (బిజేఎమ్‌సీ) జాతీయ చైర్మన్ బిశ్వప్రియ రాయ్ చౌదరీ అన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిజేఎమ్‌సీ హైదరాబాద్ అధ్యక్షురాలిగా శ్రీదేవి రమేష్‌కు నియామకపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు అర్నబ్ చటర్జీతో కలిసి బిశ్వప్రియరాయ్ మాట్లాడుతూ .. వీధి వ్యాపారులకు, భవన రంగంలో పనిచేసే కార్మికులకు, ఆటో, రిక్షా, హోటల్స్‌లో పనిచేసే వారికి కూడా లేబర్ కార్యాలయం నుండి గుర్తింపు కార్డు పొందవచ్చునని ఈ విషయం ఎవ్వరికీ తెలియదని వారికి అవగాహన కల్పించి, లేబర్ కార్డు ఇప్పించాలని సూచించారు. తెలంగాణలో మనం ప్రతిపక్ష హోదాలో ఉన్నామని బిజేఎమ్‌సీ మండల, జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి ప్రతీ నిత్యం సమస్యలపై పోరాటం చేస్తూనే ఉండాలని పిలుపునిచ్చారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అద్దె చెల్లింపులో నిర్లక్ష్యం తగదు



ఆరోగ్య కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ జవహర్‌నగర్‌కాలనీలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్వహణ కొనసాగుతున్న భవనం అద్దె చెల్లింపు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ తెలిపారు. సుమారు సంవత్సర కాలంగా అద్దె చెల్లించకపోవడంతో భవన యాజమాన్యం అక్కడ నుంచి ఆరోగ్య కేంద్రం తీసివేయాలని పట్టుబట్టిన నేపథ్యంలో బుధవారం ఆయన ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి ఆరోగ్య కేంద్రానికి కొత్త భవనం నిర్మించేదాకా ఇక్కడే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రూ.1.43 కోట్లు జవహర్‌నగర్, బీజేఆర్‌నగర్‌లలో కొత్త ఆరోగ్య కేంద్రాలు నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయని, ఇక్కడ ఉన్న ఖాళీ స్థలంలో ఎమ్మార్వో ఎన్‌ఓసీని ఇస్తే జీహెచ్ఎంసీ భవనాన్ని నిర్మించడానికి సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా కార్పొరేటర్ తెలిపారు. అప్పటివరకు గతంలో ఎమ్మెల్యే ఇస్తానన్న రూ.2 లక్షలను ఈ భవనం అద్దెకు వినియోగించాలన్నారు.

పరస్పర బదిలీలు చేయాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఉపాధ్యాయుల మ్యూచువల్ బదిలీల ఉత్తర్వులను తక్షణమే జారీ చేయాలని ధర్మ టీచర్స్ యూనిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామెర ఉపేందర్‌లు బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జీవో.317 ద్వారా వివిధ జిల్లాలకు బదిలీలు చేసిన ఉపాధ్యాయులకు న్యాయం చేసేందుకు పరస్పర బదిలీలకు అవకాశం కల్పిస్తూ జీవో.245 జారీ చేసిందని గుర్తు చేశారు. దీంతో 925 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోగా 631 మంది దరఖాస్తులు ఆమోదించి మిగతా 249 మంది దరఖాస్తులను నిలిపేశారని తెలిపారు.

ప్రేమ పేరిట మోసం..పోలీసులకు ఫిర్యాదు

వెంగళరావునగర్: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి..గర్భవతి అయిన తర్వాత ముఖం చాటేసిన యువకునిపై మధురానగర్ పీఎస్‌లో ఓ యువతి ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం సూర్యాపేట జిల్లాకు చెందిన 21 ఏళ్ల యువతి గతంలో కొండాపూర్‌లో నివసిస్తూ రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా ఉద్యోగం చేసేది. ఆ సమయంలో ఖమ్మం ప్రాంతానికి చెందిన లక్ష్మీకాంత్‌తో పరిచయం అయింది. ఆమె తర్వాత మధురానగర్‌కు వచ్చింది. ఇరువురి మధ్య స్నేహం ప్రేమగా మారింది. అతను ప్రేమిస్తున్నాని, పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో సన్నిహితంగా మెలిగింది. లక్ష్మీకాంత్ తల్లి ఫిబ్రవరిలో చనిపోవడంతో ఖమ్మం వెళ్లాడు. దాంతో ఆ యువతి కూడా ఖమ్మం వెళ్ళి వారి ఇంట్లో నెలరోజులు గడిపింది. అతని తండ్రి కూడా పెళ్లికి అంగీకరించాడు. అనంతరం ఆమె మిర్యాలగూడకు వెళ్లింది. అక్కడ తాను గర్భవతినని తెలియడంతో లక్ష్మీకాంత్‌కు తెలియజేసింది. అయితే పెళ్లి చేసుకోవాలంటే రూ.40 లక్షలు నగదు, 3 ఎకరాలు పొలం కావాలని డిమాండ్ చేశాడు. తనవద్ద లేవని చెప్పడంతో ముఖం చాటేసి తిరుగుతున్నాడు. దాంతో తనను మోసం చేసిన లక్ష్మీకాంత్‌పై చర్యలు తీసుకోవాలని బాధితురాలు బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ

హిమాయత్‌నగర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టాస్క్ ఫోర్స్, హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్‌మెంట్ వింగ్(హెచ్ న్యూ) డీసీపీ వై.వి.ఎస్.సుధీంద్ర సూచించారు. బుధవారం హెచ్‌న్యూ, హెచ్‌సీఎస్ సీ(హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్) యాంటీ నార్కోటోయిక్స్ ఫోరంతో కలిసి నారాయణగూడలోని కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషనల్ సొసైటీలో మాదకద్రవ్య నిరోధక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా డీసీపీ విద్యార్థులకు మాదకద్రవ్య రహిత జీవనశైలిపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా వాటి దుర్వినియోగాన్ని ప్రోత్సహించే స్నేహాలు చేయొద్దని సూచించారు. హెచ్‌న్యూ ఎస్ఐ సి.వెంకట రాములు, హెచ్‌సీఎస్‌సీ యాంటీ నార్కోటిక్ ఫోరం జాయింట్ సెక్రటరీ కెజిఎస్ఎస్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎస్పీ సోమనాథం

హిమాయత్‌నగర్: డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని యాంటీ నార్కోటిక్ బ్యూరో డీఎస్పీ సోమనాథం పిలుపునిచ్చారు. బుధవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో విద్యార్థి సేన అధ్యక్షులు టీకే.శివప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టబోయే 'డ్రగ్స్ ఫ్రీ తెలంగాణకు 100 రోజుల మహోద్యమ' పోస్టర్‌ను ఆయన ముఖ్య అతిథిగా ఆవిష్కరించి మాట్లాడారు. గతేడాది రూ.100 కోట్ల విలువ గల డ్రగ్స్ పట్టుకున్నాం అన్నారు. ఈ సంవత్సరం కూడా విస్తృత దాడులు నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్స్ వాడకంపై యువతకు పౌర సమాజం, స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.

వివాహితను వేధిస్తున్న డ్యాన్స్‌మాస్టర్

వెంగళరావునగర్: వివాహితను వేధిస్తున్న డాన్స్‌మాస్టర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. రహమత్‌నగర్‌లో నివాసం ఉండే మహిళ కుమార్తె డాన్స్ నేర్చుకుంటుంది. డాన్స్‌మాస్టర్ కె.జయచంద్రతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో గత ఆదివారం డాన్స్‌మాస్టర్ మహిళ ఇంటికి వచ్చాడు.అసభ్యంగా ప్రవర్తించి కోర్కె తీర్చాలని వేధించాడు. దీంతో బాధితురాలు డాన్స్‌మాస్టర్‌పై బుధవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది.

నమ్మించి.. మోసం చేసి తల్లిని చేశాడు

వెంగళరావునగర్: యువతిని మోసం చేసి బాబు పుట్టాక ముఖం చాటేసిన యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదైంది. పోలీసులు తెలిపిన మేరకు..రంగారెడ్డి జిల్లాకు చెందిన యువతి షాద్‌నగర్ కాలేజీలో డిగ్రీ చదివే సమయంలో సీనియర్ ద్వారా అయిన భరత్‌రెడ్డి పరిచయమయ్యాడు. గత ఏడాది యువతిని అమీర్‌పేట ఓయో రూంలో బలవంతంగా కలిశాడు.గర్భవతినని ఆమె భరత్‌రెడ్డికి చెప్పగా పెళ్ళి చేసుకుందామని చెప్పాడు.ఆ తరువాత ఆమెకు బాబు పుట్టాడు. దీంతో బాధితురాలుషాద్‌నగర్‌లోని భరత్ రెడ్డి ఇంటికి వెళ్ళగా దుర్భాషలాడి పంపారు. తనను మోసం చేసిన భరత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పీఎస్‌లో ఆమె ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఎస్ఆర్‌నగర్‌కు పంపారు.

దాడి ఘటనలో నిందితుల అరెస్టు

బంజారాహిల్స్: కారులో వెళ్తున్న వ్యక్తిని వెంబడించి బెదిరించి దాడి చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను బంజారాహిల్స్ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. బంజారాహిల్స్ రోడ్ నెంబర్–12లోని ఎమ్మెల్యే కాలనీ నుంచి శ్రీనివాస్ అనే డ్రైవర్ కారులో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి వైపు వెళ్తుండగా బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు కారును వెంబడించి కారు ముందు ఆపారు. కారు నడుపుతున్న వ్యక్తిని హెచ్చరిస్తూ బెదిరిస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. అంతటితో ఆగకుండా ముఖంపై తీవ్రంగా బాదారు. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు నందినగర్‌కు చెందిన ముడావత్ గణేష్, జుడావత్ అరుణ్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సినీ దర్శకుడిపై కేసు

నిర్మాతను మోసం చేశాడని ఆరోపణలు

బంజారాహిల్స్: సినిమా షూటింగ్‌ను మధ్యలోనే నిలిపివేసి ఆ సినిమాకు సంబంధించిన ఫుటేజీలు ఉన్న ల్యాప్‌ట్యాప్‌లు, ఐప్యాడ్‌ను తీసుకువెళ్లిన ఘటనలో నమ్మకద్రోహానికి పాల్పడ్డ సినీ దర్శకుడిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే..అమెరికాలో నివసించే ఎన్ఆర్ఐ అల్లు సాయిలక్ష్మణ్ సినిమాలు నిర్మించేందుకు హైదరాబాద్‌కు వచ్చి జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–10లోని స్రవంతినగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ తీసుకుని సినిమా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. 2024లో సినిమా నిర్మించేందుకు అమెరికా నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సాయిలక్ష్మణ్ అల్లు ఆర్ట్స్ అకాడమీ ప్రొడక్షన్ పేరుతో మల్లికార్జున్ అనే డైరెక్టర్‌తో 'గాడ్స్ ప్రీమియర్ లీగ్' (జీపీఎల్) సినిమాను మొదలుపెట్టాడు. ఈ సినిమాకు వేములవాడ శివకుమార్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా కుదిరాడు. అయితే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైన కొద్దిరోజులకే డైరెక్టర్ మల్లికార్జున్ ప్రవర్తన సరిగ్గా లేకపోవడంతో నిర్మాత సాయిలక్ష్మణ్ ఆ సినిమా షూటింగ్‌ను నిలిపివేశాడు. అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న వేములవాడ శివకుమార్‌ను డైరెక్టర్‌గా పెట్టుకుని ప్రొడక్షన్ నెంబర్–1 పేరుతో మరో సినిమాను ప్రారంభించాడు. ఈ సినిమా చిత్రీకరణ 35 రోజులు పూర్తయిన తర్వాత సాయిలక్ష్మణ్ తన వ్యాపారం నిమిత్తం అమెరికా వెళ్లిపోయాడు. ఆయన వెళ్లిపోయిన తర్వాత సినిమా షూటింగ్ నిలిచిపోయింది. షూటింగ్ జరపాలంటూ పలుమార్లు యూఎస్ఏ నుంచి సాయిలక్ష్మణ్ చెప్పినా శివకుమార్ వినిపించుకోలేదు. అంతటితో ఆగకుండా షూటింగ్‌కు సంబంధించిన ఫుటేజీలు, ఒక ఐటమ్ సాంగ్, మరో పాట రెండు ల్యాప్‌ట్యాప్‌లలోనూ, రెండు ఐప్యాడ్‌లలోనూ స్టోర్ చేసి ఉంచగా..వీటిని నిర్మాతకు చెప్పకుండా శివకుమార్ కార్యాలయాల నుంచి తీసుకువెళ్లిపోయాడు. తెచ్చి ఇవ్వాలని చెప్పినా వినిపించుకోలేదు. ఈ ల్యాప్‌ట్యాప్, ఐప్యాడ్‌లలో సినిమా డేటాతో పాటు ఫిలిం మేకింగ్ వీడియోస్ కూడా ఉన్నాయని నిర్మాత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు దర్శకుడు శివకుమార్ సినిమా దృశ్యాలతో పాటు పాటలను ఇన్‌స్టాగామ్‌లో, ఫేస్‌బుక్‌లో, యూట్యూబ్‌లో పోస్ట్ చేశారని, ఇది తమకు ఎంతో నష్టాన్ని కలిగించేదిగా ఉందని ఆరోపించారు. చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు డైరెక్టర్ శివకుమార్‌పై బీఎన్ఎస్ సెక్షన్ 316 (4) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థుల ర్యాలీ



మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో సీవీ ఆనంద్, క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బ్యానర్లు, ప్లకార్డులను పట్టుకొని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వెంట కదం తొక్కారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు ఉన్న యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి పోలీసు వ్యవస్థ పకడ్బందీగా ముందుకు సాగుతోందన్నారు. మాదక ద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ శాఖ ఉద్యోగులకు రిటైల్ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ

రాయదుర్గం: రక్షణ శాఖ ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం దేశానికి సేవ చేసినంత గౌరవంగా ఉందని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్(ఎఫ్‌డీడీఐ)–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.తేజ్ లోహిత్‌రెడ్డి అన్నారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ హైదరాబాద్ క్యాంపస్‌లో రక్షణ శాఖలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ రీసెటిల్‌మెంట్(డీజీఆర్) పునరావాస కార్యక్రమంలో భాగంగా రక్షణ శాఖ ఉద్యోగులకు రిటైల్ మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, అంకితభావం రిటైల్ రంగంలో ఉన్నత స్థానానికి తీసుకెళతాయన్నారు. డీఆర్‌జెడ్‌లోని అదనపు డైరెక్టర్ జనరల్(ఏడీజీ) అండ్ కమాండర్ రహిల్ బ్రిగేడియర్ రోహిత్ మెహతా వర్చువల్‌గా మాట్లాడుతూ 22 మంది రక్షణ సిబ్బందికి రిటైల్ మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికెట్ కోర్సు నిర్వహిస్తోందన్నారు. వినియోగదారులకు అందించే సేవలు, ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్, అమ్మకాల పద్ధతులు, ఆధునిక రిటైల్ కార్యకలాపాలు వంటి కీలక అంశాల్లో మెలకువలు నేర్పుతారని చెప్పారు. కార్యక్రమంలో శిక్షణ పొందేవారితోపాటు ఎఫ్‌డీడీఐ ఫ్యాకల్టీ, అధికారులు, డీఆర్‌జెడ్, డీజీఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

డాక్టర్ శరత్ చంద్రమౌళికి ప్రతిష్టాత్మక ఫెలోషిప్

లండన్ రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ నుంచి గుర్తింపు



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో రుమటాలజిస్టుగా సేవలందిస్తున్న డాక్టర్ వీరవల్లి శరత్ చంద్రమౌళికి లండన్‌లోని ప్రతిష్టాత్మక రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ నుంచి ఫెలోషిప్ లభించింది. సుదీర్ఘకాలంగా వైద్య రంగంలో ఆయన చేస్తున్న సేవలకుగాను ఈ ఫెలోషిప్ లభించింది. డాక్టర్ శరత్ చంద్రమౌళి మాట్లాడుతూ 'ఈ గౌరవం వ్యక్తిగతంగా లభించిన గుర్తింపు మాత్రమే కాదు. నా ఈ ప్రయాణాన్ని రూపుదిద్దిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, స్నేహితులు, పేషెంట్లు.. వీరందరి సమైక్య కృషి ఫలితమే'అని అన్నారు. ఈ సమాజ సంక్షేమం, ఆరోగ్యం కోసం మరింత అర్థవంతంగా కృషి చేస్తానని పేర్కొన్నారు. లండన్‌లోని రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ ప్రెసిడెంట్ డాక్టర్ ముంతాజ్ పటేల్ ఈ సర్టిఫికెట్‌పై సంతకం చేశారు. వైద్య ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడం, రోగులకు అందే చికిత్సలను మరింత మెరుగుపరచడంలో ఆయన నిబద్ధత కారణంగా ఆయనకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రజారోగ్య కార్యక్రమాలు, వైద్య పరిశోధనల్లో నిరంతరం పాల్గొనడంతోపాటు దేశ, విదేశాల్లో కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సీఎంఈ) కార్యక్రమాలు నిర్వహించారు.

బాధ్యతలు స్వీకరించిన డిస్కం డైరెక్టర్లు



సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో ప్రస్తుతం చీఫ్ ఇంజనీర్ ఓ అండ్ ఎంగా పనిచేస్తున్న డాక్టర్ నలగండ్ల నరసింహులు ఆపరేషన్స్ విభాగం డైరెక్టర్‌గా, చీఫ్ ఇంజనీర్ ఐటీగా పని చేస్తున్న వట్టికొండ శివాజీ ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా, మెట్రోజోన్ సీఈగా పని చేస్తున్న చిలుకమర్రి చక్రపాణి కమర్షియల్ డైరెక్టర్‌గా, ఫైనాన్స్ సీజీఎంగా ఇటీవలే పదవీ విరమణ చేసిన పాల్వాయి కృష్ణారెడ్డిని ఫైనాన్స్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. వీరంతా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీఎండీ ముషారఫ్ ఫారూఖీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి అభినందనలు తెలిపిన సీఎండీ, సంస్థకు, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. డైరెక్టర్ల నియామకం ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమని, అనుభవం, అవగాహన ఉన్న వాళ్లకు ప్రాధాన్యత కల్పించడం అభినందనీయమని తెలంగాణ విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య అన్నారు. డైరెక్టర్లను కలిసి అభినందనలు తెలిపారు.

బీజేపీ ద్విముఖ వ్యూహం!

- జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ ఉపఎన్నిక, జీహెచ్ఎంసీ ఎన్నికలపై ఫోకస్
- ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రణాళిక
- కీలక నేతల మధ్య సమన్వయ లోపం.. శ్రేణుల్లో ఆందోళన

ఒక్కో నేత ఒక్కో పార్టీని లక్ష్యంగా చేసుకుని హాట్ కామెంట్స్



సాక్షి, సిటీ బ్యూరో: భాగ్యనగరంలో బీజేపీ దూకుడు పెంచుతోంది. సమీప భవిష్యత్తులో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక ఉండగా, ఆ వెంటనే జీహెచ్ఎంసీ ఎన్నికలు రానున్నాయి. ఈ రెండింటిలో వచ్చే ఫలితాలు వచ్చే శాసనసభ ఎన్నికలపై ప్రభావం చూపుతాయనే అంచనాతో ఆ పార్టీ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉపఎన్నికలో గెలవడంతోపాటు జీహెచ్ఎంసీ పీఠం దక్కించుకోవాలని బీజేపీ పావులు కదుపుతోంది. ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పనిచేస్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం సాధించడానికి మార్గం సుగుమం అవుతుందని గుర్తించిన పార్టీ పెద్దలు స్థానిక నేతలకు ఇప్పటికే దిశానిర్దేశం చేశారు. ఈ క్రమంలోనే ఎన్నికల ముందు ద్విముఖ వ్యూహం పాటిస్తోందని నేతలు పేర్కొంటున్నారు. పార్టీలో కొంతమంది నాయకులు అధికార కాంగ్రెస్‌ను లక్ష్యంగా చేసుకోగా, మరికొంత మంది గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై పదునైన విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఇదిగో ఆధారాలంటూ సాధారణ ప్రజలకు అర్థమయ్యేలా వివరించే ప్రయత్నం చేస్తున్నారు. కేంద్రంలో ముచ్చటగా మూడోసారి నరేంద్ర మోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తరువాత గత 11 ఏళ్లలో సాధించిన విజయాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు గల్లీగల్లీలో కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టికల్ 370 రద్దు, ఇటీవల జరిగిన ఆపరేషన్ సిందూర్, జాతీయ రహదారులు, డిజిటల్ చెల్లింపులు తదితర అంశాలను వివరిస్తున్నారు. సమీప భవిష్యత్తులో గ్రేటర్‌లో వార్డులవారీగా ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు సిద్ధమవుతున్నారు.

దూకుడు పెంచిన నేతలు..

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ నగరంలో కలియదిరుగుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాల అమలు తీరు నుంచి హైడ్రా కూల్చివేతల వరకు సమయం చిక్కినప్పుడల్లా ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. మురికివాడల్లో తన బలగాన్ని వేసుకుని పర్యటిస్తున్నారు. అయితే బీఆర్ఎస్ నేతలపై పెద్దగా స్పందించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మాత్రం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పాలనలో జరిగిన లోపాలను లక్ష్యంగా చేసుకున్నారు. ఇన్నాళ్లు పార్టీకి కంటిలో నలుసుగా కనిపించిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సైతం పార్టీ లైన్‌లోకి వచ్చినట్లేనని కార్యకర్తలు, నేతలు భావిస్తున్నారు. గతంలో రాజాసింగ్‌ను బండి సంజయ్ కలిసి సర్ది చెప్పారు. ఇటీవల సంజయ్ వ్యాఖ్యలను రాజాసింగ్ బలపరుస్తున్నారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సందర్భానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా పార్టీలో కీలక నేతల మధ్య అంతర్గత విభేదాలు ఆ పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

జూబ్లీహిల్స్‌పై గురి..

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి చెందడంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ పరిస్థితుల్లో అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉండేలా ఎన్నికల వ్యూహాన్ని మార్చుకోవాలని కమలనాథులు భావిస్తున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీని అప్రమత్తం చేశారు. దీంతో బీజేపీ సైతం ఎన్నికలకు సమాయత్తమవుతోంది.

మాదకద్రవ్యాల కేసులపై కఠినంగా ఉండాలి

– పోలీసులకు మంత్రి పొన్నం సూచన



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రులు, పోలీసులు ఉన్నతాధికారులు

ఖైరతాబాద్: 'నేను మాదకద్రవ్యాలపై జరుగుతున్న పోరాటంలో క్రియాశీల భాగస్వామిని అవుతాను. డ్రగ్స్ రహిత జీవనశైలిని అనుసరిస్తూ నాతోపాటు ఏ ఒక్కరూ డ్రగ్స్ బారిన పడకుండా ఉండటానికి కృషి చేస్తాను. డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ ప్రభుత్వ సంకల్పంలో భాగస్వామిని అవుతాను' అంటూ మంత్రులు, పోలీసు ఉన్నతాధికారులు, విద్యార్థులు, యువత ప్రతిజ్ఞ చేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవ సందర్భంగా జలవిహార్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణను నిషా ముక్తి తెలంగాణగా చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. మాదక ద్రవ్యాల కేసు వస్తే పోలీసులు కఠినంగా వ్యవహరించాలని మంత్రి సూచించారు. పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మాట్లాడుతూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలంటూ యాంటీ నార్కోటిక్ వింగ్ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో అవగాహన కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. నటుడు సిద్ధార్థ్ మాట్లాడుతూ స్కూళ్లు, కాలేజీలలో సరదాగా అలవాటయ్యే సిగరెట్, హుక్కా వంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ దుష్ప్రభావాలపై షార్ట్ ఫిల్మ్‌ను, పోస్టర్, సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించారు. అనంతరం అవగాహన వాక్ నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల ఐలయ్య, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, కార్పొరేషన్ చైర్మన్లు మెట్టు సాయికుమార్, వీరయ్య, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో చీఫ్ సందీప్ శాండిల్య, ఐఏఎస్ అధికారులు అనితా రామచంద్రన్, శైలజ, రాచకొండ సీపీ సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకాష్ విద్యార్థులకు అభినందన

సాక్షి, సిటీబ్యూరో: ఇటీవల నీట్, జేఈఈ పరీక్షల్లో రాణించిన ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ (ఏఈఎస్ఎల్) విద్యార్థులను బుధవారం క్రాస్‌రోడ్స్‌లోని ఆర్టీసీ కళ్యాణమండపంలో నిర్వహించిన విజయోత్సవ సభలో సన్మానించారు. ఈ సందర్భంగా సీఈఓ దీపక్ మెహ్రోత్రా మాట్లాడుతూ నీట్ టాప్ 10లో తమ విద్యార్థులు 5 ర్యాంకులు పొందారని, టాప్–100లో 35 మంది నిలిచారని, ఇది తమకు గర్వకారణమని అన్నారు. మరో 11 మంది రాష్ట్రాల్లో టాపర్లుగా నిలిచారని తెలిపారు. పరిస్థితులకు తగినట్లుగా విద్యార్థులు దృక్పథం అలవర్చుకోవడం వల్లే ఈ ఏడాది కూడా మంచి ర్యాంకులు సాధ్యమయ్యాయని అన్నారు. ఈ సందర్భంగా మంచి ర్యాంకులు దక్కించుకున్న విద్యార్థులు తమ కార్యాచరణను పంచుకున్నారు. కార్యక్రమంలో బిజినెస్ హెడ్ ధీరజ్ కుమార్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.



డీఆర్ఎం కార్యాలయం వద్ద లోకో పైలట్ల నిరసన



సికింద్రాబాద్ డీఆర్ఎం కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైల్వే లోకో పైలట్లు

అడ్డగుట్ట: వైద్య సదుపాయాల విషయంలో రైల్వే లోకో పైలట్లపై చిన్నచూపు తగదని ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్(ఏఐఎల్ఆర్ఎస్ఏ) డివిజన్ సెక్రటరీ ఆర్.ఎస్. శ్రీజిత్ అన్నారు. ఇటీవల లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే డెంగీ వ్యాధితో సీనియర్ ఏఎల్‌పీ మోనో కుమార్ మృతి చెందాడంటూ లోకో పైలట్లు ఆస్పత్రి ముందు ధర్నా చేసిన విషయం తెలిసిందే. ఐఎల్ఆర్ఎస్ఏ ఆధ్వర్యంలో బుధవారం సికింద్రాబాద్‌లోని డీఆర్ఎం కార్యాలయం ముందు మోనోకుమార్ సంతాప సభ నిర్వహించారు. శ్రీజిత్ మాట్లాడుతూ రైల్వే లోకో పైలట్లకు వైద్య సదుపాయాలు సరిగ్గా అందడం లేదని, తీవ్ర అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా కేవలం మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారే కానీ అడ్మిట్ చేసుకోవడం లేదని ఆరోపించారు. ఆరోగ్య సమస్యల కారణంగా వీఆర్ఎస్ తీసుకోవాలని నిర్ణయించుకున్న ఉద్యోగులకు కూడా వీఆర్ఎస్ ఇవ్వడం లేదని వాపోయారు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి లోకో పైలట్ల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ చైర్మన్ జిలానీ పాషా, కే. శ్రీనివాస్, జే.ఎస్. కృష్ణ, ఎం. పల్లయ్య, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ

– సీపీఎం సదస్సులో పలువురు వక్తలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా ప్రభుత్వాలు పాలన కొనసాగిస్తున్నాయని, ప్రధాని నరేంద్ర మోదీ స్టీరింగ్ కార్పొరేట్ శక్తుల చేతుల్లో ఉందని, ఎమర్జెన్సీ నాటి పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయని పలువురు వక్తలు అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో 'నాడు ప్రకటిత ఎమర్జెన్సీ– నేడు అప్రకటిత ఎమర్జెన్సీ– మన కర్తవ్యాలు'అనే అంశంపై ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర సమాచార కమిషన్ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్ మాట్లాడుతూ రాజ్యాంగం సూత్రాలను విస్మరించి నాడు ఎమర్జెన్సీని ప్రకటించారని, అప్పటి రాష్ట్రపతి బాధ్యతగా వ్యవహరించలేదని అన్నారు. కేబినెట్‌లో చర్చించకుండానే ఆగమేఘాల మీద ఎమర్జెన్సీని ప్రకటించారని పేర్కొన్నారు. నాడు ఎమర్జెన్సీని వ్యతిరేకించిన ఫోర్త్ ఎస్టేట్ నేడు రియల్ ఎస్టేట్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ 1960లో కాంగ్రెస్ పార్టీ గుత్తాధిపత్యానికి పెద్ద దెబ్బ తగిలిందని, 1970 నాటికి తీవ్ర సంక్షోభ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి దేశం ఉక్కిరిబిక్కిరి అవుతున్న నేపథ్యంలో వీటిని అధిగమించేందుకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని ప్రకటించారని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో ప్రాథమిక హక్కులన్నింటిని కాలరాశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశ్నించే వారి గొంతును నొక్కేశారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు టి. జ్యోతి, డీజీ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ డొనేషన్ బాక్స్

ఆ నిధులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూత



కలెక్టర్ హరిచందనను కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, మణిదీప్

సనత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనందించేలా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున కలెక్టర్ కార్యాలయంలో 'డొనేషన్ బాక్స్'ను ఏర్పాటు చేయాల్సిందిగా హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన సొసైటీ సభ్యులకు సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ భీంరెడ్డి, యూత్ కన్వీనర్ మణిదీప్ బుధవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పలు అంశాలపై చర్చించారు. ముఖ్యంగా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనందించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. డొనేషన్ బాక్స్‌కు వచ్చే నిధులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలన్నారు. బోనాల ఉత్సవాలు ప్రారంభమవుతున్న దృష్ట్యా ప్రధాన జాతరల నిర్వహణలో రెడ్‌క్రాస్ సొసైటీ వాలంటీర్లను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా సీనియర్ సిటిజన్స్, దివ్యాంగులకు సహాయం అందించే విధంగా చూడాలన్నారు. అనంతరం భీంరెడ్డి, మణిదీప్ మాట్లాడుతూ కలెక్టర్ సూచనల మేరకు బోనాల ఉత్సవాల్లో వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని చెప్పారు. డొనేషన్ బాక్స్‌ను ఏర్పాటు చేసి వాటి ద్వారా వచ్చే నిధులతో ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి, విద్యార్థులకు అవసరమైన సామగ్రిని అందించనున్నామని వివరించారు. అనుకోని విపత్తులు ఎదురైతే ప్రజలకు అండగా నిలబడేలా వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు.

బోనాల నిర్వహణకు రూ.20 కోట్లు: మంత్రి పొన్నం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో బోనాల నిర్వహణకు 2,783 దేవాలయాలకు ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు మంత్రి వివరించారు. బోనాల సందర్భంగా దేవాలయాల్లో ఊరేగింపు దశ గతంలో స్వాగతం, శోభయాత్ర, తొట్టెల ఊరేగింపు, పోతురాజుల వీరంగాలు , ఎదుర్కోలు, అమ్మవార్లకు బోనాల సమర్పణ, పట్టు వస్త్రాల సమర్పణ, కళా ప్రదర్శనలు కార్యక్రమాల నిర్వహణకు నిధులు వెచ్చించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.

హైదరాబాద్ కోర్ అర్బన్‌పై సమగ్ర ప్రణాళిక

- అసంపూర్తి పనులు త్వరగా పూర్తి చేయండి
- మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్‌పై సీఎం సమీక్ష



సాక్షి,సిటీ బ్యూరో: పెరుగుతున్న హైదరాబాద్ నగర జనాభా అవసరాలకు అనుగుణంగా రాబోయే 25 ఏళ్లను దృష్టిలో ఉంచుకొని అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌కు సంబంధించి ప్రత్యేకంగా సమగ్ర విధానాన్ని తయారు చేయాలని ఆదేశించారు. బుధవారం నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధి శాఖ అధికారులతో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల పురోగతికి సంబంధించిన వివరాలను అధికారులు వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న కోర్ అర్బన్ రీజియన్‌లో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రోడ్లు, మెట్రో కనెక్టివిటీ, ఎలివేటెడ్ కారిడార్లకు సంబంధించి పూర్తి ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో కొనసాగుతున్న తాగునీటి సరఫరా, సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్ పనుల్లో పరిస్థితిని అధికారులు వివరించారు. అసంపూర్తిగా ఉన్న పనులను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయాలని చెప్పారు.

శానిటేషన్‌లో నిర్లక్ష్యం వద్దు

నగరంలో పారిశుద్ధ్యం విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించరాదని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో డెంగీ, చికున్ గున్యా లాంటి సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, మున్సిపల్ కార్యదర్శి ఇలంబర్తి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఎఫ్‌సీడీఏ కమిషనర్ కె. శశాంక, వాటర్‌బోర్డు ఎండీ అశోక్ రెడ్డి, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హింసను ఎదుర్కొన్న మహిళలకు మద్దతు

సెర్ప్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి దివ్య దేవరాజన్



వర్క్‌షాప్‌నకు హాజరైన అతిథులు

సనత్‌నగర్: హింసాత్మక వాతావరణం నుంచి బయటపడిన మహిళలు జీవించేందుకు మద్దతు అవసరమని రాష్ట్ర గ్రామీణ దారిద్య్ర నిర్మూలన సంస్థ(సెర్ప్) ప్రధాన కార్యనిర్వాహక అధికారి దివ్య దేవరాజన్ అన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను ఎదుర్కోవడంలో సంస్థాగత యంత్రాంగాలను బలపరిచే లక్ష్యంగా కేరళ రాష్ట్రం కొచ్చికి చెందిన సెంటర్ ఫర్ పబ్లిక్ పాలసీ రీసెర్చ్ (సీపీపీఆర్) ఆధ్వర్యంలో బేగంపేట టూరిజం ప్లాజాలో రెండు రోజుల అంతర్జాతీయ వర్క్‌షాప్ బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన దివ్య దేవరాజన్ మాట్లాడుతూ వితంతువులకు ఇచ్చే పింఛన్ల మాదిరిగా ఈ మహిళలకు చేయూతనివ్వాలని అభిప్రాయపడ్డారు. హింసకు గురయ్యే అవకాశం ఉన్న గ్రామీణ ప్రాంతాలను దుర్బల మ్యాపింగ్ ద్వారా గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. భూమిక ఉమెన్స్ కలెక్టివ్ చీఫ్ ఫంక్షనరీ సత్యవతి కొండవీటి మాట్లాడుతూ సంస్థల మధ్య సమన్వయం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. అమెరికా కాన్సులేట్‌కు చెందిన పబ్లిక్ అఫైర్స్ ఆఫీసర్ అలెగ్జాండర్ మెక్‌లారెన్ మాట్లాడుతూ అందరికీ సురక్షితమైన, న్యాయమైన సమాజాన్ని సృష్టించేందుకు బలమైన చట్టం చేయాలని సూచించారు. సీపీపీఆర్ చైర్మన్ డాక్టర్ డి.ధన్‌రాజ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐదు రాష్ట్రాల్లో సీపీపీఆర్ అధ్యయనంలో భాగంగా వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని, వ్యవస్థాపిత లోపాలను గుర్తించి, ఆచరణ సాధ్యమైన విధాన సిఫారసులను రూపొందించడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూఎస్ఏ బ్యాటర్డ్ ఉమెన్స్ జస్టిస్ ప్రాజెక్ట్ చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ డాక్టర్ సుజాత వారియర్, సంగీత రేగే, సీనియర్ అర్బన్ డిజైన్ స్పెషలిస్ట్ రితీ మండల్, సైబర్‌క్రైమ్ డీసీపీ దార కవిత, తరుణి డైరెక్టర్ మమత రఘువీర్ ఆచంట తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల కేర్‌టేకర్లను విధుల్లోకి తీసుకోవాలి

ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో వక్తల డిమాండ్



ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న కేర్ టేకర్లు

కవాడిగూడ: తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల కేర్ టేకర్లు కదం తొక్కారు. రాష్ట్రం నలుమూలల నుంచి ధర్నాచౌక్‌కు తరలివచ్చారు. బుధవారం అసిస్టెంట్ కేర్ టేకర్ల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు , ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఎంఆర్‌పిఎస్ నగర అధ్యక్షుడు నరసింహారావు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ మాట్లాడారు. తొలగించిన అసిస్టెంట్ కేర్ టేకర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 20 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాలను ఊడగొడుతోందని విమర్శించారు. గురుకులాల సెక్రటరీ డాక్టర్ అలుగు వర్షిని ఎలాంటి కారణం లేకుండా 263 మంది అసిస్టెంట్ కేర్ టేకర్లను విధుల నుంచి అర్ధాంతరంగా తొలగించడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ ఎస్ దారిలోనే ముందుకు సాగుతోందని విమర్శించారు. అసిస్టెంట్ కేర్ టేకర్ల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పి.జయేందర్, ఉపాధ్యక్షులు నర్సింగరావు, నిరుపమ, ప్రధాన కార్యదర్శి, బి.కరుణాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం తమ కుటుంబాలపై ఆర్థిక దాడి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అసిస్టెంట్ కేర్ టేకర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాజు, ప్రచార కార్యదర్శి మల్లేష్, కార్యదర్శి కోశాధికారి బి.రాజు, మమత, ఉషారాణితో పాటు కేర్ టేకర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలకు ప్రభుత్వ ప్రోత్సాహం

– ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న భట్టి విక్రమార్క, పొన్నం తదితరులు

ఖైరతాబాద్: పెద్ద ఎత్తున ఉపాధి, ఆదాయాన్ని సృష్టించే కుటీర పరిశ్రమలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. బుధవారం సాగర తీరంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పక్కన హెచ్ఎండీఏ మైదానంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీసీ చేతివృత్తి కళాకారుల ఉత్పత్తుల ప్రదర్శన, స్టాల్స్‌ను డిప్యూటీ సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ చేతి వృత్తుల ఉత్పత్తులను ప్రోత్సహించి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ నెల 25 నుంచి 29 వరకు ఎగ్జిబిషన్ కొనసాగుతుందన్నారు. ఎగ్జిబిషన్‌లో నగరానికి చెందిన వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి కుటీర పరిశ్రమలకు సంబంధించిన ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందని ఈ ఎగ్జిబిషన్‌ను రాష్ట్ర ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. పర్యావరణానికి మేలు చేసే విధంగా ఏర్పాటు చేసిన మట్టి కుండలు, టీ గ్లాసులు, వాటర్ బాటిళ్లు..ఇలా ఎన్నో ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని చెప్పారు. బీసీ కార్పొరేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించిన రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారు చేసిన మట్టి పాత్రలు, మేదర వారు తయారు చేసిన సామగ్రి, పోచంపల్లి, గద్వాల, నారాయణపేట మొదలైన చేనేత ఉత్పత్తులు, నీరా ఉత్పత్తుల స్టాల్స్ ఉన్నాయి. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరితో పాటు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

టీబీ వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు

– హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి



సాక్షి,సిటీబ్యూరో: టీబీ వ్యాధి నివారణకు పటిష్ట చర్యలు చేపట్టి హైదరాబాద్‌ను టీబీ రహిత జిల్లాగా మార్చాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి వైద్యాధికారులను ఆదేశించారు. ఈ నెల 26 నుంచి 100 రోజులపాటు మూడు వేల ఎక్స్ రే స్క్రీనింగ్‌లు చేపట్టి వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో టీబీ వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. టీబీ ప్రాణాంతకమైన వ్యాధి కాదని, చికిత్స ద్వారా నయమయ్యే వ్యాధి అని అన్నారు. వ్యాధిగ్రస్తులకు మంచి పోషకాహారం అందించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఆరోగ్యశ్రీ, పీహెచ్‌సీలు, బస్తీ దావాఖానాలు, అన్ని ఆరోగ్య శిబిరాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆమె సూచించారు. వర్షాకాలం కావడంతో డెంగీ, మలేరియా, ఇతర వ్యాధుల నివారణకు అన్ని ఆసుపత్రుల్లో మందులు నిల్వ ఉంచాలని, వైద్యాధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్‌బీఎస్‌కే వాహనాల ద్వారా టీబీ పేషెంట్లకు అవగాహన కల్పించాలని, ఆరోగ్యశ్రీ ఎంప్యానల్‌మెంట్ ఉన్న ఆసుపత్రులలో ఎక్స్‌రే స్క్రీనింగ్ చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ చర్ల దేవి, డీసీహెచ్ఎస్ సూర్య సాయి, వివిధ వైద్యశాలల వైద్యాధికారులు, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల పర్యవేక్షులు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, గురువారం, 26, జూన్, 2025



కార్పొరేట్.. చారిటీ..

సాక్షి, సిటీబ్యూరో: ఏఐ–ఆధారిత మోడరన్ క్వాలిటీ ఇంజనీరింగ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సొల్యూషన్స్‌కు పేరొందిన క్వాలిజీల్, నగరంలో నిరుపేద విద్యార్థులకు చేయూత అందించింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్)లో భాగంగా ప్రముఖ ఎన్జీఓ నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆవరణలో ఈ చారిటీ కార్యక్రమాన్ని నిర్వహించింది. సెలవుల అనంతరం స్కూల్స్ పునఃప్రారంభమైన నేపథ్యంలో పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులు, స్టేషనరీ వంటి పాఠశాల సామాగ్రిని కలిగి ఉన్న బ్యాక్–టు–క్లాస్‌రూమ్ కిట్‌లను పంపిణీ చేసింది. అంతేకాకుండా యువతకు ల్యాప్‌టాప్‌లు కూడా అందజేసింది. కార్యక్రమంలో క్వాలిజీల్ సహ వ్యవస్థాపకురాలు కోటేబిపిల్లి చీఫ్ పీపుల్ ఆఫీసర్ హిమశ్రీ రఘుముద్రి తదితరులు పాల్గొన్నారు.

సిటీలో.. శ్రీలంక రోడ్ షో


వచ్చేనెల 1న..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పర్యాటక ప్రేమికులకు శ్రీలంక ఒక సందర్శనీయ స్థలంగా మారిన నేపథ్యంలో నగరంలో రోడ్ షోస్, నెట్ వర్కింగ్ సెషన్స్ నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. మేనెల 31వ తేదీ వరకు, శ్రీలంకకు 10,29,803 మంది పర్యాటకులు రాగా అందులో 2,04,060 మంది భారతదేశం నుంచే వచ్చారని, మొత్తం పర్యాటకుల్లో 20శాతం మంది భారత్‌కు చెందిన వారేనని వివరించారు. ఈ నేపథ్యంలో చెన్నైలోని శ్రీలంక డిప్యూటీ హైకమిషన్ సహకారంతో బంజారా హిల్స్‌లోని తాజ్‌కృష్ణా హోటల్ వేదికగా ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

చిరుజల్లులలో ఏదైనా వేడి వేడి ఫుడ్ ఉంటే.. దానికి తోడు కమ్మటి వాసనతో హాట్ కాఫీ సిప్ చేస్తుంటే.. ఆ హాయి మరోలా ఉంటుంది. ఇలాంటి అనుభూతులు నగరవాసులకు ఎన్నెన్నో.. సిటీలో చినుకులు పడుతుంటే చాలు జనం ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్‌లపై సందడి చేస్తుంటారు. చల్లటి వాతావరణాన్ని ఆస్వాదిస్తారు. అయితే ఈ మాన్‌సూన్ సీజన్‌లో ఆరోగ్యం, హైజీన్, డిజిటల్ టూల్స్ వంటి అంశాలను సైతం సమానంగా పరిగణనలోకి తీసుకుంటున్నారు నగరవాసులు. ఎందుకంటే ఈ కాలంలో వైరల్ ఇన్‌ఫెక్షన్లు, నీటి కాలుష్యం, వాతావరణ మార్పులతో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందుకే వర్షాకాలాన్ని సురక్షితంగా, అందంగా అనుభవించడానికి కొన్ని లైఫ్‌స్టైల్ హ్యాక్స్, గాడ్జెట్స్, యాప్స్ సైతం అందుబాటులో ఉన్నాయి.

- సాక్షి, సిటీబ్యూరో

చినుకుల్లో హాయి.. జాగ్రత్తలు అవసరమోయి..



చిరుజల్లులలో హాట్ కాఫీతో పాటు కొన్ని జాగ్రత్తలు

- ★ సీజనల్ రక్షణగా లైఫ్‌స్టైల్ హ్యాక్స్, గాడ్జెట్స్
- ★ అధునాతనంగా హైజీన్, డిజిటల్ టూల్స్
- ★ నగర జీవనశైలికి అధునాతన సంరక్షణ అవసరమంటున్న నిపుణులు
- ★ మోడ్రన్ హ్యాబిట్స్.. హెల్త్‌వేర్‌తో మాన్సూన్



వర్షాకాలం అనేది సహజంగా ఆనందాన్ని కలిగించేది. కానీ అదే సమయంలో కొంత జాగ్రత్త అవసరం. ఆరోగ్యాన్ని, గాడ్జెట్‌లను, ఇంటిని, ఫ్యాషన్‌ను సమానంగా వాడుకుంటే ఈ సీజన్‌ను ఎంతో ప్రయోజనకరంగా మార్చుకోవచ్చు. మోడ్రన్ లైఫ్‌స్టైల్‌లో టెక్నాలజీ సహకారంతో వర్షాకాలాన్ని మరింత ఆహ్లాదకరంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నారు ఈ తరం. ఈ వానల్లో మీరు తీసుకునే జాగ్రత్తలు మీరు పొందే ఆనందానికి బలం అవుతాయి.

వర్షాకాలం హెల్త్‌కేర్ టిప్స్..

వానల సమయంలో నీటి కాలుష్యం, ఆహారంలోని బ్యాక్టీరియా వల్ల జ్వరాలు, డైజెస్టివ్ సమస్యలు, స్కిన్ ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ. ఈ సీజన్‌లో ఇంట్లోనే వంట చేసుకోవడం, వేడి నీళ్ల తాగడం, తులసి టీ, అల్లం–పెప్పర్ సూప్ వంటి బూస్టింగ్ ఫుడ్స్ తీసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



ఫ్యాషన్‌తో పాటు ఫంక్షనాలిటీ..

వర్షాకాలం అంటే మడమ తొక్కినట్లుగా బురద, తడిగా మారే దుస్తులు.. కానీ ఇప్పుడు మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వాటర్ రిపెలెంట్ ఫ్యాబ్రిక్స్, సిలికాన్ షూ కవర్స్, ఫోల్డబుల్ రైనిక్స్ లాంటి ఉత్పత్తులతో స్టైలిష్‌గా ఉండటమే కాకుండా తడిసిపోకుండా ఉండొచ్చు.

- ట్రెండీ అంబ్రెల్లాస్: యాక్టివ్ కలర్స్, ఓపెన్–క్లోజ్ మెకానిజంతో అందంగా ఉండే మోడల్స్ అందుబాటులో ఉన్నాయి.
- వాటర్‌ప్రూఫ్ బ్యాక్‌ప్యాక్స్: టెక్ లవర్స్ కోసం వర్షంలో కూడా ల్యాప్‌టాప్, గ్యాడ్జెట్లు భద్రంగా తీసుకెళ్లేందుకు ఉపయోగకరం.
- వాటర్‌ప్రూఫ్ ఫోన్ కవర్లు: ముఖ్యంగా రోడ్ల మీద లేదా బైక్ ప్రయాణాల్లో తప్పనిసరి.

హెల్త్ మానిటరింగ్ యాప్‌లు, గాడ్జెట్స్..

- ఫిట్ బిట్, ఎమ్ఐ బ్యాండ్ వంటి వేరబుల్స్ ద్వారా వాకింగ్ ట్రాక్ చేయవచ్చు.
- హెల్తీ ఫై మీ వంటి డైట్ యాప్‌లు మంచి ఆహార నియమాలు పాటించేందుకు దోహదపడుతున్నాయి.
- ప్రాక్టో, టాటా 1 ఎంజీ వంటి యాప్‌ల ద్వారా ఇంట్లో నుంచే డాక్టర్ కన్సల్టేషన్ పొందవచ్చు.

వర్షంలో ఇంటిని కాపాడండి


- దోర్ మ్యాట్స్, షూ స్టాండ్స్: వర్షపు నీళ్ల ఇంట్లోకి రాకుండా అడ్డుకునేందుకు..
- డీహ్యూమిడిఫైయర్స్: గదుల్లో తడిగా మారే వాతావరణం, మబ్బును నివారించేందుకు ఉపయోగపడతాయి.
- ఆరోమా డిఫ్యూజర్లు: తడి వాసనను తొలగించి ఫ్రెష్‌నెస్ కలిగించేందుకు ఉపయోగకరంగా ఉంటుంది.



టెక్నాలజీతో వర్షాన్ని అనుభవించండి..

వర్షాలు ఎప్పుడు వస్తాయో, ఎక్కడ ట్రాఫిక్ జామ్ ఉంటుందో ముందే తెలిసిపోతే బాగుంటుందనే మాట వాస్తవమే. ఈ విషయంలో కొన్ని యాప్స్‌తో పాటు ప్రయాణించవచ్చు.

- ఆక్యూ వెదర్, స్కైమెట్ వెదర్, లైవ్ రడార్‌తో వర్ష సూచన.
- గూగుల్ మ్యాప్స్, మై గేట్‌ల టెక్నాలజీతో ట్రాఫిక్ అప్డేట్స్, లోకేషన్ ఆధారిత అలర్ట్స్.
- స్పాటీ ఫై, పాకెట్ ఎఫ్ఎఫ్: వానలో ఒంటరిగా ప్రయాణిస్తున్నప్పుడు, లేదా ఇంట్లో కూర్చుని విండో వెనుకగా జల్లులు చూస్తున్నప్పుడు మంచి ఎంటర్‌టైన్‌మెంట్.






విందుగా మార్చే చిట్కాలు

- వీకెండ్ విత్ రైన్ థీమ్: ఇంట్లో ఫ్రెండ్స్‌తో టీవీకి దగ్గరగా బీన్స్ బ్యాగ్స్, మసాలా టీ, బజ్జీలు.. ఇదే అసలైన హ్యాపీనెస్.
- రెయిన్ ఫ్రేమ్స్ ఫొటోగ్రఫీ: వర్షపు నీటి బిందువులు, బల్కనీ పూల మధ్య సెల్ఫీలు.. సోషల్ మీడియాకు మరిచిపోలేని అనుభూతులు.
- రెయిన్ ఫ్రెండ్లీ రైడ్స్: వర్షంలో బైక్ రైడ్స్, సైక్లింగ్ ట్రిప్స్ వంటి గ్రూప్ యాక్టివిటీస్ ద్వారా వర్షాన్ని మరింత ఆస్వాదించవచ్చు.

అతడు మలిచిన శిల్పాలు జీవం పోసుకున్నాయా అన్నట్లు కనిపిస్తాయి.. కాస్త దూరం నుంచి చూస్తే అరె అక్కడ ఎవరో ఉన్నారు అనే భావన కలుగుతుంది. చేతితో తాకి చూస్తే తప్ప శిల్పం అని తెలుసుకోలేం.. మనతో లేని వారు మనమధ్యే ఉన్న ఫీలింగ్ కలుగుతుంది. శిల్పం తయారు చేస్తున్నంత సేపు అతడు తపస్సులో ఉన్నాడా అనిపిస్తుంటుంది. అతడి పేరే రాజేష్.. - విజయనగర్‌కాలనీ



శిల్పం జీవం ఉట్టిపడేలా..

శిల్పి రాజేష్

నగరంలో పుట్టిపెరిగిన అతడు 1993లో మాసబ్ ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో చదివాడు. ఆ సమయం నుంచే విగ్రహాలు తయారు చేయడం ప్రారంభించాడు. 2021లో అతడు రూపొందించిన సాయిబాబా విగ్రహాన్ని మహారాష్ట్రలోని షిరిడీ సంస్థాన్‌కు అందజేయగా అక్కడ ధ్యాన మందిరంలో ఆ శిల్పాన్ని ఏర్పాటు చేశారు. ఈ సజీవ శిల్పాన్ని చూసి అబ్బురపడ్డ పలువురు మరో ఐదు విగ్రహాలు తయారు చేయాలని ఆర్డర్ ఇవ్వగా ఆయన మొదటి వారంలోనే విగ్రహాలను తయారు చేసి షిరిడీ సంస్థాన్‌కు అందజేశారు. అతడి చేతులమీదుగా దివంగత జి.పుల్లారెడ్డి దంపతులు, ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి పద్మశ్రీ శోభానాయుడు, మైకెల్ జాక్సన్, రాఘవేంద్రస్వామి, చంద్రశేఖర సరస్వతిజీ, సంత్‌సేవాలాల్ విగ్రహాలతో పాటు ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాలు రూపుదిద్దుకున్నాయి. తెలంగాణ రాష్ట్ర టూరిజం, హెచ్ఎండీఏ, జీహెచ్ఎం తదితర సంస్థలకు రాజేష్ ప్రస్తుతం పెయింటింగ్, శిల్పాలు వారి ఆర్డర్ మేరకు తయారు చేసి ఇస్తున్నారు.

విద్యార్థులు మెచ్చిన ఆహారం

- హోమ్ స్టైల్ ఫుడ్, వీగన్ ఫుడ్
- విద్యార్థుల్లో కనపడిన ఆరోగ్య స్పృహ
- అయినా బిర్యానీ, బర్గర్స్‌దే హవా..
- స్విగ్గీ 'ఫుడ్ ఆన్ ట్రైన్' డేటా వెల్లడి

సాక్షి, సిటీబ్యూరో: వేసవి సెలవులను పురస్కరించుకుని విద్యార్థులకు రైలులోకి ఆహారం అందించే వినూత్న తరహా ఫుడ్ ఆన్ ట్రైన్‌ని అందుబాటులోకి తెచ్చిన ప్రముఖ ఫుడ్ డెలివరీ యాప్.. స్విగ్గీ వేసవి సెలవులు ముగిసిన నేపథ్యంలో ఈ ఆఫర్‌ను విద్యార్థులు ఉపయోగించుకున్న తీరుపై, తమ అధ్యయన ఫలితాలను విడుదల చేసింది. స్విగ్గీ లిమిటెడ్ వెల్లడించిన ప్రకారం..



వెరైటీ వంటకాలకు ఓటు..

విద్యార్థులు ఆర్డర్ చేసిన ఆహార పదార్థాల్లో బిర్యానీ, బర్గర్స్, పనీర్ టిక్కా క్యూసాడిల్లా, స్పాగెట్టి, అగ్లియో ఒలియో వంటి ఇటాలియన్, అరబిక్, మెడిటేరియన్ ఫుడ్, కింగ్ ఫిష్ తవా ఫ్రై, చికెన్ కాషాభునా వంటి సీఫుడ్ టాప్ ప్లేస్‌లో ఉన్నాయి. ఆరోగ్య స్పృహ కలిగిన పలువురు విద్యార్థులు, ఆరోగ్యకరమైన పాత్రలు, హోమ్‌స్టైల్ భోజనాల కోసం ది గుడ్ బౌల్ లంచ్‌బాక్స్‌లతో పాటు వీగన్ స్టైల్ వంటకాలను కోరుకున్నారు. బ్రాండెడ్ ఫుడ్ కోసం మెక్‌డొనాల్డ్స్, కేఎఫ్‌సీ, సబ్‌వే, పిజ్జాహట్ నుంచి ఎంచుకున్నారు.

ఇంజనీరింగ్ విద్యార్థులే ఎక్కువ..

ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, కోల్‌కతా వంటి నగరాలకు రాకపోకలు సాగించే విద్యార్థులు అత్యధికంగా నాగ్‌పూర్ స్టేషన్‌లో ఫుడ్ డెలివరీ చేయించుకున్నారు. రైళ్లలో ఆహారం కోసం దాదాపు 70శాతం ఆర్డర్‌లతో ఇంజనీరింగ్ విద్యార్థులు ఈ ఫుడ్ ఆన్ ట్రైన్ వినియోగించుకుని జాబితాలో అగ్రస్థానంలో ఉన్నారు. ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ బీహెచ్‌యూ వారణాసి వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలకు చెందిన విద్యార్థులు ముందున్నారు. రైళ్లలో ఆర్డర్ చేసేటప్పుడు విద్యార్థులు సమయపాలన పాటించలేదు. ఉదయం 7 గంటలకు అల్పాహారం నుంచి రాత్రి 11 గంటలకు లేట్‌నైట్ స్నాక్స్, డెజర్ట్ దాకా విద్యార్థులు రొటీన్‌కు భిన్నంగా ఆర్డర్లు చేశారు.

క్లుప్తంగా...

టీడీపీ సీనియర్ నేత సుగవాసి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సుగవాసి బాలసుబ్రహ్మణ్యం

సాక్షి, అమరావతి: టీడీపీ సీనియర్ నేత సుగవాసి బాలసుబ్రహ్మణ్యం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయనకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దివంగత టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు పెద్ద కుమారుడు సుబ్రహ్మణ్యం. నాలుగు దశాబ్దాలుగా టీడీపీలో కొనసాగిన సుగవాసి కుటుంబం.. టీడీపీలో జరుగుతున్న అవమానాలు తట్టుకోలేక ఆ పార్టీని వీడి వైఎస్ జగన్ వెంట నడవాలని నిర్ణయించుకుంది.

శుభాన్షు శుక్లా దేశానికి గర్వకారణం

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: భారత వైమానిక దళానికి చెందిన గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా యాక్సియం మిషన్-4లో భాగంగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయల్దేరడంపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్తున్న తొలి ఇస్రో వ్యోమగామి కావడం భారతదేశానికి గర్వకారణమని కొనియాడారు. శుక్లా సహా ఆయన బృందం సురక్షితమైన ప్రయాణం సాగించాలని, ఈ మిషన్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ బుధవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు.

మిమ్మల్ని చూసి భారత్ గర్విస్తోంది

శుభాన్షు శుక్లాకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అభినందన

సాక్షి, న్యూఢిల్లీ: అంతరిక్షంలోకి అడుగుపెట్టిన శుభాన్షు శుక్లాకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. 41 ఏళ్ల క్రితం రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి అడుగుపెడుతున్న రెండో భారతీయుడిగా, ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌కు వెళ్తున్న తొలి భారతీయుడిగా శుభాన్షు ప్రయాణం ప్రతి భారతీయుడికీ గర్వకారణమని పేర్కొన్నారు.

ప్రజల సొమ్మును దుబారా చేస్తున్నారు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద



సాక్షి, హైదరాబాద్: ఖజానా ఖాళీ అంటూ.. ఉద్యోగులకు బెనిఫిట్స్, ప్రాజెక్టులకు నిధులు ఇవ్వలేమని చేతులెత్తేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల సొమ్మును దుబారా చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. ముఖ్యమంత్రి సొంత వారికి ప్రభుత్వ సొమ్మును దోచి పెడుతున్నారని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్‌కు ప్రభుత్వం రూ.200 కోట్లను ఖర్చు చేసిందన్నారు. రాహుల్ గాంధీ హాజరైన కార్యక్రమానికి ప్రభుత్వ నిధులు ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మిస్ వరల్డ్ పోటీల్లో ఒక్కో ప్లేట్ భోజనానికి రూ.లక్ష ఖర్చు చేసి, అందాల పోటీలతో రాష్ట్రానికి అపఖ్యాతి తెచ్చారన్నారు. కలెక్టరేట్లలో కొత్తగా తెలంగాణ తల్లి విగ్రహాలను పెట్టడం ప్రభుత్వ ధనాన్ని దుబారా చేయడంతో పాటు తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని ఆయన విమర్శించారు. ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం మొదలుకాకమునుపే అందులో పిల్లలు చదువుతున్నట్లు అడ్వర్టయిజ్‌మెంట్లు ఇస్తున్నారన్నారు.

పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయాలి

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్... ఈనెల 27న ఇందిరాపార్కు వద్ద ధర్నా

సాక్షి, హైదరాబాద్: నియోజకవర్గానికి ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగంలో ఉన్న 30 వేల పాఠశాలలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ విద్యను విధ్వంసం చేసే విధానాలను ప్రతిఘటించాలని కోరుతూ ఈనెల 27న ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నామని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రధరరావు, హరగోపాల్ తెలిపారు. విద్యకు కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం కేటాయించాలని కోరారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లోనే ప్రమాణాలు గల పూర్వ విద్య బోధించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు ఉత్తర్వులను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఏర్పడిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలకు బదులు రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలను, అన్ని పాలిటెక్నిక్ కాలేజీలు, ఐటీలను సమగ్రంగా అభివృద్ధి చేసి తెలంగాణ యువతకు ఉద్యోగాలు వచ్చే నైపుణ్యాలను నేర్పించాలని కోరారు.

ఇంటింటికీ వంచన

- 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ'పై గ్రామ గ్రామాన, ఇంటింటా ప్రచారం
- 'చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ..' పేరుతో 5 వారాల బృహత్తర కార్యక్రమం
- పార్టీ శ్రేణులకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పిలుపు



'చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ' కార్యక్రమం క్యూఆర్ కోడ్‌ను చూపిస్తున్న వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు.. ఇంటింటికీ ఆ హామీలను అమలు చేస్తానంటూ సంతకాలతో పంపించిన బాండ్లు గుర్తు చేస్తూ.. వాటిని ఏ మాత్రం అమలు చేయని చంద్రబాబు మోసాన్ని ప్రజల్లో ఎండగడుతూ.. దాని వల్ల ప్రతి కుటుంబం ఎంతెంత నష్టపోయింది? ఇంకా ఎంత నష్టపోతోంది? అన్న విషయాలపై అందరికీ అవగాహన కల్పించేలా 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో'(చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ..) పేరుతో ఐదు వారాల బృహత్తర కార్యక్రమాన్ని నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ అధ్యక్షతన పార్టీ విస్తృత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్లమెంటు నియోజకవర్గాల పరిశీలకులు, పార్టీ జిల్లా అధ్యక్షులతోపాటు పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు. 'చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ'కార్యక్రమానికి సంబంధించి సమావేశంలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించి.. రాష్ట్రంలో ఇంటింటికీ దాన్ని చేర్చే కార్యక్రమాన్ని వైఎస్ జగన్ ప్రారంభించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు.. జరుగుతున్న పరిణామాలపై విస్తృతంగా చర్చించి, పార్టీని మరింతగా బలోపేతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ నేతలకు మార్గ నిర్దేశం చేశారు.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయగలరు

చంద్రబాబు పచ్చి మోసాలు ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయగానే.. ప్రజాగళం.. సూపర్‌సిక్స్, సూపర్ సెవెన్ హామీలు వస్తాయి. చంద్రబాబు చేసిన దగా, పచ్చి మోసం వివరాలు కూడా వస్తాయి. గత ఏడాది ఇవ్వకుండా ఎగ్గొట్టింది ఎంత? ఇక ఈ ఏడాది రావాల్సిన మొత్తం ఎంత? అనేది కూడా తెలుస్తుంది. అన్ని పథకాల ద్వారా ఆ ఇంటికి (పథకాల వారీగా) నెలకు ఎంతెంత చొప్పున, ఏడాదికి ఎంత వస్తుంది.. అలా ఐదేళ్లలో ఆ ఇంటికి మొత్తం ఎంత నగదు అందుతుంది.. అని చెబుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ సంతకాలు చేసి మరీ ప్రతి ఇంటికి బాండ్ పంపారు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, ఆ వివరాలన్నీ తీసి రెడీగా పెట్టుకోండి. మీ ఇంటికి టీడీపీ నాయకులు రాగానే గత ఏడాది బాకీ, ఈ ఏడాది ఇవ్వాల్సింది ఎప్పుడిస్తారని నిలదీయండి.

ఏడాది గడిచింది. హనీమూన్ పీరియడ్ ముగిసింది. ఇక నుంచి యుద్ధం చేయాల్సిందే. కాబట్టి అందరినీ కలుపుకుపోవాలి. ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజా సమస్యలు తెలుసుకోవాలి. వాటిపై పోరాడాలి. ఇది ఎమ్మెల్యే అభ్యర్థులకు చాలా కీలకం. అప్పుడే మనం సత్తా చూపగలం. ఎందుకంటే ఇది రాక్షస రాజ్యం. ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదు. కలెక్టర్ల దగ్గరకు పోయినా, ప్రయోజనం ఉండడం లేదు. కాబట్టి, మనం ప్రతి చోటా, ప్రతి క్షణం ప్రజలతో కలిసి వారి కోసం పని చేయాలి.

\- వైఎస్ జగన్

లాసెట్‌లో 30,311 మంది ఉత్తీర్ణత

ఫలితాలు వెల్లడించిన ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి



ఫలితాలు విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: న్యాయవిద్య కోర్సుల్లో ప్రవేశానికి ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీ లాసెట్)లో 30,311 (66.46 శాతం) అర్హత సాధించారు. మూడేళ్లు, ఐదేళ్లు, పీజీ లాసెట్‌కు మొత్తం 57,715 మంది దరఖాస్తు చేయగా, 45,609 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 30,311 మంది అర్హత సాధించారు. లాసెట్ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి బుధవారం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండలి వైస్‌చైర్మన్లు ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కే.మహమ్మూద్, మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్, సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి.విజయలక్ష్మి, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ తదితరులు పాల్గొన్నారు. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 82.19 శాతం ఉత్తీర్ణత సాధించగా, నిజామాబాద్ 59.24 శాతంతో ఆఖరి స్థానంలో ఉందని బాలకిష్టారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో అన్ని కోర్సులకు కలిపి 31 కాలేజీలున్నాయని, ఇందులో 8,680 సీట్లు ఉన్నాయన్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే...



బోథ్: తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే తాను ఐదేళ్ల లా కోర్సులో టాప్ ర్యాంకు సాధించినట్టు ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రానికి చెందిన రుతిక తెలిపారు. లా చదవాలనే ఆకాంక్షతోనే సీరియస్‌గా ప్రిపేర్ అయ్యానని చెప్పారు.

సివిల్స్ టార్గెట్



సిద్దిపేటజోన్: మూడేళ్ల లా కోర్సులో మూడో ర్యాంకు సాధించిన సిద్దిపేటకు చెందిన మాడుగుల శిరీష్ శర్మ సివిల్స్ సాధించడమే తన టార్గెట్ అని చెప్పారు. బీటెక్ పూర్తిన చేసిన శిరీష్ ఉద్యోగ ప్రయత్నాల్లోనే భాగంగానే లాసెట్ రాశాడు. ఆయన తండ్రి సిద్దిపేట రూరల్ ఎంపీడీఓగా పనిచేస్తున్నారు.

ఆయా విభాగాల్లో టాపర్ల వివరాలు

విద్యార్థి పేరు	జిల్లా	మార్కులు
మూడేళ్ల లా కోర్సు		
హర్షవర్ధన్‌రాజు.కె	కోనసీమ (ఏపీ)	97
శ్రీరాం బొడ్డు	హైదరాబాద్	93
మడుగుల్ల శిరీష్‌శర్మ	సిద్దిపేట	90
ఐదేళ్ల లా కోర్సు		
ఇ.రుతిక	ఆదిలాబాద్	85
భల్లా గోపేశ్ రాంసాయి	సంగారెడ్డి	84
జొహనాజ్	హైదరాబాద్	82
పీజీ లా కోర్సు		
లుక్కా హిమజ	హైదరాబాద్	74
మహ్మద్ అనదుల్లా షరీఫ్	జనగాం	71

విభాగాల వారీగా ఉత్తీర్ణత ఇలా...

విభాగం	దరఖాస్తు చేసింది	పరీక్ష రాసింది	అర్హులు	శాతం
మూడేళ్ల లా కోర్సు	41,210	32,118	21,715	67.61
ఐదేళ్ల లా కోర్సు	11,695	9,325	4,833	51.83
పీజీ లా కోర్సు	4,810	4,166	3,763	90.33

పీఎస్‌యూల భూములు అమ్మేస్తారా?

బీజేపీ ఎంపీ లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన భూములను వెనక్కి ఇవ్వాలని అడుగుతున్న తెలంగాణ సర్కార్ వాటిని అమ్మాలనుకుంటోందా? అని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. ముందుగా రాష్ట్రంలో భూముల అమ్మకాన్ని ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. తెలంగాణలో భూముల అమ్మకాన్ని అడ్డుకుని తీరుతామని స్పష్టం చేశారు. లక్ష్మణ్ బుధవారం ఢిల్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చోద్యం చూస్తోందని దుయ్యబట్టారు. హైకోర్టు తీర్పు మేరకు స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పడం బీసీలను మోసం చేయడమేనని ఆరోపించారు. 42 శాతం రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపితే పరిశీలిస్తుందని చెప్పారు. తాను బీజేపీ రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న సమయంలో ఫోన్ ట్యాపింగ్ జరిగి ఉండవచ్చని, అయితే.. ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదని లక్ష్మణ్ వెల్లడించారు.

కొత్తగా అదనపు కమిషనర్ పోస్టు

సాక్షి, హైదరాబాద్: పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో కొత్తగా అదనపు కమిషనర్ పోస్టును ఏర్పాటుచేస్తూ ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర విభజనకు ముందు కమిషనర్ కార్యాలయంలో అదనపు కమిషనర్ పోస్టు ఉండేదని, విభజన సమయంలో ఆ పోస్టు కాస్తా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లడంతో.. ఆ పోస్టు ఇక్కడ రద్దు అయింది. అయితే కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన ప్రతిపాదన మేరకు ఈ పోస్టును మంజూరు చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌లో దెయ్యాలు.. కాంగ్రెస్‌లో దేవతలు

మీరు ఏ బీసీని, ఏ ఎస్సీని అందలమెక్కించారు?

- కవితకు ఆర్.కృష్ణయ్య కితాబు ఇవ్వడం ఏంటి?
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



మాట్లాడుతున్న మహేశ్‌గౌడ్. చిత్రంలో జనక్‌ప్రసాద్, అనిల్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీలో దెయ్యాలుంటే.. కాంగ్రెస్ పార్టీలో దేవతలున్నారని, అందుకే 18 నెలలుగా రాష్ట్రంలో స్వర్ణయుగంలాంటి పాలన జరుగుతోందని, అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. పదేళ్ల పాటు ప్రజలను మోసం చేసి దోపిడీ చేయడం మినహా బీఆర్ఎస్ నేతలు రాష్ట్రానికి చేసిందేమీ లేదని ఆరోపించారు. ఈ పదేళ్లలో వారు చేసింది ఫోన్ ట్యాపింగ్ మాత్రమేనని ఎద్దేవా చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్పొరేషన్ల చైర్మన్లు ఈరవత్రి అనిల్, జనక్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగౌడ్, కోట్ల శ్రీనివాస్, అక్బర్‌లతో కలిసి మాట్లాడారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏ బీసీ నాయకుడిని, ఏ ఎస్సీ నాయకుడిని అందలమెక్కించారో చెప్పాలని బీఆర్ఎస్‌ను డిమాండ్ చేశారు. బీసీల గురించి గతంలో ఎన్నడూ మాట్లాడని ఎమ్మెల్సీ కవిత ఇప్పుడు ఏదో మాట్లాడుతున్నారని, ఆమెకు బీసీ ఉద్యమ నేత ఆర్.కృష్ణయ్య కితాబివ్వడం ఏంటని ప్రశ్నించారు. కృష్ణయ్య అంటే తమకు ఎంతో గౌరవం ఉందని, కానీ బీసీల గురించి గొంతెత్తని కవితకు కితాబివ్వడం సరైంది కాదన్నారు. బనకచర్ల విషయంలో కాంగ్రెస్ రాజీపడే ప్రసక్తే లేదని, ఆ ప్రాజెక్టును కట్టనివ్వబోమని చెప్పారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కల్పించే అంశంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేదంటే న్యాయపరమైన చర్యలకు వెళ్లాలా? పార్టీ పరంగా ఏం చేయాలన్న దానిపై లోతుగా చర్చించి నిర్ణయం తీసుకుంటామని, 42 శాతం రిజర్వేషన్లకు మాత్రం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని చెప్పారు.

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పోటీ చేయడం కాదు మేం గెలవడమూ ఖాయమే

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని మహేశ్‌గౌడ్ స్పష్టం చేశారు. 'ఎమ్మెల్యేలుగా ఉండి చనిపోతే వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించే ఆనవాయితీ గతంలో దివంగత వైఎస్సార్ హయాంలో ఉండేది. కానీ ఆ ఆనవాయితీని కేసీఆర్ తెంపేశారు. నారాయణఖేడ్ ఉప ఎన్నికను ఏకగ్రీవం చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరినా, వినకుండా విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసి గెలిచారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ పోటీ చేయడం ఖాయం. గెలవడమూ ఖాయమే'అని మహేశ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

ప్రియుడితో భర్తను చంపించిన భార్య

- వివాహేతర సంబంధానికి అడ్డున్నాడని ఘాతుకం... ఆరు గంటల వ్యవధిలోనే మిస్టరీని ఛేదించిన పోలీసులు
- నిందితుల అరెస్టు.. రిమాండ్
- అనంతపురంలో మరో హత్య

రాప్తాడు రూరల్: దాదాపు 20 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్న భర్తను కాదని.. రెండునెలల క్రితం పరిచయమైన ప్రియుడిపై ఓ మహిళ మోజు పెంచుకుంది. అది చివరకు భర్తను అంతమొందించేందుకు దారితీసింది. ఈ ఘటన వెలుగులోకి వచ్చిన ఆరు గంటల్లోనే అనంతపురం రూరల్ పోలీసులు మిస్టరీని ఛేదించారు. నగరంలో మంగళవారం ఉదయం ఓ హత్య జరగ్గా అదేరోజు రాత్రి మరో దారుణం జరగడంతో నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు. వివరాలివీ..

అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయతీ సదాశివకాలనీకి చెందిన కుమ్మర నరసాపురం సురేశ్‌బాబు (43), అనిత దంపతులు. అనంతపురంలోని కల్యాణదుర్గం రోడ్డులో సురేశ్‌బాబు ఓ హోటల్ నిర్వహిస్తున్నాడు. భార్య అదే ప్రాంతంలోని ఓ హోటల్‌లో పనిచేస్తోంది. ఈ క్రమంలో అనితకు రెండునెలల క్రితం ఆటోలో పండ్లు అమ్ముకునే బాబాఫక్రుద్దీన్ అనే యువకుడితో పరిచయం ఏర్పడి, వివాహేతర సంబంధానికి దారితీసింది.

భర్తకు అనుమానం రావడంతో..

భార్య వ్యవహారశైలిపై ఇటీవల సురేశ్‌బాబుకు అనుమానం వచ్చింది. దీంతో మద్యం మత్తులో భార్యను వేధించడం ప్రారంభించాడు. తనను ఇబ్బంది పెడుతున్న విషయాన్ని ప్రియుడికి అనిత వివరించింది. భర్తను కడతేరిస్తే ఇద్దరం సంతోషంగా ఉండొచ్చని ప్రియుడికి చెప్పింది. ఇద్దరూ కలిసి భర్త హత్యకు పథకం రచించింది. ఈ క్రమంలో సురేశ్‌బాబు మంగళవారం రాత్రి 11 గంటలకు హోటల్ మూసేసి తన టూ వీలర్‌పై ఇంటికి బయల్దేరాడు. అక్కంపల్లి–రాచానపల్లి మధ్యలో ప్రయాణిస్తుండగా అప్పటికే అక్కడ మాటువేసిన బాబాఫక్రుద్దీన్ ఖాళీ సీసాను సురేశ్‌బాబుపై విసిరాడు. దీంతో వాహనం అదుపుతప్పి కిందపడిన సురేశ్‌పై స్క్రూడ్రైవర్‌తో విచక్షణారహితంగా పొడిచాడు. అనంతరం ఓ పెద్ద బండరాయి తీసుకుని తలపై వేసి హతమార్చి ఉడాయించాడు.

భార్య తీరుపై అనుమానంతో..

ఇక ఈ ఘటన బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు, సీఐ శేఖర్, ఎస్ఐ రాంబాబు, సిబ్బంది వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. హతుడి భార్య అనితతో మాట్లాడారు. తన భర్త చాలా మంచివాడని ఎవరితోనూ గొడవల్లేవని ఎందుకు హత్యచేశారో తనకు తెలీదంటూ వాపోయింది. అయితే, ఆమె తీరుపై అనుమానం వచ్చిన పోలీసులు ఆమె నడవడికపై ఆరా తీశారు. ఆ తర్వాత బాబాఫక్రుద్దీన్‌ను అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే అనితనూ అదుపులోకి తీసుకుని ఇద్దరినీ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు. కేసును కేవలం ఆరు గంటల్లోనే ఛేదించిన డీఎస్పీ, సీఐ, ఎస్ఐ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

తెలంగాణలో 'మెము' రైళ్లు

- కాజీపేట ఆర్ఎంయూలో 'మెము కోచ్'ల ఉత్పత్తి
- 2026 మే నుంచి ఉత్పత్తి ప్రారంభం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి



అశ్వినీ వైష్ణవ్‌ను శాలువాతో సత్కరిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రైల్వే ప్రయాణాన్ని మరింత సులభతరం చేసే లక్ష్యంతో కొత్తతరం 'మెయిన్ లైన్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్'(మెము) రైళ్లను త్వరలోనే ప్రవేశపెట్టనున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 16 నుంచి 20 కోచ్‌లు ఉండే మెము రైళ్లను.. రాష్ట్రంలోని కాజీపేట రైల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ (ఆర్ఎంయూ)లో ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడించారు. అశ్వినీ వైష్ణవ్‌తో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఢిల్లీలో బుధవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించిన వివిధ రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై చర్చ జరిగింది. గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాలను అనుసంధానించడంలో మెము రైళ్లది కీలక పాత్ర అని అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. రూ.716 కోట్లతో కాజీపేటలోని రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని కిషన్‌రెడ్డికి వివరించారు. 2026 జనవరి నాటికి ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందని చెప్పారు. 2026 మే నెల నుంచి ఆర్ఎంయూలో ఉత్పత్తి ప్రారంభం కానుందని వెల్లడించారు.

అబద్ధాలలో ఇద్దరూ ఇద్దరే

సీఎం రేవంత్‌రెడ్డితో పీసీసీ చీఫ్ మహేశ్ పోటీ: హరీశ్‌రావు



హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన ప్రశాంత్ పాటిల్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి, సీనియర్ నాయకుడు జైపాల్‌రెడ్డి తదితరులు

సిద్దిపేటజోన్: అబద్ధాలు చెప్పడంలో ఇద్దరూ ఇద్దరేనని, సీఎం రేవంత్‌రెడ్డితో పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ పోటీ పడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేటలోని క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి మెదక్ జిల్లా రాయికోడ్ మండల యువజన కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల ప్రశాంత్ పాటిల్ హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. గత 18 నెలల కాలంలో కాంగ్రెస్ సర్కార్ చేసింది ఏమీ లేదని విమర్శించారు. అభివృద్ధిపై బీఆర్ఎస్‌తో బహిరంగ చర్చకు సిద్ధమని మహేశ్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు స్పందించారు. కాంగ్రెస్ హామీల వైఫల్యం, రుణమాఫీ అంశంపై రాష్ట్రంలో ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రైతుల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. ఓట్ల కోసమే కాంగ్రెస్ పార్టీ రైతు భరోసా పైసలు వేసిందన్నారు. రైతులకు విత్తనాలను సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. అసెంబ్లీ పెట్టడానికి కూడా కాంగ్రెస్ భయపడుతోందని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ప్రశ్నలకు బదులివ్వలేక వారం రోజులకే వాయిదా వేస్తోందని విమర్శించారు.

రేవంత్ నోటి నుంచి అబద్ధాల బురద

మాజీమంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి. చిత్రంలో గంగుల, ప్రశాంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: రైతు సంబురాల పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోటి నుంచి అబద్ధాల బురద వరదలా వచ్చిందని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి మూర్ఖంగా మతి భ్రమించి మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోపాటు కేటీఆర్, హరీశ్‌రావుపై రేవంత్ తన సంస్కారలేమిని మరోమారు బయట పెట్టుకున్నారని మండిపడ్డారు. మాజీమంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్యయాదవ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి బుధవారం తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది మొదలుకొని ఇప్పటివరకు రైతుభరోసా కింద 4 విడతల్లో రూ.44 వేల కోట్లు ఇవ్వాల్సి ఉండగా, కేవలం రూ.19 వేల కోట్లు మాత్రమే ఇచ్చిందన్నారు. ఓట్లపై తప్ప రేవంత్ సర్కారుకు నాట్లపై ప్రేమ లేదని, స్థానిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే రైతుభరోసా ఇచ్చారని విమర్శించారు. సన్న వడ్లకు రూ.21 వేల కోట్ల బోనస్‌కుగాను కేవలం రూ.వేయి కోట్లు మాత్రమే ఈ ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు.

శవాలు కూడా బయటకు తేలేకపోయారు: నిరంజన్‌రెడ్డి

రాష్ట్ర ప్రాజెక్టులు, పరీవాహక ప్రాంతంపై అవగాహన లేని సీఎం రేవంత్ దమ్ముంటే అసెంబ్లీలో చర్చకు రావాలని మాజీమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సవాలు చేశారు. శ్రీశైలం ఎడమ కాలువ సొరంగంలో ఎనిమిది మంది మరణిస్తే కనీసం శవాలు కూడా బయటకు తేలేకపోయారన్నారు. మేడిగడ్డలో కుంగిన పిల్లర్లకు మరమ్మతు చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టును కూలేశ్వరం అంటూ రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై విమర్శలు మానుకొని బనకచర్ల లింక్ ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వంతో పోరాడాలని చెప్పారు. పాలమూరు బిడ్డగా చెప్పుకునే సీఎం రేవంత్ పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన పదిశాతం పనులు పూర్తి చేయాలన్నారు.

పచ్చబడిన ప్రాంతాలు తిరిగి ఎడారవుతున్నాయి: గంగుల కమలాకర్

కాళేశ్వరం ప్రాజెక్టుతో పచ్చబడిన ప్రాంతాలు తిరిగి ఎడారిలా మారుతున్నాయని మాజీమంత్రి గంగుల కమలాకర్ విమర్శించారు. ఏపీకి నదీ జలాలు తరలిస్తూ తెలంగాణను ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్‌గాంధీ పాదాల చెంత రైతు సంబురాలు చేస్తున్నామని మంత్రులు చెప్పడం సిగ్గుచేటు అని విమర్శించారు. కాంగ్రెస్‌లో నెలకొన్న విభేదాలు, పార్టీ, ప్రభుత్వంలో తనమాట చెల్లుబాటు కావడం లేదనే నిస్పృహతో కేసీఆర్‌పై సీఎం రేవంత్ చూపుతున్నాడని గంగుల విమర్శించారు.

కేసీఆర్ దమ్మేంటో ఒరిజినల్ కాంగ్రెస్ లీడర్లను అడిగితే చెప్తారు

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత... మహిళలకు రూ.2,500 ఇవ్వాలని సోనియాగాంధీకి పోస్టుకార్డులు పంపి నిరసన



పోస్టుకార్డులతో కవిత

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): మాజీ సీఎం కేసీఆర్ దమ్మేంటో ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులను అడిగితే తెలుస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ హామీ ఇచ్చిన మహిళలకు నెలకు రూ.2,500 ఇవ్వడంతో పాటు పెన్షన్ల పెంపు హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ బుధవారం తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో అబిడ్స్ జీపీఓ ఎదుట ఆందోళన నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున పోస్టుకార్డులను ఢిల్లీకి పోస్టు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబును పిలిచి ప్రజా భవన్‌లో హైదరాబాద్ బిర్యానీ పెట్టి గోదావరి నీళ్లను కానుకగా ఇచ్చిందే రేవంత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ సమావేశాలు పెట్టి ఆరు గ్యారంటీలు, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై చర్చించే సత్తా ఉందా? అని ప్రశ్నించారు. 2016లో పోలవరం–బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ అనే ప్రస్తావనే లేదని గుర్తు చేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా ఎన్నికలకు వెళ్తే ప్రజలు క్షమించబోరన్నారు.



మూడు ముళ్లెందుకు గుచ్చుకుంటున్నాయి?

'మగాళ్లు, ఆడాళ్లు ఇద్దరూ సమానమే.. కానీ మగాళ్లు ఇంకొంచెం ఎక్కువ సమానం!'

'రాధాగోపాలం' సినిమాలో డైలాగ్!

'భార్యభర్తలిద్దరూ సమానమే అయితే భర్త ఇంకొంచెం ఎక్కువ సమానం' అని సంసారంలో ఉన్న మాటను ఇప్పటి తరం అంటే అమ్మాయిలు అంగీకరించే పరిస్థితిలో లేరు! ఈ మాట వినపడగానే పెద్దలు, సంప్రదాయవాదులు అందుకే మనమూ పాశ్చాత్యుల్లా విడాకులకు తెగబడుతున్నాం అనేస్తారు ఘాటుగా!

ఇంతకీ ప్రపంచ దేశాలతో పోలిస్తే మన దగ్గర విడాకుల సంఖ్య ఎంతో తెలుసా.. కేవలం ఒక్క శాతమే! అంతదానికే ఇంత ఘాటా? అంటే కుటుంబ వ్యవస్థకు పునాది వివాహ వ్యవస్థగా మన్ననలు అందుకుంటున్న దేశం కదా! అలాంటి సమాజంలో ప్రపంచంతో పోలిస్తే తక్కువే అయినా విడాకుల సంఖ్య పెరుగుతుండటం, అందుకు అనుమతులు వస్తుండటం ఆందోళన కలిగించే అంశమే కదా! ఈ నేపథ్యంలో మన పెళ్లి వ్యవస్థ బీటలు వారుతోందా? నివారోణాపాయం ఏంటి... వంటి అంశాల మీద నేటి నుంచి వరుస కథనాలు.

ఈ రోజు.. పెళ్లి, అది ప్రమోట్ చేస్తున్న, డిమాండ్ చేస్తున్న అంశాలేంటో చూద్దాం! ఇదివరకు.. ఆడపిల్లకు ఉత్తరం చదివే అక్షరజ్ఞానం ఉంటే సరిపోతుందని అంతవరకే అనుమతించారు. తర్వాత ఆ ఆలోచన కాస్త మారి అమ్మాయి తన పిల్లలకు చదువు చెప్పుకునేంత జ్ఞానం సంపాదించాలని ఆ అనుమతిని కాస్త సడలించారు. ఇప్పుడు అమ్మాయిలు ప్రొఫెషనల్ డిగ్రీలు, పీహెచ్‌డీలూ చేసి, అబ్బాయిలు ఏయే రంగాల్లో ఉన్నారో ఆయా రంగాల్లో తమ ఉనికినీ చాటుకుంటున్నారు. అబ్బాయిలతో సమానంగా శ్రమించి సమాన వేతనాల కోసం డిమాండ్ చేస్తున్నారు. సమానత్వ సాధనలో ఇది శుభపరిణామం. కానీ ఇదే పెళ్లిని బ్రేక్ చేస్తోందని సంప్రదాయ వాదుల భావన.

విడాకులు పెరుగుతున్నాయి...

ఇదివరకటితో పోల్చుకుంటే దేశంలో పట్టణ ప్రాంతాల్లో విడాకుల సంఖ్య పెరుగుతూ వస్తోందని పలు నివేదికలు, అధ్యయనాల సారాంశం. 2017–18 నుంచి 2023–24 వరకు విడాకులు కోరుకున్న మగవాళ్ల సంఖ్య 0.3 శాతం నుంచి 0.5 శాతం పెరిగితే, ఆడవాళ్ల సంఖ్య 0.6 శాతం నుంచి 0.7 శాతం పెరిగింది.

కాపురాల్లో కలతలు, వేధింపులు, హింస, వరకట్న వేధింపులు లాంటి రకరకాల కారణాలతో హత్యలు, ఆత్మహత్యలూ జరుగుతున్నాయి. అమ్మాయిలు అంతరిక్షంలోకి వెళ్తున్న ఈ రోజుల్లోనూ అత్తారింట్లో వరకట్న వేధింపులను ఎదుర్కొంటున్నారంటే నమ్ముతారా? నమ్మాల్సిందే అంటోంది 2024 నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక. నిరుడు 4,383 అంటే 17 శాతం వరకట్న వేధింపు కేసులు నమోదయ్యాయి. నమోదు కానివి ఇంకెన్నో! 2022లో అయితే ఆరువేలకు పైనే వరకట్న మరణాలు రిజిస్టర్ అయ్యాయి. ఆత్మహత్యలు గణనీయంగా పెరగడంలో వైవాహిక సమస్యల పాత్ర చాలా ఉందని ఎన్‌సీఆర్‌బీ డేటా వెల్లడిస్తోంది. 2016 నుంచి 2020 మధ్య వైవాహిక సమస్యల వల్ల రోజుకు 20 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారని చూపిస్తున్నాయి ఎన్‌సీఆర్‌బీ నివేదికలు. 2024లో జాతీయ మహిళా కమిషన్ మొత్తం 25, 743 ఫిర్యాదులను స్వీకరించింది. అందులో 6, 237 అంటే 24 శాతం డొమెస్టిక్ వయొలెన్స్‌కి సంబంధించినవే.



సమాజంలో జరుగుతున్న దాన్ని అందరికీ ఆపాదించలేం. ఎవరి జీవితం వాళ్లది.. ఎవరి ఎక్స్‌పీరియెన్స్ వాళ్లది. పెళ్లి విషయంలోనూ అంతే! పెళ్లి కావాలనుకున్నా వద్దనుకున్నా అది వాళ్ల వ్యక్తిగత చాయిస్. అలాగే విడాకుల విషయంలోనూ అంతే! కలిసి ఉందామనుకున్నా, వద్దనుకున్నా ఆ జంట నిర్ణయం. అయితే ఆ చాయిస్‌కి కానీ, నిర్ణయాలకు కానీ సమాజంలో స్పేస్ ఉండాలి.

– ఐశ్వర్య రాయ్ బచ్చన్



'నాకిప్పుడు 59 ఏళ్లు. శారీరకంగా, మానసికంగా నానా అవస్థలు పడుతూ సినిమాల్లో పనిచేస్తున్నాను. పెళ్లి పేరుతో నా జీవితంలోకి వచ్చిన భాగస్వామి ఏ కారణంతో విడిపోయినా భరణం కింద నా కష్టార్జితంలో సగానికి ఎసరుపెడుతుంది. యంగ్ ఏజ్‌లో పెళ్లయితే పర్లేదు.. అవతలి వాళ్లు మనోవర్తి కింద ఎంత డబ్బు తీసుకున్నా మళ్లీ సంపాదించుకోగలమనే నమ్మకం ఉంటుంది. కానీ ఈ వయసులో? అదంతా ఎక్కడ పెట్టుకోను? అందుకే ఇలా గడచిపోతోంది గడచిపోనివ్వండి'

– సల్మాన్ ఖాన్, బాలీవుడ్ నటుడు

ఎందుకంటే...

అక్షరజ్ఞానం నుంచి ఆఫీస్‌లకు చేరుకునేదాకా ఆడవాళ్ల ప్రగతిని ఆంక్షలు, హద్దులతో అయినా అంగీకరించిన సమాజం కనీసం స్థాయిలో డొమెస్టిక్ లేబర్‌లో పురుషుల భాగస్వామ్యాన్ని అంగీకరించలేకపోతోంది. ఆ ప్రగతికి సమాన నిష్పత్తిలో డొమెస్టిక్ లేబర్‌లో పురుషుల పాత్ర పెరగలేదు. అంటే పెళ్లి ఆ బాధ్యతను పూర్తిగా ఇంకా స్త్రీల భుజాన్నే మోపుతోంది. భార్యాభర్తలు పేరెంట్స్‌గా మారినా భర్త మీద పెద్దగా భారం పడట్లేదు. తల్లయిన భార్యకు మాత్రం క్రమంగా విశ్రాంతి తగ్గిపోతోందని, పిల్లలు పుట్టగానే నిద్ర నుంచి కెరీర్ వరకు తల్లే త్యాగం చేయాల్సి వస్తోందని అధ్యయనాల సారం. పేరెంటింగ్ సమస్య కాదు. మ్యారేజ్‌లో పేరెంటింగ్‌ని కేవలం తల్లి బాధ్యతలా పరిగణించడమే సమస్య, ఆ మాటకొస్తే పెళ్లిలోని ప్రేమ, విధేయత, కమిట్‌మెంట్‌తో కూడా ప్రాబ్లం లేదు. పెళ్లి నిర్మాణమే అసలు ప్రాబ్లం' అంటున్నారు ఈతరం అమ్మాయిలు. అందుకే సాధికారత సాధించిన యువతలు ఆర్థిక, సామాజిక భద్రతకో, ఓ ఇంటి వారవడం కోసమో పెళ్లి చేసుకునే స్థితిలో లేరు. పురుషులతోపాటు స్త్రీలకూ అంతే ప్రాధాన్యం, గౌరవం ఇస్తూ భాగస్వామ్యానికి అసలైన నిర్వచనంగా ఉండే బంధాన్ని కోరుకుంటున్నారు. ఆ ఫ్రేమ్‌లో లేని పెళ్లిని త్యజించడానికి సిద్ధపడుతున్నారు. ఆనందం పంచలేని బంధానికి విడాకులనివ్వడానికీ వెనుకాడటం లేదు. సంప్రదాయం కన్నా మానసిక ఆరోగ్యం, భద్రతకే ప్రాధాన్యం ఇస్తున్నారు. దీన్ని కుటుంబం గ్రహించాలి. పిల్లల పెంపకం నుంచే జాగ్రత్త వహించాలి. చదువు విషయంలో అమ్మాయి, అబ్బాయి పట్ల చాలావరకు సమానత్వం చూపిస్తున్న తల్లిదండ్రులు ఇంటి పనుల విషయంలోనూ ఆ సమానత్వాన్ని ప్రదర్శించాలి. ఎందుకంటే అక్కడ అమ్మాయిలకు వెసులుబాటు దొరికితేనే వారి సాధికారతకు సార్థకత చేకూరుతుంది. ఇప్పటికిప్పుడు తల్లిదండ్రులు డొమెస్టిక్ లేబర్‌లోనూ అబ్బాయిలకు వాటా ఇస్తే భవిష్యత్ తరానికి అది నార్మలైజ్ అవుతుంది.

– సరస్వతి రమ

● మన(సు)లో మాట

నా మొండి భర్తను మార్చగలరా!

నా భర్తకు 48 ఏళ్లు, రైల్వే ఉద్యోగి. చిన్నవయసు నుండే కుటుంబ బాధ్యతలు ఆయన మీద పడ్డాయి. అప్పటి నుండే మందుకు, స్మోకింగ్‌కి బానిస అయ్యారు. ఈ మధ్య గుండెకి ఆపరేషన్ కూడా అయింది. హాస్పిటల్ నుండి డిశ్చార్జ్ అయిన తర్వాతి రోజే మళ్లీ మందు, సిగరెట్ మొదలుపెట్టారు. ఆఫీస్‌కి సరిగా వెళ్లరు. మందులు వేసుకోరు. ఈయన పరిస్థితికి భయం వేసి హైదరాబాద్‌లో రిహాబిలిటేషన్ సెంటర్లో జాయిన్ చేశాము. కొన్నిరోజులు అవగానే అక్కడ తిండి తినకుండా గొడవ చేసి మారుతానని బతిమిలాడితే ఇంటికి తీస్కొచ్చేశాం. బయటకు రాగానే అన్నీ – మళ్లీ మొదలు పెట్టారు. ఇలా కనీసం ఇప్పటికి మూడుసార్లు జరిగింది. అసలు ఆయన మారతాడంటారా? సలహా ఇవ్వండి.

– పద్మలత, కాజీపేట

మీ భర్త ఆరోగ్యం గురించి మీరు పడే ఆందోళన, తపన అర్థం అవుతున్నాయి. ఇది ఆల్కహాల్‌కి బానిస అయిన చాలామంది పేషెంట్ల కుటుంబ సభ్యుల సమస్య కూడా. ఆల్కహాల్ అడిక్షన్‌కి వంశపారంపర్యం, వ్యక్తిత్వం, చుట్టూ ఉండే పరిస్థితులు, ఇతర మానసిక సమస్యలు... ఇలా అనేకమైన కారణాలు ఉంటాయి. మద్యం లేదా ఇతర, మత్తుపదార్థాలకు బానిస అయిన వారి మెదడు అనేకమైన మార్పులకి గురయి ఉంటుంది. వారిని ఆ అలవాటు నుండి బయట తీసుకు రావడానికి చాలా సమయం పడుతుంది. ఇక రిహాబిలిటేషన్ అనేది చాలా నిదానంగా చేసే చికిత్స. అందుకని ఆ వ్యక్తికి మారాలి అనే ఆలోచన లేనపుడు, ఆ ఆలోచన తీసుకురావడానికి కూడా చాలా సమయం పడుతుంది. చికిత్సకి అసలు సహకరించరు. ఇలాంటి సందర్భాల్లో కుటుంబ సభ్యుల సహకారం అవసరం. వీరిలో మారాలనే ఆలోచన వచ్చేలా సి.బి.టి, మోటివేషన్ ఇంటర్వ్యూయింగ్ పద్ధతులు వాడతాము. ఒకసారి మోటివేషన్ వస్తే అపుడు మళ్ళీ మద్యం జోలికి పోకుండా ఉండడానికి 'ప్రివెన్షన్ రిలాప్స్' పద్ధతులు చెప్తారు. దీనితోపాటు వారి జీవన శైలిలో, స్నేహితుల విషయాలలో చాలా మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. స్ట్రెస్ తట్టుకోడానికి, కోపం తొందరపాటు తగ్గించుకునేలా కూడా థెరపీ ఇస్తారు. 30 సంవత్సరాల అలవాటుని 30 రోజుల్లో మార్చడం అసంభవం అని గుర్తుపెట్టుకోండి! ఈ సందర్భంలోనే మీరు ఓర్పుగా, నేర్పుగా సంయమనంతో ఉండాలి.

అలాగే మీరు చేర్పించే రిహాబిలిటేషన్ సెంటర్లో సరైన శిక్షణ, అనుభవం కలిగిన మానసిక వైద్యులు, కౌన్సిలర్లు, సోషల్ వర్కర్లు, యోగ థెరపిస్ట్ లాంటి సౌకర్యాలు ఉన్నాయో లేదో చూడండి. పేషెంట్‌తో పాటు కుటుంబ సభ్యులు కూడా రెగ్యులర్ కౌన్సెలింగ్ తీసుకోవాలి. వైద్యుల సలహా మేరకు చికిత్స పూర్తి స్థాయిలో అందించండి. అతనిలో తప్పకుండా పరివర్తన వస్తుంది. ఆల్ ది వెరీ బెస్ట్ !



డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్
విజయవాడ
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ
sakshifamily3@gmail.com

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 25న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,310
బంగారం (22 క్యారెట్లు)	91,690
వెండి	1,07,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,00,240
బంగారం (22 క్యారెట్లు)	90,700
వెండి	1,08,800
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	98,950
బంగారం (22 క్యారెట్లు)	90,700
వెండి	1,18,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,00,240
బంగారం (22 క్యారెట్లు)	93,420
వెండి	1,08,800
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	97,700
బంగారం (22 క్యారెట్లు)	89,880
వెండి	1,06,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	98,940
బంగారం (22 క్యారెట్లు)	90,700
వెండి	1,19,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



ఎన్నో వాయిదాల తరువాత 'ఫాల్కన్ 9' నింగిలోకి దూసుకువెళ్లింది. అంతరిక్షంలోకి అడుగుపెట్టాడు మన శుభాంశు శుక్లా. ఈ నేపథ్యంలో శుక్లా పంపించిన సందేశం భావోద్వేగానికి గురి చేసింది.

● ఇన్‌ఫ్లుయెన్స్ మీడియా

శ్రీమతికి ప్రేమతో...

ఇన్‌స్టాగ్రామ్‌లో హార్ట్‌టచింగ్ ఫొటోగ్రాఫ్‌తో కూడిన మేసేజ్‌ను శుక్లా షేర్ చేశాడు.

'ఈ ప్రయాణంలో నాకు అండగా నిలిచిన కుటుంబ సభ్యులు, స్నేహితులకు నా కృతజ్ఞతలు. కొన్నిసార్లు సన్నిహితులు మన కోసం నిస్వార్థంగా త్యాగాలు చేస్తుంటారు. అవి మనకు పూర్తిగా అర్థం కాకపోవచ్చు. అయితే ఆ త్యాగాలలో వారికి మనపై ఉన్న ప్రేమ ప్రతిఫలిస్తుంది' అని రాశాడు శుక్లా.

భార్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశాడు.

'నా అద్భుత జీవిత భాగస్వామి కామ్నాశుభాకు ప్రత్యేక కృతజ్ఞతలు. నీవు లేకపోతే ఈ ప్రయాణం సాధ్యం అయ్యేది కాదు' అని రాశాడు.

కామ్నా, శుక్లా ఇద్దరూ బాల్యస్నేహితులు.

'మూడో క్లాస్ నుంచి మేము క్లోజ్ ఫ్రెండ్స్. శుభాంశు చిన్నప్పుడు ఎక్కువగా మాట్లాడేవాడు కాదు. సిగ్గరి' అని ఒకానొక సందర్భంలో శుభాంశు శుక్లా గురించి తెలియజేసింది కామ్నా మిశ్రా.

● ఇంటింటి పండుగ

సంబురాలు మొదలాయె

ఇంటి ఆడబిడ్డ బోనం ఎత్తగానే మోగిన డప్పు వాయిద్యాలు.. పోతరాజు విన్యాసాలు.. అమ్మా, కాపాడమ్మా.. అంటూ సాగే అడుగులన్నీ అమ్మవారి ఆలయం వైపుగా కదులుతుంటే.. దారులన్నీ ఆధ్యాత్మిక శోభతో కళ కళలాడతాయి. ఆ కళ గురించి వర్ణించడానికి మాటలు సరిపోవు అనిపించేంత సంబురంగా జరుగుతుంది తెలంగాణ బోనాల పండగ.

తెలంగాణ ప్రజల సాంస్కృతిక, ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ఆషాఢ మాసం మొదలవుతూనే ఆరంభం అవుతుంది. పోచమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ, ముత్యాలమ్మ, బాలమ్మ, మహంకాళమ్మ, పెద్దమ్మ .. ఈ ఏడుగురు అమ్మతల్లులు ప్రాంతాలను బట్టి వివిధ పేర్లతో పూజలు అందుకుంటున్నారు. ఈ అమ్మతల్లుల ఆలయాలన్నీ సుందరంగా ముస్తాబు అవుతాయి. నేటి నుంచి మొదలయ్యే ఈ వేడుకలో తెలంగాణ ఆడబిడ్డలు ఉత్సాహంగా పాల్గొంటారు. బెల్లం కలిపి వండిన అన్నాన్ని పసుపు, కుంకుమ బొట్లు, వేపాకులతో అలంకరించిన మట్టి లేదా ఇత్తడి పాత్రలలో ఉంచుతారు. పైన పెట్టిన మూతలో దీపాన్ని ఉంచి, ఆ పాత్రను జాగ్రత్తగా తలపైన పెట్టుకుని, అమ్మవారి దేవాలయాలకు వెళతారు. ఈ పండుగలో భక్తి, కుటుంబ శ్రేయస్సు ప్రధానంగా కనిపిస్తాయి. బోనాలతో పాటు, పొట్టేళ్ళ, ఘటం ఊరేగింపు వంటి సాంస్కృతిక కార్యక్రమాలూ నిర్వహిస్తారు.



హైదరాబాద్‌లో గోల్కొండ శ్రీ జగదాంబిక అమ్మవారికి తొలి బోనం సమర్పించడంతో ఈ పండగ మొదలవుతుంది. వెయ్యేళ్లకు పైగా ఈ ఆచారం ఉన్నట్లు, కాకతీయ రాజులలో ఒకరైన ప్రతాప రుద్రుడు గోల్కొండలోని జగదాంబిక ఆలయంలో బోనాల సమయంలో ప్రత్యేక పూజలు జరిపినట్లు చారిత్రక కథనాలు. రెండో బోనం బల్కంపేట రేణుక ఎల్లమ్మ గుడిలో, తరువాతి వారంలో సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అమ్మవారికి బోనం సమర్పిస్తారు. లాల్ దర్వాజా అమ్మవారి ఆలయంతో పాటు వివిధ ప్రాంతాలలో ఉన్న అమ్మవార్లకు వరసగా బోనం సమర్పించే ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయి. చివరి వారం రంగం, భవిష్యవాణిలతో ముగింపు కార్యక్రమం ఉంటుంది. జులై 21తో ముగిసే ఈ జాతర ఉత్సవాలు పిల్లలూ పెద్దలలో ఆనందోత్సాహాలను నింపుతుంది.

● బ్యూటిప్స్

మచ్చలేని నిగారింపు కోసం

ముఖంపై ఉండే మృతకణాలను ఇంట్లో దొరికే పదార్థాలతో సులభంగా తొలగించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. అదెలాగో చూద్దాం...

అలోవెరా స్క్రబ్: మూడు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్‌లో రెండు టీస్పూన్లు బియ్యప్పిండి, టీస్పూను తేనె వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, మెడకు రాసుకుని



చేసి పదినిమిషాలపాటు మర్దన చేసి ఆరాక కడిగేయాలి.

వాల్‌నట్ స్క్రబ్: రెండు వాల్‌నట్స్‌ను తీసుకుని పొడిచేసుకోవాలి. ఈ పొడిలో మూడు టీస్పూన్లు తేనె వేసి పేస్టులా కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి పదిహేను నిమిషాలు ఆరాక నీటితో కడిగేయాలి. వాల్‌నట్స్‌లోని ఔషధ గుణాలు చర్మానికి పోషణ అందించడంతోపాటు, చర్మంపై ఉన్న జిడ్డుని తొలగించి ముఖాన్ని తాజాగా ఉంచుతాయి.

కాఫీ స్క్రబ్: నాలుగు టీస్పూన్ల కాఫీ పొడిలో రెండు టీస్పూన్ల బ్రౌన్ సుగర్, టీస్పూను తేనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి, చేతులకు అప్లై చేసి పదిహేను నిమిషాల పాటు మర్దన చేయాలి. ఆరాక నీటితో కడిగేయాలి. కాఫీ పొడిలోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మాన్ని లోతుగా శుభ్ర పరిచి ఫ్రెష్‌గా ఉంచుతాయి.

● నేడు మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

మత్తుపై దండెత్తారు!



● డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో ఛత్తీస్‌గఢ్‌లోని జూహ్లీ గ్రామ మహిళలు

మత్తును చిత్తు చేసిన మహిళా యోధులు
'భూమాత అంత ఓపిక మహిళల సొంతం' అంటారు. సహనానికి పర్యాయ పదంలా చెప్పే 'మహిళ' అవసరమైతే అపర కాళీ అవుతుంది. కేరళ నుంచి పంజాబ్ వరకు ఎన్నో ప్రాంతాలలో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడడానికి మహిళలు నడుం బిగించారు. సంఘాలుగా ఏర్పడి ఎన్నో గ్రామాలను డ్రగ్స్ భూతం నుంచి విముక్తి చేశారు...

ఛత్తీస్‌గఢ్‌లోని జూహ్లీ గ్రామంలో ఒకప్పుడు పరిస్థితి భయానకంగా ఉండేది. ఈ గ్రామంలో ఎంతో మంది మాదకద్రవ్యాలకు బానిస అయ్యారు. ఫలితంగా గ్రామంలో శాంతిభద్రతలు లోపించాయి. ఎప్పుడు ఏ గొడవ జరుగుతుందో తెలియదు. మత్తులో పడి పని కూడా మానేసేవారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావడానికి గ్రామ మహిళలు నడుం బిగించారు.

'ఉమెన్ కమాండోస్' పేరుతో ఒక గ్రూప్‌గా ఏర్పడ్డారు. గ్రామాన్ని మాదక ద్రవ్యాల బారి నుంచి విముక్తి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. రాత్రీ, పగలు తేడా లేకుండా ఈ గ్రూప్ సభ్యులు వీధి వీధిలో పెట్రోలింగ్ చేసేవారు.

'మా అలవాటు మా ఇష్టం. మీకెందుకు?' అని అడ్డంగా వాదించే మొండిఘటాలను కూడా దారిలోకి తెచ్చారు.

ఇప్పుడు గ్రామంలో పూర్తిగా మార్పు వచ్చింది. మద్యం, మాదకద్రవ్యాల విష కోరల నుంచి బయటపడి ఆదర్శ గ్రామంగా మారింది జూహ్లీ. ఈ మార్పుకు కారణం...ఉమెన్ కమాండోస్.

'ఒకప్పుడు వయసు మళ్లిన వాళ్లలో కొందరు డ్రగ్స్ తీసుకునేవారు. ఆ దురలవాటు చివరికి యువత, పిల్లల్లోకి కూడా వచ్చింది. ఇలా చూస్తూ పోతే గ్రామం సర్వనాశనం అయిపోతుందని భయపడ్డాం. ఉమెన్ కమాండోస్ గ్రూప్‌గా ఏర్పడ్డాం. మార్పు సాధ్యం కాదు అనుకున్నచోట మార్పు తెచ్చాం' అంటుంది 'ఉమెన్ కమాండోస్' గ్రూప్ సభ్యురాలు విష్ణుదేవి.

'మాదకద్రవ్యాల వాడకం వల్ల గృహహింస ఎక్కువ అయింది. కుటుంబ జీవితం అస్తవ్యస్తంగా మారింది. మేము ఉమెన్ కమాండోస్ పేరుతో ఒక గ్రూప్‌గా ఏర్పడినప్పుడు మార్పు తేవడం మీ వల్ల కాదు అన్నారు కొందరు. కచ్చితంగా అవుతుంది అని నిరూపించాలనుకున్నాం. నిరూపించాం' అంటుంది రాజేశ్వరి మారవీ.

శైలి(పేరు మార్చాం)కి సరదాగా డ్రగ్స్ అలవాటు మొదలైంది. చివరికి ఈ దురలవాటు తనను మృత్యువు అంచుల వరకు తీసుకువెళ్లింది. పంజాబ్‌లో శైలిలాంటి ఎంతోమంది మహిళలను డ్రగ్స్ మృత్యునీడ నుంచి బయటకు తీసుకువచ్చి కొత్త జీవితాన్ని ఇచ్చింది హెర్మిటేజ్ రిహాబ్ సెంటర్.

బాధ పడకూడదు... పోరాడాలి

పంజాబ్‌లోని బఠిండా జిల్లాలోని దులేవాలా గ్రామంలో పదకొండు మంది మహిళలతో ఏర్పాటైన 'ఆల్-ఉమెన్ యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ కమిటీ' గ్రామంలోని డ్రగ్స్ భూతాన్ని తరిమేసింది. సోషల్ హెల్త్ యాక్టివిస్ట్ షిందర్ పాల్ కౌర్ ఈ కమిటీకి నాయకత్వం వహించింది. 'డ్రగ్స్ వల్ల ఎన్నో కాపురాలు కూలిపోయాయి. ఎంతోమంది దారి తప్పి వినాశనాన్ని కొని తెచ్చుకున్నారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావడానికి మేము చేసిన ప్రయత్నం ఫలించింది' అంటుంది షిందర్ పాల్ కౌర్.



● ఆల్-ఉమెన్ యాంటీ-డ్రగ్ అవేర్‌నెస్ కమిటీ

మాదక ద్రవ్యాల బారిన పడిన మహిళలను కుటుంబ సభ్యులు ఈసడించడం, దూరం పెట్టడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యేది. పురుషుల కోసం మాత్రమే అన్నట్లుగా ఉండే రిహాబిలిటేషన్ సెంటర్‌లు మహిళలను చేర్చుకోవడానికి నిరాకరించేవి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని హెర్మిటేజ్ రిహాబ్ కేంద్రం మొదలైంది. పంజాబ్‌లోని వివిధ ప్రాంతాల నుంచి మహిళలు ఈ ఆల్-ఉమెన్ డ్రగ్ రిహాబ్ సెంటర్‌లో చేరుతుంటారు. అయితే ఇది నాణేనికి ఒకవైపు మాత్రమే.

మహిళలే కీలకం

మరోవైపు చూస్తే...మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో, మాదకద్రవ్యాల బారిన పడిన వారిని తిరిగి మామూలు స్థితికి తీసుకురావడంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో మహిళలను కీలక భాగస్వాములను చేస్తోంది పంజాబ్ ప్రభుత్వం. డ్రగ్స్ వ్యతిరేక పోరాటంలో భాగంగా వర్క్‌షాప్‌లు నిర్వహించింది.

'మాదకద్రవ్యాల బారిన పడిన వాళ్లను అందులో నుంచి బయటికి తీసుకువచ్చే శక్తి మహిళలకు ఉంది' అంటున్నారు పంజాబ్ ఆరోగ్య శాఖ మంత్రి డా.బల్బీర్‌సింగ్.

బెదిరింపులు వచ్చినా...

డ్రగ్స్‌పై పోరాడుతున్న మహిళలకు డ్రగ్ మాఫియా నుంచి బెదిరింపులు వచ్చాయి. దాడులు జరిగాయి. అయినా వారు వెనక్కి తగ్గలేదు. మహిళా యోధుల పట్టుదల ముందు డ్రగ్ మాఫియా తోకముడిచింది.



సెమీఫైనల్లో యూకీ బాంబ్రీ జోడీ

మలోర్కా ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో యూకీ బాంబ్రీ (భారత్)-రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. స్పెయిన్‌లో బుధవారం జరిగిన పురుషుల డబుల్స్ క్వార్టర్ ఫైనల్లో యూకీ-గాలోవే ద్వయం 6-2, 6-3తో రాఫెల్ మాటోస్-మార్సెలో మెలో (బ్రెజిల్) జంటపై విజయం సాధించింది. 69 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-గాలోవే జోడీ మూడు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తమ సర్వీస్‌ను ఒక్కసారి కూడా చేజార్చుకోని యూకీ-గాలోవే ప్రత్యర్థుల సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశారు.

రెండు విభాగాల ఫైనల్స్‌లో అభయ్ సింగ్

ఆసియా స్క్వాష్ డబుల్స్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ అభయ్ సింగ్ రెండు స్వర్ణాల కోసం పోటీపడనున్నాడు. మలేసియాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల డబుల్స్‌లో అభయ్-సెంథిల్... మిక్స్‌డ్ డబుల్స్‌లో అభయ్-అనాహత్ ఫైనల్లోకి ప్రవేశించారు. సెమీఫైనల్స్‌లో అభయ్-సెంథిల్ 11-5, 11-9తో వోంగ్ చి హిమ్-టాంగ్ మింగ్ హాంగ్ (హాంకాంగ్)లపై... అభయ్-అనాహత్ 11-8, 10-12, 11-5తో ఐనా అమాని-సియాఫిక్ కమాల్ (మలేసియా)లపై గెలుపొందారు.



కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో పంత్



- ఏడో స్థానంలో భారత వికెట్ కీపర్
- ఐసీసీ టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్


దుబాయ్: ఇంగ్లండ్‌తో తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలతో చెలరేగిన భారత వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టెస్టు ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. బుధవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో పంత్ ఒక స్థానం మెరుగుపర్చుకొని ఎనిమిది నుంచి ఏడో స్థానానికి చేరుకున్నాడు. లీడ్స్ వేదికగా జరిగిన పోరులో విజృంభించడం ద్వారా పంత్ 801 రేటింగ్ పాయింట్లకు చేరాడు. టెస్టు మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు చేసిన రెండో వికెట్ కీపర్‌గా 27 ఏళ్ల పంత్ నిలిచాడు. ఇక ఈ మ్యాచ్ ద్వారానే టెస్టు కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్న శుబ్‌మన్ గిల్ (660 పాయింట్లు) ఐదు స్థానాలు మెరుగు పరుచుకొని 20వ ర్యాంక్‌కు చేరగా... టీమిండియా నుంచి అత్యుత్తమంగా యశస్వి జైస్వాల్ 851 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్‌తో మొదటి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో వీరిద్దరు సైతం సెంచరీలతో కదంతొక్కారు. ఇక బౌలింగ్ విభాగంలో తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో అదరగొట్టిన భారత ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (907 పాయింట్లు) 'టాప్' స్థానాన్ని కాపాడుకున్నాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచిన ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ ఐదు స్థానాలు ఎగబాకి ఎనిమిదో ర్యాంక్‌కు చేరాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ (889 పాయింట్లు) 'టాప్' ర్యాంక్‌లో ఉండగా... హ్యారీ బ్రూక్ (874 పాయింట్లు) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ఓలీ పోప్ (19వ స్థానం), జేమీ స్మిత్ (27వ స్థానం) కూడా ర్యాంకింగ్స్‌లో ముందంజ వేశారు. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్ రవీంద్ర జడేజా (376 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతుండగా... ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ మూడు స్థానాలు మెరుగు పరుచుకొని (254 పాయింట్లు) ఐదో ర్యాంక్‌కు చేరాడు.

ఆయుశ్ శెట్టి శుభారంభం



అయోవా (అమెరికా): యూఎస్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత రెండో ర్యాంకర్ ఆయుశ్ శెట్టి శుభారంభం చేశాడు. బుధవారం మొదలైన ఈ టోర్నీలో ప్రపంచ 34వ ర్యాంకర్ ఆయుశ్ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ఆయుశ్ 21-17, 21-19తో 85వ ర్యాంకర్ మాగ్నస్ జొహాన్సెన్ (డెన్మార్క్)పై నెగ్గాడు. 40 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఆయుశ్ తొలి గేమ్‌లో ఒకదశలో 14-4తో ఆధిక్యంలోకి వెళ్లాడు. అయితే మాగ్నస్ ఒక్కసారిగా చెలరేగి వరుసగా 11 పాయింట్లు నెగ్గి 15-14తో ఆధిక్యంలోకి వచ్చాడు. ఆ తర్వాత ఆయుశ్ ఒక పాయింట్ సాధించగా... మాగ్నస్ రెండు పాయింట్లు గెలిచాడు. స్కోరు 15-17 వద్ద ఆయుశ్ విజృంభించి వరుసగా ఆరు పాయింట్లు నెగ్గి తొలి గేమ్‌ను 21-17తో సొంతం చేసుకున్నాడు. హోరాహోరీగా సాగిన రెండో గేమ్‌లో స్కోరు 19-19 వద్ద ఆయుశ్ వరుసగా రెండు పాయింట్లు సాధించి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను దక్కించుకున్నాడు. మహిళల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ ఐరా శర్మ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించింది. క్వాలిఫయింగ్ ఫైనల్ మ్యాచ్‌లో ఐరా శర్మ 21-19, 21-11తో దిశా గుప్తా (అమెరికా)పై గెలిచింది. పురుషుల సింగిల్స్ మెయిన్ 'డ్రా'లో భారత్ నుంచి శ్రీకాంత్, తరుణ్, ప్రియాన్షు, రిత్విక్, శంకర్ ముత్తుస్వామి బరిలో ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో అన్మోల్, ఆకర్షి, శ్రియాన్షి, తాన్యా, తన్వీ శర్మ పోటీపడుతున్నారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



'పేస్ బౌలర్లను నిందించవద్దు'

- వారికి తగినంత సమయం ఇవ్వాలి
- తొలి టెస్టు ప్రదర్శనపై భారత జట్టు హెడ్ కోచ్ గంభీర్ వ్యాఖ్య

లీడ్స్: ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టెస్టులో భారత జట్టు పరాజయానికి పేలవమైన పేస్ బౌలింగ్ కూడా ఒక కారణం. తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా మినహా మిగితా వారంతా ఏమాత్రం ప్రభావం చూపలేకపోయారు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, శార్దుల్ ఠాకూర్ సమష్టిగా విఫలమయ్యారు. ప్రసిధ్ అయితే ఏకంగా ఓవర్‌కు ఆరుకు పైగా పరుగులు ఇచ్చాడు. అయితే భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తమ పేసర్లకు అండగా నిలిచాడు. ఒక్క ఓటమికే వారిని నిందించడం భావ్యం కాదని అతను పేర్కొన్నాడు. 'గతంలో భారత జట్టులో నలుగురు పేసర్లు ఉంటే వారంతా ఒక్కొక్కరు కనీసం 40 టెస్టుల అనుభవంతో ఉండేవారు. వన్డేలు, టి20ల్లో సమస్య లేకపోవచ్చు కానీ ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికాలాంటి చోట టెస్టులు ఆడేటప్పుడు అనుభవం ఎంతో కీలకం. బుమ్రా, సిరాజ్‌లకు కొంత అనుభవం ఉన్నా ప్రసిధ్ నాలుగు టెస్టులే ఆడాడు. తుది జట్టులో లేనివారిని చూసినా నితీశ్ రెడ్డికి ఐదు, హర్షిత్‌కు రెండు టెస్టుల అనుభవం మాత్రమే ఉండగా అర్‌‌ష్‌దీప్ ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఇది ఆరంభం మాత్రమే. వారు తమ ఆటను మెరుగు పర్చుకునేందుకు తగినంత సమయం **ఇవ్వాలి. ప్రతీ టెస్టు తర్వాత లోపాలను వెతికితే బలమైన బౌలింగ్ బృందాన్ని ఎలా తయారు చేయగలం. వారిలో తగినంత ప్రతిభ ఉంది కాబట్టే జట్టు**లోకి ఎంపికై ఇక్కడ ఉన్నారు' అని గంభీర్ సమర్థించాడు. తొలి నాలుగు రోజుల పాటు బౌలర్లు కూడా రాణించడం వల్లే భారత జట్టు ఆధిక్యం ప్రదర్శించగలిగిందని, వారిపై తనకు నమ్మకం ఉందని అతను అన్నాడు. ప్రసిధ్ కూడా బాగానే బౌలింగ్ చేశాడని... అతనితో పాటు శార్దుల్ కూడా కీలకదశలో రెండేసి వికెట్లు తీశారని గంభీర్ గుర్తు చేశాడు. ఫలానా ఆటగాళ్ల వల్లే తాము ఓడిపోయామంటూ ఎవరినీ బాధ్యులను చేయనన్న కోచ్... తాము గెలిచినా ఓడినా అందులో అందరి పాత్ర ఉంటుందని వెల్లడించాడు. కెప్టెన్‌గా తొలి టెస్టులో ఒత్తిడి సహజమన్న గంభీర్... ముున్ముందు గిల్ చాలా నేర్చుకొని మంచి ఫలితాలు రాబడతాడని విశ్వాసం వ్యక్తం చేశాడు. ఈ పర్యటనలో తాము ముందుగా అనుకున్నట్లుగా బుమ్రా మూడు టెస్టులు మాత్రమే ఆడతాడని, మిగిలిన నాలుగు మ్యాచ్‌లలో ఏ రెండు ఆడించాలనే విషయంపై టీమ్ మేనేజ్‌మెంట్ ఇంకా నిర్ణయం తీసుకోలేదని కోచ్ వెల్లడించాడు. తొలి టెస్టులో పంత్ రెండు సెంచరీలు సాధించిన విషయంపై మాట్లాడుతూ... 'పంత్ మాత్రమే కాదు. మరో ముగ్గురు కూడా సెంచరీలు సాధించారనే విషయం మరచిపోవద్దు. అయినా జట్టు గెలవనప్పుడు వ్యక్తిగత ప్రదర్శనలకు విలువ లేదు' అని గంభీర్ కాస్త ఘాటుగా జవాబిచ్చాడు.

'అదే కీలక మలుపు'

- భారత లోయర్ ఆర్డర్ వైఫల్యంపై స్టోక్స్
- ఓపెనర్లు గెలిపించారన్న ఇంగ్లండ్ కెప్టెన్

లీడ్స్: తొలి టెస్టులో భారత జట్టు లోయర్ ఆర్డర్‌ను కట్టడి చేయడం కూడా తమ విజయానికి ప్రధాన కారణమని ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అభిప్రాయపడ్డాడు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై కూడా తమ బౌలర్లు ప్రత్యర్థి చివరి వరుస బ్యాటర్లను తొందరగా అవుట్ చేయడంలో సఫలమయ్యారని అతను ప్రశంసించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 41 పరుగుల వ్యవధిలో చివరి 7 వికెట్లు కోల్పోయిన భారత్... రెండో ఇన్నింగ్స్‌లో 31 పరుగుల వ్యవధిలో చివరి 6 వికెట్లు చేజార్చుకుంది. 'ఇరు జట్లు నమోదు చేసిన స్కోర్లు చూస్తే మంచి బ్యాటింగ్ పిచ్ అని అర్థమవుతోంది. అయితే ఈ మ్యాచ్‌లో పలు మలుపులున్నా అన్నింటికంటే ప్రధానమైన కారణం రెండుసార్లూ భారత్ లోయర్ ఆర్డర్‌ను మేం కట్టడి చేయడమే అని నేను భావిస్తున్నా. రెండో ఇన్నింగ్స్‌లో అయితే భారత్ స్కోరు కనీసం 500 వరకు చేరే అవకాశం కనిపించింది. అలా జరిగితే మాకు ఛేదన కష్టమయ్యేది. కానీ మా బౌలర్లు వారికి ఆ అవకాశం ఇవ్వలేదు. చక్కటి ఆటతో పాటు ప్రతీ సెషన్‌లో మా ఆటగాళ్లు చూపిన పట్టుదల కూడా ప్రశంసనీయార్హం' అని స్టోక్స్ అన్నాడు. 371 పరుగుల ఛేదనలో శుభారంభం అందించిన ఓపెనర్లు డకెట్, క్రాలీలను కెప్టెన్ ప్రత్యేకంగా అభినందించాడు. ముఖ్యంగా జడేజా బౌలింగ్‌లో డకెట్ రివర్స్ స్వీప్‌లతో భారీగా పరుగులు రాబట్టడం అద్భుతమని... అతని సలహాతోనే తాను కూడా స్పిన్‌ను ఎదుర్కొనేందుకు రివర్స్ స్వీప్ వైపే మొగ్గు చూపానని ఇంగ్లండ్ కెప్టెన్ చెప్పాడు. హెడింగ్లీ మైదానంలో సాధారణంగా అవుట్‌ఫీల్డ్ చాలా వేగంగా ఉంటుందని, అందుబాటులో ఉన్న ఓవర్లన్నీ ఆడగలిగితే తాము విజయం సాధిస్తామనే గట్టి నమ్మకంతో ఉన్నామన్న స్టోక్స్... టాస్ గెలిచి ఫీల్డింగ్ తీసుకున్న నిర్ణయం చివరకు తప్పు కాకపోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశాడు.



సాక్షి సినిమా

ఇలాంటి సినిమాలు విజయం సాధించాలి



మురళీమోహన్

''డొక్కా సీతమ్మగారిలాంటి గొప్పవారిపై సినిమా తీస్తుండటం ఆనందంగా ఉంది. ఇప్పుడంతా కమర్షియల్ అయిపోయిన సమయంలో రాంబాబు, రవి నారాయణగారు 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ' చిత్రం నిర్మిస్తుండటం అభినందనీయం. ఇలాంటి సినిమాలు పెద్ద విజయాన్ని సాధించాలి'' అని మురళీమోహన్ తెలిపారు. టీవీ రవి నారాయణ్ దర్శకత్వంలో మురళీమోహన్, ఆమని ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ'. వల్లూరి రాంబాబు, మట్టా శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. జూన్ 24న మురళీమోహన్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి స్పెషల్ పోస్టర్‌ను, గ్లింప్స్‌ని విడుదల చేశారు. టీవీ రవి నారాయణ్ మాట్లాడుతూ– ''ఈ సినిమా ఆరంభం నుంచి మురళీమోహన్‌గారు ప్రోత్సహిస్తూనే ఉన్నారు. ఆయన వల్లే ఈ చిత్రం ఇక్కడివరకూ వచ్చింది'' అన్నారు. అతిథిగా హాజరైన డైరెక్టర్ రేలంగి నరసింహారావు మాట్లాడుతూ– ''డొక్కా సీతమ్మగారి' కథతో సినిమా తీస్తుండటం ఆనందంగా ఉంది'' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు కార్తీక్, నిర్మాతలు సాయివెంకట్, రామ సత్యనారాయణ, బెక్కెం వేణుగోపాల్, డైరెక్టర్ శివ నాగు, దాసన్న తదితరులు మాట్లాడారు.

ఆ పాత్ర గొప్పదనం అర్థమైంది - శివ బాలాజీ



''కన్నప్ప' చిత్రంలో మహదేవశాస్త్రి (మోహన్‌బాబు పాత్ర) కొడుకు పాత్ర చేయమని మోహన్‌బాబుగారు అన్నప్పుడు ఆలోచించాను. మరీ సైడ్‌కి అలా నిలబడే పాత్ర ఎలా చేయాలని విష్ణుని అడిగితే, 'నీ ఇష్టం' అన్నారు. మా ఆవిడ మధుమిత కూడా అలానే అన్నారు. ఫైనల్‌గా ఒప్పుకున్నాను. అయితే ఈ చిత్రంలో ఆ పాత్ర చేసి ఉండకపోతే నేను చాలా మిస్ అయ్యేవాణ్ణి. ఇప్పుడు నాకు ఆ పాత్ర గొప్పదనం అర్థమైంది'' అని శివ బాలాజీ అన్నారు. విష్ణు మంచు హీరోగా ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం 'కన్నప్ప'. మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ చిత్రంలో నటించిన శివ బాలాజీ మాట్లాడుతూ– ''కన్నప్ప'లో నా పాత్ర నిడివి, ప్రాముఖ్యత కాస్త తక్కువగా ఉంటుంది. కానీ, ఓ గొప్ప చిత్రం, పాన్ ఇండియన్ సినిమాలో భాగం అవ్వాలనే ఉద్దేశంతో ఇంకేమీ ఆలోచించకుండా ఒప్పుకున్నాను. ఈ చిత్రంలో ప్రభాస్, విష్ణు పాత్రల మధ్య వచ్చే సంభాషణలు అద్భుతంగా అనిపిస్తాయి. ఇక నేను చేసిన 'రెక్కీ' సినిమాకి అద్భుతమైన స్పందన వచ్చింది. 'రెక్కీ 2' త్వరలోనే రానుంది. ప్రస్తుతం 'సిందూరం' అనే చిత్రం చేశాను. అలాగే మోహన్‌బాబుగారి ప్రొడక్షన్‌లో నేను హీరోగా ఓ సినిమా చేస్తున్నాను'' అన్నారు.

నేను రెడీ ఫిక్స్



త్రినాథరావు, కావ్యా థాపర్, హవీష్, నిఖిల

''ఇటీవల విడుదలైన 'కుబేర' సినిమా విజయం సాధించడం సంతోషంగా ఉంది. రేపు రానున్న 'కన్నప్ప', ఆ తర్వాత వచ్చే సినిమాలన్నీ కూడా విజయం సాధించాలి. థియేటర్లు ప్రేక్షకులతో కళకళలాడాలని కోరుకుంటున్నాను'' అని డైరెక్టర్ నక్కిన త్రినాథరావు అన్నారు. హవీష్, కావ్యా థాపర్ జంటగా నటిస్తున్న చిత్రానికి 'నేను రెడీ' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. హార్నిక్స్ ఇండియా ఎల్‌ఎల్‌పీ బ్యానర్‌పై నక్కిన త్రినాథరావు దర్శకత్వంలో నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. ఈ మూవీ టైటిల్, గ్లింప్స్‌ను గురువారం రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో నక్కిన త్రినాథరావు మాట్లాడుతూ– ''మజాకా' చిత్రం తర్వాత రైటర్ విక్రాంత్ శ్రీనివాస్ 'నేను రెడీ' కథ చెప్పారు. ఈ కథ హవీష్‌కు బాగుంటుందనిపించి, వినిపించగా వెంటనే ఒప్పుకున్నారు. అప్పట్లో 'పెళ్లి సందడి' చిత్రంలో ఇండస్ట్రీలోని హాస్యనటులంతా నటించారని విన్నాం. 'నేను రెడీ' కూడా ఆర్టిస్టులతో కళకళగా ఉంటుంది. ఈ సినిమా షూటింగ్ 50 శాతం పూర్తయింది'' అని పేర్కొన్నారు. నిఖిల కోనేరు మాట్లాడుతూ–''నేను రెడీ' చిత్రంతో నిర్మాతగా అరంగేట్రం చేస్తుండటం సంతోషంగా ఉంది. మా నాన్న కోనేరు సత్యనారాయణగారి వారసత్వాన్ని సినిమా రంగంలో ముందుకు తీసుకువెళ్లాలనేది నా కల. మీ అందరి సపోర్ట్ కావాలి'' అని తెలిపారు. హవీష్ మాట్లాడుతూ – ''ఈ బర్త్ డే నాకు ఎంతో స్పెషల్. త్రినాథరావుగారితో ఎప్పుడో సినిమా చేయాల్సింది. కానీ, ఆయన బిజీగా ఉండటం వల్ల కుదరలేదు. 'నేను రెడీ'తో ఆ అవకాశం రావడం సంతోషంగా ఉంది'' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్టోరీ, డైలాగ్ రైటర్ విక్రాంత్ శ్రీనివాస్, ఎడిటర్ ప్రవీణ్ పూడి, నటుడు గోపరాజు రమణ మాట్లాడారు.



ప్రియాంక, విక్కీ



ప్రియాంకా చోప్రా

''ప్రియాంకా చోప్రా మేడమ్‌తో పని చేయడం నాకో ప్రత్యేకమైన అనుభవం. ఆమె చాలా తెలివి గలవారు... మంచి చమత్కారి... స్ట్రాంగ్ ఉమన్ కూడా. అందరితో చాలా ఫ్రెండ్లీగా ఉంటారు'' అంటూ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ విక్కీ భరత్వా కొనియాడారు. ఇంతకీ ప్రియాంకాతో కలిసి విక్కీ ఏ సినిమా చేశారంటే... మహేశ్ బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న

మీతో జర్నీ అద్భుతం మేడమ్

- ప్రియాంకా చోప్రా గురించి కొరియోగ్రాఫర్ విక్కీ భరత్వా

'ఎస్ఎస్ఎమ్‌బి 29' (వర్కింగ్ టైటిల్)కి. ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా ఓ లీడ్ రోల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాకి సంబంధించిన ఓ పాటకు విక్కీ నృత్యదర్శకుడిగా పని చేసినట్లుగా ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆయన షేర్ చేసిన పోస్ట్ స్పష్టం చేస్తోంది. ఈ పాటలో ప్రియాంకా చోప్రా ఎనర్జీ సూపర్ అని విక్కీ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. ''డ్యాన్స్ రిహార్సల్స్ సమయంలో, షూటింగ్ అప్పుడు ప్రియాంక కనబరిచిన ఎనర్జీ చాలా స్ఫూర్తిగా ఉంటుంది. తన శాయశక్తులా కృషి చేస్తారామె. ఆమెలో నాకు నచ్చిన ఇంకో విషయం ఏంటంటే... స్థాయిని బట్టి కాకుండా అందరితోనూ గౌరవంగా ఉంటారు. ఒకవైపు హార్డ్‌వర్క్ చేస్తూనే మరోవైపు తన చుట్టూ ఉన్న అందర్నీ పట్టించుకుంటారు. నాకు ఆమె మీద అభిమానం, గౌరవం పెరిగిపోయాయి. కళ పట్ల మీరు (ప్రియాంక) కనబరిచే అంకితభావం, ప్రేమ, అందరి పట్ల మీరు చూపించే గౌరవ మర్యాదలకు ధన్యవాదాలు మేడమ్. మీతో నా ఈ చిన్ని ప్రయాణం (ఎస్ఎస్ఎమ్‌బి 29ని ఉద్దేశించి) అద్భుతం. ఈ జర్నీలో భాగమైనందుకు చాలా హ్యాపీగా ఉంది'' అంటూ ప్రియాంకా చోప్రాపై తనకు ఏర్పడిన అభిమానాన్నంతా వ్యక్తపరిచారు విక్కీ భరత్వా. ఇదిలా ఉంటే... ప్రియాంకా చోప్రాపై చిత్రీకరించిన పాటలో మహేశ్‌బాబు కూడా ఉన్నారా? లేక సోలో పాటనా? అనేది తెలియాల్సి ఉంది. ఇక భారీ బడ్జెట్‌తో అంతర్జాతీయ స్థాయిలో ఈ చిత్రాన్ని కేఎల్ నారాయణ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈ పాన్ ఇండియా మూవీ వచ్చే ఏడాది విడుదలయ్యే అవకాశం ఉంది.

సిల్వర్ స్క్రీన్ పైకి దశావతారాలు



ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ తాజాగా క్లీమ్ ప్రొడక్షన్స్‌తో కలిసి పన్నెండేళ్ల ప్రణాళికతో మహావతార్ సినిమాటిక్ యూనివర్స్ (ఎంసీయూ) అనే ప్రాజెక్ట్‌ను ప్రారంభించింది. ఈ యూనివర్స్‌లో భాగంగా రానున్న తొలి చిత్రం 'మహావతార్ నరసింహ'. అశ్విన్ కుమార్ దర్శకత్వంలో శిల్పా ధవాన్, కుశల్ దేశాయి, చైతన్య దేశాయి నిర్మించారు. ఈ చిత్రం 3డీ ఫార్మాట్‌లో ఐదు భాషల్లో జూలై 25న రిలీజ్ కానుంది. సామ్ సీఎస్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'రోర్ ఆఫ్ నరసింహ...' పాటను రిలీజ్ చేశారు. సామ్ సీఎస్, రాకేందు మౌళి సాహిత్యం అందించి, పాడారు. ఈ సందర్భంగా అశ్విన్ కుమార్ మాట్లాడుతూ– ''ఇది కేవలం సినిమా కాదు... ఆధ్యాత్మిక అనుభూతి'' అన్నారు. ''ఇప్పుడు మన కథలు వెండితెరపై అలరించబోతున్నాయి. ఇదో అద్భుతమైన సినిమా ప్రయాణం'' అని శిల్పా ధవాన్ తెలిపారు. ఇదిలా ఉంటే... ఎంసీయూ దశావతారాలను తెరపైకి తీసుకొస్తుంది. 2025లో నరసింహ, 2027లో పరశురామ, 2029లో రఘునందన్, 2031లో ద్వారకాధీశ్, 2033లో గోకులానంద, 2035లో మహావతార్ కల్కి- పార్ట్ 1, 2037లో మహావతార్ కల్కి - పార్ట్ 2 ' చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు మేకర్స్ తెలిపారు.

మహాశివుడి నేపథ్యంలో...



ఆశా వెంకట్

సురేష్ రవి, ఆశా వెంకటేశ్ జంటగా జీవీ పెరుమాళ్ వర్దన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'చంద్రేశ్వర'. 'అదృశ్య ఖడ్గం' అనేది ట్యాగ్‌లైన్. బేబీ అఖిల సమర్పణలో డా. రవీంద్ర చారి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా రవీంద్ర చారి మాట్లాడుతూ– ''మహాశివుడి నేపథ్యంలో రూపొందిన 'చంద్రేశ్వర' సినిమాతో పరిశ్రమలోకి అడుగుపెడుతున్నాను. ఆర్కియాలజీ, ఎమోషన్స్‌తో కూడిన సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది. ఎలాంటి టెక్నాలజీ లేని ఆ కాలంలో మన పూర్వీకులు గొప్ప దేవాలయాలు నిర్మించారు. అప్పటి వారి జీవన విధానం ఎలా ఉండేది? వంటి అంశాలు మా చిత్రంలో ఆకట్టుకుంటాయి. ఆర్కియాలజీ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన తొలి చిత్రం మాదే అని గర్వంగా చెప్పగలం'' అని తెలిపారు.

కాలేజీ రోజుల్లోకి...



మిత్ర, రాజా దారపునేని, జెన్నీఫర్

గీతానంద్, మిత్రా శర్మ, శ్రీహాన్, జెన్నీఫర్ ఇమాన్యుయేల్, రోనిత్, అన్షుల ముఖ్య పాత్రలు పోషించిన చిత్రం 'వర్జిన్ బాయ్స్'. దయానంద్ గడ్డం దర్శకత్వంలో రాజా దారపునేని నిర్మించిన ఈ సినిమా జూలై 11న విడుదల కానుంది. స్మరణ్ సాయి సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'దం దిగ దం...' సాంగ్ లాంచ్ ఈవెంట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ పాటకి ప్రణవ్ చాగంటి సాహిత్యం అందించగా, యాజిన్ నిజార్ పాడారు. ఈ సందర్భంగా రాజా దారపనేని మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన మా సినిమాలో వినోదంతో పాటు మంచి ప్రేమకథ ఉంది. మా చిత్రాన్ని నైజాంలో ఏషియన్ సునీల్‌గారు డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు'' అన్నారు. దయానంద్ గడ్డం మాట్లాడుతూ– ''మా సినిమా ప్రేక్షకులను కాలేజ్ డేస్‌లోకి తీసుకెళ్లి, అప్పటి ఆ రోజులను గుర్తు చేస్తుంది'' అన్నారు.

హాలీవుడ్ ఎంట్రీ షురూ



వరలక్ష్మి, జెరెమీ ఐరన్స్

నటిగా దక్షిణాదిన మంచి గుర్తింపు తెచ్చుకున్న వరలక్ష్మీ శరత్‌కుమార్ హాలీవుడ్‌లో అడుగుపెట్టారు. 'రిజానా- ఎ కేజ్డ్ బర్డ్' చిత్రం ద్వారా ఆమె హాలీవుడ్ ఎంట్రీ షురూ అయింది. ఈ చిత్రంలో ప్రముఖ బ్రిటిష్ నటుడు జెరెమీ ఐరన్స్ హీరోగా నటిస్తున్నారు. ఆయనకి జోడీగా వరలక్ష్మి నటిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం శ్రీలంకలో జరుగుతోంది. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ– ''ఆస్కార్' అవార్డు గెలుచుకున్న జెరెమీ ఐరన్స్ వంటి గొప్ప నటుడితో కలిసి పని చేస్తుండటంతో నా కల నెరవేరినట్టు అనిపిస్తోంది. 'లయన్ కింగ్' సినిమాలో స్కార్ పాత్రకు ఆయనే వాయిస్ ఇచ్చారు. ఆ సినిమా అంటే నాకు చాలా ఇష్టం. శ్రీలంకలోనే కాదు, ప్రపంచ సినిమాకే చంద్రన్ రత్నంగారు కొత్తదారులు చూపిన దర్శకుడు. ఇలాంటి అద్భుతమైన అంతర్జాతీయ స్టార్స్‌తో సినిమా చేసే ఛాన్స్ దొరికినందుకు హ్యాపీగా ఉంది. నా కెరీర్‌లో మరిచిపోలేని ఒక మైలురాయి 'రిజానా-ఎ కేజ్డ్ బర్డ్'' అని పేర్కొన్నారు. ''వాస్తవ కథ ఆధారంగా రూపొందిస్తున్న చిత్రం ఇది. దక్షిణాసియా, అంతర్జాతీయ సినిమా మధ్య ఓ హిస్టారికల్ కొలాబరేషన్‌గా ఈ చిత్రం నిలుస్తుంది'' అని చిత్రయూనిట్ తెలిపింది.

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	700	82,756
నిఫ్టీ ▲	200	25,245

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,939	▲	33
డోజోన్స్	42,934	▼	155
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,719	▼	40
డాక్స్	23,498	▼	143
షాంఘై	3,456	▲	36
నికాయ్	38,942	▲	152

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.60	86.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	115.60	118.04
€	యూరో	ఎస్‌బీఐ	98.70	101.44
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.68	60.21
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.47	59.29
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	68.86	69.53
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.05	23.57
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.55	24.33
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.12	12.94

అంబానీ.. అదానీ ఇంధన బంధం!

- మళ్లీ జట్టుకట్టిన అపర కుబేరులు...
- ఇంధనాల విక్రయంలో భాగస్వామ్యం
- జియో–బీపీ పెట్రోల్ బంకుల్లో అదానీ సీఎన్‌జీ పంపులు
- అదానీ టోటల్ గ్యాస్ ఔట్‌లెట్లలో అంబానీ పెట్రోల్, డీజిల్ అమ్మకాలు



న్యూఢిల్లీ: దేశీ దిగ్గజాలు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ మరో భారీ వ్యాపార వెంచర్ కోసం చేతులు కలిపారు. ఒకరి ఇంధన రిటైల్ నెట్‌వర్క్‌లో మరొకరి ఇంధనాలను విక్రయించుకునేందుకు వీలుగా ఒప్పందం కుదుర్చుకున్నారు. దీని ప్రకారం అదానీ టోటల్ గ్యాస్ (ఏటీజీఎల్) సీఎన్‌జీ రిటైల్ ఔట్‌లెట్స్‌లో జియో–బీపీ తమ పెట్రోల్, డీజిల్ ఇంధనాలను విక్రయిస్తుంది. అలాగే, జియో–బీపీ పెట్రోల్ బంకుల్లో ఏటీజీఎల్ తమ సీఎన్‌జీ పంపులను ఏర్పాటు చేస్తుంది. ప్రస్తుతమున్న, భవిష్యత్‌లో రాబోయే ఔట్‌లెట్స్ అన్నింటికీ ఈ ఒప్పందం వర్తిస్తుందని ఇరు సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపాయి. జియో–బీపీ అనేది అంబానీకి చెందిన జియో, బ్రిటన్ సంస్థ బీపీ మధ్య జాయింట్ వెంచర్. ఇక, ఏటీజీఎల్ అనేది అదానీ గ్రూప్, ఫ్రాన్స్‌కి చెందిన టోటల్ ఎనర్జీస్ కలిసి ఏర్పాటు చేసిన జేవీ సంస్థ. జియో–బీపీకి దేశవ్యాప్తంగా 1,972 పెట్రోల్ బంకులు ఉండగా, ఏటీజీఎల్‌కి 659 సీఎన్‌జీ స్టేషన్లు ఉన్నాయి. ఇరు సంస్థల పటిష్టమైన నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని కస్టమర్లకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని జియో–బీపీ చైర్మన్ సార్థక్ బెహూరియా తెలిపారు. ఈ డీల్ ద్వారా ఔట్‌లెట్స్‌లో అత్యంత నాణ్యమైన, వివిధ రకాల ఇంధనాలను అందించాలనేది తమ ఉమ్మడి లక్ష్యమని ఏటీజీఎల్ ఈడీ సురేష్ పి. మంగ్లానీ చెప్పారు.

పీఎస్‌యూలకు పోటీ..: ప్రస్తుతం ఇంధనాల రిటైలింగ్ విభాగంలో ప్రభుత్వ రంగ సంస్థల (పీఎస్‌యూ) ఆధిపత్యం కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా 97,366 పెట్రోల్ బంకులు ఉండగా మూడు పీఎస్‌యూలకు (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐవోసీ), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్తాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్)) ఏకంగా 90% వాటా ఉంది. సిటీ గ్యాస్ పంపిణీ వ్యాపారంలో కూడా అవి ముందుంటున్నాయి. ఈ నేపథ్యంలో అదానీ, అంబానీ చేతులు కలపడం వల్ల వాటి ఆధిపత్యానికి గండి కొట్టే అవకాశాలు ఉన్నాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. ఏటీజీఎల్ సంస్థ గృహాలు, పరిశ్రమలు, వాహనదారులు, ఇతరత్రా కస్టమర్లకు గ్యాస్‌ను, ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ సదుపాయాలు మొదలైనవి అందిస్తోంది. మరోవైపు, జియో–బీపీ ఇంధనాల రిటైలింగ్‌తో పాటు పర్యావరణహిత ప్రత్యామ్నాయ ఇంధనాలు, కన్వీనియెన్స్ స్టోర్స్ మొదలైన విభాగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

ఇప్పటికే ఓ పవర్ ప్రాజెక్టులో..

ఇరువురు కుబేరులు వ్యాపార అవసరాలరీత్యా జట్టు కట్టడం ఇటీవలి కాలంలో ఇది రెండోసారి. గతేడాది మార్చిలో మధ్యప్రదేశ్‌లోని ఓ విద్యుత్ ప్రాజెక్టు కోసం ఇద్దరూ చేతులు కలిపారు. అదానీ పవర్ ప్రాజెక్టులో రిలయన్స్ ఇండస్ట్రీస్ 26 శాతం వాటా కొనుగోలు చేసింది.

పోటా పోటీ..

గుజరాత్‌కే చెందిన అంబానీ, అదానీ ఇద్దరికీ బడా వ్యాపార సామ్రాజ్యాలు ఉన్న సంగతి తెలిసిందే. ఆసియాలోనే నంబర్ వన్ సంపన్నులుగా నిలవడంలో గత కొన్నాళ్లుగా ఇద్దరి మధ్య పోటీ నడుస్తోంది. అంబానీ ఓవైపు ఆయిల్, గ్యాస్, రిటైల్, టెలికం తదితర రంగాల్లో విస్తరించగా అదానీ మరోవైపు నౌకాశ్రయాలు, విమానాశ్రయాలు, బొగ్గు, మైనింగ్ తదితర మౌలిక సదుపాయాల రంగాల్లో విస్తరించారు. పర్యావరణహిత ఇంధనాల ప్రాజెక్టులను మినహాయిస్తే ఇద్దరూ ఒకరి రంగంలోకి మరొకరు అడుగుపెట్టలేదు. అదానీ మెగా రెన్యువబుల్ ఎనర్జీ పార్క్‌లు, సోలార్ మాడ్యూల్స్ .. విండ్ టర్బైన్ల తయారీపై దృష్టి పెట్టారు. అటు అంబానీకి చెందిన రిలయన్స్ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో నాలుగు గిగాఫ్యాక్టరీలను ఏర్పాటు చేస్తోంది. ఇక 2014 నుంచి సీఎన్‌బీసీ–టీవీ18, సీఎన్ఎన్–న్యూస్18, కలర్స్ లాంటి టీవీ చానళ్ల ద్వారా అంబానీ మీడియా రంగంలో కార్యకలాపాలు సాగిస్తుండగా.. ఎన్‌డీటీవీ కొనుగోలు ద్వారా అదానీ కూడా ఇటీవలే ఈ విభాగంలోకి ప్రవేశించారు.

నా జీవితంలో అతిపెద్ద రిస్క్.. జియో

అందరూ వద్దని హెచ్చరించినా నేను వినలేదు..

ఒకవేళ విఫలమైనా, దేశానికి మేలు చేసినట్లయ్యేది ● ఇంటర్వ్యూలో ముకేశ్ అంబానీ వెల్లడి

న్యూఢిల్లీ: జియో రూపంలో టెలికం రంగంలోకి రీఎంట్రీ చేయడమనేది తన జీవితంలో తీసుకున్న అతి పెద్ద రిస్క్‌గా రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ అభివర్ణించారు. అత్యంత అధునాతనమైన డిజిటల్ టెక్నాలజీకి భారత్‌లో పరిస్థితులు ఇంకా అనువుగా లేవని, ఈ వెంచర్ ఆర్థికంగా విఫలమవుతుందని విశ్లేషకులు హెచ్చరించినప్పటికీ వెనక్కి తగ్గలేదని ఆయన చెప్పారు. ఒకవేళ విశ్లేషకులు చెప్పినది నిజంగానే జరిగినా కూడా, దేశాన్ని డిజిటల్ బాట పట్టించడంలో జియో కీలక పాత్ర పోషించిన నేపథ్యంలో, ఆ మాత్రం రిస్కు తీసుకోవడంలో తప్పు లేదనిపించిందని మెకిన్సే అండ్ కంపెనీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. 'మేము ఎప్పుడూ పెద్ద రిస్కులే తీసుకున్నాం. మాకు భారీ స్థాయి ముఖ్యం. మేము ఇప్పటి వరకు తీసుకున్న అతి పెద్ద రిస్కు జియోనే. అప్పట్లో మా సొంత డబ్బును ఇన్వెస్ట్ చేశాం. నేను మెజారిటీ వాటాదారుగా ఉన్నాను. 4జీ మొబైల్ నెట్‌వర్క్ విస్తరణ కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్ కోట్ల కొద్దీ డాలర్లను ఇన్వెస్ట్ చేస్తున్న క్రమంలో ఈ టెక్నాలజీకి భారత్‌లో అనువైన పరిస్థితులు లేవని, డబ్బంతా వృథా అవుతుందని కొందరు విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. కానీ మా కంపెనీ బోర్డుకు నేను ఒక్కటే చెప్పాను. ఇదంతా మన సొంత డబ్బు. మహా అయితే దీనిపై మనకు పెద్దగా ఆదాయం రాకపోవచ్చు. ఫర్వాలేదు. దీనితో దేశాన్ని డిజిటలైజ్ చేయొచ్చు. భారత్‌ను సంపూర్ణంగా మార్చివేయొచ్చు. ఆ విధంగా దేశం కోసం రిలయన్స్ ఒక గొప్ప మేలు చేసినట్లవుతుంది. అత్యుత్తమ విరాళం ఇచ్చినట్లవుతుంది అన్నాను' అని అంబానీ పేర్కొన్నారు. 2016లో ప్రారంభమైన జియో.. నేడు 47 కోట్ల మంది యూజర్లతో, 5జీ, క్లౌడ్, ఏఐ సర్వీసుల్లోనూ కార్యకలాపాలతో టెలికంలో అగ్రస్థానంలో ఉంది.

ఇంకా ఏమన్నారంటే..

- ప్రపంచం ప్రతి అయిదేళ్లకో లేదా పదేళ్లకో మారిపోతూ ఉంటుంది. మనం బిజినెస్ స్కూల్‌లో నేర్చుకున్న దానికి పూర్తి విరుద్ధంగా జరుగుతుంటుంది. మేము అలాంటి పరిస్థితులకు సవాలు విసిరాం. రిలయన్స్ 1960లలో ఒకలాగా, 70ల్లో ఆ తర్వాత 2000.. 2020లలో మరోలాగా మారింది. ఇప్పుడు పూర్తి భిన్నం.
- రిస్క్ మేనేజ్‌మెంట్ విషయానికొస్తే.. ఒకవేళ పరిస్థితులు ఘోరంగా దిగజారితే బైటపడగలమా అనేది ఆలోచించాలి. ఏం చేసినా సరే మా ఉద్యోగుల కళ్లలోకి చూసి నిజాయితీగా మాట్లాడగలిగేలా ఉండాలని 30..40 ఏళ్ల క్రితం నేను వ్యక్తిగతంగా ఒక సిద్ధాంతం పెట్టుకున్నాను. ఈ సంస్థాగత సంస్కృతే ఎంత పెద్ద రిస్కుల నుంచైనా కాపాడగలిగే బీమా.
- డీప్–టెక్, అధునాతన తయారీ కంపెనీగా ఎదగాలనేది రిలయన్స్ లక్ష్యం. మన దగ్గర సరైన టాలెంట్, సరైన లక్ష్యం అంటూ ఉంటే ఎక్కడికి వెళ్లాలి, కోరుకున్నది ఎలా సాధించాలనేది ఏదో విధంగా కనుక్కుంటాం. అది రిలయన్స్ డీఎన్ఏలోనే ఉంది.

నాన్నకు మాటిచ్చాను..

ఇంటర్వ్యూ సందర్భంగా ముకేశ్ అంబానీ తన తండ్రి ధీరుభాయ్ అంబానీని గుర్తు చేసుకున్నారు. 'రిలయన్స్ అనేది ఒక నిరంతర ప్రక్రియ. ఈ సంస్థ చిరకాలం ఉండాలి. నా తర్వాత, నీ తర్వాత కూడా రిలయన్స్ కొనసాగేలా నువ్వు చూడాలి అని నాన్న చెప్పారు. మా తదనంతరం కూడా రిలయన్స్ ఉంటుందని నేను ఆయనకు మాట ఇచ్చాను. 2027లో రిలయన్స్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకుంటుంది. కానీ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న తర్వాత కూడా రిలయన్స్ భారతదేశానికి, మానవాళికి సేవ చేయడాన్ని కొనసాగించాలని నేను కోరుకుంటున్నాను. అది కచ్చితంగా జరుగుతుందని గాఢంగా నమ్ముతున్నాను' అని ముకేశ్ అంబానీ చెప్పారు.



రెండోరోజూ బుల్ జోరు



ముంబై: ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధ ఉద్రిక్తతలు తగ్గడం, చమురు ధరలు చల్లారడటంతో రెండోరోజూ బుల్ జోరు కనబరిచింది. సెన్సెక్స్ 700 పాయింట్లు ఎగసి 82,756 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 200 పాయింట్లు బలపడి 25,245 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల సంకేతాలతో ఉదయం సూచీలు లాభాల్లో మొదలయ్యాయి. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపడంతో రోజంతా లాభాల్లో ట్రేడయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 761 పాయింట్లు బలపడి 82,816 వద్ద, నిఫ్టీ 223 పాయింట్లు ఎగసి 25,267 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. ఆసియాలో దక్షిణ కొరియా, జపాన్ నికాయ్, హాంగ్‌కాంగ్ సూచీలు ఒకటిన్నర శాతం లాభపడ్డాయి. యూరప్ మార్కెట్లు అరశాతం నష్టపోయాయి. అమెరికా మార్కెట్లు స్వల్ప నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- క్యాపిటల్ గూడ్స్, ఆయిల్‌అండ్‌గ్యాస్ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. రంగాల వారీగా బీఎస్ఈ ఇండెక్సుల్లో ఐటీ 1.70%, టెలికమ్యూనికేషన్ 1.50%, కన్జూమర్ డిస్క్రెషనరీ 1.26%, కన్జూమర్ డ్యూరబుల్స్ 1.20%, ఫార్మా ఒకశాతం చొప్పున పెరిగాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1.59%, 0.63 శాతం పెరిగాయి.
- లాభాల మార్కెట్లోనూ ఆరిస్ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ లిస్టింగ్ మెప్పించ లేకపోయింది. ఇష్యూ ధర (రూ. 222) తో పోలిస్తే బీఎస్ఈలో 6% డిస్కౌంట్‌తో రూ.209 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో మరింత దిగజారింది. ఒక దశలో 23% క్షీణించి రూ.171 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 22% నష్టంతో రూ.174 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

పీఎల్ఐ ప్రోత్సాహకాలు... రూ.21,534 కోట్లు	5జీ యూజర్లు @ 98 కోట్లు..!

విద్య, ఉద్యోగ సమాచారం

నేషనల్ లా యూనివర్శిటీలో ఎల్ఎల్ఎం ప్రవేశాలు

న్యూఢిల్లీలోని నేషనల్ లా యూనివర్శిటీ ఢిల్లీ 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎల్ఎల్ఎం(ప్రొఫెషనల్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **స్పెషలైజేషన్లు:** క్రిమినల్ లా, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ స్టడీస్,ఇంటలెక్చువల్ ప్రాపర్టీ లా, కమర్షియల్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా అండ్ జస్టిస్, ప్రాపర్టీ అండ్ రియల్ ఎస్టేట్ లా, టాక్సేషన్ లా.
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా విభాగంలో డిగ్రీ/పీజీ ఉత్తీర్ణులవ్వాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.07.2025
» **వెబ్‌సైట్:** https://nludelhi.ac.in

మునిషన్స్ ఇండియా లిమిటెడ్‌లో 140 అప్రెంటిస్‌లు

మునిషన్స్ ఇండియా లిమిటెడ్ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న గ్రాడ్యుయేట్, డిప్లొమా అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 140.
» **ఖాళీల వివరాలు:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్(ఇంజనీర్)–45, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్(జనరల్ స్ట్రీమ్)–45, టెక్నీషియన్ అప్రెంటిస్(డిప్లొమా)–50. » **విభాగాలు:** మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, బ్యాచిలర్ ఆఫ్ సైన్స్, కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, బీటెక్, డిప్లొమాలో ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 14 ఏళ్లు పైబడిన అభ్యర్థులు అర్హులు. గరిష్ట వయోపరిమితి లేదు.
» **దరఖాస్తు విధానం:** దరఖాస్తును ది చీఫ్ జనరల్ మేనేజర్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ చందా, చంద్రాపూర్ జిల్లా, మహారాష్ట్ర–442501 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 19.07.2025.
» **వెబ్‌సైట్:** https://munitionsindia.in

ఎన్ఐఈపీఎండీ, చెన్నైలో 11 పోస్టులు

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టీపుల్ డిజబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ).. తాత్కాలిక ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
» **పోస్టుల వివరాలు:** అసోసియేట్ ప్రొఫెసర్(ప్రోస్థెటిక్స్–ఆర్థోటిక్స్)–1, క్లినికల్ అసిస్టెంట్(ఆడియాలజిస్ట్–గ్రేడ్1)–1, క్లినికల్ అసిస్టెంట్(స్పీచ్ పాథాలజిస్ట్–గ్రేడ్1)–1, క్లినికల్ అసిస్టెంట్(స్పీచ్–హియరింగ్)–1, డైరెక్టర్(కన్సల్టెంట్)–1, క్లినికల్ అసిస్టెంట్(డెవలప్‌మెంట్ థెరపిస్ట్)–1, క్లినికల్ అసిస్టెంట్(స్పీచ్ థెరపిస్ట్)–1, స్పెషల్ ఎడ్యుకేటర్(కన్సల్టెంట్)–1, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్(కన్సల్టెంట్)–1, అసిస్టెంట్(కన్సల్టెంట్)–1, అకౌంటెంట్ (కన్సల్టెంట్)–1.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, డీఈడీ, బీఈడీ, పీజీ డిప్లొమా, పీజీ, బీఎస్సీ, ఎంఎస్సీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **గరిష్ట వయో పరిమితి:** 56 ఏళ్లు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.07.2025
» **వెబ్‌సైట్:** https://niepmd.nic.in

ఇన్‌స్ట్రుమెంటేషన్ లిమిటెడ్, పాలక్కడ్‌లో వివిధ ఉద్యోగాలు

పాలక్కడ్(కేరళ)లోని ఇన్‌స్ట్రుమెంటేషన్ లిమిటెడ్ రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **పోస్టుల వివరాలు:** అడిషనల్ జనరల్ మేనేజర్(ప్లాంట్ ఆపరేషన్స్)–1,సీనియర్ మేనేజర్(ఫైనాన్స్ అండ్ అకౌంట్)–1, సీనియర్ ఇంజనీర్(డిజైన్ ఇంజనీరింగ్ అండ్ అసెంబ్లీ)–2, సీనియర్ ఇంజనీర్(క్వాలిటీ కంట్రోల్)–1, అకౌంట్ ఆఫీసర్(ఫైనాన్స్ అండ్ అకౌంట్)–1.
» **అర్హత:** సంబంధిత విభాగాల్లో సీఏ/సీడబ్ల్యూఏ, సీఎంఏ, బీఈ/బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. » **వయసు:** అడిషనల్ జనరల్ మేనేజర్‌కు 57 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 47 ఏళ్లు, సీనియర్ ఇంజనీర్‌కు 38 ఏళ్లు, అకౌంట్ ఆఫీసర్‌కు 35 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్,ఇంటర్వ్యూ ద్వారా.
» **దరఖాస్తు విధానం:** దరఖాస్తును డిప్యూటీ మేనేజర్, ఇన్‌స్ట్రుమెంటేషన్ లిమిటెడ్, కంజికోడ్ వెస్ట్, పాలక్కడ్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.07.2025.
» **వెబ్‌సైట్:** https://ilpgt.com

క్రియేటివిటీకి కేరాఫ్.. ఫైన్ ఆర్ట్స్

» ఎఫ్‌ఏడీఈఈ 2025 నోటిఫికేషన్ విడుదల
» జేఎన్ఏఎఫ్ఏయూలో ఫైన్ ఆర్ట్స్ కోర్సులు
» ప్రవేశ పరీక్షలో ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు

చిత్రలేఖనం, శిల్పకళ, ఫొటోగ్రఫీ, ఇంటీరియర్ డిజైన్, యానిమేషన్.. వంటి పలు రకాల ఫైన్ ఆర్ట్స్ కోర్సులను అందించడంలో హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ)కి జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ) కోర్సుల్లో ప్రవేశానికి ప్రతి ఏటా ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(ఎఫ్ఏడీఈఈ)ను వర్సిటీ నిర్వహిస్తుంది. తాజాగా 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎఫ్ఏడీఈఈ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఎఫ్ఏడీఈఈ 2025తో ప్రవేశం కల్పించే కోర్సులు-సీట్లు, ప్రవేశ పరీక్ష, సిలబస్ తదితర వివరాలు..



కెరీర్ గైడెన్స్

కోర్సులు ఆరు.. సీట్లు 275

జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (జేఎన్ఏఎఫ్ఏయూ)..బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ)లో భాగంగా ఆరు రకాల కోర్సులను అందిస్తోంది. ఇందులో మొత్తం 275 సీట్లు ఉన్నాయి.

- బీఎఫ్ఏ(అప్లయిడ్ ఆర్ట్ అండ్ విజువల్ కమ్యూనికేషన్)లో రెగ్యులర్–35, సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు–15.
- బీఎఫ్ఏ(పెయింటింగ్)–రెగ్యులర్–20, సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్ సీట్లు–15.
- బీఎఫ్ఏ(స్కల్ప్చర్)–రెగ్యులర్–10, సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్–10.
- బీఎఫ్ఏ(యానిమేషన్ అండ్ వీఎఫ్ఎక్స్)–సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్–60.
- బీఎఫ్ఏ(ఫొటోగ్రఫీ అండ్ విజువల్ కమ్యూనికేషన్)–రెగ్యులర్–30,సెల్ఫ్ సపోర్టింగ్ స్ట్రక్చర్–20.
- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(ఇంటీరియర్ డిజైన్)–సపోర్టింగ్ స్ట్రక్చర్–60.

అర్హత

ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణత సాధించాలి.

పరీక్ష ఇలా

- బీఎఫ్ఏ అప్లయిడ్ ఆర్ట్స్, పెయింటింగ్, స్కల్ప్చర్ అండ్ యానిమేషన్ కోర్సులకు పేపర్–ఏలో మెమొరీ డ్రాయింగ్, కలరింగ్ విభాగాల్లో 100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఏదైనా అంశాన్ని ఇస్తారు. దానికి దృశ్య రూపాన్ని ఇవ్వాలి. పరీక్ష సమయం 90 నిమిషాలు.
- **పేపర్–బీ:** ఆబ్జెక్టివ్ తరహాలో 50 మార్కులకు పరీక్ష ఉంటుంది. పరీక్ష సమయం 50 నిమిషాలు. ఇందులో జీకే, కరెంట్ అఫైర్స్–15 ప్రశ్నలు, ఇంగ్లిష్–15 ప్రశ్నలు, జనరల్ ఆర్ట్ ఓరియంటెడ్ 20 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు.
- **పేపర్ సీ:** ఆబ్జెక్టివ్ డ్రాయింగ్‌లో 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష సమయం 90 నిమిషాలు. ఇందులో భాగంగా ఏదైనా వస్తువు లేదా బొమ్మ చూపుతారు.ఆ దృశ్యాన్ని గీసి,దాని చుట్టూ పరిసరాలను ఊహించి వర్ణనాత్మక చిత్రాన్ని రూపొందించాలి. ఇందులో చిత్ర నైపుణ్యాలు, ఊహ, పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఉంటుంది.
- బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ అండ్ విజువల్ కమ్యూనికేషన్స్ పరీక్షలో కంపోజిషన్, విజువల్ కమ్యూనికేషన్ 100 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 90 నిమిషాలు. ఇందులో డ్రాయింగ్, కంపోజిషన్ నైపుణ్యాలు పరిశీలిస్తారు. ఏదైనా అసంపూర్ణ దృశ్యం ఇచ్చి.. దాని చుట్టు ఉండే అవసరమైన ఇతర అంశాలను అందులో చేర్చి తీర్చిదిద్దమంటారు. ఇందులో మరో ఆబ్జెక్టివ్ టైప్ పేపర్ 50 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం 50 నిమిషాలు. ఇందులో జీకే, కరెంట్ అఫైర్స్ 15, ఇంగ్లిష్ 15, జనరల్ ఆర్ట్ ఓరియంటెడ్ నుంచి 20 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు.
- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బి.డిజైన్) పరీక్షను 200 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి 3 గంటలు. ఇందులో జీకే, కరెంట్ అఫైర్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇలస్ట్రేటివ్, అనలిటికల్ అండ్ డిజైన్ ఎబిలిటీ, మెమొరీ డ్రాయింగ్, కలర్ కో–ఆర్డినేషన్ నుంచి ప్రశ్నలు వస్తాయి.

భిన్నమైన ప్రిపరేషన్

పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి ముందు వరుసలో నిలవాలంటే.. అభ్యర్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అభ్యర్థి ఊహ, సృజనాత్మకత, సరికొత్తగా ఆలోచించే తీరును పరీక్షలో ప్రధానంగా పరీక్షిస్తారు. ప్రాక్టీస్ ఎక్కువగా చేసిన వారే నిర్ణీత సమయంలో ఒక ఊహకు అందమైన డ్రాయింగ్‌ను ఇవ్వగలరు. దీంతోపాటు వర్తమాన అంశాలు, ఇంగ్లిష్ గ్రామర్‌పైనా ఫోకస్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తు చివరి తేది:** 26.06.2025. ఆలస్య రుసుంతో 03.07.2025 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **పరీక్ష తేదీలు:** 2025 జూలై 11, 12 తేదీల్లో
- **వెబ్‌సైట్:** www.jnafau.ac.in

కెరీర్ ఇలా

ప్రతి ఒక్కరికి ఏదో ఒక కళపై ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. హాబీగా చేసే ఆ పనిలో ఎంతో క్రియేటివిటీ, నైపుణ్యం దాగి ఉంటాయి. ఆసక్తి ఉన్న అదే రంగంలో మరింత ప్రావీణ్యం పొంది.. దాన్నే ఉపాధి వేదికగా మార్చుకోవచ్చు. చేస్తున్న పనిలో సంతృప్తినీ పొందవచ్చు. పెయింటింగ్, శిల్పకళ, ఫొటోగ్రఫీ, ఇంటీరియర్ డిజైన్, యానిమేషన్ వంటి వాటిపై ఆసక్తి ఉన్న వారికి ఫైన్ ఆర్ట్స్ కోర్సులు ఉత్తమ ఎంపిక.

శిల్పకళ

స్కల్ప్చర్ కోర్సును పూర్తి చేసిన వారు శిల్పులు, చిత్రకారులుగా రాణించవచ్చు. ఆర్ట్ మ్యూజియంలు,గ్యాలరీలు,మ్యూజియంలలో ఉద్యోగ అవకాశాలుంటాయి. దేవతామూర్తుల విగ్రహాలు మొదలుకొని రాజకీయ నాయకులు, ఇతర ప్రముఖుల విగ్రహాలను తయారు చేసే కంపెనీలను ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధిని పొందవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు ఏజెన్సీలకు శిల్పాలను సరఫరా చేయవచ్చు.

ఇంటీరియర్ డిజైన్

ఒక ఇంటిని, కార్యాలయ సముదాయాన్ని అందంగా తీర్చిదిద్దడమే ఇంటీరియర్ డిజైన్. ఫర్నీచర్ డిజైనింగ్, ఎగ్జిబిషన్ డిజైనర్, లైటింగ్ డిజైనర్, కిచెన్ డిజైనర్, ఆర్కిటెక్చురల్ టెక్నాలజిస్టు, ప్రొడక్ట్ డిజైనర్, టెక్స్‌టైల్ డిజైనర్ వంటి ఉద్యోగాలలో స్థిరపడవచ్చు. నేటి ఆధునిక యుగంలో ప్రతి వ్యాపార సంస్థ ఇంటీరియర్ డిజైన్‌కు ప్రాధాన్యం ఇస్తుండటంతో.. ఈ కోర్సు పూర్తి చేసిన వారికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది.

అప్లయిడ్ ఆర్ట్

రోజువారీ పనులకు కళాత్మకతను జోడించడమే అప్లయిడ్ ఆర్ట్. ఈ కోర్సులో భాగంగా డ్రాయింగ్, పెయింటింగ్, క్లే మోడలింగ్, బేసిక్ విజువల్ అండ్ గ్రాఫిక్స్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తారు. సినిమా రంగంలో ఆర్ట్ డైరెక్టర్‌గా స్థిరపడాలనుకునే వారికి ఈ కోర్సు ఉత్తమ మార్గం. సెట్ డిజైనర్‌గా, విజువలైజర్‌గానూ అవకాశాలుంటాయి. దుస్తుల పరిశ్రమలో డిజైనర్, ఆభరణాల డిజైనింగ్, యాడ్ ఫిలిం ఏజెన్సీల్లో స్టోరీ బోర్డ్ ఆర్టిస్ట్‌గా, క్రియేటివ్ ఆర్ట్ డైరెక్టర్‌గా పలు అవకాశాలు లభిస్తాయి.

చిత్రకళ

ఒక ఊహకు అందమైన రూపం ఇచ్చే కళ.. పెయింటింగ్. చిత్రకళకు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఈ కోర్సులో భాగంగా పెయింటింగ్‌కు సృజనాత్మకతను ఎలా జోడించాలో బోధిస్తారు. ఆయిల్ పెయింటింగ్, వాటర్ కలర్ పెయింటింగ్, ఆక్రిలిక్ పెయింటింగ్, టెంపెరా పెయింటింగ్ వంటి ప్రాచుర్యం పొందిన రంగాల్లో శిక్షణ ఇస్తారు. ఈ కోర్సు పూర్తి చేసిన వారు ఫ్రీలాన్స్ ఆర్టిస్ట్‌గా స్థిరపడవచ్చు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లో ఆర్ట్ టీచర్లుగా అవకాశాలు ఉంటాయి. పోటీ తక్కువగా ఉన్న రంగాల్లో ఆర్ట్ టీచర్ ఒకటి.

యానిమేషన్

ఈ కోర్సు పూర్తి చేసిన వారికి ఉపాధి గ్యారంటీ అని చెప్పొచ్చు. ఆన్‌లైన్ గేమింగ్‌పై యువత నానాటికీ మోజు పెంచుకుంటుండటంతో ఈ కోర్సు చేసిన వారికి మంచి డిమాండ్ ఉంది. సినిమాలు, టెలివిజన్, ప్రకటన రంగాల్లో వీరికి ప్రధానంగా ఉపాధి లభిస్తుంది.

ఫొటోగ్రఫీ

వంద భావాలను ఒక ఫొటో వ్యక్తం చేయగలదు.క్రేజీ కోర్సుల్లో ఫొటోగ్రఫీ ఒకటి. ఇందులో మెళకువలు నేర్చుకున్న వారికి ప్రభుత్వ,ప్రైవేటు రంగాల్లో అవకాశాలు లభిస్తాయి. సొంతంగా డిజిటల్ ల్యాబ్‌లు, గ్రీన్ మ్యాట్ స్టూడియోలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఫ్యాషన్ ఫొటోగ్రఫీ, ఆటోమొబైల్ ఫొటోగ్రఫీ, కార్పొరేట్ ఫొటోగ్రఫీ, వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీ వంటి రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–సైన్స్ మెథడ్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–జాగ్రఫీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–ఇంగ్లిష్

మంచు విష్ణు ఆఫీస్‌లో ఐటీ సోదాలు

సాక్షి, హైదరాబాద్/మాదాపూర్: 'కన్నప్ప' సినిమా నిర్మాత మంచు విష్ణు కార్యాలయాల్లో ఐటీ, జీఎస్టీ అధికారులు బుధవారం సోదాలు చేశారు. భారీ బడ్జెట్ నిర్మాణానికి నిధులు ఎక్కడ నుంచి సమకూర్చుకున్నారు.. సినిమాకు అయిన బడ్జెట్ తదితర వివరాలపై ఆరా తీశారు. ఐటీ, జీఎస్టీ ఎగవేసినట్లు అందిన ఫిర్యాదుల నేపథ్యంలోనే మాదాపూర్‌లోని కాకతీయహిల్స్ రోడ్‌నంబర్ 10లోని కార్యాలయంలో మూడు గంటలపాటు సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. జీఎస్టీ చెల్లింపుల్లో తేడాలున్నట్లు అధికారులు గుర్తించారు. అధికారులు సోదాలు జరుపుతున్న సమయంలోనే సినీనటుడు మోహన్‌బాబు అక్కడకు చేరుకున్నారు. ఈనెల 27న సినిమా విడుదల అవుతున్న తరుణంలో ఈ సోదాలు కలకలం రేపాయి.

హోంగార్డులకు ఉన్ని జాకెట్లు, రెయిన్ కోట్లు

- పంపిణీ చేసిన అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా




సాక్షి, హైదరాబాద్: వర్షాకాలం ప్రారంభం కావడంతో విధి నిర్వహణలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు హోంగార్డులకు ఉన్ని జాకెట్లను, రెయిన్ కోట్లను హోంగార్డ్స్ అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా పంపిణీ చేశారు. డీజీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతి లక్రా మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో హోంగార్డులకు పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. హోంగార్డులకు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా ప్రస్తుత సీజన్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హోంగార్డులకు ఉన్ని జాకెట్లను, రెయిన్ కోట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎం.రమేశ్ మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణ పోలీసులకు మంచిపేరు ఉందని, తదనుగుణంగా హోంగార్డులు బాధ్యతగా విధులు నిర్వహించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. హోంగార్డుల సంక్షేమం కోసం స్వాతి లక్రా నిరంతరం సూచనలు చేస్తుంటారని తెలిపారు.

ఆ ఐదింటిలో... టాప్-10లో భారత్

సాక్షి, స్పెషల్ డెస్క్

కీలకమైన ఐదు ప్రధాన సాంకేతిక రంగాల్లో భారత్ టాప్-10లో చోటు సంపాదించింది. ఈ రంగాల్లో ప్రపంచంలోని 25 ప్రధాన దేశాల సామర్థ్యాలను తెలియజేస్తూ హార్వర్డ్ కెన్నడీ స్కూల్‌కు చెందిన బెల్ఫర్ సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ 'క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇండెక్స్' అనే సూచీని రూపొందించింది. ఏఐ, బయోటెక్నాలజీ, సెమీకండక్టర్స్, అంతరిక్షం, క్వాంటమ్ టెక్నాలజీ విభాగాల్లో దేశాల తయారీ సామర్థ్యం, సాంకేతిక పురోగతి, ప్రభుత్వ నియంత్రణ, అంతర్జాతీయంగా స్థానం, మానవ వనరులు, ఆర్థిక వనరుల వంటి అంశాల ఆధారంగా దేశాలకు స్థానాలు కేటాయించారు.

- కీలక సాంకేతిక రంగాల పోటీలో ముందంజ
- ఏఐ, అంతరిక్ష విభాగాల్లో మెరుగైన స్థానం
- హార్వర్డ్ కెన్నడీ స్కూల్ నివేదికలో వెల్లడి



ఏఐలో దూసుకుపోతూ..


కృత్రిమ మేధ విభాగంలో భారత్ దూసుకుపోతోందని చెప్పాలి. దేశంలో ఏఐ వినియోగం.. అమెరికా, యూకేలతో పోలిస్తే ఎక్కువగా ఉంది. ఇంటర్నెట్ వినియోగదారుల్లో 90% మంది ఏదో ఒక విధంగా ఏఐని వాడుతున్నారు. దేశంలో ఏఐ యూజర్ల సంఖ్య 72 కోట్లు దాటింది. 'క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ ఇండెక్స్' ఏఐ విభాగంలో జపాన్, తైవాన్, దక్షిణ కొరియా కంటే మనం ముందున్నాం. బయో టెక్నాలజీ రంగంలో ప్రపంచంలో భారత్ అగ్రదేశాల సరసన చోటు దక్కించుకుంది. వ్యాక్సిన్ల ఉత్పత్తిలో మనమే ప్రపంచంలో నంబర్ వన్. ఈ సూచీలోని బయోటెక్నాలజీ విభాగంలో ఫ్రాన్స్, తైవాన్, దక్షిణ కొరియాలను మనం అధిగమించాం

సిలికాన్ వేఫర్ల ఉత్పత్తిలో..

సెమీకండక్టర్ల తయారీలో వాడే సిలికాన్ వేఫర్ల ఉత్పత్తిలో ప్రపంచంలో మనం మూడో స్థానంలో ఉన్నాం. ప్రపంచ చిప్ వినియోగంలో 10 శాతం వాటా భారత్ కైవసం చేసుకుంది. చిప్ డిజైన్ సౌకర్యాలలో ప్రపంచంలో 7% మాత్రమే భారత్ కలిగి ఉన్నప్పటికీ.. ప్రపంచంలోని డిజైన్ ఇంజనీర్లలో దాదాపు 20% మంది భారత్‌లోనే ఉన్నారు. వీరిలో అత్యధికులు యూఎస్, యూరప్ సంస్థల కోసం పనిచేస్తున్నారు. ఈ సూచీలో సెమీకండక్టర్స్ విభాగంలో మనం ఫ్రాన్స్ కంటే ముందున్నాం.


5వ అతిపెద్ద సంస్థగా ఇస్రో

అంతరిక్ష పరిశోధనలో ప్రపంచంలో 5వ అతిపెద్ద సంస్థగా ఇస్రో చోటు సంపాదించింది. ప్రపంచంలో మొదటి ప్రయత్నంలోనే ప్రతిష్టాత్మక 'మంగళ్‌యాన్' ప్రాజెక్టు ద్వారా అంగారకుడిపైకి అడుగుపెట్టిన దేశం భారత్. ఈ సూచీలో అంతరిక్ష విభాగంలో జపాన్, దక్షిణ కొరియా, తైవాన్ కంటే మనదేశం ముందుంది. క్వాంటమ్ టెక్నాలజీకి సంబంధించి అత్యధిక పేటెంట్లకు దరఖాస్తు చేసిన దేశాల్లో మనదేశం 9వ స్థానంలో ఉంది. ఈ సూచీలో క్వాంటమ్ టెక్నాలజీలో తైవాన్, దక్షిణ కొరియాలను భారత్ మించిపోవడం గమనార్హం.









ఏయే అంశాల ఆధారంగా స్కోర్‌ను నిర్ణయించారంటే...

ఏఐ
టాప్ మోడల్స్ కచ్చితత్వం, డేటా, ఆల్గరిథమ్స్, కంప్యూటింగ్ పవర్, నియంత్రణ, అంతర్జాతీయంగా స్థానం, మానవ వనరులు, ఆర్థిక వనరులు.

బయోటెక్నాలజీ
జన్యు ఇంజనీరింగ్, ఔషధాల తయారీ, వ్యాక్సిన్ పరిశోధన, వ్యవసాయ సాంకేతికత, నియంత్రణ, అంతర్జాతీయంగా స్థానం, మానవ వనరులు, భద్రత, ఆర్థిక వనరులు.


సెమీకండక్టర్స్
అసెంబ్లింగ్, టెస్టింగ్, ఎక్విప్‌మెంట్, తయారీ–ఫ్యాబ్రికేషన్, చిప్ డిజైన్–టూల్స్, ప్రత్యేక ముడిపదార్థాలు–వేఫర్స్, నియంత్రణ, అంతర్జాతీయంగా స్థానం, మానవ వనరులు, ఆర్థిక వనరులు.

స్పేస్
రిమోట్ సెన్సింగ్, టెలికమ్యూనికేషన్స్, పొజిషనింగ్–నావిగేషన్–టైమింగ్, సైన్స్– అంతరిక్ష పరిశోధన, దేశీయంగా అంతరిక్ష ప్రయోగ సామర్థ్యం, నియంత్రణ, అంతర్జాతీయంగా స్థానం, మానవ వనరులు, ఆర్థిక వనరులు

క్వాంటమ్
క్వాంటమ్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్స్, సెన్సింగ్, ప్రభుత్వ విధానాలు, అంతర్జాతీయంగా స్థానం, మానవ వనరులు, భద్రత, ఆర్థిక వనరులు.

ఆయా కీలక రంగాల్లో టాప్-10 దేశాలు సంపాదించిన పాయింట్లు

దేశం	ఏఐ	బయో టెక్నాలజీ	సెమీ కండక్టర్స్	స్పేస్	క్వాంటమ్	మొత్తం
యూఎస్	22.7	17.2	26.4	13.8	4.2	84.3
చైనా	14.5	16.8	22.1	8.4	3.8	65.6
యూరప్	11.6	11.6	8.3	6.0	3.6	41.0
జపాన్	3.3	4.7	10.5	3.3	2.0	23.8
ద.కొరియా	3.5	3.4	9.4	2.5	1.2	20.0
యూకే	4.7	4.6	3.8	3.7	2.4	19.1
జర్మనీ	4.7	4.3	3.8	3.6	2.2	18.6
తైవాన్	2	1.7	10.1	1.6	0.6	16.0
ఫ్రాన్స్	4.6	3	1.9	3.8	2.0	15.3
భారత్	3.9	4	2.4	3.6	1.3	15.2





డ్రైనేజీ శుభ్రం చేసిన మంత్రి తుమ్మల

ఖమ్మం అర్బన్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం పర్యటించారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా ఖమ్మం 11వ డివిజన్ వరదయ్యనగర్‌లో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టగా మంత్రి పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికుల నుంచి పార తీసుకుని డ్రైనేజీలో మురుగు తొలగించాక మాట్లాడారు. ఇంటింటా చెత్త సేకరిస్తున్నందున ప్రజలు తమ వంతుగా రోడ్ల వెంట, డ్రైనేజీల్లో చెత్త వేయకుండా నగర పరిశుభ్రతకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కేఎంసీ మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆస్తులు పంచుకుని.. అమ్మను వద్దన్నారు..

గ్రామపంచాయతీ వరండాలో నివాసం ఉంటున్న తల్లి



నర్సంపేట: కన్న తల్లిని కొడుకులు పట్టించుకోకపోవడంతో గ్రామపంచాయతీ కార్యాలయ వరండాలో నివాసం ఉంటున్న సంఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం కోనాపురంలో బుధవారం వెలుగులోకి వచ్చింది. ఇదే గ్రామానికి చెందిన వెల్దె లచ్చమ్మ–సారయ్య దంపతులకు సదానందం, శ్రీనివాస్ కుమారులు. భర్త సారయ్య ఎనిమిదేళ్ల కిందట గుండెపోటుతో మృతి చెందాడు. తండ్రి ఉండగానే ఇద్దరు కుమారులకు మూడెకరాల చొప్పున భూమిని, ఇంటి స్థలం పంచి ఇచ్చారు. కుమారులు ఎవరి ఇంటి స్థలంలో వారు ఇళ్లు నిర్మించుకున్నారు. కానీ ఆ కొడుకులు తల్లిని పట్టించుకోకపోవడంతో మూడేళ్లుగా ఆమె అద్దె ఇంట్లో జీవనం గడుపుతోంది. నాలుగు రోజుల కిందట అద్దె ఇంటి యజమాని ఆమెను వెళ్లి పోవాలని అనడంతో ఖాళీ చేసి బయటకు వచ్చింది. తనకు నివాసం కల్పించాలని కొడుకులను ఆశ్రయించగా ఎవరూ పట్టించుకోకపోవడంతో దిక్కు తోచని ఆ తల్లి గ్రామపంచాయతీ కార్యాలయ వరండాలో తలదాచుకుంది. న్యాయం చేయాలని అధికారులను వేడుకుంది.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సాంకేతిక సౌరభం




పాలిటెక్నిక్ కళాశాల



1959లో కళాశాల ప్రారంభం అనంతరం రాజావారితో జవహర్ లాల్ నెహ్రూ (ఫైల్)

- ఆరు దశాబ్దాల క్రితమే వనపర్తిలో సాంకేతిక విద్యకు పునాది
- ప్రభుత్వానికి కళాశాలను అప్పగించిన సంస్థానాధీశుడు రాజా రామేశ్వర్‌రావు
- జవహర్‌లాల్ నెహ్రూతో 1959 అక్టోబర్ 11న పాలిటెక్నిక్ కళాశాల ప్రారంభం

వనపర్తిటౌన్: వనపర్తి ఎడ్యుకేషన్ హబ్‌కు కేరాఫ్‌గా మారింది. ఇందుకు సంస్థానాధీశుల కాలంలోనే బీజం పడింది. పాఠశాల విద్య, సాంకేతిక విద్యకు వనపర్తి రాజులు జీవం పోశా రు. 1936, అంతకంటే ముందు నిజాం ప్రభువు హయాంలో హైదరాబాద్ రాష్ట్రంలో పది పాఠశాలలు ఉంటే.. అందులో ఒకటి వనపర్తిలో (పాత జూనియర్ కళాశాల) ఏర్పాటు చేసేలా సంస్థానాధీశులు చొరవ తీసుకున్నారు. అప్పట్లో నిరుపేద కుటుంబాలకు చెందిన అన్ని వర్గాల విద్యార్థులకు ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లు అందించే వారు. 1959లో సంస్థానాధీశుడు రాజా రామేశ్వర్‌రావు హయాంలో దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించారు. ఈ కళాశాలలో చదువుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా.. నేపాల్, జర్మనీ తదితర దేశాల నుంచి వచ్చి సాంకేతిక విద్య ను అభ్యసించారు. ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్ కోర్సుల్లో 30 నుంచి 40 మందికి సాంకేతిక విద్య అందించారు.



వనపర్తిలో నిజాం హయాంలో ఏర్పాటు చేసిన హైస్కూల్

రాజా రామేశ్వర్‌రావు ఔదార్యం..

ఈ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలను రాజా రామేశ్వర్‌రావు 1959 నుంచి 1971 వరకు సమర్థవంతంగా నడిపారు. ఆ తర్వాత 20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న రాజప్రాసాదాన్ని (కళాశాల భవనం) ఒక్క రూపాయి ఆశించకుండా ప్రభుత్వానికి అందజేశారు. అప్పట్లో రాజా వారి నిర్ణయం సంచలనమని నేటికీ చర్చించుకుంటారు.

ఆరు కోర్సులతో..

పాలిటెక్నిక్ విద్య ప్రభుత్వ అధీనంలోకి వచ్చాక మొదట్లో ఉన్న మూడు కోర్సులతో పాటు సీసీపీ, డీ ఫార్మసీ, ఇన్‌స్ట్రుమెంటేషన్ కోర్సులతో కళాశాల కొనసాగుతోంది. 1,200 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా.. కృష్ణదేవ రాయ పాలిటెక్నిక్ పేరుతో రాజప్రాసాదం విరాజిల్లుతోంది.

55 ఏళ్ల తర్వాత మహిళా పాలిటెక్నిక్ కళాశాల..

వనపర్తిలో సాంకేతిక విద్యకు అడుగులు పడిన 55 ఏళ్ల తర్వా త జిల్లాలోని పెబ్బేరుకు మహిళా పాలిటెక్నిక్ కళాశాల మంజూరైంది. ఇందులో రెండు కోర్సులు ఉన్నాయి. ప్రస్తుతం 300 మంది విద్యార్థినులు చదువుతున్నారు. రాజుల కాలంలోనే మోడల్ బేసిక్ ప్రాక్టిసింగ్ స్కూల్‌ను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం, స్వాతంత్ర్య అనంతరం కొన్నేళ్ల పాటు వనపర్తి పాతబజార్‌లోని హనుమాన్, శంకర్‌గంజ్‌లోని దేవాలయాల్లో బ్రాహ్మణులు నిరుపేదలకు చదువులు చెబుతూ జీవ నం సాగించేవారు. సంస్థానాధీశుల కాలం నుంచే వనపర్తిలో విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇస్తూ వస్తున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఇక్కడ పాఠశాల విద్యకు ప్రాధాన్యం ఉంది. ఫలితంగా ఇక్కడి ప్రజలు విద్యాపరంగా చైతన్యవంతులు అని గుర్తింపు వచ్చింది.

ఉపాధి అవకాశాలు మెండు..



ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ శాఖ గుర్తింపు పొందిన పాలిటెక్నిక్ విద్య విద్యార్థులకు వరంలాంటిది. పాలిటెక్నిక్ విద్యతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి. పలు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రథమ ప్రాధాన్యం ఇస్తారు. ప్రైవేట్ కంపెనీల్లో రూ. 3 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు సంపాదించొచ్చు. డిప్లొమాతోనే విద్యార్థులు స్థిరపడే అవకాశం పాలిటెక్నిక్ విద్యతో చేకూరుతుంది. త్వరలో జరిగే పాలిసెట్ కౌన్సిల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– జగన్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, వనపర్తి

విద్యాపర్తిగా గుర్తింపు..



రాజుల కాలం నుంచే విద్యకు ప్రాధాన్యం ఇచ్చారు. సాంకేతిక విద్యలో వనపర్తికి ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచే కాకుండా రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ జిల్లాల నుంచి ఇక్కడకు వచ్చి విద్యనభ్యసించారు. జిల్లాలోని పెబ్బేరులో పదేళ్ల క్రితం మహిళా పాలిటెక్నిక్ కళాశాలతో పాటు ప్రైవేట్ రంగంలోనూ సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చింది.

– టీపీ కృష్ణయ్య, విద్యావేత్త, వనపర్తి

ఉన్నత స్థాయికి చేర్చింది..



వనపర్తిలో విద్యనభ్యసించిన ఎంతోమంది అత్యున్నత స్థాయికి చేరారు. నిజాం కాలం నుంచి వచ్చిన ప్రతి విద్యాసంస్థ ప్రారంభం వెనుక ప్రజా పోరాటాలు, ప్రజల ఆకాంక్షలు ఇమిడి ఉన్నాయి. రాజరికం నుంచి ప్రస్తుత రాజకీయ పార్టీలకు అతీతంగా విద్యావికాసంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే వనపర్తి అగ్రగామిగా నిలుస్తుంది. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, సైంటిస్టులు, హైకోర్టు న్యాయమూర్తులు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి వంటి వారితో పాటు ప్రతి రంగంలో వనపర్తి అక్షర జ్ఞానం కనిపిస్తుంది.

– గణేశ్‌కుమార్, ఉపాధ్యాయుడు, వనపర్తి

విద్యకు పెద్దపీట..



నిజాం కాలంలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇచ్చి ప్రోత్సహించిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉంది. అంతే కాకుండా కులమతాలకు అతీతంగా అందరికీ విద్య అందించడంలో వనపర్తి ఆది నుంచీ అడుగులు వేస్తోంది. సాంకేతిక విద్య అభ్యసించేందుకు నేపాల్, జర్మనీ, జపాన్ వంటి దేశాల నుంచి వచ్చే వారు. సాంకేతిక విద్యను చేరువ చేసేందుకు రాజా రామేశ్వర్‌రావు తన రాజప్రాసాదాన్ని ప్రభుత్వానికి ఉదారంగా ఇవ్వడం విద్యా విస్తరణపై వనపర్తి సంస్థానాధీశులకు ఉన్న దూరదృష్టిని తెలియజేస్తుంది.

– భైరోజు చంద్రశేఖర్, వనపర్తి

ప్రభుత్వం నిబద్ధతను చాటుకోవాల్సిన సమయం

బీసీ రిజర్వేషన్లపై వకుళాభరణం కృష్ణమోహన్

సాక్షి, హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతను చాటుకోవాల్సిన సమయం ఇదే అని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్ 30లోగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించిందని, ఈ సమయంలో బీసీ రిజర్వేషన్ల అమలు బాధ్యత ప్రభుత్వ నిబద్ధతకు పరీక్ష అని అన్నారు. బీసీ రిజర్వేషన్లు లేకుండా ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఎక్కడా చెప్పలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందని, అదేవిధంగా బీసీలకు న్యాయమైన రిజర్వేషన్లను అమలుచేసే బాధ్యత కూడా ప్రభుత్వానిదే అని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తన నిబద్ధతను శాసన, న్యాయ ప్రమాణాల ప్రకారమే రుజువు చేయాల్సి ఉందని పేర్కొన్నారు. బీసీలకు న్యాయం జరగకపోతే వారి ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ల అమలు న్యాయబద్ధంగా ఉండాలంటే పూర్తిస్థాయి స్వతంత్ర డెడికేటెడ్ కమిషన్ ద్వారా శాస్త్రీయ నివేదిక రావాల్సి ఉందని, లేకపోతే ఈ రిజర్వేషన్లు న్యాయస్థానాల్లో నిలబడటం కష్టమని ఆయన తెలిపారు.

ప్రేమ హత్యలు ఆందోళనకరం

మాజీ ఎంపీ వీహెచ్



సాక్షి, హైదరాబాద్: ఫ్యాక్షన్ పేరుతో గతంలో అప్పుడప్పుడు హత్యలు జరుగుతుండేవని, ఇప్పుడు ప్రేమ పేరుతో హత్యలను తరచూ చూడాల్సి వస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన బుధవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. భర్తను భార్య చంపడం, ఇందుకు స్కెచ్‌లు వేయడం, తల్లిని కూతురు చంపడం లాంటి ఘటనలను సమాజం తీవ్రంగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబ బంధాలను సైతం కబళిస్తున్న వైనంపై సమాజంలో చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ పరిశ్రమ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో.. సహజీవనం పేరిట అమ్మాయిలు, అబ్బాయిలను కలిపి ఉంచుతున్నారని, ఇలాంటి వాటిని ప్రభుత్వం నియంత్రించాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు చర్యలు తీసుకోవాలని, మానవ హక్కుల సంఘాలు కూడా ఇటీవలి హత్యలపై స్పందించాలని వీహెచ్ కోరారు.



గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

ఇళ్ల మురిపెం

అంతాఇంతా కాదు

పూరి గుడిసెలో పుట్టెడు కష్టాలతో కాలం వెళ్లదీస్తున్న ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కల నెరవేరుతోంది. ఇందిరమ్మ రాజ్యం పేదోడికి హస్తం అంటూ సంక్షేమ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల్లో తనదైన ముద్ర వేసుకుంటోంది కాంగ్రెస్ ప్రభుత్వం. అనేక ఏళ్ల సొంతింటి కల నెరవేరిందంటూ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నిలువ నీడలేని తమకు అధికారులే తమ గుడిసె వద్దకు వచ్చి ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి అర్హులకు పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేశారంటున్నారు. ఇంటి నిర్మాణాలకు దశలవారీగా బిల్లులు చెల్లిస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవి సోమన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన సాగుతున్నాయి. కొన్ని స్లాబ్ వరకు పూర్తికాగా మరికొన్ని చివరిదశకు చేరాయి. ఇచ్చిన మాటకు కట్టుబడిన పాలకులు, అధికారులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. రెండు, మూడోదశల్లో ఇళ్ల మంజూరు కోసం మరికొందరు ఎదురుచూస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ముందు ఫొటో దిగిన ఎలివేణి విజయ దంపతులు



ఇంటి ప్రొసీడింగ్ కాగితంతో సంతోషంతో పెద్ది లావణ్య



కూతురితో ఇందిరమ్మ ఇంటి ముందు కనుకుంట్ల సుజాత



ఇల్లు స్లాబ్ వరకు వచ్చిందంటున్న గువ్వల మంజుల

ఇల్లందు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సస్పెన్షన్

అక్రమ నిర్బంధం నేరంపై..

సాక్షి, హైదరాబాద్: అక్రమంగా ఒక కుటుంబాన్ని నిర్బంధంలో ఉంచి.. బాధితులపై అమానుషంగా ప్రవర్తించారనే ఆరోపణలపై ఇల్లందు ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణను సస్పెండ్ చేసినట్లు మల్టీజోన్–1 ఐజీ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడలు దాఖలు చేసిన ఫిర్యాదు మేరకు ఈ నెల 19న పి.రాంరెడ్డితోపాటు అతని భార్య, కుమారుడు, కోడలిని.. ఇన్‌స్పెక్టర్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారని తెలిపారు. చట్టప్రకారం కేసు నమోదు చేయకుండా, 8 నుంచి 12 గంటల పాటు నిబంధనలకు విరుద్ధంగా స్టేషన్‌లో నిర్బంధించారని తెలిపారు. వారికి ఆహారం, ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందకుండా నిరాకరించడంతో పాటు బెదిరించారని పేర్కొన్నారు. రాంరెడ్డి భార్య పద్మజ అలసట, మానసిక ఒత్తిడితో కుప్పకూలారని, ఇంకా ఆ బాధ నుంచి కోలుకోలేదని వివరించారు. ఈ విషయంలో ఇన్‌స్పెక్టర్ ప్రవర్తన అనైతికమని, పోలీస్ సూత్రాలకు విరుద్ధమని స్పష్టం చేశారు. సత్యనారాయణ దుష్ప్రవర్తన తీవ్రతను దృష్టిలో ఉంచుకుని.. బాధితుల ఫిర్యాదుపై శాఖాపరమైన విచారణ స్వేచ్ఛగా, పారదర్శకంగా సాగేందుకు అతన్ని తక్షణమే సస్పెండ్ చేసినట్లు ప్రకటనలో వెల్లడించారు.

భార్య 'ఖులా' విడాకులు కోరవచ్చు

భర్త పిటిషన్‌ను కొట్టివేసిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: ఖులా విడాకులు కోరే సంపూర్ణ హక్కు ముస్లిం భార్యకు ఉంటుందని, భర్త డిమాండ్‌ను అంగీకరించాల్సిన అవసరం లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. వివాహ రద్దుపై న్యాయస్థానం ముద్ర మాత్రమే వేస్తుందని, దానికి కట్టుబడటం ఇరుపక్షాలపై ఉంటుందని స్పష్టం చేసింది. తన భార్యతో వివాహాన్ని రద్దు చేయడంలో సదా ఈ హక్ షరాయ్ కౌన్సిల్ నిర్ణయాన్ని సమర్థించిన కుటుంబ కోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ చాంద్రాయణగుట్టకు చెందిన ఓ వ్యక్తి హైకోర్టులో అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై జస్టిస్ మౌషుమి భట్టాచార్య, జస్టిస్ బీఆర్ మధుసూదన్‌రావు ధర్మాసనం సమగ్ర తీర్పును వెలువరించింది. భార్య వివాహ బంధాన్ని కొనసాగించకూడదనుకుని ముఫ్తీని సంప్రదించి ప్రైవేట్‌గా పరిష్కరించుకునే విధానమే 'ఖులా'. షరియత్ ఆధారంగా ముఫ్తీ సలహా (ఫత్వా) ఇస్తారు. ఒకవేళ ప్రైవేట్‌గా పరిష్కారం కాకపోతే.. వ్యాజ్యం దాఖలైతే న్యాయమూర్తి షరియత్ ఆధారంగా తీర్పు ఇవ్వవలసి ఉంటుంది. ఈ కేసులో భర్త వేధింపులు భరించలేక భార్య ఖులా కోరారు. భర్త అంగీకరించకపోవడంతో సదా ఈ హక్ షరాయ్ కౌన్సిల్ ద్వారా ఖులానామా (విడాకుల పత్రం) పొందారు. దీనిని భర్త ఫ్యామిలీ కోర్టులో సవాల్ చేసినా ఊరట దక్కలేదు. దీంతో హైకోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఖులా ద్వారా విడాకులు పొందవచ్చన్న ఫ్యామిలీ కోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. మెహర్ (కట్నం) మొత్తాన్ని, అందులో కొంత భాగాన్ని తిరిగి ఇవ్వడంపై చర్చలు జరపడం తప్ప ఆమె డిమాండ్‌ను తిరస్కరించే హక్కు భర్తకు లేదని కోర్టు అభిప్రాయపడింది.

ఢిల్లీ లాల్‌దర్వాజా బోనాలకు రండి

టీపీసీసీ అధ్యక్షుడికి ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీ తెలంగాణ భవన్‌లో ఈనెల 30, జూలై 1, 2 తేదీల్లో నిర్వహించనున్న లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలకు రావాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను లాల్‌దర్వాజా సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం గాంధీభవన్‌లో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు కె.విష్ణుగౌడ్, కె.వెంకటేష్, సాంస్కృతిక కార్యదర్శి వినోద్ కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. పదేళ్లుగా ఢిల్లీలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉత్సవాలను నిర్వహిస్తున్నామని వారు వివరించారు.

పీసీసీ అధ్యక్షుడితో మంత్రి లక్ష్మణ్ భేటీ



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ అభివృద్ధి, ఎస్టీ, మైనార్టీ, వికలాంగ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్.. టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. బుధవారం ఉదయం గాంధీభవన్‌కు వచ్చిన ఆయన మహేశ్‌కుమార్ గౌడ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తనకు కేబినెట్‌లో అవకాశం కల్పించిన పార్టీకి కృతజ్ఞతలు తెలిపారు.

అప్రకటిత ఎమర్జెన్సీ వ్యాఖ్యలు సరికాదు

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాష్

సాక్షి, హైదరాబాద్: మోదీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీ విధించిందంటూ కాంగ్రెస్ నేత జైరాం రమేష్ చేసిన వ్యాఖ్యల్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుభాష్ ఖండించారు. ఆయన బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం నిజంగా ఎమర్జెన్సీ విధిస్తే.. జైరాం రమేష్ వంటి నాయకులు పత్రికా సమావేశాల్లో మాట్లాడే అవకాశం ఉండేది కాదని స్పష్టం చేశారు. దేశంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు అయ్యిందన్నారు. ఆ రోజులను చీకటి అధ్యాయంగా, రాజ్యాంగ హత్యా దినంగా పరిగణిస్తూ జూన్ 25, 26, 27 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ఫొటో ఎగ్జిబిషన్లు నిర్వహిస్తున్నట్లు సుభాష్ వెల్లడించారు.

బనకచర్లపై అసెంబ్లీ భేటీ అంటే భయమెందుకు?: ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు పట్టిన శని కేసీఆర్ అయితే, శకుని హరీశ్‌రావు అని పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బనకచర్లపై అసెంబ్లీలో చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డి సూటిగా, స్పష్టంగా సవాల్ విసిరితే అసెంబ్లీ సమావేశం ఏర్పాటు చేయ మనే ధైర్యం లేక హరీశ్‌రావు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. బుధవా రం ఆయన సీఎల్పీ కార్యాలయంలో విలేక రులతో మాట్లాడుతూ, హరీశ్‌రావుకు నిజంగా దమ్ము, ధైర్యం ఉంటే ఏ రోజున అసెంబ్లీని సమావేశపరచాలో కోరుతూ బీఆర్ఎస్ పక్షాన స్పీకర్‌కు లేఖ రాయాలన్నారు. బనకచర్లపై అసెంబ్లీ భేటీకి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. రైతులకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ నేతలను కార్యకర్తలు అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

క్యాంపస్‌లో కొలువుల్లేవు



- గతంలో సగటున 1,200 నుంచి 1,600 ఉద్యోగాలకు ఆఫర్ లెటర్లు
- ఇప్పుడు 185 ఉద్యోగాలకు పడిపోయిన దుస్థితి

ఏయూ ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ కష్టాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఏయూలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారిలో 20 శాతం మందికి కూడా ఉద్యోగాలు రాని పరిస్థితి నెలకొంది. ఒక్క ప్రముఖ కంపెనీ కూడా ఏయూలో ప్లేస్‌మెంట్స్ డ్రైవ్ నిర్వహించలేదు. ఇందుకు ప్రధాన కారణం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌పై కనీస శ్రద్ధ వహించకపోవడమే. ఈ వ్యవహారమంతా ఉద్దేశపూర్వకంగానే సాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత ఏడాదితో పాటు అంతకు ముందు మూడేళ్లు ఏటా 1,200 నుంచి 1,600 వరకూ ఏయూ ఇంజనీరింగ్ విద్యార్థులు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు సాధించారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారిలో కేవలం 185 మందికి మాత్రమే ప్లేస్‌మెంట్స్ లభించడం గమనార్హం. ఇందులోనూ అనేక మంది ఆఫ్ క్యాంపస్‌లో ఉద్యోగాలు సాధించిన వారే. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీలపై కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చూపుతోందనే విమర్శలున్నాయి. విశాఖలో ఇతర ప్రైవేటు కాలేజీలకు మేలుచేకూర్చే విధంగానే వ్యవహారం ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ఆంధ్రా యూనివర్సిటీలో నారాయణ (పేరు మార్చాం) అనే విద్యార్థి 2024–25 విద్యా సంవత్సరంలో బీటెక్ (సీఎస్) పూర్తి చేశాడు. ప్రముఖ కంపెనీలేవీ ప్లేస్‌మెంట్స్ కోసం రాకపోవడంతో గాయత్రీ కాలేజీలో జరిగే ఆఫ్–క్యాంపస్ సెలక్షన్స్‌కు వెళ్లి టీసీఎస్‌లో ఉద్యోగం సంపాదించుకున్నాడు. ఈ విధంగా ఒక్క నారాయణే కాదు 20 మంది ఏయూ విద్యార్థులు ఉద్యోగాలు పొందారు.

ఈ అమ్మాయి పేరు రేపాక ఈశ్వరి. 2022–23 విద్యా సంవత్సరంలో ఏయూలో సీఎస్ పూర్తి చేసిన ఈ అమ్మాయికి అట్లాసియన్ కంపెనీలో రూ.84.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. ఆఫర్ లెటర్‌ను అప్పటి ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అందించారు. ఆ ఏడాది ఈ అమ్మాయికే కాదు 1,001 మంది విద్యార్థులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ఆఫర్ లెటర్స్ అందించారు.



2023 మే 1వ తేదీన బీచ్‌రోడ్‌లోని ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో 'అచీవర్స్ డే' ఘనంగా నిర్వహించి 1,001 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆఫర్ లెటర్స్‌ను అందించారు. ఆ ఏడాది వచ్చిన అత్యధిక ప్యాకేజీ రూ.84.5 లక్షలు!

2025లో ఏయూలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారిలో పట్టుమని 20 శాతం మందికి కూడా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ లేని పరిస్థితి. ఆఫ్–క్యాంపస్‌లో గాయత్రీ కాలేజీకి వెళ్లి అక్కడ సెలక్షన్స్‌లో 20 మంది ఏయూ విద్యార్థులు టీసీఎస్‌లో ఉద్యోగం సంపాదించుకున్నారు. ఈ ఏడాది వచ్చిన అత్యధిక ప్యాకేజీ రూ.12 లక్షలు!

ఇదీ గత ప్రభుత్వ హయాంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు... కూటమి ప్రభుత్వంలో ఏయూలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థుల క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు మధ్య ఉన్న తేడా.

20 లక్షల ఉద్యోగాల పేరుతో...!

వాస్తవానికి ఎన్నికలకు ముందు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని... లేనిపక్షంలో నెలకు రూ. 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నేతలు ప్రకటించారు. తీరా ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఉద్యోగాల ఊసే ఎత్తడం లేదు. వాస్తవానికి ఏయూలో ఇంజనీరింగ్ సీటు మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులకే సాధ్యమవుతుంది. అటువంటి విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగం సంపాదించడం కష్టమేమీ కాదు. కూటమి ప్రభుత్వం క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌పై కనీస శ్రద్ధ వహించక పోవడంతో వేరే ప్రాంతాలకు వెళ్లి ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగాలు సంపాదించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉద్దేశపూర్వకంగానే...!

వాస్తవానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు సంస్కరణలతో పాటు అభివృద్ధి కార్యక్రమాల వల్ల ఏయూలో గణనీయ అభివృద్ధి జరిగింది. నూతన పోకడలకు అనుగుణంగా ఏయూలో కొంగొత్త మార్పులకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టారు. ఎన్నడూ లేని విధంగా స్టార్టప్‌ల కోసం ప్రత్యేకంగా ఏ-హబ్‌ను ఏర్పాటు చేశారు. పేటెంట్ల కోసం ఏకంగా వందకుపైగా దరఖాస్తుల చేయడం ద్వారా రాష్ట్రంలోని ఇతర యూనివర్సిటీలకు మార్గదర్శకంగా నిలిచింది. మేథో సంపత్తి హక్కులను (పేటెంట్స్) పొందేందుకుగానూ ప్రత్యేకంగా మేథో సంపత్తి హక్కుల కేంద్రం (ఐపీటీ)ని గత ప్రభుత్వ హయాంలో అప్పటి వీసీ ప్రసాద్‌రెడ్డి 2020 సెప్టెంబరులో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా వందకిపైగా దరఖాస్తులను పంపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగానే ఏయూ ప్రతిష్టను మంటగలిపే ప్రయత్నం జరుగుతుందన్న ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఏదో జరిగిందనే రీతిలో ప్రచారం చేస్తూ... విచారణ పేరుతో గందరగోళాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా ప్రముఖ కంపెనీలను పిలిచి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను నిర్వహించడం లేదు.

క్లుప్తంగా...

ప్రగతి అంశాలపై సీఎస్‌లతో ప్రధాని సమీక్ష

సాక్షి, అమరావతి: ఆధార్ సంబంధిత ఫిర్యాదులు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీయంఅభియాన్), 5వ స్ట్రీమ్ అల్యూమినియ రిఫైనరీ విస్తరణ ప్రాజెక్టు తదితర ప్రగతి అంశాలపై బుధవారం ఢిల్లీ నుంచి ప్రధాని మోదీ, కేబినెట్ కార్యదర్శి సోమనాథన్ వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రధాని మాట్లాడుతూ వివిధ ప్రగతి ప్రాజెక్టులు, పథకాలను సకాలంలో పూర్తి చేసేందుకు అన్ని రాష్ట్రాల సీఎస్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

ఏపీఎస్‌పీఎఫ్ సిబ్బందికి ఉచిత కంటి పరీక్షలు

సాక్షి, అమరావతి: ఏపీఎస్‌పీఎఫ్ డీజీ డాక్టర్ త్రివిక్రమ వర్మ, ఐజీ బీవీ రామిరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం రాష్ట్ర సచివాలయంలో ఏపీఎస్‌పీఎఫ్ సిబ్బందికి డా.అగర్వాల్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో కంటి పరీక్షల నిర్వహణ శిబిరం జరిగింది. కమాండెంట్ ఎం.శంకర్రావు ఆధ్వర్యంలో దీనిని నిర్వహించినట్లు రాష్ట్ర సచివాలయ ముఖ్య భద్రతాధికారి పీవీఎస్ఎన్ మల్లికార్జునరావు తెలిపారు.

విజయవాడలో జలహారతి కార్పొరేషన్ కార్యాలయం

సాక్షి, అమరావతి: జలహారతి కార్పొరేషన్ లిమిటెడ్ (జేహెచ్‌సీఎల్) కార్యాలయాన్ని విజయవాడలో నీటిపారుదల శాఖ భవనంలోని మొదటి అంతస్తులో ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేపట్టడం కోసం స్పెషల్ పర్పస్ వెహికల్ జేహెచ్‌సీఎల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ సంస్థ కార్యాలయం ఏర్పాటుకు కృష్ణా డెల్టా సీఈ పంపిన ప్రతిపాదనపై ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది.

ఏపీఎన్ఆర్‌టీఎస్ సలహాదారునిగా వేమూరు రవి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ సలహాదారునిగా వేమూరు రవిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించి ఏపీఎన్ఆర్టీఎస్ తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏపీఎస్ఐఆర్‌డీ మేనేజింగ్ బోర్డు ఏర్పాటు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఏపీఎస్ఐఆర్‌డీ)కి 17 మంది అధికారులతో కొత్త మేనేజింగ్ బోర్డు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులిచ్చింది. ఈ బోర్డుకు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఆరు నెలలకోసారి బోర్డు సమావేశమై పంచాయతీరాజ్ సంస్థ సిబ్బంది, ఉద్యోగులకు పాలనాపరమైన అంశాలపై శిక్షణా కార్యక్రమాల నిర్వహణతో పాటు తగిన ప్రణాళికలు రూపొందించే ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వం పేర్కొంది.

26 నుంచి నట్టల నివారణ మందు పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మేకలు, గొర్రెలకు ఈ నెల 26వ తేదీ నుంచి జూలై 10వ తేదీ వరకు ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేపట్టనున్నట్లు పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదరనాయుడు బుధవారం తెలిపారు.

ఆక్వాలో ప్రైవేటు రంగం పాత్ర కీలకం

సాక్షి, అమరావతి: ఆక్వాకల్చర్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రైవేట్ రంగం పాత్ర కీలకమని మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి. రాజశేఖర్ అన్నారు. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), ఆహార, వ్యవసాయ కేంద్రం ఆఫ్ ఎక్సలెన్స్ (ఎఫ్ఏసీఈ) ఆధ్వర్యంలో 'మత్స్య, జలసంపదలో స్థిరమైన వృద్ధి–పోటీతత్వాన్ని పెంపొందించడం' అనే అంశంపై బుధవారం విజయవాడలో జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ మార్కెట్ లింకేజీలను సృష్టించడంలో ప్రైవేటు రంగంలో వస్తున్న ఆవిష్కరణలు ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు.

ఉత్తర్వులు సరే.. బకాయిలు ఇవ్వరేం..?

కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల ఇన్‌సెంటివ్ చెల్లింపుల్లో కాలయాపన

సాక్షి, అమరావతి: గ్రామీణ ప్రాంత ప్రజలకు ముఖ్యమైన వైద్య సేవలు అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఇన్‌సెంటివ్ బకాయిల చెల్లింపుల విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు ఆరు నెలల ఇన్‌సెంటివ్ బకాయిలను విడుదల చేయాలని మే 8న ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ రూ.77.33 కోట్ల విలువైన ప్రొసీడింగ్స్ జారీ చేశారు. అయితే కేవలం మార్చి నెల ఇన్‌సెంటివ్‌ను మాత్రమే ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 10,032 మంది కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఒక్కొక్కరికి సగటున రూ.70,000కు పైగా రావాల్సి ఉంది. పైగా ఏప్రిల్, మే నెలల్లో సమ్మె కారణంగా ఈ రెండు నెలల వేతనాలనూ ప్రభుత్వం ఇవ్వకపోవడం గమనార్హం. ఇంటి అద్దెలు, పిల్లల బడి ఖర్చులు, కుటుంబ పోషణ కోసం బయట నుంచి అప్పులు తెచ్చుకునే పరిస్థితి ఏర్పడిందని హెల్త్ ఆఫీసర్లు వాపోతున్నారు.

డిమాండ్ల పరిష్కారానికి జూలై 9న సమ్మె

యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రకటన

సాక్షి, అమరావతి: ఏఎన్ఎంలను వారి సొంత ప్రాంతాల్లో విధి నిర్వహణకు అనుమతించడంతో పాటు, తొలగించిన పారామెడికల్ సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. అలాగే, వైద్య ఆరోగ్య శాఖలో సేవలందిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరింది. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 9న రాష్ట్రవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. తక్షణం సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు యూనియన్ గౌరవాధ్యక్షులు ఎ.వి. నాగేశ్వరరావు, అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు లేఖ రాశారు. ఏఎన్ఎంలు, హెల్త్ సెక్రటరీలపై తీవ్రమైన పని భారాన్ని మోపుతున్నారని, 'పని సర్దుబాటు' పేరుతో వీరిని సుదూర ప్రాంతాల్లో పనిచేయాల్సిన పరిస్థితిలోకి నెట్టివేస్తున్నారని వారు విమర్శించారు. రాష్ట్రంలో పనిచేస్తున్న 3.50 లక్షల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస టైమ్ స్కేల్‌ను అమలుచేయాలని డిమాండ్ చేశారు.

అమరావతి రెండో దశ భూసమీకరణను ఆపాలి

ప్రభుత్వానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు సూచన

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతిలో రెండో దశలో మరో 44వేల ఎకరాల భూసమీకరణ చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయం సరైనది కాదని, దీన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 11 సంవత్సరాల క్రితం సమీకరించిన 34 వేల ఎకరాల భూముల్లో రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి చేయకుండా, మరోదశ భూ సమీకరణ చేస్తే రాజధానిలో భూములిచ్చిన రైతులు, పేదల ప్రయోజనాలకు దోహద పడకపోగా, మరింత హాని చేస్తుందన్నారు. లేనిపోని భ్రమలు కల్పించి విస్తరణ పేరుతో కొత్త గ్రామాల్లో ప్రజలను బలవంతంగా ఒప్పించడం సరైంది కాదన్నారు. గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం, పరిశ్రమల అభివృద్ధి, స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ భూ సమీకరణ చేయాలనుకోవడం సరైన నిర్ణయం కాదన్నారు.

క్వాంటమ్ వ్యాలీతో లక్ష మందికి ఉపాధి

- విద్య, వైద్యారోగ్యం, ఫార్మా, అగ్రిటెక్, మెడ్‌టెక్ రంగాల్లో కీలకం
- ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్

సాక్షి, అమరావతి : రాజధాని అమరావతిలో అభివృద్ధిచేస్తున్న క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ వచ్చే ఏడాది జనవరికల్లా అందుబాటులోకి వస్తుందని.. ఈ వ్యాలీ ద్వారా లక్ష మందికి పైగా ఉపాధి లభిస్తుందని ఐటీ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ తెలిపారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీపై జూన్ 30న నిర్వహించనున్న జాతీయస్థాయి సదస్సులో భాగంగా బుధవారం విజయవాడలో పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాటమనేని మాట్లాడుతూ.. ఏపీతో పాటు దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న విద్య, వైద్యారోగ్యం, ఫార్మా, అగ్రిటెక్, మెడ్‌టెక్ సంస్థలు ఈ క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీ సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు. క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ ద్వారా భవిష్యత్తులో యువతకు ఉపాధి అవకాశాలు తగ్గుతాయన్నది కేవలం అపోహ మాత్రమేనని ఆయన స్పష్టంచేశారు. క్వాంటమ్ కంప్యూటింగ్ మానవ సమాజానికి ప్రత్యామ్నాయం కాదని.. సంప్రదాయ కంప్యూటర్లు యథాతథంగా కొనసాగాల్సిందేనని, మానవాళికి తక్కువ సమయంలో సాధ్యంకాని సమస్యల్ని, పరిశోధనల్ని సాధించేందుకు మాత్రమే క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ ఉపయోగపడుతుందన్నారు. ఇక క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీ ద్వారా ఉత్పాదకత పెరుగుతుందని చెప్పారు.

దేశవ్యాప్తంగా పరిశోధనలు..

నేషనల్ క్వాంటమ్ మిషన్ సభ్యులు ప్రొఫెసర్ అనిల్ ప్రభాకర్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్లు పరిశోధన కొనసాగిస్తున్నాయన్నారు. ఔషధాల పరిశోధన, ఈవీ బ్యాటరీలు, బిన్ ప్యాకింగ్, కార్గో డెలివరీ, రూట్ ఆప్టిమైజేషన్, ఇమేజ్ క్లాసిఫికేషన్ వంటి అంశాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ టెక్నాలజీని వినియోగించొచ్చన్నారు. స్టాక్‌మార్కెట్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో కూడా ఈ టెక్నాలజీ విస్తృత సేవలు అందిస్తోందన్నారు. ఐబీఎం సంస్థ డైరెక్టర్ డాక్టర్ అమిత్ సింఘే, ఎల్టీఐ మైండ్ ట్రీ లీడ్ విజయరావు మాట్లాడుతూ.. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్కు ఏర్పాటు దేశంలో ఓ కీలకమైన పరిణామమని, భవిష్యత్తులో లాజిస్టిక్స్, స్పేస్, ఔషధ రంగం, విద్య, వైద్యం, ఫైనాన్షియల్, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ కీలకం కానుందని తెలిపారు.

మోసపూరిత ప్రకటనలు మానుకోవాలి

ప్రభుత్వంపై ఏపీ రైతు సంఘం ధ్వజం

సాక్షి, అమరావతి: మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన పొగాకుకుగానూ రూ.273 కోట్లు రైతుల ఖాతాల్లో వేసినట్లు ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని ఏపీ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకరరెడ్డి అన్నారు. పొగాకు రైతులను ఆదుకోవడంలో సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పనితనం చాలా గొప్పగా ఉందంటూ టీడీపీ ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, అశోక్ రెడ్డి ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. టన్ను కాదు కదా కనీసం క్వింటా పొగాకు కూడా కొనుగోలు చేయకుండా పొగాకు రైతులను ఆదుకున్నామంటూ ప్రకటించడం శోచనీయమన్నారు. ఇప్పటివరకు ఏయే జిల్లాల్లో ఎంతమంది రైతుల నుంచి ఎన్ని క్వింటాళ్ల పొగాకు కొనుగోలు చేశారు? ఎంత మంది రైతులకు ఎంత మొత్తం ఇప్పటి వరకు జమ చేశారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. అసత్య ప్రకటనలతో పొగాకు రైతులను మోసం చేసే ప్రయత్నం మానుకోవాలన్నారు. రైతుల వద్ద ఉన్న చివరి కిలో పొగాకు వరకు నాణ్యతతో సంబంధం లేకుండా క్వింటా రూ.12 వేల చొప్పున కొనుగోలు చేయాలని బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

తూచ్.. ఆ పోస్టు ఇప్పుడు భర్తీ చేయం

హెల్త్ వర్సిటీ సీవోఈ పోస్టుకు ఇచ్చిన నోటిఫికేషన్ 'హోల్డ్'

సాక్షి, అమరావతి: కీలకమైన ఎంబీబీఎస్, ఇతర వైద్య విద్యా కోర్సుల పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యుడినే కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ (సీవోఈ)గా కొనసాగించడానికి ప్రభుత్వం మొగ్గు చూపుతుండటంపై హెల్త్ వర్సిటీ వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. సీవోఈ పోస్టుకు ఇచ్చిన నోటిఫికేషన్‌ను సైతం ఈసారి 'హోల్డ్' చేయడం చర్చనీయాంశమైంది. పరీక్షల విభాగంపై ఆరోపణలు వచ్చిన ప్రతిసారి డిప్యుటేషన్ రద్దు చేసుకుని వెళతానని సదరు వైద్యుడు అభ్యర్థించడం, వివాదం సద్దుమణిగిన తర్వాత అదే స్థానంలో ఆయనను కొనసాగించడం పరిపాటిగా మారింది. తాజాగా ఈ ఏడాది ఏప్రిల్‌లో సిద్ధార్థ మెడికల్ కాలేజీలో మాస్ కాపీయింగ్ ఘటన తర్వాత సదరు సెంటర్‌ను మళ్లీ అనుమతించడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజాగా 'డిప్యుటేషన్‌ను రద్దు చేసుకుని వెళతానని ప్రకటించడం, ఈ పోస్టుకు నోటిఫికేషన్ ఇవ్వడం, దరఖాస్తులు స్వీకరించడం, నియామక ప్రక్రియ సమయంలో నోటిఫికేషన్ హోల్డ్ చేయడం, సీఈఓ తన నిర్ణయాన్ని విరమించుకున్నారని, డిసెంబర్ వరకూ ఆయనే కొనసాగుతారని అధికారులు ప్రకటించడం' వర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

కాంట్రాక్టర్లు, రాజకీయ నేతల లబ్ధికే బనకచర్ల

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోలవరం–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనను విరమించుకోవాలని ఆలోచనాపరుల వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ ప్రాజెక్టుతో రాష్ట్రానికి ఎటువంటి ప్రయోజనమూ లేదని, ఇది కేవలం కాంట్రాక్టర్లు, రాజకీయ నేతలకు లబ్ధి చేకూర్చేందుకేనని అభిప్రాయపడింది. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆలోచనాపరుల వేదిక ఆధ్వర్యంలో పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుపై మీడియా సమావేశం నిర్వహించారు. సాగునీటి రంగ నిపుణులు టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్ర అవసరాలకు, ప్రయోజనాలకు, కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటా పరిరక్షణకు అనుగుణంగా ఉన్నదా! లేదా! అని ప్రభుత్వం ప్రశ్నించుకోవాలని పేర్కొన్నారు. ఇది రాష్ట్రానికి ఒక గుదిబండలా మారనున్నదని చెప్పారు. బనకచర్ల ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేస్తామంటే అది కేవలం కరువుపీడిత ప్రజానీకాన్ని వంచించడమేనని విమర్శించారు. ఎందుకు ఈ పనికి పాల్పడుతున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా బనకచర్ల వరకు గ్రావిటీ ద్వారా, పైసా ఖర్చు లేకుండా నీళ్లు పారుతున్నాయని, వరదలు వచ్చినప్పుడు గరిష్ఠ స్థాయిలో నీటిని రాయలసీమకు తరలించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని పేర్కొన్నారు. రాయలసీమలోని చాలా ప్రాజెక్టుల నిర్మాణ పనులు, బ్రాంచి కాల్వలు, పంట కాల్వలు పూర్తి చేయలేదని, వాటిపై దృష్టి పెట్టాలని సూచించారు. బనకచర్ల వల్ల రాష్ట్రం కృష్ణా నది నుంచి 200 టీఎంసీల నీటి హక్కును కోల్పోతుందని హెచ్చరించారు. పట్టిసీమ కాల్వను విస్తరించి 38,000 క్యూసెక్కులు పంపినా, మరో సమాంతర కాల్వను నిర్మించి 23,000 క్యూసెక్కులు పంపినా విజయవాడకు వరద ప్రమాదం పొంచి ఉంటుందన్నారు. చిత్తు లెక్కల ప్రకారమే బనకచర్లకు రూ.81వేల కోట్లు ఖర్చవుతుందని చెబుతున్నారని, డీపీఆర్ పూర్తయితే అది రూ. లక్షన్నర కోట్లకు చేరుతుందని వివరించారు. రిటైర్డ్ ఇంజనీర్ కంభంపాటి పాపారావు మాట్లాడుతూ పోలవరం–బనకచర్ల నిర్ణయాన్ని ఉపసంహరించుకుని పోలవరం–పెన్నా అనుసంధానంపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఆలోచనాపరుల వేదిక ప్రతినిధులుఏ. బి.వెంకటేశ్వరరావు అక్కినేని భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో తిరిగి అధికారంలోకి రారు

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

చంద్రబాబు అప్పులు ఎక్కువ చేస్తున్నారు: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సాక్షి, అమరావతి: సంక్షేమ పథకాలతో ప్రభుత్వాలు తిరిగి అధికారంలోకి రావని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశం కె.శివారెడ్డి అధ్యక్షతన విజయవాడలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆగస్టు 23 నుంచి 25 వరకు ఒంగోలులో నిర్వహించనున్న పార్టీ రాష్ట్ర 28వ మహాసభల ఆహ్వాన సంఘ కరపత్రాన్ని విడుదల చేసి నారాయణ మాట్లాడారు. 2019 ఎన్నికల ముందు పసుపు–కుంకుమ అందించిన చంద్రబాబు తిరిగి అధికారంలోకి రాలేకపోయారన్నారు. అనంతరం అధికారం చేపట్టిన వైఎస్ జగన్ కూడా ప్రతి నెల ఏదొక పథకానికి బటన్ నొక్కి ప్రజలకు సంక్షేమాన్ని అందించినా అధికారానికి దూరమవ్వక తప్పలేదన్నారు. సంక్షేమ పథకాలు ఒక్కటే అధికారంలోకి తేవనే విషయం దీన్ని బట్టి తేటతెల్లమవుతోందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ గతంలో జగన్‌ను విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు ఇంకా ఎక్కువ అప్పులు చేస్తున్నారని మండిపడ్డారు. విజన్ 2047, పీ4 విధానాలతో ప్రయోజనం ఏమీలేదన్నారు. కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపు, ప్రజా సమస్యలపైన ఉద్యమాలకు సన్నద్ధం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

ఆప్కాబ్ పీఐసీ పదవీకాలం ఆర్నెళ్లు పొడిగింపు

సాక్షి, అమరావతి: ఏపీ స్టేట్ కో ఆపరేటివ్ బ్యాంక్(ఆప్కాబ్) నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ పదవీ కాలాన్ని ఆర్నెళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీ పదవీకాలం ఈ నెల 18తో ముగిసింది. అదే విధంగా 13 జిల్లాల్లోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)ల నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీల పదవీ కాలాన్ని కూడా ఆర్నెళ్ల పాటు పొడిగించారు. ఈ కమిటీల పదవీ కాలం ఈ నెల 27తో ముగియనుండగా మరోసారి పొడిగించారు.

మిగిలిన మినీ అంగన్‌వాడీలను అప్‌గ్రేడ్ చేయాలి

సీఐటీయూ డిమాండ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 6,497 మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో 4,687 కేంద్రాలను మెయిన్ సెంటర్లుగా మార్చిన ప్రభుత్వం మిగిలిన వాటిని కూడా అప్‌గ్రేడ్ చేయాలని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. ఇదే సమయంలో మిగిలిన వాటిలో పనిచేసే వర్కర్లకు దాదాపు 15 ఏళ్ల సీనియార్టీ ఉందని, వారికి కూడా మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు పెంచి చెల్లించాలని కోరారు.

ఆ ఫుడ్‌స్టాళ్లను తొలగించేలా ఆదేశాలివ్వండి

హైకోర్టులో జనసేన కార్పొరేటర్ పిల్

కౌంటర్ దాఖలుకు అధికారులకు కోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: విశాఖపట్నం పాత జైలు రోడ్డులో జీవీఎంసీ నుంచి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఫుడ్‌స్టాళ్లను తొలగించేలా ఆదేశాలివ్వాలని కోరుతూ జనసేన కార్పొరేటర్ పీతలమూర్తి యాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు... పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, జీవీఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మూర్తియాదవ్ తరఫున సీనియర్ న్యాయవాది కె.శ్రీనివాసమూర్తి వాదనలు వినిపిస్తూ, అనధికార స్టాళ్లతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని... ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. జీవీఎంసీ సైతం ఆదాయం కోల్పోతోందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది.

వ్యవసాయ శాఖలో బదిలీలు కొలిక్కి

సాక్షి, అమరావతి: వ్యవసాయ శాఖలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు (డీఏవో), జాయింట్ డైరెక్టర్లు (జేడీ), అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీఏ) పోస్టుల బదిలీల్లో తీవ్ర గందరగోళం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఒకే పోస్టుకి రాజకీయ నాయకుల సిఫారసులతో ఇద్దరు ముగ్గురికి పోస్టింగులు కోరడం వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో 133 మంది ఏడీఏలు, 27 మంది డీఏవోలు, ముగ్గురు జేడీలను బదిలీ చేయడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు తుది ఉత్తర్వుల జారీని నిలిపివేశారు. ఈ నేపథ్యంలో 133 మంది ఏడీఏల్లో 110 మందికి పోస్టింగులు ఇస్తూ బుధవారం రాత్రి వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు ఉత్తర్వులు ఇచ్చారు. అదేవిధంగా గతంలో బదిలీ చేసిన 27 మంది డీఏవోల్లో 24 మందికి, ముగ్గురు జేడీల్లో ఇద్దరికి పోస్టింగులు ఖరారు చేశారు. మిగిలిన వారికి పోస్టింగులు ఇచ్చే విషయంపై ప్రభుత్వ అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపారు. కాకినాడ జిల్లా డీఏవోను విజయనగరానికి, విజయనగరం డీఏవోను కాకినాడకు బదిలీ చేయగా డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఒత్తిడితో వారి బదిలీలను నిలిపివేశారని సమాచారం. పార్వతీపురం మన్యం జిల్లా డీఏవోను పాడేరుకు, పాడేరు డీఏవోను పార్వతీపురం మన్యం జిల్లాకు బదిలీ చేయగా స్థానిక టీడీపీ నేతల ఒత్తిడి మేరకు నిలిపివేశారు. వీరిని యథాస్థానంలో కొనసాగించేందుకు ప్రభుత్వం అనుమతి కోరుతూ ప్రతిపాదనలు పంపారు.

క్రైస్తవులపై దాడులు అరికట్టండి

మంత్రి ఫరూక్‌కు ఐక్య వినతి

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, క్రైస్తవులు, చర్చిలు, పాస్టర్ల రక్షణకు ప్రత్యేక చట్టం తేవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌కు ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ అసోసియేషన్ (ఐక్య) విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ ప్రతినిధుల బృందం వెలగపూడి సచివాలయంలో మంత్రి ఫరూక్‌ను బుధవారం కలిసింది. డాక్టర్ గోళ్లమూడి రాజ సుందరబాబు, కె.హనోక్ బెంజిమెన్, జె.రవికాంత్, ఎం.ప్రేమ జ్యోతిబాబు తదితరుల బృందం 10 అంశాలపై మంత్రికి ఫరూక్‌కు వినతిపత్రం అందించింది. క్రిస్టియన్ స్మశానాలకు భూములు కేటాయించాలని కోరింది. పాస్టర్లుగా పనిచేస్తూ మత సంబంధిత కోర్సులను పూర్తి చేసేందుకు ఆర్థిక సాయం, విద్యా, వైద్య సంస్థలను నిర్వహించుకునేందుకు ప్రభుత్వ గ్రాంటు మంజూరు చేయాలని విన్నవించింది. గ్రూప్ -1, గ్రూప్-2, గ్రూప్-3, ఆర్ఆర్‌బీ తదితర ఉద్యోగాల పోటీ పరీక్షలకు, బీసీ–సీ, పాస్టర్లు, సువార్తికుల పిల్లలకు ఏడాదికి కనీసం 200 మందికి ఉచితంగా శిక్షణ ఇవ్వాలని కోరింది. ఈ అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు.

కృష్ణంరాజు వ్యాఖ్యల వీడియోను మా ముందు ఉంచండి

పోలీసులకు హైకోర్టు ఆదేశంవిచారణ రేపటికి వాయిదా

సాక్షి, అమరావతి: అమరావతి రాజధాని గురించి సీనియర్ పాత్రికేయుడు వీవీఆర్ కృష్ణంరాజు చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను తమ ముందు ఉంచాలని హైకోర్టు బుధవారం పోలీసులను ఆదేశించింది. తదుపరి విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు ఉత్తర్వులు జారీ చేశారు. రాజధానిపై వ్యాఖ్యలకు తనపై పోలీసులు నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు చేయాలంటూ కృష్ణంరాజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై బుధవారం జస్టిస్ లక్ష్మణరావు మరోసారి విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది డీఎస్ఎన్వీ ప్రసాద్‌బాబు వాదనలు వినిపించారు. కృష్ణంరాజుపై నమోదైన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్ష పడేవేనని.. ఇలాంటి పరిస్థితుల్లో నిందితులకు బీఎన్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు జారీ చేయాల్సి ఉంటుందన్నారు. మేజిస్ట్రేట్ మాత్రం ఆర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరించి రిమాండ్‌కు పంపారన్నారు. పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ, అన్ని అంశాలను పరిశీలించాకే మేజిస్ట్రేట్ రిమాండ్ ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణానికి బ్యాంకర్లు సహకరించాలి: మంత్రి నారాయణ

సాక్షి, అమరావతి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై–అర్బన్)ను విజయవంతం చేయడంలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కోరారు. ఏపీ టిడ్కో గృహాల నిర్మాణం, నిర్మించిన గృహాలను అప్పగించే పనులను వేగవంతం చేసే విషయంలో ఎదురవుతున్న సమస్యలపై బుధవారం ఆయన విజయవాడలో బ్యాంక్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. దీపావళి నాటికి ఇళ్లను పూర్తి చేసేలా పెండింగ్ నిధులను విడుదల చేయాలని, కొత్త రుణాలను అందించడంలో బ్యాంకులు ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, అప్పగించిన ఇళ్లకు సంబంధించి రికవరీ రావడం లేదని బ్యాంకర్లు మంత్రి నారాయణ దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్ , ఏపీ టిడ్కో ఎండీ సునీల్ కుమార్ రెడ్డి, ఎస్బీఐ అమరావతి సర్కిల్ సీజీఎం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్లతో పాటు ఇతర బ్యాంకుల కంట్రోలర్లు పాల్గొన్నారు.



సల్లంగ చూడు తల్లి

తెలంగాణ ప్రజలు చాలా సంతోషంగా జరుపుకునే పండుగ. ముఖ్యంగా భాగ్యనగరం (హైదరాబాద్), లస్కర్ (సికింద్రాబాద్) జంట నగరాల్లో జరిగే బోనాల పండుగ అంగరంగవైభవంగా జరుగుతుంది. అందుకే తెలంగాణ ప్రభుత్వం బోనాల పండుగను రాష్ట్రపండుగగా గుర్తించింది. మొదట గోల్కొండ జగదాంబిక ఆలయంలో ప్రారంభమై తరువాత సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాల పండుగాను నిర్వహిస్తారు. ఆ తరువాత చివరగా లాల్ దర్వాజ సింహవాహిని ఆలయంలోనూ, ఇతర చోట్ల నిర్వహిస్తారు. ఆషాఢమాసంలో ఈ బోనాల పండుగ తెలంగాణ ప్రాంతాలలో ఆనందంగా జరుపుకుంటారు. బోనాల పండుగలో ఎన్నో శాస్త్రీయ కారణాలు ఉన్నాయి. అసలు ఈ పండుగ నిర్వహించడానికి గల కారణాలు వాటిలో మనం కొన్ని ముఖ్యమైనవి తెలుసుకుందాం...

బోనం

బోనం అంటే భోజనం అని అర్థం. ఆ భోజనాన్ని ఆషాఢమాసంలో అమ్మవారికి నైవేద్యంగా పెట్టడం ఆచారంగా వస్తున్న సంప్రదాయం. ముందుగా ఆ బోనాన్ని ఒక మట్టికుండలో వండుతారు ఆలా వండిన కుండని సున్నం, పసుపు, కుంకుమ, వేపాకులతో అలంకరించి ఆ కుండపై ఒక దీపాన్ని ఉంచుతారు.

ఆచారాలు

ఆషాఢమాసంలో దేవి తన పుట్టింటికి వెళుతుందని నమ్మకం, అందుకే భక్తులు ఈ పండుగ సమయంలో దేవిని దర్శించుకుని తమ స్వంత కూతురు తమ ఇంటికి వచ్చిన భావనతో, భక్తి శ్రద్ధలతోనే గాక ప్రేమానురాగాలతో బోనాలను ఆహార నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ తంతును ఊరడి అంటారు. వేర్వేరు ప్రాంతాల్లో పెద్ద పండుగ, ఊరపండుగ వంటి పేర్లతో పిలిచేవారు. ఊరడే తర్వాతి కాలంలో బోనాలుగా మారింది.

పూర్వకాలంలో ఈ పండుగ రోజున దుష్టశక్తులను పారద్రోలటానికి ఆలయ ప్రాంగణంలో ఒక దున్నపోతును బలి ఇచ్చేవారు. నేడు దున్నపోతులకు బదులు కోడి పుంజులను బలి ఇవ్వడం ఆనవాయితీగా మారింది.

పండుగ రోజున స్త్రీలు పట్టుచీరలు, నగలు ధరిస్తారు. పూనకం వచ్చిన కొందరు స్త్రీలు తలపై కుండని (బోనం) మోస్తూ డప్పుగాళ్ళ లయబద్ధమైన మోతలకు అనుగుణంగా దేవిని స్మరిస్తూ నర్తిస్తారు.

ఆమెను శాంతపరచడానికై ఈ మహిళలు ఆలయాన్ని సమీపించు సమయంలో వారి పాదాలపై నీళ్ళు కుమ్మరిస్తారు.

తమ భక్తికి చిహ్నంగా ప్రతి భక్తబృందమూ తొట్టెలను (కాగితమూ, కర్రలతో కూర్చబడిన చిన్న రంగుల పరికరము) సమర్పించడం ఆచారంగా ఉంది.

బోనాల పండుగ సందోహం గోల్కొండకోట లోని గోల్కొండ ఎల్లమ్మ ఆలయం వద్ద మొదలయ్యి లష్కర్ బోనాలుగా పిలువబడే సికింద్రాబాదులోని ఉజ్జయిని మహంకాళి ఆలయం, బల్కంపేట్‌లోని ఎల్లమ్మ దేవాలయాల మీదుగా ఓల్డ్‌సిటీ ప్రాంతానికి చేరుకుంటుంది.

పోతురాజు

అమ్మవారి సోదరుడైన పోతురాజును ప్రతిబింబించే ఒక మనిషి చేత పండుగ సమూహాన్ని నడిపించడం ఇంకొక ఆనవాయితీ. పోతురాజు పాత్రను పోషించే వ్యక్తి సుర్రద్రూపిగా బలశాలిగా ఉంటాడు, ఒంటిపై పసుపు, నుదుటిపై కుంకుమ, కాలికి గజ్జెలు కలిగి, చిన్న ఎర్రని ధోతీని ధరించి డప్పు వాయిద్యానికి అనుగుణంగా ఆడతాడు. అతను భక్త సమూహం ముందు ఫలహారం బండి వద్ద నర్తిస్తాడు. అతను పుజా కార్యక్రమాల ఆరంభకుడిగా, భక్త సమూహానికి రక్షకుడిగా భావించబడతాడు. కొరడాతో బాదుకొంటూ... వేపాకులను నడుముకు చుట్టుకుని, అమ్మవారి పూనకంలో ఉన్న భక్తురాంద్రను ఆలయంలోని అమ్మవారి సమక్షానికి తీసుకెళతాడు.

పండుగ జరిగే ప్రాంతాలలో వేపాకులతో అలంకరించబడిన వీధులు దర్శనమిస్తాయి. జానపద శైలిలో ఉండే అమ్మవారి కీర్తనలతో నిండిన పండుగ వాతావణం విస్పష్టంగా ప్రస్ఫుటమౌతుంది.



రంగం

రంగం, పండుగ రెండవ రోజు ఉదయం జరుగుతుంది.

అమ్మవారి ఆకారంలో అలంకరింపబడిన రాగి కలశాన్ని ఘటం అని సంబోధిస్తారు. సాంప్రదాయక వస్త్రధారణ, ఒంటి పై పసుపు కలిగిన పూజారి ఈ ఘటాన్ని మోస్తాడు. పండుగ మొదటి రోజు నుండి, చివరి రోజు నిమజ్జనం దాకా ఈ ఘటాన్ని డప్పుల మేళవాద్యాల నడుమ ఊరేగిస్తారు.

ఘటం ఉత్సవం రంగం తర్వాత జరుగుతుంది. హరిబౌలిలోని అక్కన్న మాదన్న దేవాలయము వారి ఘటంతో ఏనుగు అంబారీపై, అశ్వాల మధ్య అక్కన్న, మాదన్నల బొమ్మల నడుమ ఊరేగింపు మొదలై సాయంత్రానికి కన్నుల పండుగగా నయాపుల్ వద్ద ఘట నిమజ్జనతో ముగుస్తుంది.

● ఇస్లాం వెలుగు

కొత్త సంకల్పాలకు నాంది ముహర్రం

ఇస్లామీయ కాలగణన ప్రకారం ముహర్రం నెలతో కొత్త సంవత్సరం ప్రారంభమవుతుంది. జనవరి ఒకటిని, ఉగాదిని ఎలా ఒక శుభ ప్రారంభంగా భావిస్తామో, ముహర్రం కూడా ఇస్లామీయ సమాజానికి అలా ప్రారంభ దినంగా ఉంటుంది. కానీ ఈ ఆరంభం పిచ్చిపిచ్చి వేడుకలతో ఉండకూడదు. ఆత్మపరిశీలనతో, చరిత్ర జ్ఞాపకాలతో, విలువల పునఃపరిశీలనతో ఉండాలి. హిజ్రీ సంవత్సరం ప్రారంభానికి మూలం, ప్రవక్త (స) మక్కా నుండి మదీనాకు హిజ్రత్ / వలస వెళ్లడం. ఈ వలస సాధారణ హిజ్రత్ కాదు, ధర్మ పరిరక్షణార్థం దైవాదేశాల మేరకు తీసుకున్న నిర్ణయం. అదే హిజ్రీ సంవత్సరానికి ఆధారం. అందుకే ముహర్రం నెల ప్రారంభం అంటే మన జీవితంలో ధార్మిక మార్గాల వైపు మన పయనాన్ని పునః ప్రారంభించాలనే సందేశం.

ఈ నెలలో త్యాగం, సహనం, ధైర్యం, శాంతి వంటి విలువలను గుర్తుచేసే చారిత్రక ఘట్టాలు అనేకం. గత సంవత్సరం పొరపాట్లపై పశ్చాత్తాప పడుతూ, కొత్త సంకల్పాలకు సంకేతంగా ముహర్రం నిలవాలి. ఇది ఏ విధంగా చూసినా శుభ ప్రారంభమే. అయితే కొన్ని ప్రాంతాల్లో ముహర్రం నెలలో పెళ్లిళ్లు చేయకూడదని, గృహ ప్రవేశాలు జరుపరాదని, సంతోష కార్యక్రమాలు ఏమీ చేయకూడదనే అపోహలు ఉన్నాయి. ఇవి చరిత్ర, ధర్మం రెండింటినీ విస్మరించిన వక్రీకృత ఆచారాలు. ఎందుకంటే ముహర్రం నెలలోనే అనేక మంది ప్రముఖ సహాబాలు మృతిచెందారు, షహీదులయ్యారు. షహాదత్ అనేది ఇస్లాం లో అత్యున్నత స్థాయిలో గౌరవించబడే విషయం. మరి ఈ నెలను శాపగ్రస్తంగా పరిగణించడం ఎంతవరకు సమంజసం?

ఈ నెలలో ఉపవాసాలకు ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా పదవ రోజు (యౌమే ఆషూరా) ఉపవాసానికి ఎనలేని ప్రాముఖ్యత ఉంది.

ఇస్లామీయ కొత్త సంవత్సరం ఒక్క క్యాలెండర్ మార్పు మాత్రమే కాదు, అది మన వ్యక్తిగత జీవితం, సామాజిక బాధ్యతలకు సంబంధించిన పునః ఆరంభానికి గుర్తు. ప్రతి కొత్త సంవత్సరానికి తఖ్వా, దైవభీతి, ఆత్మనిగ్రహం, సమాజంలోని అన్యాయాలపై చింతన వంటి విలువలు ప్రాతిపదిక కావాలి. ముహర్రం నెలను గౌరవించాలి, ఆశతో ముందుకు సాగాలి, అపోహలతో వెనక్కిపోకూడదు. ఇది ఆత్మపరిశుద్ధతకు ప్రారంభం, సమాజం కోసం మన బాధ్యతలకు పునరుత్థానం.



ఈ నేపథ్యంతో మనం కొత్త హిజ్రీ సంవత్సరం ప్రారంభిస్తున్న సమయంలో, ఆధ్యాత్మికంగా, సామాజికంగా మన కర్తవ్యాలను గుర్తించుకునే, అవి మన జీవనశైలిలో ప్రతిబింబించేలా చూసుకోవాల్సిన సమయం ఇది.

ముహర్రం నెల అపశకునాల నెల కాదు. అది ఆత్మవికాసానికి ఆహ్వానం. దైవం మన జీవితాలను మంచి మార్గంలో నడిపించుగాక.! ఇస్లామీయ నూతనసంవత్సర శుభాకాంక్షలతో...


– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● నిర్మల వాణి

విశుద్ధి చక్రం

విశుద్ధి చక్రాన్ని రెండుగా విభజించవచ్చు. విశుద్ధి హంస చక్రం. ఇవి రెండు చక్రాలు. విశుద్ధి చక్రం అంటే విరాటుని చక్రం. అదే మనం ప్రతివారిలోని ఆత్మను అనుభూతి చెందడము. మనం ఇతరులందరి ఆత్మను అనుభూతి చెందగలగాలి.

విశుద్ధి చక్రం విశ్వ వ్యాపితమై ఉండే సంబంధ బాంధవ్యాలలో ఉండే మాధుర్యం. ఒక పుష్పంలోని మాధుర్యాన్ని సువాసనను ఆస్వాదించినట్లుగా ఇతరులలోని మాధుర్యాన్ని ఆస్వాదించగలగాలి. ఈ సామూహిక చేతన, విశ్వజనీయత అనుభూతి చెందగలిగినప్పుడు మీరు విరాట్‌లో అంతర్భాగమవుతారు.



మొదటగా మీరు మీ ప్రేమను ఇతరులలో స్థిరపరచండి. విశుద్ధి సమస్యను అధిగమించగల మార్గం ఇదే. కేవలం సాక్షీతత్వం ద్వారానే మీరు నేర్చుకోగలుగుతారు. మీ ప్రవర్తనలోను, ముఖ కవళికల్లోనూ ఎంతో మదుత్వం ప్రస్ఫుటమవుతుంది. సహజయోగ సాధనతో శ్రీ కృష్ణుని గుణగణాలను మీలో స్థిరపరచుకోవడం ద్వారా దీనిని పొందగలరు.

హంస చక్రము

ఇది కూడా విశుద్ధి చక్రములోని భాగమే. హంస పాలను, నీటిని విడదీయగలిగినట్లుగా ఈ హంస చక్రం మీలో విచక్షణా భావాన్ని పెంపొందిస్తుంది. దీనిని పరిశుభ్రంగా, చైతన్యవంతంగా వుంచుకుంటే మంచి, చెడుల మధ్య వ్యత్యాసాన్ని మీ అంతట మీరే గుర్తించగలరు.

ఆజ్ఞా చక్రము

ఆజ్ఞా చక్రము మీ చిత్తాన్ని తేజోవంతము చేస్తుంది. ఆత్మ సాక్షాత్కారము తర్వాత మీరు ప్రతిదానిని ఈ కాంతి ద్వారానే చూస్తారు. కాంతి అని, శాశ్వతమైన ప్రకాశమని తెలుసుకుంటారు. గీతలో చెప్పబడినట్లుగా? ''నైనం ఛిదంతి శస్త్రాణి, నైనం దహతి పావక''(ఇది ఆయుధాలతో పొడవ బడదు. అగ్నిచేత దహింపబడదు). ఆజ్ఞాచక్రంలో మీకు ఈ విషయం అర్థమైనపుడు, అన్ని భయాలు, మిమ్మల్ని తమ అధీనంలో వుంచుకోవడానికి ప్రయత్నం చేసే శక్తులన్నీ క్షణంలో అదృశ్యమవుతాయి. ఎందుచేతనంటే ఇక్కడ వున్నది ప్రేమ ప్రకాశం. దీనికి పెత్తనం చలాయించడం తెలియదు. ఇది శాశ్వతమైనది కాబట్టి చావుకి గాని, శిలువ వేయబడటానికి గాని భయపడదు. ఈ ఆజ్ఞాచక్రం ఆనందాన్ని మీలోనికి చొచ్చుకుని పోనిచ్చినప్పుడు మీలోని కాంతి నిశ్చలమవుతుంది. ఆ ప్రకాశంలో మీరు మీ త్యాగాన్ని ఆనందిస్తారు. అమర వీరులు ఎలాగైతే వారి జీవితాన్ని ఆనందంగా త్యాగం చేస్తారో అదే విధంగా ఎటువంటి ఇబ్బందులైనా ఆనందంగా ఎదుర్కొంటారు. సహజయోగ సాధకులకు సాధ్యపడుతుంది.



శ్రీ మాతాజీ నిర్మలాదేవి

డా. పి. రాకేష్
(శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనం ఆధారంగా)

● పూరి జగన్నాథ రథ యాత్ర

అద్వితీయం.. అద్భుతం

ఆషాఢమాసం వస్తోందనగానే భాగ్యనగర వాసులకు, తెలంగాణ వాసులకు బోనాల పండుగ ఎలా గుర్తుకొస్తుందో ఒడిశా వాసులకు, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జగన్నాథుని భక్తులకు పూరి జగన్నాథుని రథయాత్రే గుర్తుకువస్తుంది. ఇది ఆషాఢ శుక్ల విదియ నాడు పూరి క్షేత్రంలో అంగరంగ వైభవంగా జరుగుతుంది. శనివారం జగన్నాథ రథయాత్ర సందర్భంగా ఆ విశేషాలు ...





దేశవ్యాప్తంగా పుణ్యక్షేత్రాలు కోకొల్లలుగా ఉన్నాయి. వాటన్నింటిలోనూ ఆ దేవదేవుడు సతీసమేతంగా కొలువుతీరి ఉండటమే చూస్తాం. కాని, ఈ సువిశాల జగత్తుకే పతి అయిన జగన్నాథుడు సోదరీ సోదరులైన సుభద్ర, బలభద్రులతో కలిసి కనుల పండువ చేయడం ఒడిశా రాష్ట్రంలోని పూరీలో మాత్రమే చూడగలం. పూరీ క్షేత్రంలో జగన్నాథ రథయాత్ర జూన్ 28న ప్రారంభం అవుతోంది. దాదాపు కోటిమందికి పైగా భక్తులు పాల్గొనే ఈ అతిపెద్ద రథయాత్ర విశేషాలను అవలోకిద్దాం:

రథయాత్ర సందర్భంగా జగన్నాథుడు తన నివాసమైన శ్రీ పీఠాన్ని వదిలి ప్రజల వద్దకు విచ్చేస్తాడు. 44 అడుగుల ఎత్తున్న రథంలో సోదరసోదరీ సమేతంగా జగన్నాథ స్వామి రథయాత్ర కొనసాగుతుంది. రాజు- పేద, నాగరిక- అనాగకరిక, పండిత- పామర, దేశీ- విదేశీ భక్తులు అందరూ పాల్గొంటారు. 250 అడుగుల పొడవు, 8 అంగుళాల కైవారం ఉండే తాళ్లతో ఉండే రథాలను లాగడానికి అశేష భక్తజనం పోటీపడతారు. ఆషాఢమాసం రెండోరోజున ఆ దేవదేవుని రథచక్రాలు ముందుకు కదులుతాయి.

స్థలపురాణం

ప్రస్తుత పూరీని ఒకప్పుడు శ్రీక్షేత్రమని, శంఖక్షేత్రమని, నీలాచలమని, నీలాద్రి అనీ, పురుషోత్తమ పురి అనీ జగన్నాథపురి అని పిలిచేవారు. ఈయనకు నీలమాధవుడని పేరు. ఈ నీలమాధవునికి తొలి పూజలు చేసింది విశ్వవసు అనే శబర నాయకుడు. జగన్నాథునికి ఆలయాన్ని నిర్మించింది గంగవంశస్థులు. నీలమణితో తయారైన నీలమాధవుని విగ్రహం కాలగర్భంలో కలిసిపోగా, ఇంద్రద్యుమ్నుడనే మహారాజు తనకు కలలో కనపడిన దారువు (కొయ్యదుంగ)ను విగ్రహాలుగా చెక్కించేందుకు పూనుకుంటాడు. ఒక వద్ధ శిల్పిని అందుకోసం నియమించాడు. అయితే ఆ వద్ధ శిల్పి ఒక షరతు విధించాడు. తనకు ప్రత్యేకంగా ఒక గది ఇవ్వాలని, విగ్రహాల తయారీ పూర్తయ్యేవరకూ తనను ఎవరూ కదిలించకూడదని, చెప్పాడు. రాజు అందుకు అంగీకరించాడు. అయితే ఎన్నాళ్లకూ గది తలుపులు తెరుచుకోకపోవడం, లోపలినుంచి శిల్పాలు చెక్కిన శబ్దాలు వినిపించకపోవడంతో ఉత్సుకత పట్టలేక రాజు గది తలుపులు తెరిచాడు. అంతే! మొండెం వరకూ చెక్కిన విగ్రహాలను అలాగే వదిలేసి ఆ వృద్ధశిల్పి అదృశ్యమయ్యాడు. రాజు ఖిన్నుడయ్యాడు. అప్పుడు జగన్నాథుడు ప్రత్యక్షమై 'రాజా దిగులు చెందక వీటిని యథాతథంగా ప్రతిష్ఠించు' అని చెప్పి అదృశ్యమయ్యాడు. రాజు వాటినే ప్రతిష్ఠించి, పూజలు జరిపాడు. ముగ్ధమనోహర రూపంలో ఉండే ఈ మూర్తులను శంకర భగవత్పాదులు, రామానుజార్యులు, మధ్వాచార్యులు వంటి ఎందరో మహానుభావులు ఇక్కడ తమ మఠాలను ఏర్పాటు చేసుకుని మరీ కొలిచారు, తరించారు.

ఆ రూపమే అపురూపం

పూరీ జగన్నాథునిది చాలా విచిత్రరూపం. దారుమూర్తిగా పెద్ద పెద్ద కళ్లతో, కాళ్లు, చేతులు, పెదవులు, చెవులు లేకుండా కేవలం ఒక చెట్టుకు పసుపు, కుంకుమలతో అలంకరించినట్లుగా ఉంటే ఆటవిక రూపం. అయితేనేం, ఈ సువిశాల ప్రపంచాన్నంతటినీ చూడడం కోసమే అన్నట్లు ఇంతింత లావున ఉండే గుండ్రని కన్నులతో, త్రికోణాకారంలో ఉండే ముఖం జగన్నాథునిది కాగా, గుండ్రని ముఖారవిందంతో బలభద్రుడు కనువిందు చేస్తాడు, సుభద్రాదేవి పసుపుపచ్చని వర్ణంతో దర్శనమిస్తుంది. ఈ మూడు మూర్తులూ కూడా కేవలం నడుము భాగం వరకే ఉంటాయి. ప్రతి పద్దెనిమిదేళ్లకు ఒకసారి సుభద్ర, బలభద్రుడు, జగన్నాథుని విగ్రహాలను తయారు చేస్తారు. అంటే కొత్త మూర్తులను తయారు చేసి, పాతమూర్తులలోని 'బ్రహ్మపదార్థాన్ని' వాటిలో ప్రవేశపెడతారు. దీనినే నవకళేబర (శక్తి ఆవాహన)మంటారు. పాత మూర్తులను కొయిలి వైకుంఠమనే ప్రదేశంలో భూస్థాపితం చేస్తారు. మూలవిరాట్టులకు ఏడాదిలో ఒకసారి మాత్రమే జేష్ఠ్యపూర్ణిమ నాడు మాత్రమే అభిషేకం చేస్తారు. మిగతా అన్ని రోజుల్లో అన్నా చెల్లెళ్లకు ఎదురుగా అద్దాన్ని ఏర్పాటు చేసి దర్పణస్నానం చేయిస్తారు.

ముగ్గురు తోబుట్టువులు... మూడు రథాలు

పూరీలో ప్రతి ఏడాదీ నూతన రథాలను తయారు చేస్తారు. బలరామునికి, సుభద్రకు, జగన్నాథునికి మూడు కొత్త రథాలను తయారు చేస్తారు. సరిగ్గా రథయాత్రకు ముందు రోజైన ఆషాఢ శుద్ధ పాడ్యమి నాడు పూర్తవుతుంది. ఏ క్షేత్రంలోనైనా ఉత్సవమూర్తులను రథాలపై ఊరేగిస్తారు. కానీ పూరీలో మాత్రమే మూలవిరాట్టులనే రథాలపై అధిరోహింపచేస్తారు. ఇలాంటి ప్రత్యేకత మరెక్కడా లేదు. 44 అడుగుల ఎత్తుండే జగన్నాధుడి రథం పేరు నందిఘోష, ఈ రథాన్ని ఎరుపు, పసుపు రంగు వస్త్రాలతో అలంకరిస్తారు. 43 అడుగుల ఎత్తుండే బలరాముడి రథం పేరు తాళధ్వజ. దీనిని ఎరు, ఆకుపచ్చ వస్త్రాలతో అలంకరిస్తారు. ఇక సుభద్రాదేవి రథం పేరు దర్పదళన. దీని ఎత్తు 42 అడుగులు. దీనిని ఎరుపు, నలుపు వస్త్రాలతో అలంకరిస్తారు.


● సువార్త

దేవుని గూర్చిన అధ్యయనం

మహోన్నతుడైన దేవుని అధ్యయన, పరిశోధనల ద్వారా వాస్తవమైన జీవితం ఒకటి ఉందనే సర్వ సత్యం లోతుగా అనుభవానికి వస్తుంది. అట్టి జీవితం ద్వారానే దేవుని మెప్పించే వీలుందనే అవగాహనతో పాటుగా స్థిరచిత్తం కూడా అలవడుతుంది. ఆధ్యాత్మికంగా సుసంపన్నమైన భావజాలం గల వ్యక్తి అన్నింటా ఉన్నతుడు. తనను చుట్టుముట్టే సమస్యలకు చలించడు. ఏనాడూ వాటికి తలవంచడు. ఎప్పుడూ కలత చెందడు. సమస్యలనేవి ఉన్నచోటనే ఆగిపోతాయి. వేగంగా వచ్చి బండను ఢీ కొన్న కెరటం ఛిన్నాభిన్నమైపోతుంది. సమస్యకే సమస్య వచ్చిపడి అది ఇక తాళలేక వెనక్కి మరలడం చూసే వారికది ఎప్పుడూ కనువిందే. సద్భక్తిపరులే సమస్యల పట్ల బండలాంటి ధీరోదాత్తం ప్రదర్శించగలుగుతారు. దేవుని గూర్చిన అధ్యయనం వలన ఇంత గొప్ప లాభం ఉంది మరి.

'దేవుని గూర్చిన అధ్యయనం' చేసే మేలు ఇంతా అంతా కాదు. ఈ యావత్ప్రపంచంలోనే దేవుని గూర్చిన అధ్యయనం మించిన అంశం, ఇట్టి పరిశోధనాంశం మరొకటి లేనేలేదు. ఈ అరుదైన ఈ అసాధారణ విషయం ఒక్కటే యావత్తూ మానవ జీవితాన్ని నిర్దేశిస్తుందనేది వాస్తవం. పరమార్థం దిశలో సార్థకం అయ్యేదే వాస్తవమైన జీవితమని రాజ గ్రంథమనే పరిశుద్ధ బైబిలు వ్యాఖ్యానించడం ఎంతో మనస్సు పెట్టి గమనించదగ్గది.

ఆత్మ సంబంధ విద్య చిన్నలకు, పెద్దలకు, అందరికి సంబంధించిన విద్య. ఆత్మ సంబంధ విద్య యావత్తూ మానవాళి శ్రేయస్సును కాంక్షించేదే కాబట్టి ఇది అందరి విద్య కావాలసిన తరుణం ఇదే. ఈ ఆత్మ సంబంధ విద్య ఉంటే అన్నీ సమకూర్చుకున్నట్టే.



యేసు చిన్న వయస్సులోనే తాను నేర్చుకోన్న పరిమిత జ్ఞానంతోనే ప్రశ్నలు గుప్పిస్తూ ధర్మ శాస్త్ర సంబంధ జ్ఞానులను, శాస్త్రులను, పరిసయ్యుల పండితులను ఆశ్చర్యానందాలకు గురి చేసాడు. నేడు ఆత్మ సంబంధ విద్య కొందరికే పరిమితం చేయడం, అది బాలుడుగా ఉన్నప్పుడు మొదలు కాక, ముగింపు దశలో నేర్చుకోనే విద్యగా పరిగణించడం మనం వింటూ ఉంటూ చూస్తుంటాము కూడా. అయితే బాలుడు నడువవలసిన త్రోవను గూర్చి గ్రంథరాజ బోధన తీరు అమోఘం. దైవికపరమైన పరసంబంధ పవిత్ర జ్ఞానాన్ని నిర్లక్ష్యం చేయడం జీవితంలో ఎదగాలనుకొనేవారికి తగదు. వినమ్రతా విధేయతలతో ఆత్మ సంబంధ విద్యను సముపార్జించడం అసాధారణ విషయం. ఇందు ఇమిడిన సానుకూల దృక్పథం సంబంధిత సృజనాత్మకళ సామాన్యుడిని ఉన్నతుడిని చేసి శిఖరాగ్రాన నిలబెడుతుంది. దేవుని మనస్సును, అంతర్యాన్ని అధ్యయనం చేస్తూ, ఆయనపై ఆధారపడిన వారెప్పుడు అణిగి మణిగి ఉంటారు. ఇలా ఆధ్యాత్మికంగా సుసంపన్నమైన వారు అన్నింటా రాణిస్తారు. దేవుని బోధల అవగాహన మేరకు తెలియబడేది ఏమంటే వాస్తవిక జీవిత లక్షణం ఎన్నడూ హెచ్చించుకోకపోవడం అనునదే. తగ్గింపులోనే హెచ్చింపు అనేది రసంబంధ సర్వ సత్యం. క్రీస్తు శ్రమలలో అపొస్తలులవలె మనం కూడా పాలి భాగస్థులం కావడం అనేదే మనకు మహాభాగ్యం. క్రీస్తువలె శ్రమల ద్వారా విధేయతను నేర్చుకోనేలా దేవుడు అనుమతించిన శ్రమలను అడ్డుకోక తలవంచే జీవితమే ఉన్నత జీవితం. క్రైస్తవ్యం శ్రమలు లేని జీవితం కాదు. క్రీస్తును బట్టి శ్రమలను సాహసంతో ఎదుర్కొనే హుందా జీవితమే క్రైస్తవ్యం. నిత్య దైవసందేశ పఠనమే సరియైన మార్గాన నడిపించి ఇట్టి సారవంత జీవితాన్ని అనుగ్రహించి పెడుతుంది.

– జేతమ్

● ధర్మ సందేహాలు

అయిదో తనమంటే ?

ముత్తయిదువ అని అర్థం. పసుపు, కుంకుమ, గాజులు, మెట్టెలు, మాంగల్యం. స్త్రీ ఈ అయిదు అలంకరణలతో కల కల లాడుతుండాలి. స్త్రీకి వివాహం అయిన తర్వాతే మెట్టెలు, మాంగల్యం వస్తాయి.



స్త్రీలు జుట్టు విరబోసుకొని ఎందుకుండరాదు?

ఈ చర్య పిశాచాలకు ఆహ్వానం వంటిది. అనేక దుష్ట గ్రహాలూ ఆ సమయంలో ఆవహించి కల్లోలపరిచే శక్తి జుట్టు విరబోసుకున్నప్పుడే వాటికి వస్తుంది. దానికి తోడు విరబోసుకున్న స్త్రీని చూసిన పురుశిడికి ఆ స్త్రీమీద కామం కలుగుతుంది. తద్వారా కుటుంబ సమస్యలు వస్తాయి. అలాగే జుట్టు విరబోసుకు తిరుగుతుంటే లక్ష్మి దేవి అక్కకు కూడా ఆహ్వానమే.

బిజినెస్ రీల్

యూనియన్ బ్యాంక్ ఈడీకి ఊహించని అనుభవం

హోదా తగ్గించి జనరల్ మేనేజర్‌గా నియామకం



న్యూఢిల్లీ: యూనియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) పంకజ్ ద్వివేదికి ఊహించని అనుభవం ఎదురైంది. జనరల్ మేనేజర్‌గా ఆయన హోదాను తగ్గిస్తూ కేంద్ర ఆర్థిక సేవల విభాగం నోటిఫికేషన్ జారీ చేసింది. పూర్వపు హోదాలో జనరల్ మేనేజర్‌గా పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్‌కు పంపించింది. ఢిల్లీ హైకోర్టులో ద్వివేదికి వ్యతిరేకంగా కేసు పెండింగ్‌లో ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. యూనియన్ బ్యాంక్ ఈడీగా ద్వివేది నియామకాన్ని సవాలు చూస్తే ఢిల్లీ హైకోర్టులో గతేడాది ప్రజాహిత వ్యాజ్యం దాఖలైంది. విజిలెన్స్ క్లియరెన్స్ లేకుండా ఈడీగా నియమించడం నిబంధనల ఉల్లంఘనంటూ పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విజిలెన్స్ విభాగం ఆమోదం లేకుండా నియామకం ఎలా చేశారని ప్రశ్నిస్తూ.. 2024 ఆగస్టులో కేంద్రం, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు కూడా జారీ చేసింది.

ఆరు చైనా ఉత్పత్తులపై యాంటీ-డంపింగ్ సుంకం



న్యూఢిల్లీ: వెల్లువెత్తే చౌక దిగుమతుల నుంచి దేశీ తయారీ సంస్థల ప్రయోజనాలను కాపాడే దిశగా ఈ నెలలో ఇప్పటివరకు ఆరు చైనా ఉత్పత్తులపై కేంద్రం యాంటీ-డంపింగ్ సుంకం విధించింది. పీఈడీఏ, ఎసిటోనైట్రిల్ (ఫార్మా రంగంలో ఉపయోగిస్తారు), విటమిన్-ఎ పామిటేట్, డెకోర్ పేపర్ మొదలైనవి వీటిలో ఉన్నాయి. పరిశ్రమల్లో ఉపయోగించే ఈ ముడిసరుకులపై అయిదేళ్ల పాటు సుంకాలు ఉంటాయని వేర్వేరు నోటిఫికేషన్లలో కేంద్రీయ పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డ్ తెలిపింది. వాణిజ్య శాఖలో భాగమైన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమెడీస్ (డీజీటీఆర్) సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. దిగుమతి సుంకాలు ఉత్పత్తిని బట్టి కేజీకి 20.87 డాలర్ల నుంచి టన్నుకు 2,017.9 డాలర్ల వరకు ఉంటాయి. గత ఆర్థిక సంవత్సరంలో చైనాతో భారత్ వాణిజ్య లోటు 99.2 బిలియన్ డాలర్లకు చేరింది. చైనాకు ఎగుమతులు 14.5 శాతం క్షీణించి 14.25 బిలియన్ డాలర్లకు పరిమితం కాగా, దిగుమతులు 11.52 శాతం పెరిగి 113.45 బిలియన్ డాలర్లకు ఎగిశాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

26-6-2025

విశాఖ	575-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	555-00
విజయవాడ	575-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	545-00
వరంగల్	547-00
రిటైల్ ధర	6.05

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TITAN	3,655.00	3.66
M&M	3,218.00	2.16
GRASIM	2,840.00	2.13
INFY	1,612.50	1.95
JSWSTEEL	1,024.65	1.75

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	406.3	-2.92
KOTAKBANK	2,195.00	-1.29
EICHERMOT	5,576.50	-0.93
ONGC	241.8	-0.87
AXISBANK	1,211.00	-0.84


స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,401
ఎన్ఎస్ఈ	1,01,656
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	3,83,798
ఎఫ్ఐఐ	- 2,427
డీఐఐ	+ 2,373

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.29	$ 64.37
బ్రెంట్	66.79	$ 66.17

పీఎల్ఐ ప్రోత్సాహకాలు... రూ.21,534 కోట్లు



- 12 రంగాలకు వితరణ
- రూ.1.76 లక్షల కోట్ల పెట్టుబడులు
- రూ.16.5 లక్షల కోట్ల అదనపు ఉత్పత్తి
- తయారీకి ఊతంగా 2021లో ప్రారంభం

న్యూఢిల్లీ: భారత్‌లో తయారీని ప్రోత్సాహించేందుకు కేంద్రం తలపెట్టిన ఉత్పత్తి అనుసంధాన ఆధారిత ప్రోత్సాహకం (పీఎల్ఐ) పథకం సత్ఫలితాలను ఇస్తోంది. దీని కింద కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు 12 రంగాలకు రూ.21,534 కోట్ల ప్రోత్సాహకాలు అందించినట్టు ప్రకటించింది. ఎలక్ట్రానిక్స్, ఫార్మా రంగాలు కూడా ఇందులో ఉన్నాయి. కరోనా సమయంలో సరఫరా వ్యవస్థ నుంచి సమస్యలు ఏర్పడడంతో.. భారత్‌లో తయారీని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో కేంద్రంలోని మోదీ సర్కారు 2021లో పీఎల్ఐ పథకాన్ని 14 రంగాల కోసం ప్రకటించింది. రూ.1.97 లక్షల కోట్ల ప్రోత్సాహకాలు ఇవ్వాలన్న లక్ష్యాన్ని పెట్టుకుంది. ఇప్పటి వరకు 12 రంగాలకు కలిపి రూ.21,534 కోట్ల ప్రోత్సాహకం విడుదల చేసినట్టు కేంద్ర వాణిజ్య శాఖ తాజాగా ప్రకటించింది. ఎలక్ట్రానిక్స్ తయారీ, ఐటీ హార్డ్‌వేర్, బల్క్ డ్రగ్స్, వైద్య పరికరాలు, ఫార్మా, టెలికం, ఆహార ప్రాసెసింగ్, వైట్ గూడ్స్ (ఏసీలు తదితర), ఆటోమొబైల్స్, స్పెషాలిటీ స్టీల్, టెక్స్‌టైల్స్, డ్రోన్స్ తయారీకి కేంద్రం ప్రోత్సాహకాలను ప్రకటించడం గమనార్హం. ఈ తరహా పథకాల పనితీరును కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ తాజాగా సమీక్షించారు. వచ్చే ఐదేళ్ల కాలానికి పెట్టుబడులు, ప్రోత్సాహకాలతో తమ పరిధిలో కార్యాచరణ రూపొందించాలని వివిధ శాఖలను కోరారు.

12 లక్షల మందికి ఉపాధి

పీఎల్ఐ పథకం కింద ఇప్పటి వరకు రూ.1.76 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు వాణిజ్య శాఖ తెలిపింది. వీటి ద్వారా రూ.16.5 లక్షల కోట్ల ఉత్పత్తి అదనంగా నమోదు కాగా, 12 లక్షల మందికి పైగా ఈ ఏడాది మార్చి నాటికి ఉపాధి (ప్రత్యక్ష, పరోక్ష) లభించినట్టు పేర్కొంది. ఫార్మా రంగానికి సంబంధించి పీఎల్ఐ పురోగతిని సమీక్షించగా, ఈ రంగంలో రూ.2.66 లక్షల కోట్ల ఉత్పత్తి అదనంగా సాధ్యమైనట్టు, ఇందులో రూ.1.70 లక్షల కోట్ల ఎగుమతులు మొదటి మూడేళ్లలో నమోదైనట్టు వాణిజ్య శాఖ గుర్తించింది. మొత్తం మీద ఫార్మా రంగంలో దేశీయంగా విలువ జోడింపు 2025 మార్చి నాటికి 83.70 శాతానికి చేరుకున్నట్టు తెలిపింది. బల్క్ డ్రగ్ విభాగంలో మన దేశం నికర దిగుమతిదారు నుంచి ఎగుమతిదారుగా మారింది. 2021-22 నాటికి నికర బల్క్ డ్రగ్ దిగుమతులు రూ.1,930 కోట్లుగా ఉంటే, 2025 మార్చి నాటికి రూ.2,280 కోట్ల నికర ఎగుమతులు పీఎల్ఐ కింద నమోదయ్యాయి. మ్యాన్ మేడ్ ఫైబర్ (ఎంఎంఎఫ్) టెక్స్‌టైల్స్ ఎగుమతులు 6 బిలియన్ డాలర్లకు చేరాయి. 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో వీటి ఎగుమతులు 5.7 బిలియన్ డాలర్లుగానే ఉండడం గమనార్హం.

హెచ్‌డీబీకి యాంకర్ పెట్టుబడులు

- దేశ, విదేశీ ఇన్వెస్టర్ల నుంచి రూ. 3,369 కోట్లు
- పబ్లిక్ ఇష్యూ షురూ
- ధరల శ్రేణి రూ. 700-740



న్యూఢిల్లీ: అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీ.. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూలో భాగంగా దేశ, విదేశీ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థల నుంచి రూ. 3,369 కోట్లు సమీకరించింది. షేరుకి రూ. 740 ధరలో 4.55 కోట్ల షేర్లను కేటాయించింది. యాంకర్ ఇన్వెస్టర్ల జాబితాలో ఎంఎఫ్‌లు.. ఐసీఐసీఐ ప్రు, ఎస్‌బీఐ, నిప్పన్ ఇండియాసహా ఎల్ఐసీ, టాటా ఇన్వెస్ట్‌మెంట్, బ్లాక్‌రాక్, మోర్గాన్ స్టాన్లీ, రాయల్ బ్యాంక్ ఆఫ్ కెనడా, అలియెంజ్ గ్లోబల్, సొసైటీ జనరాలి తదితర 141 దిగ్గజాలు చేరాయి. ఇందులో 65 పథకాల ద్వారా దరఖాస్తు చేసిన 22 దేశీ ఎంఎఫ్‌లకు దాదపు 1.94 కోట్ల షేర్లు జారీ చేసింది. కంపెనీ రూ. 700-740 ధరల శ్రేణిలో చేపట్టిన ఐపీవో బుధవారం(25న) ప్రారంభమై శుక్రవారం(27న) ముగియనుంది. ఇష్యూలో భాగంగా మాతృ సంస్థ, ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ. 10,000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచగా.. మరో రూ. 2,500 కోట్ల ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వెరసి ఇష్యూ ద్వారా మొత్తం రూ. 12,500 కోట్లు అందుకోనుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 20 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఐపీవో ధర ప్రకారం కంపెనీ విలువ రూ. 61,400 కోట్లుగా నమోదయ్యే అవకాశముంది. ప్రస్తుతం అనుబంధ ఎన్‌బీఎఫ్‌సీలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 94.36 శాతం వాటా కలిగి ఉంది. ఈక్విటీ జారీ నిధులను టైర్-1 మూలధన బలిమికి వెచ్చించనుంది. తద్వారా బిజినెస్ వృద్ధికి దోహదపడే అదనపు రుణాల విడుదలకు, భవిష్యత్ పెట్టుబడి అవసరాలకు వినియోగించనుంది. 2008 మొదలు కంపెనీ ఎంటర్‌ప్రైజ్, కన్జూమర్ రుణాలతోపాటు అసెట్ ఫైనాన్స్ తదితర సర్వీసులందిస్తున్నట్లు హెచ్‌డీబీ ఫైనాన్స్ సీఈవో రమేష్ జి పేర్కొన్నారు.

ఎయిరిండియాకు ప్రమోటర్ల నిధులు

గతేడాది రూ. 9,558 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: నష్టాలతో నడుస్తున్న విమానయాన దిగ్గజం ఎయిరిండియాలో ప్రమోటర్ సంస్థలు టాటా సన్స్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ గత ఆర్థిక సంవత్సరం(2024-25)లో రూ. 9,558 కోట్లు ఇన్వెస్ట్ చేశాయి. వీటిలో ఒక్క చివరి నెల(మార్చి)లోనే రూ. 4,306 కోట్లు అందించాయి. 2022 జనవరి మొదలు టాటా గ్రూప్ ఎయిరిండియాను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఐదేళ్లలో సరికొత్త మార్పులకు తెరతీసే(ట్రాన్స్‌ఫార్మేషన్) ప్రణాళికలను అమలు చేస్తోంది. 2024 నవంబర్‌లో రెండు సంస్థల భాగస్వామ్య కంపెనీ విస్తారాను ఎయిరిండియాలో విలీనం చేశాయి. తద్వారా ఎయిరిండియాలో సింగపూర్ సంస్థ 25.1 శాతం వాటా దక్కించుకుంది. దీంతో ఎయిరిండియా మూలధన వ్యయాలకుగాను ప్రమోటర్ సంస్థలు గతేడాది రూ. 9,500 కోట్లకుపైగా ఇన్వెస్ట్ చేసినట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. ప్రయివేట్ రంగ విమానయాన దిగ్గజానికి టాటా సన్స్ రూ. 3,225 కోట్లు, సింగపూర్ ఎయిర్‌లైన్స్ రూ. 6,333 కోట్లు చొప్పున అందించినట్లు వెల్లడించారు. నిధులను పెట్టుబడి వ్యయాలతోపాటు వర్కింగ్ క్యాపిటల్, వృద్ధి ప్రణాళికలకు అనుగుణంగా సమకూర్చినట్లు తెలియజేశారు. బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ వివరాల ప్రకారం ఈ మార్చిలో టాటా సన్స్ రూ. 3,225 కోట్లు, సింగపూర్ సంస్థ రూ. 1,081 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేశాయి. మార్చి పెట్టుబడులకు ముందు ఎయిరిండియాలో సింగపూర్ ఎయిర్‌లైన్స్ దాదాపు రూ. 5,253 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. కాగా.. 2024 డిసెంబర్31తో ముగిసిన 9 నెలల కాలంలో ఎయిరిండియా గ్రూప్ అనుకోని పద్దులకు ముందు రూ. 8,033 కోట్ల నష్టాలు ప్రకటించింది. ఇదే కాలంలో ప్రొవిజనల్ గణాంకాల ప్రకారం రూ. 56,367 కోట్ల ఆదాయం సాధించింది.

5జీ యూజర్లు @ 98 కోట్లు..!

- 23 కోట్లకు 4జీ చందాదారులు
- ఒక్కో ఫోన్ డేటా వినియోగం 66జీబీ
- 2030 నాటికి చేరుకోవచ్చు
- ఎరిక్సన్ మొబిలిటీ నివేదిక



న్యూఢిల్లీ: భారత్‌లో 5జీ టెలికం యూజర్లు (చందాదారులు) 2030 నాటికి 98 కోట్లకు చేరుకుంటారని, అప్పటికి 4జీ చందాదారుల సంఖ్య 60 శాతం తగ్గి 23 కోట్లకు పరిమితం అవుతుందని టెలికం గేర్ల తయారీ సంస్థ ఎరిక్సన్ తెలిపింది. "2024 చివరికి 5జీ చందాదారులు 29 కోట్లకు పెరిగారు. మొత్తం మొబైల్ సబ్‌స్క్రిప్షన్లలో 24 శాతంగా ఉన్నారు. 2030 నాటికి ఈ సంఖ్య 98 కోట్లకు చేరుకుంటుంది. మొత్తం చందాదారుల్లో 5జీ యూజర్లు 75 శాతానికి పెరుగుతారు''అని ఎరిక్సన్ మొబిలిటీ రిపోర్ట్ వెల్లడించింది. 2024లో ఒక్కో స్మార్ట్ ఫోన్ ద్వారా 32జీబీ డేటా వినియోగంతో భారత్ ప్రపంచంలో డేటా రద్దీ పరంగా మొదటి స్థానంలో నిలిచినట్టు తెలిపింది. 2030 నాటికి ఒక్కో స్మార్ట్‌ఫోన్ డేటా వినియోగం 66జీబీకి పెరుగుతుందని అంచనా వేసింది. ఇందుకు అనుగుణంగా బలమైన 5జీ నెట్‌వర్క్ అవసరం ఉంటుందని పేర్కొంది. వేగంగా 5జీ స్మార్ట్‌ఫోన్లకు యూజర్లు మారుతుండడం, డేటా వినియోగానికి డిమాండ్ పెరుగుతున్నట్టు వివరించింది. ''బ్రాడ్‌బ్యాండ్ అవసరం పెరుగుతోంది. ముఖ్యంగా గ్రామీణ, చిన్న పట్టణాల్లో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. 5జీ ఫిక్స్‌డ్ వైర్‌లెస్ యాక్సెస్ (ఎఫ్‌డబ్ల్యూఏ) విస్తరణ దిశగా సర్వీస్ ప్రొవైడర్లను ఈ డిమాండ్ నడిపిస్తుంది. భారత్‌లో అందుబాటులో ఉన్న 5జీ మిడ్‌బ్యాండ్ స్పెక్ట్రమ్.. సామర్థ్యం, నెట్‌వర్క్ విస్తరణ అవసరాలకు సరిపోతుంది. ఇది యూజర్ అనుభవం పెరిగేందుకు వీలు కల్పిస్తుంది''అని ఎరిక్సన్ నివేదిక వివరించింది.

1.41 కోట్లకు విమాన ప్రయాణికులు

- మే నెలలో నమోదు
- ఇండిగో మార్కెట్ వాటా 64 %



ముంబై: దేశీ విమానయాన రంగంలో ప్రయాణికుల సంఖ్య మే నెలలో 1.89 శాతం పెరిగి 1.41 కోట్లకు చేరినట్టు పౌర విమానయాన డైరెక్టరేట్ జనరల్ (డీజీసీఏ) ప్రకటించింది. 2024 మే నెలలో విమాన ప్రయాణికుల సంఖ్య 1.38 కోట్లుగా ఉంది. 64 శాతం మార్కెట్ వాటా ఇండిగో చేతుల్లోనే ఉంది. ఈ సంస్థ విమానాల్లో 93.09 లక్షల మంది ప్రయాణించారు. ఆ తర్వాత 37.22 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందించడం ద్వారా 26.5 శాతం మార్కెట్ వాటా ఎయిర్ ఇండియా గ్రూపు సొంతం చేసుకుంది. ఇక ఆకాశ ఎయిర్ విమానాల్లో 7.48 లక్షల మంది, స్పైస్‌జెట్ విమానాల్లో 3.40 లక్షల మంది చొప్పున మే నెలలో ప్రయాణించారు. ఆకాశ ఎయిర్ మార్కెట్ వాటా 5.3 శాతంగా ఉంటే, స్పైస్ జెట్ మార్కెట్ వాటా 2.4 శాతానికి పరిమితమైంది. ఆరు ప్రధాన విమానాశ్రయాల నుంచి (హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా) 84 శాతం సర్వీసులకు సకాలంలో సేవలు అందించి ఇండిగో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత 79.7 శాతంతో ఎయిర్ ఇండియా గ్రూపు ద్వితీయ స్థానంలో ఉంది.

జైప్రకాశ్ రిజల్యూషన్‌కు రెడీ

అదానీ గ్రూప్, వేదాంతా, దాల్మియా భారత్ ప్రణాళికలు



న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న జైప్రకాశ్ అసోసియేట్స్ దివాలా పరిష్కారంలో భాగంగా డైవర్సిఫైడ్ దిగ్గజాలు అదానీ గ్రూప్, వేదాంతాసహా దాల్మియా భారత్ సిమెంట్ తాజాగా ప్రణాళికలు దాఖలు చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే జేపీ ఇన్‌ఫ్రాటెక్‌ను సొంతం చేసుకున్న సురక్షా గ్రూప్ సైతం బిడ్ వేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. అయితే తొలుత ఆసక్తి చూపిన బాబా రామ్‌దేవ్ కంపెనీ పతంజలి ఆయుర్వేద్ వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. జైప్రకాశ్ అసోసియేట్స్‌ను కొనుగోలు చేసేందుకు ఏప్రిల్‌లో 25 కంపెనీలవరకూ ఆసక్తిని ప్రదర్శించాయి. దీంతో ఈ నెల మొదట్లో జైప్రకాశ్ రుణదాత సంస్థలు రిజల్యూషన్ ప్రణాళికల దాఖలుకు గడువును జూన్ 24వరకూ పొడిగించాయి. రియల్టీ, సిమెంట్ తయారీ, ఆతిథ్యం, ఇంజినీరింగ్, నిర్మాణ రంగాలలో బిజినెస్‌లు కలిగిన జైప్రకాశ్ రుణ చెల్లింపుల్లో విఫలంకావడంతో కార్పొరేట్ దివాల ప్రక్రియకు చేరింది. జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) అలహాబాద్ బెంచ్ 2024 జూన్3న జారీ చేసిన ఆదేశాలమేరకు దివాలా చర్యలకు తెరలేచింది. జైప్రకాశ్ రుణ పరిష్కారంపై ఏప్రిల్‌లో టొరెంట్ పవర్, జీఎంఆర్ బిజినెస్, జిందాల్ ఇండియా పవర్, ఒబెరాయ్ రియల్టీ, జేసీ ఫ్లవర్స్ ఏఆర్‌సీ తదితరాలు ఏప్రిల్‌లో ఆసక్తిని వ్యక్తం చేస్తూ బిడ్(ఈవోఐ)ను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. మొత్తం రూ. 57,185 కోట్ల రుణాలను రుణదాతలు క్లెయిమ్ చేస్తుండటం గమనార్హం!

రిలయన్స్ డిఫెన్స్‌కు రూ. 600 కోట్ల ఆర్డర్



న్యూఢిల్లీ: అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీ రిలయన్స్ డిఫెన్స్ తాజాగా జర్మనీ రక్షణ రంగ సంస్థ రైన్‌మెటల్ వాఫే మ్యునిషన్ జీఎంబీహెచ్ నుంచి రూ. 600 కోట్ల విలువైన ఆర్డర్ దక్కించుకుంది. హైటెక్ కమ్యూనికేషన్ విభాగంలో ఇది అతిపెద్ద ఎగుమతి కాంట్రాక్ట్‌గా కంపెనీ పేర్కొంది. తాజా ఆర్డర్ గ్లోబల్ డిఫెన్స్, యుద్ధసామగ్రి విభాగంలో కంపెనీకి కీలక మైలురాయిగా అభివర్ణించింది. తద్వారా అంతర్జాతీయస్థాయిలో రక్షణ, యుద్ధసామగ్రి సరఫరా చైన్‌లో విశ్వసనీయ భాగస్వామిగా రిలయన్స్ డిఫెన్స్ మరింత పటిష్టపడినట్లు తెలియజేసింది. రెండు సంస్థల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం దీర్ఘకాలిక సహకారానికి కట్టుబాటుగా పేర్కొంది. అంతేకాకుండా ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా లక్ష్యాలకు మద్దతుగా దేశీ రక్షణ తయారీ సామర్థ్యాలను పటిష్టపరచనున్నట్లు వివరించింది.

భారత ఆర్థిక వ్యవస్థ పటిష్టం



- పరిశ్రమలు, సేవల్లో సానుకూలత
- రెట్టింపైన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు
- ఆర్‌బీఐ తాజా బులెటిన్ విడుదల

ముంబై: అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితుల మధ్య భారత ఆర్థిక కార్యకలాపాలు పటిష్టంగా ఉన్నట్టు ఆర్‌బీఐ బులెటిన్ తెలిపింది. పరిశ్రమలు, సేవల రంగాల్లో కార్యకలాపాలు ఇదే సూచిస్తున్నట్టు పేర్కొంది. వాణిజ్య విధాన పరమైన అనిశ్చితులకుతోడు పెరిగిపోయిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలను ప్రస్తావించింది. ''ఈ విధంగా అంతర్జాతీయ అనిశ్చితులు పెరిగిపోయిన తరుణంలోనూ 2025 మే నెలకు సంబంధించి అధిక ప్రాముఖ్యం కలిగిన సంకేతాలు.. పరిశ్రమలు, సేవల రంగాల్లో ఆర్థిక కార్యకలాపాలు పటిష్టంగా ఉన్నట్టు సూచిస్తున్నాయి''అని తన బులెటిన్‌లో పేర్కొంది. వ్యవసాయ రంగంలో 2024-25లో అన్ని ప్రధాన పంటల్లోనూ ఉత్పాదకత పెరిగినట్టు తెలిపింది. అదే సమయమంలో దేశీయంగా ధరలు సానుకూల స్థితిలోనే ఉన్నట్టు పేర్కొంది. రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ లక్ష్యం పరిధిలోనే వరుసగా నాలుగో నెలలోనూ నమోదైనట్టు తెలిపింది. వడ్డీ రేట్ల తగ్గింపును రుణ గ్రహీతలకు సమర్థవంతంగా బదిలీ చేసేందుకు వీలుగా సానుకూల ఆర్థిక పరిస్థితులు నెలకొన్నట్టు వివరించింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఏప్రిల్ నెలలో 8.8 బిలియన్ డాలర్లుగా ఉన్నాయంటూ.. మార్చి నెలలో ఉన్న 5.9 బిలియన్ డాలర్లు, 2024 ఏప్రిల్ నెలలో ఎఫ్‌డీఐ 7.2 బిలియన్ డాలర్ల కంటే అధికమని పేర్కొంది. ఇదే సమయంలో మన దేశం నుంచి బయటకు వెళ్లిన ఎఫ్‌డీఐలు కూడా పెరిగినట్టు తెలిపింది. నికర ఎఫ్‌డీఐలు ఏప్రిల్ నెలలో అంతక్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే రెట్టింపై 3.9 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు తెలిపింది. ఈ బులెటిన్‌లో అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమే కానీ, ఆర్‌బీఐ అధికారిక అభిప్రాయాలు కాదని పేర్కొంది.

ఈ ఏడాది జీడీపీ వృద్ధి 6.2 శాతం

- గత అంచనాలను కొనసాగించిన ఇక్రా
- మంచి వర్షాలు, కనిష్ట ఇంధన ధరలు సానుకూలం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) జీడీపీ 6.2 శాతం వృద్ధిని సాధిస్తుందన్న గత అంచనాలను రేటింగ్ సంస్థ ఇక్రా కొనసాగిస్తున్నట్టు ప్రకటించింది. దేశవ్యాప్తంగా తగినంత వర్షపాతం, చమురు ధరలు బ్యారెల్‌కు సగటున 70 డాలర్ల స్థాయిలో ఉండొచ్చని భావిస్తున్నట్టు తెలిపింది. పశ్చిమాసియాలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు (ఇరాన్-ఇజ్రాయెల్) పెరగడం, ఫైనాన్షియల్ మార్కెట్లలో ఆటుపోట్లు, వాణిజ్య విధానాల్లో అనిశ్చితులు దేశ జీడీపీ వృద్ధి తగ్గేందుకు పొంచి ఉన్న రిస్కులుగా పేర్కొంది. ఈ మేరకు తాజా నివేదికను విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ 6.5 శాతం వృద్ధిని సాధిస్తుందని ఆర్‌బీఐ అంచనా వేయగా.. అంతర్జాతీయ రేటింగ్ సంస్థ ఎస్అండ్‌పీ గ్లోబల్ సైతం ఇదేవిధమైన అంచనాను వ్యక్తం చేయడం గమనార్హం. ''ఏప్రిల్, మే నెలల్లో ఆర్థిక కార్యకలాపాల్లో మిశ్రమ పనితీరు నెలకొంది. వేసవి పంటల ఉత్పాదకత ఆశాజనకంగా ఉంటుందన్న అంచనాలు నెలకొన్నప్పటికీ.. 17 వ్యవసాయేతర సంకేతాలకు గాను తొమ్మిదింటిలోనే మెరుగుదల కనిపించింది''అని ఇక్రా తెలిపింది. మే నెలలోనే రుతుపవనాలు రావడంతో విద్యుత్, మైనింగ్ రంగాల పనితీరు ప్రభావితమైనట్టు పేర్కొంది.

పట్టణాల్లో బలంగా వినియోగం

ఆదాయపన్ను మినహాయింపులు పెంచడం, వడ్డీ రేట్ల తగ్గింపు నేపథ్యంలో పట్టణ వినియోగం బలంగా ఉంటుందని ఇక్రా అంచనా వేసింది. ''సాధారణం కంటే అధిక వర్షపాతం ఉంటుందన్న సానుకూల అంచనాలు ఆహార ద్రవ్యోల్బణాన్ని తగ్గిస్తాయి. రిటైల్ ద్రవ్యోల్బణం 2024-25లో 4.6 శాతంగా ఉంటే, 2025-26లో 3.5 శాతానికి పరిమితం అవుతుంది. ఆర్‌బీఐ ఎంపీసీ అంచనా 3.7 శాతం కంటే ఇంకా తక్కువ''అని ఇక్రా వివరించింది. వచ్చే ఆగస్ట్‌లో జరిగే ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశంలో రేట్ల తగ్గింపునకు అవకాశాల్లేకపోయినప్పటికీ.. ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉన్నందున అక్టోబర్ నాటి సమీక్షలో 25 బేసిస్ పాయింట్ల కోతను చేపట్టొచ్చని అభిప్రాయపడింది. చమురు ధరలు బ్యారెల్‌కు 10 డాలర్లు పెరిగితే దిగుమతులపై 13-14 బిలియన్ డాలర్ల మేర అదనంగా వెచ్చించాల్సి ఉంటుందని, ఇది కరెంట్ ఖాతా లోటును జీడీపీలో 0.3 శాతం మేర పెంచుతుందని ఇక్రా తెలిపింది. ఇక్కడి నుంచి చమురు ధరలు స్థిరంగా పెరుగుతూ పోతే అది భారత కంపెనీల లాభదాయకతను ప్రభావితం చేస్తుందని.. జీడీపీ వృద్ధి అంచనాలను తగ్గించేందుకు దారితీయొచ్చని పేర్కొంది.

సాక్షి ప్లస్
గురువారం । 26-6-2025

ప్రాక్టీస్‌లో ఫ్లాప్...

ఇంగ్లండ్ గడ్డపై వార్మప్ మ్యాచ్‌ల్లో భారత మహిళల జట్టు ఓటమి

- వన్డే వార్మప్ పోరులో హర్లీన్ డియోల్ సెంచరీ వృథా
- టి20 ప్రాక్టీస్ మ్యాచ్‌లో స్మృతి మంధాన మెరుపులు


హర్లీన్ డియోల్

బాకెన్‌హామ్: భారత పురుషుల క్రికెట్ జట్టు ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో పరాజయం పాలవగా... మరో వైపు మహిళల జట్టు ప్రధాన సిరీస్‌ల ప్రారంభానికి ముందు జరిగిన రెండు ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లోనూ ఓడింది. 5 టి20లు, 3 వన్డేల సిరీస్‌లు ఆడేందుకు భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటిస్తోంది. శనివారం భారత్, ఇంగ్లండ్ మధ్య తొలి టి20 జరగనుంది. దీనికి ముందు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) డెవలప్‌మెంట్ ఎలెవన్‌తో జరిగిన వన్డే, టి20 టూర్ మ్యాచ్‌ల్లో భారత్ పరాజయం పాలైంది. మంగళవారం జరిగిన ప్రాక్టీస్ వన్డే పోరులో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత్ 18 పరుగుల తేడాతో ఓడింది. మొదట బ్యాటింగ్ చేసిన ఈసీబీ ఎలెవన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 353 పరుగులు చేసింది. మైయా బౌచర్ (84 బంతుల్లో 104; 16 ఫోర్లు) సెంచరీతో కదంతొక్కగా... ఎమ్మా లాంబ్ (92 బంతుల్లో 94; 15 ఫోర్లు) దంచికొట్టింది. వీరిద్దరూ తొలి వికెట్‌కు 196 పరుగులు జోడించడంతో ఈసీబీ జట్టు భారీ స్కోరు చేయగలిగింది. భారత బౌలర్లలో తెలుగమ్మాయి శ్రీచరణి 3 వికెట్లు పడగొట్టగా... స్నేహ్ రాణా, రాధా యాదవ్ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో భారత మహిళల జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 335 పరుగులకు పరిమితమైంది. హర్లీన్ డియోల్ (91 బంతుల్లో 100; 14 ఫోర్లు, 1 సిక్స్) 'శత'క్కొట్టగా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (47 బంతుల్లో 54; 5 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్‌సెంచరీ సాధించింది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన (1), జెమీమా రోడ్రిగ్స్ (5), రిచా ఘోష్ (5), షఫాలీ వర్మ (16) విఫలమయ్యారు. అమన్‌జ్యోత్ కౌర్ (32 బంతుల్లో 43; 6 ఫోర్లు), యస్తిక భాటియా (45 బంతుల్లో 32; 3 ఫోర్లు), హైదరాబాద్ ప్లేయర్ అరుంధతి రెడ్డి (21 బంతుల్లో 30 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) పోరాడారు. ఈసీబీ బౌలర్లలో ర్యానా మెక్‌డొనాల్డ్, మహికా గౌర్, సారా గ్లెన్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అందరికీ ప్రాక్టీస్ దక్కాలనే ఉద్దేశంతో హర్లీన్ డియోల్ శతకం అనంతరం రిటైర్డ్ నాటౌట్‌గా పెవిలియన్ చేరింది.

టి20లోనూ తప్పని ఓటమి...

ప్రాక్టీస్ వన్డేలో పరాజయం పాలైన టీమిండియాకు... టి20లోనూ ఓటమే ఎదురైంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో హర్మన్ బృందం 6 పరుగుల తేడాతో ఈసీబీ ఎలెవన్ చేతిలో ఓడింది. మొదట బ్యాటింగ్ చేసిన ఈసీబీ ఎలెవన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 194 పరుగులు చేసింది. బ్రియోనీ స్మిత్ (33 బంతుల్లో 62; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు అర్ధశతకం బాదగా... కెప్టెన్ హోలీ ఆర్మిటేజ్ (32 బంతుల్లో 48; 7 ఫోర్లు), మైయా బౌచర్ (25 బంతుల్లో 35; 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. భారత బౌలర్లలో అమన్‌జ్యోత్ కౌర్, స్నేహ్ రాణా చెరో 2 వికెట్లు పడగొట్టగా... దీప్తి శర్మ, రాధ యాదవ్ చెరో వికెట్ తీశారు. అనంతరం లక్ష్యఛేదనలో టీమిండియా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 188 పరుగులకు పరిమితమైంది. స్మృతి మంధాన (28 బంతుల్లో 47; 10 ఫోర్లు) ధాటిగా ఆడగా... మిగిలినవాళ్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. షఫాలీ వర్మ (13), అమన్‌జ్యోత్ కౌర్ (15), హర్మన్‌ప్రీత్ కౌర్ (28), జెమీమా రోడ్రిగ్స్ (11), రాధా యాదవ్ (17) ఎక్కువసేపు నిలవలేకపోయారు. రిచా ఘోష్ (23 బంతుల్లో 37; 4 ఫోర్లు, 1 సిక్స్) వేగంగా ఆడింది. ఈసీబీ బౌలర్లలో సారా గ్లెన్ 3 వికెట్లు పడగొట్టింది.


దివిత్ రెడ్డి

చెస్ క్రీడాకారులకు ఉపకార వేతనం

న్యూఢిల్లీ: యువ క్రీడాకారులకు ఆర్థికపరంగా అండగా నిలిచేందుకు అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) కొత్త పథకంతో ముందుకు వచ్చింది. ఇకపై జాతీయ స్థాయి క్రీడాకారులకు శిక్షణ తదితర అవసరాల కోసం ఉపకార వేతనం అందిస్తామని ప్రకటించింది. దీనికి సంబంధించి ఏప్రిల్–జూన్ మధ్య కాలానికి ఇప్పటికే రూ. 42.30 లక్షలను నేరుగా ఆటగాళ్ల అకౌంట్లకు బదిలీ చేసింది. ఈ పథకం ద్వారా ప్రయోజనం అందుకుంటున్న వారిలో అండర్–7 నుంచి అండర్–19 వయో విభాగాల క్రీడాకారులు ఉన్నారు. రూ. 60 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఒక్కో ఆటగాడికి లభించాయి. 'భారత చెస్‌లో తొలిసారి బాలుర విభాగంలో 39 మంది, బాలికల విభాగంలో 39 మంది ఆటగాళ్లను గుర్తించి భవిష్యత్తు కోసం వారిని తీర్చిదిద్దుతున్నాం. దీని ద్వారా వారికి కీలక దశలో ఆర్థికపరంగా వెసులుబాటు లభిస్తుంది. ఇతరత్రా కూడా అన్ని రకాలుగా మేం మద్దతు అందిస్తాం. మరోవైపు జాతీయ స్థాయి టోర్నీల సంఖ్యను పెంచి పోటీల్లో పాల్గొనే అవకాశాలు కూడా పెంచుతాం. దాని వల్ల మంచి ప్రతిభ వెలుగులోకి వస్తుంది' అని ఏఐసీఎఫ్ అధ్యక్షుడు నితిన్ నారంగ్ తెలిపారు. ఈ జాబితాలో తెలంగాణ నుంచి దివిత్ రెడ్డి , నిధీశ్ శ్యామల్ (అండర్–9), శ్రీరామ్ ఆదర్శ్ ఉప్పల, బి.కీర్తిక (అండర్–17), శరణ్య దేవి నరహరి (అండర్–13), ఆదిరెడ్డి అర్జున్, వేల్పుల సరయు (అండర్–19) ఉన్నారు.



తెలంగాణలో బాస్కెట్‌బాల్ లీగ్

బరిలో 6 జట్లు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బాస్కెట్‌బాల్ సంఘం (టీబీఏ) తొలిసారి రాష్ట్రంలో బాస్కెట్‌బాల్ ప్రొఫెషనల్ లీగ్‌కు శ్రీకారం చుట్టింది. ప్రొ బాస్కెట్‌బాల్ లీగ్ (టీపీబీఎల్) పేరుతో దీనిని నిర్వహించనున్నారు. జూలై 3 నుంచి 6 వరకు యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర రెడ్డి స్టేడియంలో ఈ టోర్నమెంట్ జరుగుతుంది. మొత్తం ఆరు జట్లు టోర్నీ బరిలోకి దిగుతాయి. హైదరాబాద్ హాక్స్, రంగారెడ్డి రైనోస్, వరంగల్ వారియర్స్, కరీంనగర్ కింగ్స్, నిజామాబాద్ నవాబ్స్, మహబూబ్‌నగర్ బుల్స్ పేర్లతో జట్లను విభజించారు. రాష్ట్రంలో బాస్కెట్‌బాల్ క్రీడను మరింత అభివృద్ధి చేసేందుకు ఈ టోర్నీ ఉపయోగపడుతుందని... ప్రతిభ గల ఆటగాళ్లను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించేందుకు ఈ లీగ్ వేదికగా మారుతుందని టీబీఏ అధ్యక్షుడు ఆర్.శ్రీధర్ రెడ్డి అన్నారు. పూర్తి ప్రొఫెషనల్‌గా, అత్యుత్తమ స్థాయి ప్రమాణాలతో దీనిని నిర్వహిస్తామని టీబీఏ ప్రధాన కార్యదర్శి ఎ.పృథ్వీశ్వర్ రెడ్డి వెల్లడించారు. టోర్నీ వివరాలను వెల్లడించేందుకు బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. మరోవైపు ఇటీవల మాల్దీవ్స్‌లో జరిగిన అండర్–16 క్వాలిఫయర్స్ టోర్నీలో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ ప్లేయర్లు నేత్ర బిరుదవోలు, సాన్వి కొలిశెట్టి, విహా రెడ్డిలను ఈ సందర్భంగా టీబీఏ ప్రత్యేకంగా అభినందించింది.

బంగ్లాదేశ్ 220/8

శ్రీలంకతో రెండో టెస్టు


షాద్‌మన్ ఇస్లామ్

కొలంబో: శ్రీలంక పర్యటనలో భాగంగా తొలి టెస్టులో భారీ స్కోర్లు చేసిన బంగ్లాదేశ్... రెండో మ్యాచ్‌లో అదే జోరు కనబర్చలేకపోయింది. బుధవారం కొలంబో వేదికగా ప్రారంభమైన రెండో టెస్టులో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్... తొలి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 71 ఓవర్లలో 8 వికెట్లకు 220 పరుగులు చేసింది. ఓపెనర్ షాద్‌మన్ ఇస్లామ్ (93 బంతుల్లో 46; 7 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... ముష్ఫికర్ రహీమ్ (75 బంతుల్లో 35; 5 ఫోర్లు), లిటన్ దాస్ (56 బంతుల్లో 34; 3 ఫోర్లు), మెహదీ హసన్ మిరాజ్ (42 బంతుల్లో 31; 3 ఫోర్లు) తలా కొన్ని పరుగులు చేశారు. వీరంతా మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. క్లిష్టతరమైన పిచ్‌పై పరుగులు రాబట్టేందుకు తడబడుతూ లంక బౌలర్లకు వికెట్లు అప్పగించుకున్నారు. గత మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలతో ఆకట్టుకున్న బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హసన్ షంటో (8) విఫలం కాగా... మరో ఓపెనర్ అనాముల్ హక్ (0) డకౌటయ్యాడు. తైజుల్ ఇస్లామ్ (9 బ్యాటింగ్), ఇబాదత్ హుసేన్ (5 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. శ్రీలంక బౌలర్లలో అరంగేట్ర స్పిన్నర్ సోనాల్ దినుశా, అశిత ఫెర్నాండో, విశ్వ ఫెర్నాండో రెండేసి వికెట్లు పడగొట్టారు. గత మ్యాచ్‌తో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఏంజెలో మాథ్యూస్ స్థానంలో సోనాల్ దినుశా జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇరు జట్ల మధ్య గాలె వేదికగా జరిగిన తొలి టెస్టు 'డ్రా'గా ముగిసిన విషయం తెలిసిందే.


రోహిత్

భారత్‌కు మూడో స్థానం

బెర్లిన్: నాలుగు దేశాల జూనియర్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టుకు మూడో స్థానం లభించింది. వర్గీకరణ మ్యాచ్‌లో టీమిండియా 2–1 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియా జట్టును ఓడించింది. భారత్ తరఫున రోహిత్ (45వ నిమిషంలో), అజీత్ యాదవ్ (52వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. ఆస్ట్రేలియా తరఫున కెప్టెన్ టోబీ మాలన్ (40వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు.

అర్జున్ ఖాతాలో ఐదో 'డ్రా'



తాష్కెంట్: ఉజ్ చెస్ కప్ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఐదో 'డ్రా' నమోదు చేసుకున్నాడు. రిచర్డ్ రాపోట్ (హంగేరి)తో బుధవారం జరిగిన ఏడో రౌండ్ గేమ్‌ను అర్జున్ 26 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. ప్రజ్ఞానంద (భారత్)–నిపోమ్‌నిషి (రష్యా) మధ్య గేమ్ 57 ఎత్తుల్లో 'డ్రా'కాగా... అరవింద్ చిదంబరం (భారత్) 42 ఎత్తుల్లో సిందరోవ్ (ఉజ్బెకిస్తాన్) చేతిలో ఓడిపోయాడు. ఏడో రౌండ్ తర్వాత అర్జున్ 4.5 పాయింట్లతో సిందరోవ్‌తో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో ఉన్నాడు. ప్రజ్ఞానంద 3.5 పాయింట్లతో ఆరో స్థానంలో, అరవింద్ 2 పాయింట్లతో పదో స్థానంలో ఉన్నారు.

వ్రితి అగర్వాల్‌కు రెండో పతకం



భువనేశ్వర్: జాతీయ సీనియర్ అక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఖాతాలో మూడో పతకం చేరింది. మహిళల 1500 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో తెలంగాణకు చెందిన వ్రితి అగర్వాల్ రజత పతకాన్ని సొంతం చేసుకుంది. వ్రితి అగర్వాల్ 17 నిమిషాల 41.36 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచింది. ఈ టోర్నీలో వ్రితికిది రెండో పతకం కావడం విశేషం. మహిళల 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో వ్రితి కాంస్య పతకాన్ని సాధించింది. ఇంతకు ముందు తెలంగాణకే చెందిన మిట్టపల్లి రిత్విక మహిళల 50 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ ఈవెంట్‌లో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఓవరాల్‌గా మూడు పతకాలతో తెలంగాణ తొమ్మిదో స్థానంలో ఉంది.

స్వదేశానికి హర్షిత్ రాణా



బర్మింగ్‌హామ్: తొలి టెస్టుకు ముందు అదనపు ఆటగాడిగా భారత జట్టుతో చేరిన పేస్ బౌలర్ హర్షిత్ రాణాను టీమ్ మేనేజ్‌మెంట్ విడుదల చేసింది. రెండో టెస్టు కోసం బర్మింగ్‌హామ్ వెళ్లిన టీమ్‌తో పాటు అతడిని తీసుకుపోలేదు. జట్టులోని పేసర్లు స్వల్ప గాయాలతో ఇబ్బంది పడుతుండటంతో ముందు జాగ్రత్తగా రాణాను తీసుకున్నారు. అప్పటికే భారత్ 'ఎ' జట్టు తరఫున అతను ఇంగ్లండ్‌లోనే ఉన్నాడు. అయితే ఇప్పుడు అంతా బాగుండటంతో అదనపు ఆటగాడి అవసరం లేకుండా పోయింది. లీడ్స్‌లో పరాజయం తర్వాత కోచ్ గంభీర్ కూడా ఇదే మాట చెప్పాడు. సెలక్టర్లతో మాట్లాడి రాణా విషయంలో ఒక నిర్ణయం తీసుకుంటామని అతను చెప్పగా, బుధవారం దానిపై నిర్ణయం వెలువడింది. దాంతో అతను స్వదేశానికి తిరిగి రానున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై టెస్టుల్లో అరంగేట్రం చేసిన రాణా 2 మ్యాచ్‌ల తర్వాత మళ్లీ అవకాశం దక్కించుకోలేకపోయాడు. భారత్ 'ఎ' తరఫున ఇంగ్లండ్ 'ఎ'పై ఆడిన నాలుగు రోజుల మ్యాచ్‌లో కూడా అతను ప్రభావం చూపలేదు.

జర్మనీ ఫుట్‌బాల్ సమాఖ్యకు జరిమానా

2006 ప్రపంచకప్ పన్ను ఎగవేత కేసులో తీర్పు



బెర్లిన్: జర్మనీ ఆతిథ్యమిచ్చిన 2006 ప్రపంచకప్ పన్ను ఎగవేత కేసులో జర్మనీ ఫుట్‌బాల్ సమాఖ్యకు జరిమానా పడింది. ఈ కేసులో సుదీర్ఘ వాదనల అనంతరం ఫ్రాంక్‌ఫర్ట్ స్థానిక కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. పన్ను ఎగవేతకు పాల్పడిన జర్మనీకి 1,28,000 డాలర్లు (రూ. 1 కోటి 10 లక్షలు) జరిమానా విధించింది. ప్రపంచకప్ ప్రారంభానికి ఒక ఏడాది ముందు అంటే 2005లో 'ఫిఫా' నిర్దేశించిన పన్నులు చెల్లించడంలో జర్మనీ విఫలమైంది. దీంతో జరిమానా భారీ మొత్తంలో ఉండాలని 'ఫిఫా' తరఫున న్యాయవాదులు పట్టుబట్టారు. ప్రపంచకప్ ప్రారంభోత్సవం కోసం తీసుకున్న రుణాన్ని దాచిపెట్టిన జర్మనీ ఫుట్‌బాల్ సమాఖ్య.. ఓ ఏడాది తర్వాత దాన్ని వ్యాపార ఖర్చుగా తప్పుగా వెల్లడించింది. ఆ తర్వాత దాన్ని రద్దు చేసింది. ఈ మొత్తం వ్యవహారంతో సంబంధం ఉన్న జర్మనీ ఫుట్‌బాల్ సమాఖ్య ప్రతినిధులు జ్వాన్జిగర్, వోల్ఫ్‌గ్యాంగ్, నీర్స్‌బాచ్, హోర్స్ట్ స్మిత్‌లపై తొలుత విచారణ సమయంలో అభియోగాలు మోపారు. వాటిని ఖండించిన ఈ ముగ్గురూ జరిమానాలు చెల్లించిన తర్వాత వారిపై వేసిన విచారణలను రద్దు చేశారు.

భారత షూటింగ్ లీగ్‌కు అనూహ్య స్పందన

- 400 మందికి పైగా పేర్లు నమోదు
- ఆసక్తి చూపుతున్న విదేశీ షూటర్లు



న్యూఢిల్లీ: భారత షూటింగ్ లీగ్ (ఎస్‌ఎల్‌ఐ)లో పాల్గొనేందుకు ప్రపంచవ్యాప్తంగా షూటర్లు ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది చివర్లో జరగనున్న ఈ లీగ్ కోసం ఇప్పటి వరకు దేశవిదేశాలకు చెందిన 400 మందికి పైగా షూటర్లు పేర్లు నమోదు చేసుకున్నట్లు జాతీయ రైఫిల్ సంఘం (ఎన్‌ఆర్‌ఏఐ) బుధవారం వెల్లడించింది. ఇందులో కజకిస్తాన్, రష్యా, ఇరాన్, హంగేరి, క్రొయేషియా, అజర్‌బైజాన్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, గ్రెనెడా, ఇటలీ, ఆస్ట్రేలియా, ఆస్ట్రియా, సెర్బియా, అమెరికా, స్పెయిన్, థాయ్‌లాండ్, జర్మనీ, చెక్ రిపబ్లిక్, నార్వే, సాన్ మారినో, రొమానియా దేశాలకు చెందిన షూటర్లు ఉన్నారు. తొలిసారి నిర్వహిస్తున్న ఈ లీగ్‌కు అనూహ్య స్పందన రావడం ఆనందంగా ఉందని ఎన్‌ఆర్‌ఏఐ అధ్యక్షుడు కాళికేశ్ నారాయణ్ సింగ్ పేర్కొన్నారు. 'ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న భారత షూటింగ్ లీగ్‌పై స్పష్టమైన అవగాహనతో ఉన్నాం. ప్రపంచ స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నాం. భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిగా నిలిచేవిధంగా సహృద్భావ వాతావరణంలో పోటీలు నిర్వహిస్తాం' అని అన్నారు. జూలై వరకు పేర్లు నమోదు చేసుకునే ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. నవంబర్ 20 నుంచి డిసెంబర్ 2 వరకు ఎస్‌ఎల్‌ఐ తొలి సీజన్ జరిగే అవకాశం ఉంది. లీగ్‌లో పిస్టల్ విభాగంలో 10 మీటర్లు, 25 మీటర్లు... రైఫిల్ విభాగంలో 10 మీటర్లు, 50 మీటర్లు, 'త్రీ' పొజిషన్... షాట్‌గన్ విభాగంలో ట్రాప్, స్కీట్‌లో పోటీలు నిర్వహించనున్నారు. లీగ్‌లో కనీసం ఆరు జట్లు పాల్గొననుండగా... రెండు గ్రూప్‌లుగా విభజించి పోటీలు చేపట్టనున్నారు. ఆటగాళ్లను ఎలైట్ చాంపియన్స్, వరల్డ్ ఎలైట్, నేషనల్ చాంపియన్స్, యూత్ చాంపియన్స్ అనే నాలుగు కేటగిరీల్లో విభజించనున్నారు.



బుధవారం నెదర్లాండ్స్ రాజధాని హేగ్ నగరంలో నాటో శిఖరాగ్ర భేటీలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, కూటమిలోని ఇతర దేశాల అధినేతలు

నిక్షేపంగా న్యూక్లియర్ సైట్లు

ఫోర్డో అణుకేంద్రం అస్సలు దెబ్బతినలేదు

- నతాంజ్, ఇస్ఫహాన్ అణుకేంద్రాలు పాక్షికంగా ధ్వంసం
- సెంట్రిఫ్యూజ్ వ్యవస్థల్ని కొన్నినెలల్లో పునరుద్ధరించుకోవచ్చు
- పెద్దగా ప్రభావం చూపని అమెరికా, ఇజ్రాయెల్ బాంబుదాడులు
- అమెరికా నిఘా నివేదికలోని సంచలన విషయాలు లీక్

వేల కేజీల బరువైన భారీ బాంబులను యురేనియం శుద్ధి కేంద్రాలపై పడేసి వాటిని నామరూపాల్లేకుండా చేశామని అమెరికా, ఇజ్రాయెల్ అధినేతలు శెభాష్ అని తమకు తామే జబ్బలు చరుచుకున్నారు. అయితే వాస్తవంలో ఇరాన్‌కు అంతటి నష్టమేమీ జరగలేదని స్వయంగా అమెరికా నిఘా నివేదిక ఒకటి పేర్కొంది. పర్వతగర్భ ఫోర్డో అణుకేంద్రాన్ని భూస్థాపితం చేయడమే లక్ష్యంగా కొండపైభాగంపై అరడజను దాకా జీబీయూ–57 ఏ/బీ మ్యాసివ్ ఆర్డినెన్స్ పెనిట్రేటర్ గైడెడ్ బాంబులను అమెరికా పడేసింది. అయితే కొండ పైభాగం మాత్రమే కూలిపోయిందని, అంతర్భాగంలో ఉన్న అణుకేంద్రానికి ఎలాంటి నష్టం జరగలేదని తాజా నివేదిక కుండబద్దలుకొట్టింది. అమెరికా రక్షణశాఖ(పెంటగాన్)లోని నిఘా విభాగమైన డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ(డీఐఏ) టాప్ సీక్రెట్ కేటగిరీలో రూపొందించిన ఈ నివేదికలోని కీలక అంశాలు అంతర్జాతీయ మీడియాకు లీక్ అయ్యాయి. ఈ వివరాలను సీఎన్ఎన్ వార్తాసంస్థ తొలుత తన కథనంలో బహిర్గతంచేసింది. అణుబాంబు తయారుచేయకుండా ఇరాన్‌ను శాశ్వతంగా నిలువరించామన్న ట్రంప్ వ్యాఖ్యల్లో నిజం లేదని ఈ నివేదికతో స్పష్టమైంది. ముందుజాగ్రత్తగా ఇరాన్ ఆ మూడు యురేనియం శుద్ధి కర్మాగారాల నుంచి ముడి యురేనియం, శుద్ధిచేసిన యురేనియం నిల్వలు, సెంట్రిఫ్యూజ్‌లను ముందే వేరే చోట్లకు తరలించిందన్న వాదనలకు ఈ నివేదికతో బలం చేకూరింది.

నివేదికలో ఏముంది?

ఈ మూడు అణుకేంద్రాల్లోని **కీలక నిర్మాణాలు**, మౌలిక వసతులు, **పరికరాలకు** పెద్దగా నష్టం వాటిల్లలేదని, దాడు**ల కారణం**గా యురేనియం శుద్ధి కార్యక్రమాని**కి మాత్రం** తాత్కాలికంగా బ్రేక్ పడిందని నివేదిక పేర్కొంది. ధ్వంసమైన విభాగాలను పునరుద్ధరించి మరి కొన్ని నెలల్లో ఇరాన్ మళ్లీ న్యూక్లియర్ సైట్లను పూర్వస్థితికి తీసుకురాగలదని నివేదిక అభిప్రాయపడింది. నతాంజ్, ఫోర్డో ప్లాంట్లను భూగర్భంలో నిర్మించగా ఇస్ఫహాన్ న్యూక్లియర్ టెక్నాలజీ సెంటర్‌ను నేలపై నిర్మించారు. అమెరికా జలాంతర్గామి నుంచి ప్రయోగించిన టోమాహాక్ క్రూజ్ క్షిపణుల ధాటికి ఇస్ఫహాన్ అణుకేంద్రం మాత్రమే బాగా దెబ్బతింది. ఈ అంశాన్ని ఇరాన్ సైతం ఒప్పుకుంది. అయితే భూగర్భంలో నిర్మించిన నతంజ్, ఫోర్డోలకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలుస్తోంది. భూగర్భ నిర్మాణాల అవసరాలు తీర్చే నేలపై నిర్మించిన అనుబంధ నిర్మాణాలు మాత్రమే దాడుల్లో ధ్వంసమయ్యాయని నివేదిక పేర్కొంది. బయటివైపు నిర్మించిన విద్యుత్, ఇంధన సంబంధ వ్యవస్థలు నాశనమయ్యాయి. కానీ భూగర్భంలోని సెంట్రిఫ్యూజ్ నిర్వహణ వ్యవస్థలు నిక్షేపంగా ఉన్నాయని, అక్కడి సెంట్రిఫ్యూజ్‌లను దాడులకు ముందే తరలించారని నివేదిక వెల్లడించింది. ఈ లెక్కన ఇరాన్ అణుకార్యక్రమం తాత్కాలికంగా వాయిదాపడిందిగానీ శాశ్వ**తంగా ఆగిపోలేదు.** మరికొన్ని నెలల్లో రిపేర్లు, **పునర్‌నిర్మాణా**ల తర్వాత భూగర్భ కేం**ద్రాల్లో మళ్లీ** యురేనియం శుద్ధి కార్య**క్రమం** మొదలయ్యే అవకాశముం**దని** నివేదిన అంచనావేసింది.

అదంతా అబద్ధం: ట్రంప్

అంతపెద్ద బాంబులేసినా **ఫో**ర్డో న్యూక్లియర్ ప్లాంట్ **ఇం**కా పనిచేసే స్థితిలోనే **ఉ**ందని తమ దేశ నిఘా **నివే**దిక పేర్కొనడంపై ట్రం**ప్** తీవ్రంగా స్పందించారు. **ఈ** మేరకు తన సొంత **సామా**జికమాధ్యమం ట్రూత్ **సోషల్**లో పలు పోస్టులు **పెట్టారు.** ''అణురియాక్టర్‌లకు **ఎలాంటి న**ష్టం జరగలేదన్న వార్త**లన్నీ అబద్ధం.** నకిలీ వార్తలను నమ్మకం**డి. ఇరాన్‌లోని అ**ణుకేంద్రాలన్నీ సర్వనాశన**మయ్యాయి. తప్పు**డు, అబద్ధాలు కథనాలు వండివార్చినందుకు న్యూయార్క్ టైమ్స్, సీఎన్ఎన్ వార్తాసంస్థల చెంపలను అమెరికా పౌరులు చెళ్లుమనిపించాలి. బంకర్ బస్టర్ బాంబులు ప్రయోగించడం అనేది చరిత్రలోనే అత్యంత విజయవంతమైన సైనికదాడి. ఇంతటి గొప్పదాడిని ఈ మీడియాసంస్థలు తక్కువచేసి చూపిస్తున్నాయి. లక్ష్యాలను ఖచ్చితత్వంతో పేల్చిన పైలెట్లను అభినందించాల్సిందే. పైలెట్లు అద్భుతంగా పనిచేశారు. వీళ్ల సాహసాన్ని మీడియా కించపరుస్తోంది'' అని అన్నారు. ముఖ్యంగా సీఎన్ఎన్‌పై ట్రంప్ తిట్లదండకం మొదలెట్టారు. ''సీఎన్ఎన్ మొత్తం తప్పుడు కథనాలనే ప్రసారంచేస్తుంది. నేను కూడా సీఎన్ఎన్ ఛానలే చూస్తా. మరో ప్రత్యామ్నాయం లేదుమరి. అందులో అంతా చెత్తే ఉంటుంది. అన్ని నకిలీ వార్తలే''అని అన్నారు.

స్పందించిన శ్వేతసౌధం

నివేదిక రూపకల్పనను ఒప్పుకున్న వైట్‌హౌస్.. ఆ నివేదికలోని అంశాలతో మాత్రం విబేధించడం విశేషం. ట్రంప్ సర్కార్ ప్రతిష్టను దిగజార్చేందుకే ఇలాంటి అసత్యాలను మీడియాలో ప్రచారంచేస్తున్నారని వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ అన్నారు. ''అత్యంత రహస్యమైన ఆ నివేదికలోని అంశాలు లీక్ అయిన మాట వాస్తవమే. అంతర్గత నిఘా విభాగ కిందిస్థాయి సిబ్బందిలో కొందరు ఈ దారుణానికి ఒడిగట్టారు. అధ్యక్షుడు ట్రంప్‌ను అపకీర్తి పాలుచేద్దామని కొందరు కుట్ర పన్ని ఇలా లీక్ చేశారు. ఇరాన్ అణుకార్యక్రమాలను అడ్డుకునేందుకు వేలకిలోమీటర్లు ప్రయాణించి, తెగించి బాంబులేసిన యుద్ధవిమాన పైలట్ల ధైర్యసాహసాలను ఈ లీక్‌వీరులు కించపరిచారు. ఒక్కోటి 13,600 కేజీల బరువుండే 14 భారీ బాంబులను పేలిస్తే ఎంతటి వినాశనం జరుగుతుందో అందరికీ తెలుసు. ఇరాన్ అణుకేంద్రాలు పూర్తిగా పనికిరాకుండా పోయాయి''అని కరోలిన్ చెప్పారు. లీక్‌కు పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు ఎఫ్‌బీఐతో దర్యాప్తు చేయిస్తున్నామని రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ చెప్పారు. లీక్ అయిన నివేదిక కేవలం అంచనా నివేదిక అని ఆయన వ్యాఖ్యానించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

నిజం దాస్తున్న ఇరాన్!

శత్రు దేశం కారణంగా నష్టం జరిగితే దేశ ప్రతిష్ట దృష్ట్యా స్వల్పనష్టమే జరిగిందని ఎవరైనా తక్కువ చేసి చెబుతారు. ఆ లెక్కన ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ భఘైల్ సైతం తమ అణుకేంద్రాలు తక్కువస్థాయిలోనే ధ్వంసమయ్యాయని చెప్పాలి. కానీ ఆయన భారీ నష్టం వాటిల్లిందని బుధవారం మీడియాతో అన్నారు. దీని వెనుక అంతరార్థం వేరే ఉందన్న వార్తలు వినిపిస్తున్నాయి. గుట్టుచప్పుడు కాకుండా వేరే చోట జరిగే తమ అణుకార్యక్రమంపై ఎవరికీ అనుమానం రావొద్దనే ఉద్దేశ్యంతోనే ఆయన ఇలా అబద్ధాలు చెబుతున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పునర్‌నిర్మాణాల తర్వాత మళ్లీ అణుకార్యక్రమాన్ని మొదలెట్టే విషయం బయటకు పొక్కితే అతిగా అంతర్జాతీయ ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతోనూ ఇస్మాయిల్ ఇలా అబద్ధాలు చెబుతున్నారని తెలుస్తోంది.

ముగ్గురు ఇజ్రాయెల్ గూఢచారులను ఉరితీసిన ఇరాన్

700 మంది అనుమానితుల అరెస్టు

టెహ్రాన్: అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణ కుదిరిన మరుసటి రోజే ఇరాన్.. ముగ్గురు ఇజ్రాయెల్ గూఢచారులను ఉరితీసింది. గూఢచర్యం అనుమానం, గూఢచారులకు ఆవాసం కల్పిస్తున్న ఆరోపణలతో 700 మందిని అరెస్టు చేసింది. 12 రోజుల పాటు కొనసాగిన తీవ్ర ఘర్షణ, అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, ఇరాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించిన విషయం తెలిసిందే. ఒక రోజు తర్వాత ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముగ్గురు వ్యక్తులు ఇజ్రాయెల్ గూఢచార వ్యవస్థ మొస్సాద్‌కు సహకరించారని, ఒక వ్యక్తి హత్యకు ఉపయోగించిన పరికరాలను రవాణా చేశారని, సున్నితమైన సమాచారాన్ని మొసాద్‌కు అందించారని ఇరాన్ ఆరోపించింది. 'హత్యలు చేయడానికి దేశంలోకి పరికరాలను దిగుమతి చేయడానికి ప్రయత్నించిన ఇద్రిస్ అలీ, ఆజాద్ షోజై, రసూల్ అహ్మద్ రసూల్‌లను అరెస్టు చేసి... ఇజ్రాయెల్‌కు సహకరించినందుకు ఈ ఉదయం శిక్ష అమలు చేశారు. వారిని ఉరితీశారు'అని న్యాయవ్యవస్థకు చెందిన మిజాన్ వెబ్‌సైట్ పేర్కొంది. తుర్కియే సరిహద్దుకు సమీపంలో ఉన్న వాయవ్య నగరమైన ఉర్మియాలో ఈ ఉరిశిక్షలు అమలు జరిగాయి. నీలిరంగు జైలు యూనిఫాంలో ఉన్న ముగ్గురు వ్యక్తుల ఫోటోను కూడా కోర్టు పంచుకుంది. ఇరాన్, ఇజ్రాయెల్ వివాదం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఇరాన్‌లో ప్రధాన ప్రత్యర్థి ఇజ్రాయెల్‌తో సహా విదేశీ నిఘా సేవలతో సంబంధాలున్నట్లు అనుమానిస్తున్న ఏజెంట్లను అరెస్టు చేయడం, ఉరితీయడం తరచుగా జరుగుతుంది. జూన్ 13న ఇజ్రాయెల్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత, ఆ దేశంతో సంబంధాలున్న వ్యక్తులపై త్వరిత చర్యలు తీసుకుంటామని టెహ్రాన్ ప్రతిజ్ఞ చేసింది. ఈ నేపథ్యంలోనే దోషులుగా తేలిన అనేక మంది వ్యక్తులను ఇరాన్ ఉరితీసింది.

మిడాస్ మునిగింది

- నౌకకు జూన్ 3న అగ్నిప్రమాదం
- 3వేల కార్లతో మెక్సికోకు వెళ్తున్న నౌక

లండన్: వాణిజ్య నౌక మార్నింగ్ మిడాస్ ఉత్తర పసిఫిక్ మహాసముద్రంలో మునిగిపోయింది. అగ్ని ప్రమాదం జరిగిన మూడు వారాల తరువాత అలాస్కాలోని అలూటియన్ దీవుల గొలుసులోని అంతర్జాతీయ జలాల్లో మునిగిపోయిందని లండన్‌కు చెందిన ఓడ నిర్వాహణ సంస్థ జోడియాక్ మారిటైమ్ ఒక ప్రకటనలో తెలిపింది. 3 వేల కార్లతో మెక్సికో వెళ్తున్న ఈ కార్గో షిప్‌కు జూన్ 3న మంటలు అంటుకున్నాయి. నౌకలో ఉన్న 22 మంది సిబ్బంది సమీపంలోని మర్చంట్ మెరైన్ నౌక రక్షించింది. ఆ తరువాత నౌక దాదాపు 5వేల మీటర్ల లోతులో, భూమి నుంచి 770 కిలోమీటర్ల దూరంలో మునిగిపోయిందని వెల్లడించింది. మునిగిన నౌక నుంచి కాలుష్యం లేదా శిథిలాలను పర్యవేక్షించడానికి సంఘటన స్థలంలో రెండు సాల్వేజ్ టగ్‌లు ఉంటాయని కంపెనీ తెలిపింది. ముందు జాగ్రత్త చర్యగా మరో ప్రత్యేక కాలుష్య ప్రతిస్పందన నౌకను కూడా ఆ ప్రదేశానికి పంపుతున్నట్లు జోడియాక్ మారిటైమ్ వెల్లడించింది.

మెక్సికోలోని ఒక ప్రధాన పసిఫిక్ ఓడరేవుకు వెళ్లాల్సిన ఈ ఓడలో 3వేల కొత్త కార్లు ఉన్నాయి. అయితే మునిగిపోయే ముందు ఏవైనా కార్లను తొలగించారా లేదా అనేది వెంటనే స్పష్టంగా తెలియలేదు. 600 అడుగుల ఎత్తున్న ఈ మార్నింగ్ మిడాస్‌ను 2006లో నిర్మించారు. 2023లోనూ జర్మనీ నుంచి సింగపూర్‌కు దాదాపు 500 ఎలక్ట్రిక్ వాహనాలతో సహా 3,000 ఆటోమొబైల్స్‌ను తీసుకెళ్తున్న ఒక సరుకు రవాణా నౌకకూ ఘోర అగ్నిప్రమాదం జరిగింది. ఈ మంటల్లో ఒకరు మరణించగా, మరికొందరు గాయపడ్డారు.

అభినందన్‌ను పట్టుకున్న పాక్ అధికారి మృతి

ఇస్లామాబాద్: భారత పైలట్ అభినందన్ వర్ధమాన్‌ను పట్టుకున్న పాల్గొన్న పాకిస్తానీ మేజర్ మోయిజ్ అబ్బాస్ షా మృతి చెందారు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతంలో తెహ్రీక్–ఇ–తాలిబాన్ పాకిస్తాన్ (టీటీపీ) ఉగ్రవాదులతో జరిగిన ఘర్షణలో ఇద్దరు సైనికాధికారులు మరణించగా.. వారిలో మోయిజ్ ఒకరు. పాకిస్తాన్‌లోని దక్షిణ వజీరిస్తాన్ జిల్లాలో నిఘా ఆధారిత ఆపరేషన్ సందర్భంగా ఈ ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా పాక్ భద్రతా దళాలు 11 మంది ఉగ్రవాదులను హతమార్చాయి. 2019లో పుల్వామా దాడి జరిగిన పన్నెండు రోజుల తర్వాత – ఫిబ్రవరి 26న పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఉన్న బాలాకోట్‌లోని ఉగ్రవాద శిక్షణా శిబిరంపై భారత్ దాడి చేసింది. అప్పటి వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్, శ్రీనగర్‌లోని 51 స్క్వాడ్రన్‌కు చెందిన భారత పుష్‌బ్యాక్ బృందంలో సభ్యుడు. ఆయన విమానాన్ని పాకిస్తాన్ యుద్ధ విమానాలు కూల్చేశాయి. ఆయన విమానం వాస్తవాధీన రేఖ అవతలి వైపు కూలిపోవడంతో అభినందన్ పట్టుబడ్డాడు. అనేక స్థాయిల్లో చర్చల తరువాత.. అప్పటి పాకిస్తాన్ ప్రధాన మంత్రి ఇమ్రాన్ ఖాన్ అభినందన్ వర్ధమాన్‌ను విడుదల చేశారు. శాంతికి గుర్తుగా ప్రకటించారు. పట్టుబడిన 58 గంటల తర్వాత అభినందన్ వర్ధమాన్ భారత్‌కు తిరిగి వచ్చారు.

శాంతి నోబెల్‌కు ట్రంప్

నామినేట్ చేసిన పాకిస్తాన్ ప్రభుత్వం

వాషింగ్టన్: నోబెల్ శాంతి బహుమతిపై గంపెడాశలు పెట్టుకున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ ఆశలు మళ్లీ చిగురించాయి. ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలంటూ పాకిస్తాన్ ప్రభుత్వం నార్వేకు సిఫార్సుచేసింది. ఈ మేరకు నామినేట్ చేస్తున్నట్లు పాక్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. తమ నాయకుడు నోబెల్ అవార్డ్‌కు తగిన వ్యక్తి అని అమెరికా కాంగ్రెస్‌లో ప్రతినిధుల సభ సభ్యుడు, జార్జియా నుంచి రిపబ్లికన్ పార్టీ నేత బడ్డీ కార్టర్ వ్యాఖ్యానించారు. ఈయన సైతం ట్రంప్ పేరును నామినేట్ చేస్తూ నార్వేలోని శాంతి బహుమతి కమిటీకి లేఖ రాశారు. ''ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని ట్రంప్ ఒంటిచేత్తో ఆపారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న ఇరాన్ అణుబాంబును సాధించకుండా ట్రంప్ సమర్థవంతంగా అడ్డుకున్నారు. ఈ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అసాధ్యమని అంతా భావించిన వేళ ట్రంప్ దానిని సాధించి చూపించారు. సమర సంక్షోభం సమసిపోయేలా ఎంతో సమర్థవంతంగా వ్యవహరించిన ట్రంప్ ఈసారి నోబెల్ శాంతి బహుమతికి అర్హుడు. శాంతిస్థాపన, యుద్ధ విరమణ, అంతర్జాతీయ సామరస్యాల సాధనకు కృషిచేసినందుకు ట్రంప్ నోబెల్ ఇవ్వాల్సిందే''అని బడ్డీ కార్టర్ తన లేఖలో రాశారు. ''భారత్, పాకిస్తాన్ మధ్య పరస్పర సైనిక చర్యలు ఆపడంలో ట్రంప్ సఫలీకృతులయ్యారు. దౌత్య జోక్యం ద్వారా ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించారు. ఈ విషయంలో ట్రంప్ నిజంగా శాంతికాముకుడు''అని పాకిస్తాన్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది. అయితే గతంలో ట్రంప్‌ను నామినేట్ చేస్తూ లేఖ రాసిన ఉక్రెయిన్ విదేశీవ్యవహారాల పార్లమెంటరీ కమిటీ చైర్మన్ ఒలెగ్జాండర్ మెరెజ్కో తన ట్రంప్ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు.

మరో 25 మంది తెలంగాణ వాసులు ఢిల్లీకి

ఇజ్రాయిల్, ఇరాన్‌ల నుంచి ఇప్పటి వరకు 48మంది స్వదేశానికి

సాక్షి, న్యూఢిల్లీ: ఇజ్రాయిల్, ఇరాన్ నుంచి మరో 25 మంది తెలంగాణవాసులు సురక్షితంగా ఢిల్లీకి చేరుకున్నారు. వారిలో ఇరాన్ నుంచి ఏడుగురు, ఇజ్రాయిల్ నుంచి 18 మంది ఢిల్లీకి చేరుకున్నట్లు ఢిల్లీలోని తెలంగాణ భవన్ కార్యాలయం బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఢిల్లీ నుంచి వారంతా స్వస్థలాలకు చేరుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకు అనుగుణంగా తెలంగాణభవన్ సిబ్బంది ఎయిర్‌పోర్టులో తగిన సహాయ, సహకారాలు అందిస్తున్నారన్నారని స్పష్టం చేసింది. తెలంగాణ ప్రభుత్వ చొరవ కారణంగా ఇప్పటివరకు ఇజ్రాయిల్, ఇరాన్‌ల నుంచి మొత్తం 48 మంది క్షేమంగా ఢిల్లీకి చేరుకున్నారని తెలిపింది.

ఫోన్‌లో జేడీ వాన్స్ మీమ్ ఉన్నందుకు అమెరికాలో ప్రవేశించనివ్వలేదు

నార్వే యువకుని ఆరోపణ

న్యూయార్క్: ఫోన్‌లో జేడీ వాన్స్ బట్టతల మీమ్ ఫొటో ఉన్నందుకు ఇమ్మిగ్రేషన్ అధికారులు తనను అమెరికాలో ప్రవేశించనివ్వలేదని నార్వేకు చెందిన పర్యాటకుడు ఆరోపించారు. తనకు ఎలాంటి నేరచరిత్ర లేకపోయినా.. తాను నెవార్క్ విమానాశ్రయంలో దిగిన మరుసటి రోజు తిప్పి పంపారని తెలిపాడు. నార్వేకు చెందిన 21 ఏళ్ల మాడ్స్ మికెల్సెన్ న్యూయార్క్, టెక్సాస్, ఆస్టిన్‌లలో స్నేహితులను కలవడానికి అమెరికాకు వెళ్లాడు. అలాగే తన తల్లితో కలిసి రోడ్ ట్రిప్‌లో జాతీయ ఉద్యానవనాలను సందర్శించాలనుకున్నాడు. కానీ నెవార్క్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులు మికెల్సెన్‌ను అడ్డుకున్నారు. 'నన్ను అనేక మంది సాయుధ గార్డులు ఉన్న గదికి తీసుకెళ్లారు. అక్కడ నా బూట్లు, మొబైల్ ఫోన్, బ్యాక్‌ప్యాక్‌ను తీసుకున్నారు. అధికారులు నా ఫోన్‌ను అన్‌లాక్ చేయమని ఒత్తిడి తెచ్చారు. నిరాకరిస్తే జైలు శిక్ష లేదా 5వేల డాలర్ల జరిమానా విధిస్తామని బెదిరించారు. సందర్భాన్ని వివరించిన తర్వాత కూడా, అధికారులు నా వస్తువులను తనిఖీ చేశారు. వేలిముద్రలను తీసుకున్నారు. రక్త నమూనాలను సేకరించారు. అమెరికాలో నేను కలవాలనుకున్న వారందరి పేర్లు, చిరునామాలు, ఫోన్ నంబర్లు, వృత్తుల వివరాలు అడిగారు. నేను పన్నెండు గంటలు ప్రయాణించాను. సరిగ్గా నిద్రపోలేదు. వారు ప్రశ్నించడం ప్రారంభించే ముందే శారీరకంగా, మానసికంగా పూర్తిగా అలసిపోయాను. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఉగ్రవాద కుట్రలు, మితవాద తీవ్రవాదంలో పాల్గొన్నట్లు అధికారులు నాపై ఆరోపణలు చేశారు. కానీ నిజానికి కారణం అది కాదు. నా ఫోన్‌లో జేడీ వాన్స్ మీమ్ ఫొటో ఉంది. అందులో ఆయన బట్టతలతోఉన్నారు. అలాగే నేను చేతిలో ఒక చెక్క పైపుతో ఉన్న ఫొటో కూడా వారికి నచ్చలేదు. ఈ రెండు చిత్రాలు అమెరికాలోకి ప్రవేశించకుండా నన్ను అడ్డుకుంటాయని అనుకోలేదు. మరునాడు నన్ను నార్వే వెళ్ళే విమానంలో ఎక్కించారు'అని మికెల్సెన్ ఆరోపించారు. ఈ వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అయ్యింది.

బిహార్ ఎన్నికల షెడ్యూల్ అక్టోబర్‌లో

నవంబర్ మూడో వారానికల్లా ఎన్నికలు ముగించాలని ఈసీ యోచన

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ఈ ఏడాది అక్టోబర్ తొలి వారంలో ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి తుది ఓటరు జాబితాను ప్రకటించిన వెంటనే షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందని ఈసీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. 243 మంది సభ్యులున్న బిహార్ అసెంబ్లీ కాలపరిమితి నవంబర్ 22వ తేదీన ముగుస్తోంది. ఈ నేపథ్యంలో అప్పటిలోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఈసీ యోచిస్తోంది. ప్రస్తుతం బిహార్‌లో వచ్చే నాలుగు నెలల్లోగా ఓటర్ల జాబితా ఖరారుపై ఒక షెడ్యూల్‌ను కేంద్రం విడుదల చేసింది.

అణు ఫైటర్ల కొనుగోలు

యూకే ప్రధాని కియిర్ స్టార్మర్ ప్రకటన

అమెరికా నుంచి ఎఫ్–35ఏ ఫైటర్ జెట్లు కొననున్నట్లు వెల్లడి

లండన్: వరుస ఉద్రిక్తతలు ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో యూకే తన రక్షణ వ్యవస్థపై దృష్టి పెట్టింది. అణ్వస్త్ర వ్యవస్థను పటిష్టం చేసుకుంటోంది. అణ్వాయుధాలను మోసుకెళ్లగలిగే ఎఫ్–35 ఏ ఫైటర్ జెట్లు 12 అమెరికా నుంచి కొనుగోలు చేయనున్నట్లు ప్రధాన మంత్రి కియిర్ స్టార్మర్ ప్రకటించారు. 'తీవ్రమైన అనిశ్చితి యుగంలో ఈ విమానాలు మన సాయుధ దళాలను బలోపేతం చేస్తాయి. మన రక్షణ వ్యవస్థ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న సైన్యానికి మద్దతు ఇస్తాయి' అని స్టార్మర్ తెలిపారు. కొత్త విమానాలను నార్ఫోక్‌లోని ఆర్ఏఎఫ్ మార్హామ్‌లో ఉంచుతారు. శత్రు దాడులను నివారించడానికి, నాటో సభ్యుల మధ్య అణుశక్తిని పంచుకునే కార్యక్రమంలో భాగంగా ఇవి ఉంటాయి. యూకే అన్ని అంతర్జాతీయ ఒప్పందాలు, నిబంధనలకు కట్టుబడి ఉంటుంది. 'దేశవ్యాప్తంగా 100 వ్యాపారాలకు, 20,000 కంటే ఎక్కువ ఉద్యోగా కల్పించే



ఈ ఎఫ్35 డ్యూయల్ కెపాసిటీ విమానాలు మన రాయల్ ఎయిర్ ఫోర్స్‌లో కొత్త శకానికి నాంది పలుకుతాయి. మన దేశాన్ని, మన మిత్రదేశాలను బెదిరించే శత్రువుల నుంచి ముప్పును అరికడతాయి' అని స్టార్మర్ అన్నారు.

స్వాగతించిన నాటో..

ఈ ప్రకటనను నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే స్వాగతించారు. ఆయన దీనిని బ్రిటన్ నుంచి కూటమికి బలమైన సహకారంగా అభివర్ణించారు. ఈ నిర్ణయం నాటో ఫస్ట్ వ్యూహాన్ని బలపరచడమే కాదు, యూకే ఆర్థిక వ్యవస్థను కూడా పెంచుతుందని రక్షణ కార్యదర్శి జాన్ హీలీ అన్నారు. బ్రిటిష్ భూభాగంపై భవిష్యత్తులో దాడులు జరిగే అవకాశం ఉందని యూకే రక్షణ వ్యవస్థ ఇటీవల హెచ్చరికలు జారీ చేసింది. రష్యా అతిపెద్ద ముప్పుగా మిగిలిందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో ఈ కొనుగోళ్ల ప్రకటన వెలువడింది.

బలమైన అణుబంబాలను మోసుకెళ్లే జెట్లు..

ఎఫ్–35ఏ విమానం బీ61–12 అనే ప్రత్యేకమైన బాంబును మోసుకెళ్లగలదు. అవి 0.3, 1.5, 10, 50 కిలోటన్నుల పేలుడు పదార్థాలను మోయగలవని అమెరికన్ సైంటిస్ట్స్ సమాఖ్య తెలిపింది. రెండో ప్రపంచ యుద్ధంలో హిరోషిమాపై వేసిన బాంబు బరువు 15 కిలోటన్నులు. ఈ జెట్ విమానాలను యూఎస్ కంపెనీ లాక్‌హీడ్ మార్టిన్ తయారు చేసింది. ఎఫ్–35ఏ పాత ఎఫ్–35బీ కంటే ఖరీదు తక్కువని, ప్రతి విమానంపై 25% వరకు ఆదా అవుతుందని ప్రభుత్వం చెబుతోంది.

ఖండాంతర క్షిపణి అభివృద్ధి కోసం పాక్ యత్నాలు

అమెరికా నిఘా వర్గాలు

- పాక్‌ను అమెరికా 'అణ్వస్త్ర శత్రువు'గా ప్రకటించే చాన్స్

వాషింగ్టన్: పాకిస్తాన్ తన క్షిపణి సామర్థ్యాన్ని భారీగా పెంచుకునేందుకు ప్రయత్నిస్తోందని అమెరికా 'విదేశీ వ్యవహారాల' నిఘా నివేదిక వెల్లడించింది. అణ్వస్త్ర సామర్థ్యంతో కూడిన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి (ఐసీబీఎం) తయారీ యత్నాలను ముమ్మరం చేస్తోందని పేర్కొంది. ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి 5,500 కిలోమీటర్లకు పైగా దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. చైనా సహకారంతో పాక్ ఇందుకు పూనుకున్నట్టు సమాచారం. ఐసీబీఎంలు తయారుచేస్తే పాక్‌ను అమెరికా తన అణ్వస్త్ర శత్రువుగా ప్రకటించడం ఖాయమని ఆ దేశ ఉన్నతాధికారులు స్పష్టంచేసినట్లు నివేదిక పేర్కొంది. అమెరికా భూభాగాన్ని తాకగలిగే స్థాయిలో సుదూరం నుంచి క్షిపణులను ప్రయోగించే సత్తా ఉన్న రష్యా, చైనా, ఉత్తర కొరియాను అమెరికా 'అణ్వస్త్ర విరోధులు'గా ప్రకటించింది. ''ఖండాంతర క్షిపణితో అమెరికాను లక్ష్యంగా చేసుకునే ఏ దేశాన్నీ అమెరికా తన మిత్రుడిగా భావించదు'' అని ఆ దేశ ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

ఐసీబీఎంలు లేని పాక్

పాక్ వద్ద ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి సాంకేతికత లేదు. ఐసీబీఎం క్షిపణులు లేవు. 2022లో భూతలం నుంచి భూతలం మీదకు ప్రయోగించే మధ్యశ్రేణి బాలిస్టిక్ క్షిపణి షాహీన్–3ను ప్రయోగించింది. ఇది 2,700 కి.మీ.కు పైగా ప్రయాణించగలదు. భారత్‌లోని ఎన్నో నగరాలు దాని పరిధిలోకి వచ్చాయి. దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నందుకు పాక్‌పై అమెరికా పలు ఆంక్షలు విధించింది. క్షిపణులను రూపొందించే 'నేషనల్ డెవలప్‌మెంట్ కాంప్లెక్స్', మరో మూడు సంస్థలపై నిషేధం విధించింది. వీటితో వ్యాపారంచేసే తమ దేశీయ సంస్థల ఆస్తులను స్తంభింపజేస్తామని గతంలోనే అల్టిమేటమిచ్చింది. ఈ చర్యలను పాక్ తప్పుబట్టింది. అమెరికా స్వప్రయోజనాలకే పెద్దపీట వేస్తోందని ఆరోపించింది. ఎన్‌పీటీపై సంతకం చేయని పాక్ వద్ద 170 అణువార్‌హెడ్‌లు పోగుబడినట్లు పాత నివేదికలు వెల్లడిస్తున్నాయి.



బుధవారం నైనిటాల్‌లో ఓ కార్యక్రమంలో అస్వస్థతకు గురైన ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

నిరంజన నదీ తీరంలో.. రావిచెట్టు నీడలో..

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

బౌద్ధ మత ఆవిర్భావం

భారతదేశంలో క్రీ.పూ. ఆరో శతాబ్దంలో జరిగిన మత ఉద్యమాల్లో భాగంగా వైదిక మతంపై తిరుగుబాటు ఉద్యమంగా బౌద్ధ మతం ఆవిర్భవించింది. దీని స్థాపకుడు సిద్ధార్థుడు. ఇతడినే గౌతముడు అంటారు. సిద్ధార్థుడు క్రీ.పూ. 563లో ప్రస్తుత నేపాల్‌లోని లుంబినీలో జన్మించాడు. ఇతడి తండ్రి కపిలవస్తును పాలించిన శాక్య క్షత్రియరాజైన శుద్ధోధనుడు. ఈ వంశంలో జన్మించడం వల్ల బుద్ధుడిని శాక్యముని అని కూడా పిలుస్తారు. ఇతడి తల్లి మహామాయ.

సిద్ధార్థుడు నాలుగు సంఘటనల్లో వరుసగా ఒక వృద్ధుడిని, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగిని, ఒక శవాన్ని, సర్వసంగ పరిత్యాగి అయిన సన్యాసిని చూశాడు. అనంతరం ఈ బాధల నుంచి మానవులకు విముక్తిని ప్రసాదించే మార్గం అన్వేషించడానికి 29వ ఏట చెన్న అనే సేవకుడి సహాయంతో, కంటక అనే గుర్రం ద్వారా సిద్ధార్థుడు అంతఃపురాన్ని వదిలి సత్యాన్వేషణకు బయలుదేరాడు. ఈ సంఘటనను 'మహాభినిష్క్రమణం'గా పేర్కొంటారు. ఆ తర్వాత దాదాపు ఏడేళ్ల పాటు సన్యాసిగా జ్ఞానార్జనకు ప్రయత్నించాడు. ఈ సమయంలో అతడు మొదటగా వైశాలిలోని అలారకలామ, తర్వాత రాజగృహంలోని ఉద్దకుడు (రామ పుత్రుడు) అనే గురువుల వద్ద శిష్యరికం చేశాడు. చివరికి 35 ఏళ్ల వయసులో బిహార్‌లోని గయా వద్ద నిరంజన్ నది ఒడ్డున, రావి చెట్టు కింద జ్ఞానోదయం పొందాడు. దీన్ని 'నిర్వాణం' లేదా 'సంబోధి' అంటారు. నాటి నుంచి సిద్ధార్థుడుని గౌతమ బుద్ధుడిగా, తథాగతుడిగా పిలిచారు. జ్ఞానోదయం పొందిన తర్వాత నుంచి 45 సంవత్సరాల పాటు (మరణించే వరకు) బుద్ధుడు తన సిద్ధాంతాలను ప్రచారం చేశాడు. ఇతడు తొలిసారిగా సారనాథ్ వద్ద ఉన్న జింకల వనంలో అయిదుగురు వ్యక్తులకు ప్రవచనాలను బోధించాడు. దీన్నే 'ధర్మ చక్రప్రవర్తనం'గా పేర్కొంటారు. ఇక్కడి నుంచి బౌద్ధ మతం ప్రారంభమైంది. బుద్ధుడు క్రీ.పూ. 483లో 80 ఏళ్ల వయసులో కుశి నగరంలోని సాలచెట్టు కింద తనువు చాలించాడు. దీన్నే 'మహాపరి నిర్యాణం' అంటారు.

బౌద్ధమత సిద్ధాంతాలు:

బౌద్ధమతం, నాటి వైదిక మత సిద్ధాంతా లను తీవ్రంగా వ్యతిరేకించింది. కొన్ని వర్గాలకే పరిమితమైన మోక్షాన్ని లింగ, కుల, వర్గ విభేదాలకు అతీతంగా అందరికీ అందుబాటులోకి తెచ్చింది. సర్వకాల సర్వావస్థల్లో ప్రతి ఒక్కరూ సులభంగా ఆచరించే విధంగా బౌద్ధమత సిద్ధాంతాలను రూపొందించారు. బుద్ధుడు దేవుడి ఉనికిని గుర్తించలేదు. కుల వ్యవస్థను, పురోహిత (బ్రాహ్మణ) వర్గం ఆధిపత్యాన్ని ప్రశ్నించాడు.

చత్వారి ఆర్యా సత్యాలు:

- ప్రపంచమంతా దుఃఖమయం.

> బుద్ధుడు జన్మించిన వెంటనే తల్లి మరణించడంతో సవతి తల్లి గౌతమి ప్రజాపతి అతడిని పెంచింది. దీనికి కృతజ్ఞతగానే సిద్ధార్థుడు గౌతముడిగా పిలుపించుకున్నాడు. చిన్న వయసులోనే యశోధరను వివాహం చేసుకున్నాడు. వీరి కుమారుడే రాహులుడు. సిద్ధార్థుని సవతి తల్లి కుమారుడు దేవదత్తుడు. సిద్ధార్థుని జీవితంలో సంభవించిన నాలుగు సంఘటనలు అతడికి ప్రాపంచిక సుఖాల పట్ల విరక్తిని కలిగించాయి.

- దుఃఖానికి కారణం కోరికలు.
- కోరికలను జయించడం ద్వారా దుఃఖాన్ని తొలగించవచ్చు.
- దీన్ని సాధించేందుకు ఉన్న ఏకైక మార్గమే అష్టాంగ మార్గం.

అష్టాంగ మార్గం:


- సరైన దృక్పథం/ దృష్టి
- సరైన లక్ష్యం
- సరైన వాక్కు
- సరైన క్రియ
- సరైన జీవనోపాధి
- సరైన కృషి/ ప్రయత్నం
- సరైన చైతన్యం/ అవగాహన
- సరైన ధ్యానం

అష్టాంగ మార్గం ఒక హేతుబద్ధమైన సిద్ధాంతం. దీన్ని ఒక నైతిక ప్రవర్తనా నియమావళిగా భావించవచ్చు. ఇది అందరికీ అనుసరణీయంగా ఉంది. దీని ద్వారా అతి సులువుగా మోక్షాన్ని పొందవచ్చు. బౌద్ధ మతంలో మోక్షం అంటే జననమరణాల నుంచి విముక్తి. అయితే బుద్ధుడు కర్మ సిద్ధాంతాన్ని అంగీకరించాడు. కర్మ, పునర్జన్మకు సంబంధించిన బౌద్ధమత సిద్ధాంతాన్ని 'ప్రతిత్య సముప్పాద' అంటారు. ఇందులో ప్రతి చర్యకు ఒక కారణం ఉంటుందని చెప్పారు.

పంచ వ్రతాలు (పంచశీల): జైన మతంలో ఉన్నట్లుగానే బౌద్ధ మతంలోనూ పంచ సిద్ధాంతాలున్నాయి. అవి:

- అహింసను పాటించాలి.
- ఇతరుల ఆస్తిని ఆశించరాదు.
- మత్తు పదార్థాలను సేవించరాదు.
- అసత్యమాడరాదు.
- లంచగొండి పనులు చేయరాదు.

బౌద్ధ సంఘం: బౌద్ధ మతంలో బిక్షువులు, ఉపాసకులు అనే రెండు వర్గాల భక్తులున్నారు. బిక్షువులతో ఏర్పడిందే బౌద్ధ సంఘం. బౌద్ధ సంఘాలు బుద్ధుని కాలంలోనే ప్రారంభమయ్యాయి. ఇందులో సభ్యత్వం కోసం బౌద్ధ త్రిరత్నాల పట్ల ప్రమాణం చేయాల్సి ఉంటుంది. అవి బుద్ధం, ధమ్మం, సంఘం. బౌద్ధ సంఘంలో సభ్యత్వం పొందిన మొదటి స్త్రీ బుద్ధుని సవతి తల్లి గౌతమి. 15 ఏళ్లు దాటనివారు, నేరస్థులు, దివాళా తీసిన వారు, అంటువ్యాధిగ్రస్థులకు ఇందులో ప్రవేశం నిషిద్ధం.



బౌద్ధమత సంగీతులు

బౌద్ధ మతంలో వివిధ కాలాల్లో నాలుగు సమావేశాలు (సంగీతులు) జరిగాయి.

మొదటి బౌద్ధ సంగీతి: బుద్ధుడు మరణించిన వెంటనే క్రీ.పూ. 483లో రాజగృహ వద్దనున్న సాతపన్ని గుహల్లో ఈ సమావేశం జరిగింది. బుద్ధుని ప్రముఖ అనుచరుడైన మహాకశ్యపుడు దీనికి అధ్యక్షత వహించాడు. ఇది అజాతశత్రువు పాలనా కాలంలో జరిగింది. దీని ప్రధాన ఉద్దేశం బుద్ధుని బోధనలను క్రోడీకరించడం. ఈ మండలి పర్యవసానంగా బుద్ధుని శిష్యులైన ఆనందుడు 'సుత్త' పీటకం, ఉపాలి 'వినయ' పీటకాలను క్రోడీకరించారు.

రెండో బౌద్ధ సంగీతి: దీన్ని బుద్ధుడు మరణించిన వందేళ్లకు (క్రీ.పూ. 383లో) కాలాశోకుని పాలనాకాలంలో వైశాలిలో నిర్వహించారు. ప్రవర్తనా నియమావళికి సంబంధించి వజ్జీ సన్యాసులు, ఇతర సన్యాసులకు మధ్య ఉత్పన్నమైన విభేదాలను పరిష్కరించడం దీని ప్రధాన ఉద్దేశం. సబకామి దీనికి అధ్యక్షత వహించారు. ఈ మండలి పర్యావసానంగా బౌద్ధ సంఘం స్థవిరవాదులు (థేరవాదులు), మహాసాంఘికులు అనే రెండు వర్గాలుగా చీలి పోయింది.

మూడో బౌద్ధ సంగీతి: అశోకుని పాలనా కాలంలో క్రీ.పూ. 250లో పాటలీపుత్రంలో దీన్ని నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన బౌద్ధ సన్యాసి మొగలిపుత్తతిస్స. దీని ప్రధాన ఉద్దేశం రెండో సంగీతిలో ఏర్పడిన రెండు వర్గాల మధ్య సయోధ్య సాధించడం, బౌద్ధమత సిద్ధాంత గ్రంథాలపై చర్చించడం. ఈ సమావేశం ఫలితంగానే అభిదమ్మ పీటికను రూపొందించారు. దీంతో బుద్ధుని బోధనలున్న త్రిపీటకాలు రూపుదిద్దుకున్నాయి.

నాలుగో బౌద్ధ సంగీతి: క్రీ.శ. 1వ శతాబ్దంలో కుషాణ రాజు కనిష్కుని పాలనాకాలంలో కశ్మీర్‌లోని కుందలవనంలో దీన్ని నిర్వహించారు. దీని అధ్యక్షుడు వసుమిత్రుడు, ఉపాధ్యక్షుడు అశ్వఘోషుడు. ఈ సమావేశం ప్రధాన ఉద్దేశం బౌద్ధ మతంలోని 18 శాఖల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించడం. కానీ ఈ సమావేశంలో బౌద్ధమతం మహాయానం, హీనయానం అనే రెండు ప్రధాన శాఖలుగా విడిపోయింది. మహాయానుల (మహా సాంఘికులు, సర్వస్తివాన్‌లు మొదలైనవారు) సిద్ధాంతలన్నింటినీ కలిపి 'మహా విభాషా శాస్త్రం'గా క్రోడీకరించారు.

బౌద్ధమత శాఖలు: బౌద్ధమతంలో చీలికలు రెండో బౌద్ధమత సంగీతితోనే ప్రారంభమయ్యాయి. నాలుగో సంగీతితో అవి స్పష్టమైన రూపాన్ని సంతరించుకొని మహాయాన, హీనయాన అనే ప్రధాన శాఖలు ఏర్పడ్డాయి. తర్వాతి కాలంలో వజ్రయానం అనే 3వ శాఖ కూడా ఏర్పడింది.

మహాయాన బౌద్ధం: బౌద్ధ మతంలోని 18 శాఖల్లో ముఖ్యమైన సర్వస్తీవాదిన్‌లు, మహాసాంఘికులు, లోకోత్తరవాదులు లాంటి వారితో ఈ శాఖ ఏర్పడింది. గొప్ప వాహనాన్ని మోక్ష మార్గంగా కల్గి ఉండి, అందులో మోక్ష ప్రాప్తిని హామీనివ్వడం ద్వారా భారత దేశంలో ఇది అధికంగా ఆదరణ పొందింది. వీరు పాళీకి బదులుగా సంస్కృతాన్ని ఉపయోగించారు. వైపుల్య సూత్రాలు అనే ప్రత్యేక మత గ్రంథాలను రూపొందించుకున్నారు. గౌతమ బుద్ధునితో పాటు అతడికి పూర్వం ఆరుగురు బుద్ధులు ఉన్నారనీ, భవిష్యత్‌లో మైత్రేయనాథుడనే బుద్ధుడు జన్మిస్తాడనీ వీరు విశ్వసించారు. బోధిసత్వుల్లోనూ వీరికి నమ్మకం ఉంది. మహాయానంలో భాగంగా రెండు తత్వ సిద్ధాంతాలు ప్రారంభమయ్యాయి. మొదటిది మాధ్యమిక శాఖ. ఆచార్య నాగార్జునుడు దీన్ని స్థాపించాడు. వీరినే శూన్యవాదులు, మాధ్యమికవాదులు, మాయావాదులుగా పిలుస్తారు. నాగార్జునుడు రచించిన 'మాధ్యమిక కలిక' వీరి ప్రామాణిక గ్రంథం.

విజ్ఞాన వాద శాఖ: దీని స్థాపకుడు మైత్రేయనాథుడు. ఈ శాఖకు చెందిన వారిలో గొప్ప తత్వవేత్తలున్నారు. వీరిలో ముఖ్యులు ఆర్య అసంగ, వసుబంధుడు, దిగ్నాగుడు, ధర్మకీర్తి.

హీనయాన బౌద్ధం: థేరవాదులు లేదా స్థవిరవాదులు ప్రముఖ వర్గంగా ఉన్న శాఖ హీనయానం. బుద్ధుని వాస్తవ బోధనల పట్ల వీరు విశ్వాసాన్ని కలిగి ఉండేవారు. వ్యక్తిగత మోక్షానికి ఇందులో ప్రాధాన్యం ఉంది. వీరు మహాయానుల్లా విగ్రహారాధనను చేయలేదు. బుద్ధుడిని ప్రతీకల ద్వారానే ఆరాధించారు. బుద్ధుడు బోధించిన పాళీ భాషనే వీరు కొనసాగించారు. ఇది భారత్ కంటే బర్మా, సిలోన్, థాయ్‌లాండ్, లావోస్, కాంబోడియాలో అధిక ప్రాచుర్యం పొందింది.

వజ్రయాన బౌద్ధం: క్రీ.శ. 5వ శతాబ్దంలో హిందూమతంలోని తాంత్రిక సిద్ధాంతాల ప్రభావంతో బౌద్ధంలోనూ తాంత్రిక వాదం ప్రారంభమైంది. అదే వజ్రయానం. సంభోగ క్రియలు, మంత్రతంత్రాలు, అతీంద్రీయ శక్తుల ద్వారా మోక్ష సాధనకు వీరు ప్రయత్నించారు. ఇందులో వామాచార, దక్షిణాచార అనే రెండు ప్రధాన శాఖలున్నాయి. ఈ మతంలో బోధి సత్వులను, వారి భార్యలైన తారలను ప్రధానంగా పూజించారు. ఇది బెంగాల్, బిహార్, టిబెట్‌లో బాగా ఆదరణ పొందింది.

మాదిరి ప్రశ్నలు

1. బౌద్ధ మతంలో తొలి చీలిక ఎన్నో సమా వేశంలో సంభవించింది?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
2. శ్రీలంకలో బౌద్ధ మతాన్ని ప్రవేశ పెట్టిన వారు?
ఎ) మహేంద్ర, సంగమిత్ర
బి) చారుమతి, మహాదేవ
సి) అతిష దీపాంకర, పద్మ సాంభవ
డి) సంతరక్షిత, కమలశీల
3. బౌద్ధ తర్క సిద్ధాంత స్థాపకుడెవరు?
ఎ) అసంగుడు బి) వసుబంధుడు
సి) దిగ్నాగుడు డి) బుద్ధఘోషుడు
4. భారతదేశంలో మొదటగా విగ్రహారాధనను ప్రారంభించినవారు?
ఎ) హీనయానులు బి) మహాయానులు
సి) వజ్రయానులు డి) హిందువులు
5. బార్హుత్ శిల్పాల్లో ఏ రాజు బుద్ధునితో సమావేశమైన దృశ్యం కన్పిస్తుంది?
ఎ) అజాతశత్రువు బి) బింబిసారుడు
సి) బిందుసారుడు డి) ప్రసేనజిత్
6. ఎన్నో బౌద్ధ మత సమావేశంతో మత ప్రచారకులను పంపే సాంప్రదాయం మొదలైంది?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
7. 'బుద్ధ చరిత్ర' రాసిన బౌద్ధమత సన్యాసి?
ఎ) వసుమిత్రుడు బి) అశ్వఘోషుడు
సి) నాగార్జునుడు డి) ధర్మ కీర్తి
8. శ్రీలంకలో బౌద్ధ సంగీతిని నిర్వహించిన ఆ దేశ రాజు?
ఎ) తిస్స బి) వత్తగమని అభయ
సి) దుత్తగమని డి) విజయబాహు
9. బుద్ధుని తల్లి ఏ మహా జనపదకు చెందిన రాకుమార్తె?
ఎ) కోసల బి) అవంతి
సి) వృజ్జీ డి) మగధ
10. తొలిసారిగా బుద్ధుని బోధనలు విన్న అయిదుగురు శిష్యుల్లో లేనివారు?
ఎ) కొండన బి) వాప
సి) అస్సాగి డి) కశ్యప
11. బుద్ధుని జీవితంలోని అయిదు ప్రధాన సంఘటనలు- వాటిని సూచించే చిహ్నాలకు సంబంధించి కిందివాటిలో సరైంది?
1. జననం - వృషభం/కమలం
2. మహాభినిష్క్రమణం - అశ్వం
3. నిర్వాణం/ సంబోధి - రావిచెట్టు
4. ధర్మ చక్ర ప్రవర్తనం - ధర్మ చక్రం
5. పరినిర్యాణం - చైత్యం
ఎ) 1, 2 బి) 1, 2, 4
సి) 1, 2, 3, 4 డి) అన్నీ సరైనవే
12. కిందివారిలో మధ్యే మార్గాన్ని బోధించిన వారు?
ఎ) బుద్ధుడు బి) మహావీరుడు
సి) భాగవత కృష్ణుడు డి) ఆజీవికుడు
13. ఎన్నో బౌద్ధ మత సమావేశంలో పాళీకి బదులు సంస్కృతంలో చర్చలు జరిపారు?
ఎ) మొదటి బి) రెండో
సి) మూడో డి) నాలుగో
14. బౌద్ధ సంఘంలో కిందివారిలో ఎవరికి సభ్యత్వం నిరాకరించారు?
ఎ) శూద్రులు బి) అస్పృశ్యులు
సి) స్త్రీలు డి) బానిసలు
15. బౌద్ధమత జన్మస్థలం?
ఎ) లుంబిని బి) బుద్ధగయ
సి) ఇసిపట్టణం (సారనాథ్)
డి) శ్రావస్తి

సమాధానాలు

1) బి; 2) ఎ; 3) సి; 4) బి; 5) ఎ; 6) సి; 7) బి; 8) బి; 9) ఎ; 10) డి; 11) సి; 12) ఎ; 13) డి; 14) డి; 15) సి.

విద్య పరమావధి.. సమాజాభివృద్ధి

బోధన సామగ్రి, బోధనాభ్యసన సామగ్రి, సైన్స్‌లో వనరుల వినియోగం

- వ్యవహారిక సత్తావాది అయిన జాన్ డ్యూయీ విద్యను త్రిధ్రువ ప్రక్రియగా వర్ణించారు.
- ఉపాధ్యాయుడు, విద్యార్థి, సమాజం.. త్రిధ్రువాలు.
- విద్య పరమావధి.. సమాజాభివృద్ధి.

సామాజిక వనరుల నిర్వచనం - వినియోగ లక్ష్యాలు - వినియోగించే పద్ధతులు

- **భౌతిక వనరులు:** ప్రకృతిలోని సరస్సులు, చెరువులు, పరిశ్రమలు.
- **సహజ వనరులు:** జంతువులు, వృక్షాలు, జంతు ప్రదర్శనశాలలు.
- **భౌద్ధిక వనరులు:** సమాజంలో వివిధ రంగా ల్లో నిష్ణాతులు, నిపుణులు, ప్రొఫెసర్లు, ఇంజనీర్లు, డాక్టర్లు.

సామాజిక వనరులను ఎందుకు ఉపయోగించాలి?

- బోధనకు కావాల్సిన వస్తు సంపద లభిస్తుంది.
- ప్రత్యక్ష అనుభవాలుంటాయి.
- అమూర్త విషయాలను, మూర్త విషయాలు గా చేయొచ్చు.
- ప్రాతిపదిక అనుభవాల గురించి చక్కని అవగాహన ఏర్పడుతుంది.
- పాఠశాల - సమాజం మధ్య చక్కని సంబంధాలను ఏర్పర్చవచ్చు.

సామాజిక వనరుల వినియోగం- ప్రయోజనాలు

- నేర్చుకునే అంశంపై అవగాహన ఏర్పడుతుంది.
- పాఠశాల బోధనకు కావాల్సిన సామగ్రి, వనరులు సేకరించడం.
- పరిశీలన శక్తి, అన్వేషణ శక్తిని పెంపొందించే సన్నివేశాలు కల్పించడం.

సామాజిక వనరుల ఉపయోగంలో ఉపాధ్యాయుడి పాత్ర

- విద్యార్థులకు ప్రేరణ కలిగించాలి.
- మనిషికి-సమాజానికి-ప్రకృతికి గల సంబంధాన్ని వివరించాలి.
- సామాజిక కృత్యాలు - క్షేత్ర పర్యటనలు నిర్వహించాలి.
- పాఠశాలను సమాజంలోకి, సమాజాన్ని పాఠశాలలోనికి తీసుకురావాలి.

ఎడ్గార్ డేల్ అనుభవాల శంఖువు

- విద్యలో అనుభవాలను వాటి మూర్త, అమూర్త మితిని బట్టి డాక్టర్ ఎడ్గార్ డేల్ ఒక శంఖువు ఆకారక్రమాన్ని వివరించారు. అవి..
  - ప్రత్యక్ష ప్రాయోజిత అనుభవాలు
  - ప్రాతినిధ్య అనుభవాలు
  - నాటకీకరణ అనుభవాలు
  - ప్రత్యక్ష నిరూపణలు
  - అధ్యయన పర్యటనలు
  - ప్రదర్శన వస్తువులు
  - దూరదర్శన్ విద్యా కార్యక్రమాలు
  - రికార్డింగ్, రేడియో, చలన రహిత చిత్రాలు
  - దృశ్య సాంకేతికాలు
  - శాబ్దిక సాంకేతికాలు

బోధనోపకరణాలు-నిర్వచనాలు-బోధనాభ్యసన ప్రక్రియలో వాటి ప్రాముఖ్యత

- అభ్యసన క్రియలో ముఖ్యమైన ప్రేరణ, వర్గీకరణ, సన్నివేశ కల్పనలను పరిపూర్ణం చేసేవే బోధనోపకరణాలని కార్టర్ వి. గుడ్ అభిప్రాయం.
- దృష్టి, శ్రవణం అనే సంవేదనాత్మక మార్గాల ద్వారా అభ్యసనాన్ని ప్రోత్సహించే సాధ నాలే దృశ్యశ్రవ్య ఉపకరణాలు.

– విద్యా నిఘంటువు

బోధనోపకరణాలు - ప్రాముఖ్యత

- సంవేదనాత్మక శక్తుల సమగ్ర వినియోగం
- బోధన సిద్ధాంతాల ప్రాతిపదిక
- విద్యార్థుల అవధానాన్ని నిలిపి ఉంచడం
- ప్రత్యక్ష అనుభవాల ప్రత్యామ్నాయాలు
- వైవిధ్యత కలిగిన వివిధ అనుభవాల కూడళ్లు
- క్రమశిక్షణ సమస్యకు పరిష్కారాలు
- పునర్బలన కారకాలు

సమాచార, సాంకేతిక విజ్ఞానం

1. ఇంటర్‌నెట్ 2. రేడియో
3. టేప్ రికార్డర్ 4. టెలివిజన్

విజ్ఞానశాస్త్ర ప్రయోగశాల - ప్రయోజనాలు

- నిజ నిరూపణ జరుగుతుంది.
- ప్రక్రియా నైపుణ్యాల అభివృద్ధి
- శాస్త్రీయ నైపుణ్యాల అభివృద్ధి
- మానసిక సంతృప్తి కలుగుతుంది.
- విరామ సమయం సద్వినియోగం
- ఆర్థిక ప్రయోజనం
- జ్ఞానం ఒక సముద్రం వంటిది. దీన్ని పుస్తకాల ద్వారా మాత్రమే కాకుండా స్వీయ అనుభవాల ద్వారా కూడా సంపాదించొచ్చు.
  - వైజ్ఞానిక మ్యూజియాలు
  - వైజ్ఞానిక సంఘాలు
  - వైజ్ఞానిక కేంద్రాలు
  - వైజ్ఞానిక విద్యా అనుభవం
  - క్షేత్ర పర్యటనలు
  - విజ్ఞాన ప్రయోగశాల
  - హెర్బేరియం
  - వైవేరియం
  - అక్వేరియం
  - టెర్రేరియం
  - నక్షత్రశాల
- మ్యూజియం అనే పదం mouseion అనే గ్రీకు పదం నుంచి ఉద్భవించింది. mous eion అంటే విద్యార్థి దేవతల నిలయం.
- వైజ్ఞానిక ప్రదర్శనలను రాష్ట్రస్థాయిలో SCERT, జాతీయస్థాయిలో NCERT నిర్వహిస్తున్నాయి.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఎస్‌జీటీ - సైన్స్ మెథడ్స్

వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రధాన కమిటీలు

1. వనరుల కమిటీ 2. సావనీర్ కమిటీ
3. ఆతిథ్య కమిటీ 4. క్రమశిక్షణ కమిటీ
5. మేనేజింగ్ కమిటీ
6. ప్రచారం ప్రెస్ కమిటీ 7. ప్రదర్శన కమిటీ
8. వసతి కమిటీ 9. ఆహార కమిటీ
10. చర్చ, క్విజ్, సాంస్కృతిక కమిటీ
11. ప్రాజెక్టు పుస్తక కమిటీ
12. న్యాయనిర్ణేతల కమిటీ

ఉత్తమ ప్రదర్శనకు కావాల్సిన అంశాలు

1. శాస్త్రీయ దృక్పథం
2. సహజత్వం - వనితనం
3. మన్నిక 4. ఆర్థికపరమైన విలువ
5. వ్యక్తిగత ఇంటర్వ్యూ

- **క్షేత్ర పర్యటనలు:** విద్యార్థి క్షేత్ర పర్యటన ద్వారా మొక్కలు, పక్షులు, పంటచేలు, వాగులు, కొండలు మొదలైన వాటి గురించి ఆహ్లాదంగా, స్వేచ్ఛగా ప్రత్యక్షానుభూతి ద్వారా విషయాన్ని నేర్చుకోగలుగుతాడు.
- **హెర్బేరియం:** ఎండబెట్టి భద్రపరిచిన మొక్క ల ఆల్బంను హెర్బేరియం అనొచ్చు.
- **వైవేరియం:** దీని ఏర్పాటు వల్ల మొక్కల సహజ సిద్ధమైన వాతావరణాన్ని తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుంది.
- **అక్వేరియం:** ఇది జలచర జీవులను తెలిపే ప్రదర్శనాంశం. ప్రపంచంలో జీవులు ఆహా రం కోసం ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్నాయి.
- **టెర్రేరియం:** దీని ద్వారా సహజసిద్ధమైన వాతావరణంలో ఉభయచరాలు, భూచరా లైన జీవుల జీవన విధానాన్ని ప్రత్యక్ష అనుభవం ద్వారా పరిశీలించొచ్చు.
- **నక్షత్రశాల:** సామాన్య మానవుడికి ఖగోళం లోని నక్షత్ర మండలాలు, నక్షత్రరాశులు, నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు. తోక చుక్కల ఉనికి, గమనాలు మొదలైన విషయాలను విశదపరిచి ప్రత్యక్ష అనుభూతిని కలిగించవచ్చు.
- ప్రాచీన నక్షత్రశాలను ఒర్రెరి (Orrery) అంటారు. దీని ద్వారా విద్యార్థుల్లో స్వయం పరిశీలనశక్తి, శాస్త్రీయ దృక్పథం పెంపొం దుతాయి.

క్షేత్ర పరిశీలనలకు ఉదాహరణ

1. పరిసరాలలోని మొక్కలు, జంతువులు
2. నేలలు - రకాలు
3. నీటివనరులు
4. పంట పొలాలు
5. చేపల పెంపకం
6. కోళ్ల పెంపకం
7. జంతుప్రదర్శనశాల
8. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
9. పురావస్తు ప్రదర్శనశాల
10. పరిశ్రమలు మొదలైనవి.

వైజ్ఞానిక ప్రదర్శనలు-నిర్వహణ: ప్రదర్శనకు అవసరమైన ప్రాంగణం - సదస్సు - వసతులు - బహుమతులు-సమయం. విద్యార్థుల్లోని వైజ్ఞానిక తృష్ణను,భావ వ్యక్తీకరణ విధానాన్ని,జాతీయ సమైక్యతా భావాన్ని పెంపొందించడానికి తోడ్పడతాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఒర్రెరి అంటే?
ఎ) నవీన నక్షత్రశాల
బి) ప్రాచీన నక్షత్రశాల
సి) చేపల పెంపకం డి) ఏదీకాదు
2. జాతీయ స్థాయిలో సైన్స్ ఫెయిర్‌ను తొలిసారి ఏర్పాటు చేసిన సంవత్సరం?
ఎ) 1952 బి) 1954 సి) 1953 డి)1959
3. వైజ్ఞానిక సంఘానికి అధ్యక్షుడు?
ఎ) సైన్స్ టీచర్ బి) ల్యాబ్ అసిస్టెంట్
సి) ప్రధానోపాధ్యాయుడు డి) విద్యార్థి
4. టెర్రేరియంలో ఉండే జీవాలు?
ఎ) ఉభయచరాలు బి) జలచరాలు
సి) పక్షులు డి) మొక్కలు
5. నీటి మొక్కలను, జలచరాలను పెంచడానికి వాడే గాజుతొట్టె?
ఎ) అక్వేరియం బి) హెర్బేరియం
సి) వైవేరియం డి) టెర్రేరియం
6. ఎయిడ్స్ డే ఏ తేదీన నిర్వహిస్తారు?
ఎ) అక్టోబర్ 26 బి) డిసెంబర్ 1
సి) నవంబర్ 12 డి) సెప్టెంబర్ 8
7. మ్యూజియం అనే పదం ఏ భాష నుంచి ఉద్భవించింది?
ఎ) గ్రీకు బి) అరబిక్
సి) ఫ్రెంచ్ డి) లాటిన్
8. విద్యను త్రిధ్రువ ప్రక్రియగా వర్ణించినవారు?
ఎ) ప్లేటో బి) అరిస్టాటిల్
సి) డార్విన్ డి) డ్యూయీ
9. త్రిధ్రువ ప్రక్రియలో భాగం కానిది?
ఎ) సమాజం బి) సంస్కృతి
సి) విద్యార్థి డి) ఉపాధ్యాయుడు
10. స్థానిక వనరులు ఎన్ని?
ఎ) 4 బి) 5 సి) 6 డి) 3
11. ఆంధ్రప్రదేశ్‌లో టెలీ స్కూల్ కార్యక్రమాలను ప్రసారం చేసేవారు?
ఎ) NCERT బి) SCERT
సి) APET డి) SIET
12. ప్రఖ్యాతిగాంచిన విశ్వేశ్వరయ్య టెక్నలాజిక ల్ మ్యూజియం ఎక్కడ ఉంది?
ఎ) బెంగళూరు బి) మద్రాసు
సి) ముంబై డి) ఢిల్లీ
13. ఎండబెట్టి భద్రపరిచిన మొక్కల ఆల్బం?
ఎ) అక్వేరియం బి) హెర్బేరియం
సి) ఒర్రెరి డి) వైవేరియం
14. ప్రైమరీ సైన్స్ కిట్‌లోని వస్తువుల రకాలు?
ఎ) 4 బి) 5 సి) 3 డి) 6
15. శంఖువులో అగ్రభాగాన ఉన్న అనుభవాలు
ఎ) కల్పిత అనుభవాలు
బి) శాబ్దిక చిహ్నాలు
సి) ప్రయోగాలు డి) చలనచిత్రాలు

సమాధానాలు

1) బి; 2) డి; 3) సి; 4) ఎ; 5) ఎ; 6) బి; 7) ఎ; 8) డి; 9) బి; 10) డి; 11) డి; 12) ఎ; 13) బి; 14) సి; 15) బి

విద్య, ఉద్యోగ సమాచారం

ఎఫ్ఎస్ఐ, డెహ్రాడూన్‌లో 15 టెక్నికల్ అసోసియేట్ పోస్టులు

డెహ్రాడూన్(ఉత్తరాఖండ్)లోని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఐ).. ఒప్పంద ప్రాతిపదికన టెక్నికల్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 15.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సైన్స్ విభాగంలో పీజీ లేదా ఎంఎస్, ఎంఎస్సీ(ఐటీ/కంప్యూటర్ సైన్స్/బీటెక్ సివిల్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణతతో పాటు డిప్లొమా లేదా రిమోట్ సెన్సింగ్/జీఐఎస్ సర్టిఫికేట్ కోర్సు కలిగి ఉండాలి. ఇంటర్మీడియట్ స్థాయిలో ఫిజిక్స్ సబ్జెక్టు చదివి ఉండాలి.
- **వయసు:** 15.06.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **వేతనం:** నెలకు రూ.37,000.
- **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్ట్,విద్యార్హతలు, రాత పరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 30.06.2025.
- **వెబ్‌సైట్:** https://fsi.nic.in

రైల్‌టెల్ ఇండియాలో 48 మేనేజర్ పోస్టులు

న్యూఢిల్లీలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. పలు విభాగాల్లో ఖాళీగా ఉన్న 48 అసిస్టెంట్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి నోటి ఫికేషన్ విడుదల చేసింది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 48
- **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్-30, డిప్యూటీ మేనేజర్-18.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీటెక్/బీఈ, డిప్లొమా, ఎంబీఏ/పీజీడీఎం, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం తప్పనిసరి.
- **వయసు:** 2025 జూన్ 30 నాటికి అసిస్టెంట్ మేనేజర్‌కు 21-28 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 21-30 ఏళ్ల మధ్యలో ఉండాలి.
- **వేతనం:** అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.30,000- రూ.1,20,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.40,000- 1,40,000.
- **ఎంపిక విధానం:** రాత పరీక్ష ఆధారంగా ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో చేసుకోవాలి
- **దరఖాస్తులకు చివరి తేది:** 30.07.2025
- **పరీక్ష కేంద్రాలు:** ముంబై, కోల్‌కతా, న్యూఢిల్లీ, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.railtel.in

ఆఫ్రికాలోని గడ్డి భూములను ఏమంటారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

జాగ్రఫీ

భూమి ఆవరణాలు

వాతావరణం

వాతావరణాన్ని ప్రధానంగా అయిదు భాగాలుగా వర్గీకరించవచ్చు.


ట్రోపో ఆవరణం: ధ్రువాల వద్ద 8 కి.మీ. భూమధ్యరేఖ వద్ద 18 కి.మీ. ఎత్తు ఉంటుంది. సగటు ఎత్తు 13 కి.మీ. ఈ ఆవరణంలో సంవహన ప్రవాహాలు వీస్తాయి. వాతావరణంలోని మొత్తం వాయువుల్లో 75 శాతం వరకు ఈ పొరలోనే ఉంటాయి. శీతోష్ణస్థితులు, వర్షపాతం ఈ ఆవరణంలోనే సంభవిస్తాయి.

స్ట్రాటో ఆవరణం: దీని ఎత్తు 50 కి.మీ. ఈ ఆవరణంలో మబ్బులు ఉండవు. జెట్ విమానాలు ఇందులోనే ఎగురుతాయి. ఓజోన్ పొర ఈ ఆవరణంలోనే ఉంటుంది.

మీసో ఆవరణం: దీని ఎత్తు 80 కి.మీ. విశ్వం నుంచి ఉల్కలు ఈ ఆవరణంలోకి ప్రవేశించగానే కాలిపోతాయి.

థర్మో ఆవరణం (అయనో ఆవరణం): దీని ఎత్తు 400 కి.మీ. ఆయాన్లు అనే విద్యుదావేశ కణాలు ఈ ఆవరణంలోనే ఉంటాయి. వీటి కారణంగా రేడియో తరంగాలు భూమికి పరావర్తనం చెందుతాయి.

ఎక్సో ఆవరణం: దీని ఎత్తు 400 కి.మీ.పైన ఉంటుంది. తేలికైన హైడ్రోజన్, హీలియం పరమాణువులు ఈ ఆవరణంలో అధికంగా ఉంటాయి. ఇందులో వ్యోమనౌకలు, కృత్రిమ ఉపగ్రహాలు సంచరిస్తాయి.



మాదిరి ప్రశ్నలు

1. వాతావరణంలో నీటి ఆవిరి ఘనపరిమాణం ఎంతశాతం ఉంటుంది?
   ఎ) 0.03 బి) 0.4
   సి) 1.04 డి) 0.71
2. సమరూప ఆవరణంలో ఉండని ఆవరణం?
   ఎ) ట్రోపో బి) స్ట్రాటో
   సి) మీసో డి) థర్మో
3. 90 కి.మీ. కంటే పైన ఉన్న వాతావరణ పొరను ఏమంటారు?
   ఎ) ఏకరూప ఆవరణం
   బి) బహురూప ఆవరణం
   సి) సమరూప ఆవరణం
   డి) మీసో ఆవరణం
4. 'సాధారణ క్షీణతాక్రమం' అంటే ఏమిటి?
   ఎ) ఎత్తుకు వెళుతున్న కొద్దీ ఉష్ణోగ్రత పెరుగుతూ, తగ్గుతూ ఉండటం
   బి) ఎత్తుకు వెళ్లే కొద్దీ ఉష్ణోగ్రతల్లో విపరీతమైన మార్పులు సంభవించడం
   సి) ఎత్తుకు వెళుతున్న కొద్దీ ఉష్ణోగ్రత తగ్గుతూ ఉండటం
   డి) ఎత్తుకు వెళుతున్న కొద్దీ ఉష్ణోగ్రత పెరుగుతూ ఉండటం
5. 'అంతర ఆయన రేఖ అభిసరణ ప్రాంతం' అంటే ఏమిటి?
   ఎ) అధిక పీడనం ఉన్న ప్రాంతం
   బి) తక్కువ పీడనం ఉన్న ప్రాంతం
   సి) పవనాల వేగం అధికంగా ఉన్న ప్రాంతం
   డి) పవనాల వేగం తక్కువగా ఉన్న ప్రాంతం
6. 'కొరియాలిస్ ప్రభావం' వల్ల జరిగే ప్రధాన పరిణామం ఏమిటి?
   ఎ) ఉత్తరార్ధ గోళంలోని పవనాల దిశలు, దక్షిణార్ధ గోళంలోని పవనాల దిశలు వ్యతిరేకంగా ఉంటాయి
   బి) దక్షిణార్ధ గోళంలోని ఈశాన్య వ్యాపార పవనాలు, ఉత్తరార్ధ గోళంలోని నైరుతి వ్యాపార పవనాలు సమదిశలో వీస్తాయి
   సి) పవనాలు ఉత్తరార్ధ గోళంలో ఎడమ వైపునకు, దక్షిణార్ధ గోళంలో కుడి వైపునకు వీస్తాయి
   డి) పవనాలు ఉత్తరార్ధ గోళంలో కుడివైపునకు, దక్షిణార్ధ గోళంలో ఎడమ వైపునకు వీస్తాయి
7. భూమధ్య రేఖ వద్ద కొరియాలిస్ ప్రభావం ఏవిధంగా ఉంటుంది?
   ఎ) శూన్యం బి) స్వల్పం
   సి) అత్యధికం డి) అత్యల్పం
8. ప్రపంచ పీడన మేఖలలో నిరంతరాయంగా, క్రమబద్ధంగా వీచే గాలులను ఏమంటారు?
   ఎ) రుతుపవనాలు
   బి) స్థానిక పవనాలు
   సి) ప్రపంచ పవనాలు
   డి) వ్యాపార పవనాలు
9. వాణిజ్య పవనాలు, పశ్చిమ పవనాలు వరుసగా ఏయే ప్రాంతాల్లో వీస్తాయి?
   ఎ) ధ్రువ ప్రాంతం, భూమధ్యరేఖా ప్రాంతం
   బి) సమశీతోష్ణ ప్రాంతం, ధ్రువ ప్రాంతం
   సి) భూమధ్యరేఖా ప్రాంతం, ఉష్ణ మండలం
   డి) ఉష్ణమండలం, సమశీతోష్ణమండలం
10. మాన్సూన్ (రుతుపవనాలు) అనేది 'మౌసమ్' అనే ఏ భాషా పదం నుంచి వచ్చింది?
    ఎ) ఇంగ్లిష్ బి) లాటిన్
    సి) గ్రీక్ డి) అరబిక్
11. ఒక ప్రాంతంలోని వాతావరణ పరిస్థితుల దీర్ఘకాల సగటు వివరాలను ఏమని పిలుస్తారు?
    ఎ) శీతోష్ణస్థితి బి) ఉష్ణోగ్రత
    సి) వాతావరణ సగటు నిష్పత్తి
    డి) సమ ఉష్ణోగ్రత క్షీణత
12. వాతావరణంలోని నీటి ఆవిరిని దేని సహాయంతో కొలుస్తారు?
    ఎ) వాతావరణ మాపకం
    బి) ఆర్ద్రతా మాపకం
    సి) పీడన మాపకం
    డి) అవపాత మాపకం
13. గాలి సంతృప్త స్థాయికి చేరే ఉష్ణోగ్రతను ఏమని పిలుస్తారు?
    ఎ) సాపేక్ష ఆర్ద్రత
    బి) సాపేక్ష ఉష్ణోగ్రత
    సి) ద్రవీభవన ఉష్ణోగ్రత
    డి) నిర్దిష్ట ఆర్ద్రత
14. ద్రవీభవనం చెందినప్పుడు నీటి బిందువులు బరువెక్కి భూమి మీదకు పడటాన్ని 'ప్రెసిపిటేషన్' (Precipitation) అంటారు. ఇది ప్రెసిపిటేషియా అనే లాటిన్ పదం నుంచి వచ్చింది. దీని అర్థం ఏమిటి?
    ఎ) ఎత్తుకు ఎగరడం బి) కిందికి పడటం
    సి) వేగంగా విస్తరించడం
    డి) ఆలస్యంగా చలనంలోకి రావడం
15. దక్కన్ పీఠభూమి మధ్య భాగంలో వర్షచ్ఛాయా ప్రాంతం ఏర్పడటానికి కారణం?
    ఎ) పర్వతీయ వర్షపాతం
    బి) సంవహన వర్షపాతం
    సి) చక్రీయ వర్షపాతం
    డి) రుతుపవన వర్షపాతం

సమాధానాలు

1) బి; 2) డి; 3) బి; 4) సి; 5) బి; 6) డి; 7) ఎ; 8) సి; 9) డి; 10) డి; 11) ఎ; 12) బి; 13) సి; 14) బి; 15) ఎ..

ఉష్ణ స్థానిక పవనాలు..

నూక్: ఉత్తర అమెరికాలోని రాకీ పర్వతాల కింది భాగంలో వీస్తాయి.
ఫోన్: యూరప్‌లోని ఆల్ప్స్ పర్వతాల ఉత్తర వాలుల మీదుగా వీస్తాయి.
లూ: ఉత్తర భారతదేశంలో మే - జూన్ మధ్య వీచే వేడి గాలులు.
సిమ్మన్: అరేబియా ఎడారిలో వీస్తాయి.
యోమా: జపాన్‌లో వీస్తాయి.
నార్వెస్టర్: న్యూజిలాండ్‌లో వీస్తాయి.

శీతల స్థానిక పవనాలు..

మిస్ట్రాల్: యూరప్‌లోని ఆల్ప్స్ పర్వతాల నుంచి ఫ్రాన్స్ మీదుగా రోమ్ లోయ ద్వారా మధ్యధరా సముద్రం వైపు వీస్తాయి.
ఫ్యూనా: దక్షిణ అమెరికాలో ఆండీస్ ప్రాంతంలో వీస్తాయి.
పాంపెరో: దక్షిణ అమెరికాలోని పంపా గడ్డి మైదాన ప్రాంతంలో వీస్తాయి.

జీవావరణం

ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వివిధ రకాల అడవులు విస్తరించి ఉన్నాయి.

ఉష్ణమండల సతత హరిత అడవులు: భూమధ్య రేఖా ప్రాంతం, ఉష్ణమండలంలో విస్తరించి ఉన్నాయి. ఈ అడవులు దట్టంగా ఉంటాయి. ఇక్కడ వర్షాలు బాగా కురుస్తాయి. రోజ్‌వుడ్, ఎబోని, మహాగని లాంటి కఠిన దారు వృక్షాలు పెరుగుతాయి.

ఉష్ణమండల ఆకురాల్చే అడవులు: భారతదేశం, ఉత్తర ఆస్ట్రేలియా, మధ్య అమెరికాలో విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో సాల్, టేకు, వేప, శీషం లాంటి గట్టి చెట్లు పెరుగుతాయి.

సమశీతోష్ణ సతత హరిత అడవులు: వాయవ్య అమెరికా, దక్షిణ చైనా, వాయవ్య బ్రెజిల్‌లో విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో ఓక్, పైన్, నీలగిరి చెట్లు పెరుగుతాయి.

సమశీతోష్ణ ఆకురాల్చే అడవులు: ఈశాన్య అమెరికా, చైనా, న్యూజిలాండ్, చిలీ, పశ్చిమ యూరప్ తీర ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఇక్కడ ఓక్, యాష్, బిర్చ్ లాంటి చెట్లు పెరుగుతాయి.

మధ్యధరా అడవులు: మధ్యధరా సముద్రం చుట్టూ, కాలిఫోర్నియా (యూఎస్ఏ), నైరుతి ఆఫ్రికా, నైరుతి దక్షిణ అమెరికా, నైరుతి ఆస్ట్రేలియాలో విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో నిమ్మ, అంజూర, ఆలివ్, ద్రాక్ష తదితర చెట్లు పెరుగుతాయి.

శృంగాకార అడవులు (టైగా అడవులు): ఎత్తైన కొండలు, హిమాలయాల్లో విస్తరించి ఉన్నాయి. మెత్తటి కలపనిచ్చే చిర్, పైన్, సెడార్ తదితర వృక్షాలు పెరుగుతాయి.

టండ్రా అడవులు: ధ్రువ ప్రాంతాల్లో ఉన్నాయి. ఇందులో నాచు, లిచెన్, చిన్న చిన్న పొదల లాంటివి పెరుగుతాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఆఫ్రికాలోని గడ్డి భూములను ఏమని పిలుస్తారు?
   ఎ) సవన్నాలు బి) స్టెప్పీలు
   సి) టైగాలు డి) పంపాలు
2. ఆమ్ల వర్షాలు కురవడానికి ప్రధాన కారణం?
   ఎ) అడవులను నరకడం
   బి) వాతావరణంలో దుమ్ము, ధూళి కణాలు పెరగడం
   సి) శిలాజ ఇంధనాలను అధికంగా ఉపయోగించడం
   డి) ఓజోన్ పొర దెబ్బతినడం
3. 'క్యోటో ప్రోటోకాల్' ప్రధాన ఉద్దేశం ఏమిటి?
   ఎ) హరిత గృహ వాయువుల ఉద్గారాలను పరిశీలించడం
   బి) ఓజోన్ పొర దెబ్బతినకుండా జాగ్రత్తలు పాటించడం
   సి) వాతావరణ కాలుష్య కారకాలను గుర్తించడం
   డి) హరిత గృహ వాయువుల విడుదలను తగ్గించడం
4. 'క్యోటో ప్రోటోకాల్ (1997)' లక్ష్యాన్ని ఏయే సంవత్సరాల మధ్య చేరుకోవాలని నిర్ణయించారు?
   ఎ) 1997-2010 బి) 2008-2012
   సి) 2000-2020 డి) 2005-2015

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) డి; 4) బి.

It denotes the simple quality

Degrees of Comparison

There are three Degrees of Comparison. The adjective which denotes the simple quality is said to be in the *Positive Degree*. It is used when no comparison is made. The adjective used to tell when two persons or things of the same class are compared together is said to be in *Comparative Degree*. When two or more persons or things of the same class are compared it is said to be in *Superlative Degree*. A few rules to remember:

1. The comparative degree is generally followed by the conjunction *than*.
E.g.: Anil is wiser than Suresh.
Note: But the comparative can be used without *than*.
E.g.: Ashok is the taller of the two boys.

2. The superlative degree is preceded by *the* and followed by *of*.
E.g.: Raman is the ablest of all the boys.

3. The comparative is usually formed by adding **–er** to the positive and the superlative by adding **–est** to the positive.
E.g.:

Positive	*Comparative*	*Superlative*
Bold	bolder	boldest
Deep	deeper	deepest
Strong	stronger	strongest

4. When the positive ends in **-e**, only **–r** and **–st** are added to form the comparative and superlative.
E.g.:

Positive	*Comparative*	*Superlative*
Able	abler	ablest
Brave	braver	bravest
True	truer	truest



BANK EXAMS
ENGLISH

5. When the positive ends in one consonant and the consonant is preceded by a short vowel, the final consonant is preceded by a short vowel, the final consonant is doubled, and **–er** and **–est** are added to form the comparative and superlative.
E.g.:

Positive	*Comparative*	*Superlative*
Big	bigger	biggest
Fit	fitter	fittest
Wet	wetter	wettest

6. If the positive ends in **y**, and the **y** is preceded by a consonant, the **y** is changed into **-i**, and **–er** and **–est** are added to form the comparative and superlative.
E.g.:

Positive	*Comparative*	*Superlative*
Dry	drier	driest
Heavy	heavier	heaviest
Pretty	prettier	prettiest

7. But if the **-y** is preceded by a vowel, the **–y** is not changed into **–i**, when **–er** and **–est** are added.
E.g.:

Positive	*Comparative*	*Superlative*
Grey	greyer	greyest

8. All adjectives of more than one syllable and many adjectives of two syllables, form the comparative by adding the word ***more*** to the positive, and the superlative by adding the word ***most*** to the positive.
E.g.:

Positive	*Comparative*	*Superlative*
Beautiful	more beautiful	most beautiful

9. Double comparatives and double superlatives should be avoided.
E.g.: He is more happier than you. (Incorrect)
He is happier than you. (Correct)

10. The word ***superior, inferior, senior, junior*** are followed by ***to*** instead of ***than***.

PRACTICE TEST

Choose the right option from the 4 options given below each sentence and indicate your answer choice.

1. Ramesh is the tallest in his family - means:
   1) All are as tall as Ramesh
   2) No one else is as tall as Ramesh
   3) Some members are taller than Ramesh
   4) Few members are tall as Ramesh.
2. Keats is greater than any other English poet (Change into Superlative Degree)
   1) Keats is of the greatest English poets.
   2) Keats is not the greatest English poet.
   3) Keats is the greatest English poet.
   4) No other English poet is so great as Keats.
3. Some rivers are at least as long as the Godavari. (Change into Superlative Degree)
   1) The Godavari is not the longest of all rivers in India.
   2) The Godavari is the longest river in India.
   3) The Godavari is one of the longest rivers in India.
   4) No Superlative degree.
4. Meena's house is more spacious than Veena's (Change into Positive Degree)
   1) Meena's house more spacious
   2) Veena's house is as spacious as Meena's house
   3) Veena's house is more spacious than Meena's house
   4) Veena's house is not as spacious as Meena's house
5. Gandhiji is one of the most famous Indian leaders (Change into Comparative Degree)
   1) Gandhiji is not most famous Indian leaders
   2) Gandhiji is not more than any other Indian leaders
   3) Gandhiji is more famous than many other Indian leaders
   4) Gandhiji is not more famous than any other Indian leaders
6. Everest is the highest peak in the world (Change into Comparative Degree)
   1) Everest is higher than many other peaks in the world
   2) Everest is higher than any other peaks in the world
   3) A few peaks in the world are as high as Everest
   4) No other peak in the world is so high an Everest
7. The pacific is deeper than any other Ocean (Change into Superlative Degree)
   1) Pacific is not the deepest Ocean
   2) Pacific is the deepest Ocean
   3) Pacific is one of the deepest Oceans
   4) No other Ocean is so deep as pacific.
8. No other girl in the college is so charming as Vasanthi. (Change into Superlative Degree)
   1) Vasanthi is one of the most charming girls in our college.
   2) Vasanthi is not one of the most charming girls in our college
   3) Vasanthi is the most charming girl in our college
   4) Vasanthi is more charming girl in our college
9. Mohith sharma bowls faster than Mohd. Shami (Change into Positive Degree)
   1) Mohd. Shami bowls as fast Mohith Sharma
   2) Mohd. Shami doesn't bowl so fast as Mohith Sharma
   3) Mohd. Shami can bowl as fast as Mohith Sharma
   4) Mohith Sharma bowls as fast as Mohd. Shami
10. Platinum is the most expensive metal (Change into Positive Degree)
    1) No other metal is so expensive as platinum
    2) Some other metals are at least as expensive as platinum
    3) Very few metal are as expensive as platinum
    4) Platinum is expensive metal.
11. Harshitha is the most beautiful girl in the class - means:
    1) All the girls in the class are more beautiful than Harshitha
    2) All the girls are as beautiful as Harshitha
    3) No girl is so beautiful as Harshitha
    4) Harshitha is not more beautiful than any other girl in the class.
12. Kashmir is cooler than many other places in India (Change into Positive Degree)
    1) Kashmir is the coolest places in India.
    2) No other place in India is so cool as Kashmir
    3) Very few places in India are as cool as Kashmir.
    4) Some places are at least as cool as Kashmir.
13. Raman is braver than Ashok. (Change into Positive Degree)
    1) Ashok is braver than Raman.
    2) Ashok is brave to Raman.
    3) Raman is as brave as Ashok.
    4) Ashok is not as brave as Raman.

ANSWERS:

1) 2; 2) 3; 3) 3; 4) 4; 5) 3; 6) 2; 7) 2; 8) 3; 9) 2; 10) 1; 11) 3; 12) 3; 13) 4.